
ఎ. చేహోవ్

కథలు





ఎ. చేహొవ్

కథలు

"రాదుగ" ప్రచురణాలయం
మాస్కో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

చిత్రాలు: కుక్రినిక్సి

రెండవ ముద్రణ

А. П. Чехов

РАССКАЗЫ

На языке телугу

Chekhov A.

SHORT STORIES

In Telugu

Перевод сделан по изданию:
А. П. Чехов. Полное собрание сочинений и писем
в 30 тт.
М., «Наука».

© తెలుగులో అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1973
© చిత్రాలు "రాదుగ" ప్రచురణాలయం 1990

సోవియట్ యూనియన్‌లో ముద్రించబడింది

ISBN 5-05-002342-4

విషయసూచిక

అంతోన్ చేహొవ్ కథలు

తన మరణానికి ముందు రాసిన చివరి కథ 'పెండ్లికూతురు' (1903)లో చేహొవ్ ఒక యువతిని వర్ణిస్తాడు. కథ తొలి భాగంలో, ఆమె ఒకవాడు వేకువకు ముందే మేల్కొని, తోటలోకి చూస్తుంది. "దట్టమైన తెల్లని పొగమంచు నిశ్శబ్దంగా లైలాక్ పొదలను సమీపించింది, వాటిని ఆవరించే ఉద్దేశం వున్నట్టు." అదే బరువైన తెల్లని పొగమంచు ఆ అమ్మాయి హృదయాన్ని ఆవరించినట్టుంది. తన నిశ్చల, లక్ష్యరహిత జీవితానికి అంతం గానీ, మార్పు గానీ వుండబోదని ఆమె అనుకుంటుంది. కానీ యింతలో తెల్లవారుతుంది. "పక్షులు కిటికీకింద చెట్ల కొమ్మల్లో కిచకిచ మంటున్నాయి, తోటలోని పొగమంచు విచ్చుకుంది, వసంతపు సూర్యకాంతి అన్నిటికీ బంగారు పూత పూసింది, ప్రతిదీ చిరునవ్వులలో ఓలలాడి నట్టుంది." యిది కేవలం ప్రకృతిలో వచ్చిన మార్పు కాదు. అమ్మాయిలో కూడా వచ్చిన మార్పు—యీ స్వయం సంతృప్తమైన క్షుద్ర జీవితంతో శాశ్వతంగా తెగదెంపులు చేసుకోవాలని నిశ్చయానికి వచ్చింది.

చేహొవ్ చివరి కథలోని యువతిలో వచ్చిన మార్పు ఆ రచయిత కృషికి సంకేతంగా వుందని సముచితంగా అనవచ్చు.

అంతోన్ చేహొవ్ 1860లో, తగన్‌రోగ్ అనే రష్యన్ పట్టణంలో జన్మించినాడు. యిరవై యేండ్ల వయసులో ఆయన మాస్కో విశ్వవిద్యాలయంలోని వైద్య కళాశాలలో చేరినాడు. అప్పుడు ఆయన వార్తాపత్రికలకూ, పత్రికలకూ కథానికలూ, స్కెచ్‌లూ, సమకాలిక విషయాలమీద వ్యంగ్య రచనలూ రాయసాగినాడు.

1880లు రష్యాలో ప్రగతి వ్యతిరేక కాలం, "హేతువాద"పు సూచన యేది కనిపించినా మనుషులు హింసకి గురయే కాలం. ప్రగతి వ్యతిరేకత, చిక్కని పొగమంచు లాగ, దేశాన్ని ఆవరించింది. యీ కాలంనాటి చేహొవ్ కథలు ధనార్జన కొరకూ, స్వీయ పురోగతి కొరకూ అంకితమైన అనామక వ్యక్తుల గురించి రాసినవి. "బలిసిన" అధి

కార్ల పటాటోపాన్నీ, సంకుచిత మనస్తత్వాన్నీ, "చిక్కిపోయిన" వాళ్ల అణకువనూ, దాస్యభావపు వినమ్రతనూ యీసడిస్తాడు. యీ ప్రపంచంలో మనిషికి కచ్చితంగా సాంఘిక హోదానుబట్టి గౌరవాగౌరవాలు కలుగుతాయని చేహొవ్ అంటాడు ('గుమాస్తా మరణం,' 1883; 'బురఖా,' 1884; మొదలైనవి.)

చేహొవ్ బహిరంగంగా పాఠకునికి విజ్ఞప్తినీ, అతన్ని ఒప్పించడానికి ప్రయత్నాన్నీ చేయడు. పాఠకునికి యిలా చెప్పడానికి ఆయన కథను మొత్తంగా ఉపయోగించుకుంటాడు: నిజమైన మనిషిగా వుండడానికి నీ కెందుకు భయం? యెందుకు నీవు నీకంటే పైనున్నవాళ్లను మాత్రమే గౌరవిస్తూ, నీకంటే కింద వున్నవాళ్లమీద అంత బాహాటంగా ఉమ్మివేస్తావు? ఆనందాన్ని కొలిచేది హోదాలతోనూ, బిరుదు చిహ్నాలతోనూ, డబ్బు సంచులతోనూనా? హోదాల, బిరుదుల బ్యురాక్రటిక్ నిచ్చెన అంత ఆత్రంగా యెందుకు యెగ్రబాకుతున్నావు?

చేహొవ్ రాసిన అత్యంత జనప్రియమైన తొలి కథలలో ఒకటైన 'ఊసరవెల్లి' (1884) 'జీహుజూర్' తత్వానికి పాఠ్యగ్రంథం లాంటిది. మార్కెట్‌వద్ద ఒక మనిషిని కుక్క కరిచింది. డ్యూటీలో వున్న పోలీసు నిర్దాక్షిణ్యమైన "కేసు" విచారణ ప్రారంభించి, తమ కుక్కలను వూరిమీది వదలిపెట్టినవాళ్లను తిడుతుంటాడు. ఆ కుక్క జనరల్‌దని జనంలో యెవరో చెప్తారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు తన మాటల్ని వేగంగా మార్చుకోగల పోలీసు అప్పుడు కుక్క కరిచిన మనిషిని తిడతాడు. తరువాత, అది జనరల్‌గారి కుక్క కాదని మరెవరో అంటారు. అప్పుడు, కుక్క యజమానికి గుణపాఠం నేర్పాలి, అని పోలీసు అంటాడు. కుక్క యజమాని సాంఘిక అంతస్తుమీద అంతా ఆధారపడుతుంది: అతను గొప్పవాడైతే, చేసింది ఒప్పు, అతను అడుగున వుంటే తప్పు.

చేహొవ్ హాస్యం కరకైనది, ధీసమన్వితమైనది. ఆయన కవితార్ద్రతా, ఆయన హృదయాన్ని చూరగొన్న పాత్రలూ, ఆయన విశ్వాసాలూ ప్రచ్ఛన్నంగా వుంటాయి. అనుభూతుల ప్రదర్శన ఆయనకిష్టం లేదు. తాను మెచ్చుకునే వాళ్లను గురించి ఆయన రాయడు. అపహసించదగిన అన్నిటిమీదా ఆయన తన తీక్ష్ణ, వ్యంగ్య దృష్టిని మళ్లిస్తాడు.

1890లో ప్రారంభమైన దశాబ్దిలో, చేహొవ్ రచయితగా పరిణతి నందుకున్నప్పుడు, ఆయన హాస్య, వ్యంగ్య కథలూ, స్కెచ్‌లూ త్యజించి, గురుతరమైన పెద్ద కథలు రచించినాడు ('చప్పిడి కథ,' 1889; 'ఆరవ వార్డు,' 1882; 'రెండంతస్తుల యిల్లు,' 1896, మొదలైనవి.)

చేహొవ్ కథల ప్రధాన విషయం సమకాలిక సమాజం గురించీ, ఆశలూ, కలలూ యెండిపోయే వాతావరణం గురించీ వుంటుంది. 'ఇయోనిచ్' (1898) అనే కథలోని

డాక్టరుకు ఒక చిన్న పట్టణంలో ఉద్యోగం వస్తుంది. నగరం మొత్తంమీద విద్యా, ప్రజ్ఞా సంపన్నమైన తూర్కిన్ కుటుంబంతో అతనికి పరిచయం కలుగుతుంది. త్వరలో అతను మంత్ర ముగ్ధునిలా వాళ్ల ప్రభావానికి లోనౌతాడు. వాళ్ల అమ్మాయి కాత్యను అతను ప్రేమించి, ఆమెను వివాహ మాడడానికి వాళ్ల అనుమతి కోరుతాడు. కానీ అతని ప్రేమ అతని ఉపేక్షతో నిత్యం పోరాటం చేస్తున్నది. డాక్టర్ ఇయోనిచ్ కథ ఉపేక్షకూ, హృదయ రాహిత్యానికీ క్రమక్రమంగా లోబడిన మనిషి కథ. చేహొవ్ అన్నట్లు, డాక్టర్ ఇయోనిచ్ హృదయంలో పూసిన లైలాక్ పూంమీద చిక్కని పొగమంచు లాంటిది అది.

'కుక్కను వెంటబెట్టుకున్న మహిళ' (1899) బహుశా చేహొవ్ కథల్లో కెల్లా ప్రజా ప్రియమైనది. యిది పదిహేను పుటలే వున్నా, అనేక ఉద్గ్రంథాల విలువ చేసే చిన్న కళాఖండం. దీనిలోని ప్రధాన పాత్ర ద్మిత్రి గూరొవ్ డాక్టర్ ఇయోనిచ్‌కి వ్యతిరేకం. గూరొవ్, యాల్టా ఊరిలోని ఒక వేసవి కేంద్రంలో, అన్నా సెర్గేయెవ్నాను కలుసుకుంటాడు, కుక్కను వెంటబెట్టుకున్న మహిళను. యిది వాళ్ల ప్రేమ కథ.

చేహొవ్ కథలు ఉద్విగ్నంగా, సంతులితంగా వుంటాయి, సుకుమారంగా వుంటాయి. వాటిలో ఉపదేశాలూ, మందలింపులూ వుండవు. అవి యెంతో సాఫీగా నడిచే కథలు. అవీ, 'జలపక్షి,' 'వాన్య మామయ్య,' 'ముగ్గురు అక్కచెల్లెండ్లు,' 'చెర్రితోట' అనే నాటకాలూ పాఠకులలోనూ, ప్రేక్షకులలోనూ ఆనాడు వుండిన జీవితంపట్ల అసంతృప్తి కలిగించి, జీవితం యెలా వుండవలసిందీ చెపుతాయి.

అంతోన్ చేహొవ్ 1904లో మరణించినాడు. ఆయన చిత్రించిన సమాజం సుదూర గతానిది. విప్లవ పూర్వపు రష్యా ఛాయ. "బలిసినవాళ్లూ," "చిక్కిపోయిన వాళ్లూ" అనే సమాజ విభజన యిక యే మాత్రమూ లేదు. చేహొవ్ పాత్రలు గతానికి చెందినవి.

మరి, చేహొవ్ యెందుకు యీనాటి రష్యాలో అంత ప్రజా ప్రియుడుగా వున్నాడు? లక్షల సంఖ్యలో అచ్చయ్యే ఆయన పుస్తకాలు దుకాణాల్లో దొరకడం యెందుకు అంత కష్టం? కారణాలు చాలా వున్నాయి.

చేహొవ్‌ను సోవియట్ రష్యాలోనూ, ప్రపంచంలోనూ యెందుకు ప్రేమిస్తారంటే, ఆయన యెప్పుడూ వున్న దాన్ని వున్నట్టు సత్యం చెప్పడానికి ప్రయత్నించినాడు గనుక!

ఆయన్ను యెందుకు ప్రేమిస్తారంటే, ఆయన చెప్పే సత్యం యెప్పుడూ నిరావేశ ప్రశాంతి కాదు, హృదయరహిత విజ్ఞత కాదు; అది యెప్పుడూ ఆయన విశ్వాసంలో భాగంగా వుండింది గనుక.

"తాను వాస్తవంగా యెలా వున్నదీ మానవునికి చూపిస్తే, అతను బాగు పడతాడు," అని చేహొవ్ అన్నాడు.

ఆయన్ను యెందుకు ప్రేమిస్తారంటే, తన సొంత జీవితం గానీ, ఆయన పాత్రల జీవితాలు గానీ యెంత కష్టంగా వున్నా సరే, ఆయన తన ప్రత్యక్ష పరిసరాలను మాత్రమే చూడలేదు, ఆయన భవిష్యత్తు నిశ్శబ్ద పదధ్వనులు కూడా విన్నాడు గనుక, పసిగట్టి వాడు గనుక.

చేహొవ్ మహా ప్రజ్ఞగల రచయిత. రచనలో, తనలాగే ప్రజ్ఞగల పాఠకుని ఉద్దేశించినట్లూ, అతని భావుకత్వంమీదా, గ్రహణ శక్తిమీదా నమ్మకం వున్నట్లూ ఆయన యెప్పుడూ కనపడతాడు. ఆయన యెప్పుడూ పాఠకుణ్ణి నడిపించే ధోరణి వహించలేదు; ముద్దలు అందివ్వడం ద్వారానూ, చిన్న పిల్లలకూ, మందబుద్ధులకూ యెంతో ఓర్పుతో, వివరాలతో బోధించడానికీ, వివరించడానికీ ప్రయత్నించడం ద్వారానూ ఆయన యెప్పుడూ పాఠకులను అవమానించలేదు. పాఠకుడు తనను అర్థం చేసుకుంటాడనీ, తన గ్రంథాల పుటలలో పాఠకుడు దారి తప్పడనీ చేహొవ్‌కు నమ్మకం వుండింది.

చేహొవ్ సందేశం సత్యాన్నీ, ఆశనూ అనుసరించడం.

గుమాస్తా మరణం

ఒక శోభాయమానమైన రాత్రి, ఇవాన్ దిమిత్రిచ్ చెర్వ్యకోవ్ అనే ఘనమైన గుమాస్తా నాటకశాల మొదటి తరగతిలో రెండవ వరసలో కూర్చొని, బైనాకులర్స్ వాడుకుంటూ 'కార్నెవిల్ గంటలు' అనే నాటకం చూస్తూ ఆనందిస్తూ వుండినాడు. అతను రంగస్థలాన్ని చూస్తూ, తనకంటె అదృష్టవంతుడైన మానవుడు భూప్రపంచంలో లేడని అనుకుంటూ వుండగా, హఠాత్తుగా.... "హఠాత్తుగా" అనేది చౌకబారు నుడికారం అయింది; కానీ జీవితం నిండా హఠాత్ ఘటనలు వుండగా రచయితలు ఆ పదాన్ని వాడకుండా యెలా వుండగలరు? కనుక, హఠాత్తుగా అతని ముఖం ముడుచుకపోయింది, కండ్లు ఆకాశంవైపు తేలిపోయినాయి, ఊపిరి ఆగిపోయింది.... బైనాకులర్లు నుండి ముఖం పక్కకు తిప్పుకొని, కుర్చీలో వంగి — అఛ్ఛూ! అని అతను తుమ్మినాడు. మరి, యెవళ్లకేనా తమ యిష్టం వచ్చినచోట తుమ్మే హక్కు వుంది. రైతులూ, గవర్నర్లు కూడా తుమ్ముతారు. ప్రతి వొకరూ తుమ్ముతారు — ప్రతి వొకరూ. చెర్వ్యకోవ్‌కు మనస్సంకోచ మేమీ లేదు; అతను చేతిగుడ్డతో ముక్కు తుడుచుకొని, మర్యాదా మన్ననా తెలిసినవాని లాగా, తన తుమ్ము వల్ల యెవరికైనా యిబ్బంది కలిగిందేమోనని చుట్టూ చూసినాడు. అప్పుడు నిజంగా అతనికి మనస్సంకోచం కలిగింది. మొదటి వరసలో, సరిగ్గా అతనికి ముందర ఒక చిన్న వృద్ధుడు అతనికి కనిపించినాడు. అతను బట్టతలా, మెడా, గ్లౌతో తుడుచుకుంటూ, యేదో గొణుక్కుంటూ వున్నాడు. అతను రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన సివిల్ జనరల్ బ్రిజాలోవ్ అని చెర్వ్యకోవ్ గుర్తించినాడు.

"ఆయనమీద నేను తుమ్మినానే!" అనుకున్నాడు చెర్వ్యకోవ్. "ఆయన మా అధికారి కాని మాట నిజమే, కానీ యిది చాలా అనుచితమైన పని. నేను క్షమాపణ చెప్పుకోవాలి" అనుకున్నాడు.

చెర్వ్యకోవ్ చిన్న పొడిదగ్గుతో ముందుకు వంగి, జనరల్ చెవిలో చెప్పినాడు:

"క్షమించండి, సార్. నాకు తుమ్ము వచ్చింది.... నేను అనుకోలేదు...."

"పోనీలే."

"మీరు తప్పక క్షమించాలి. నేను.... అది ముందుగా అనుకున్నదికాదు!"

"యిక వూరుకో, చాలు, నీకు పుణ్యం వుంటుంది! నాటకం చూడనీ!"

చెర్వ్యకోవ్ కాస్త యిబ్బంది పడి, వెర్రి చిరునవ్వు నవ్వి, రంగస్థలంమీదికి దృష్టి మళ్లించడానికి ప్రయత్నించినాడు. అతను నటులను చూస్తూ వుండినాడు, కానీ భూ్రపపంచంలో కల్లా తానే అదృష్ట వంతుణ్నని అతనికి యిప్పుడు అనిపించ లేదు. అతన్ని పశ్చాత్తాపం పీక్కుతినింది. విరామ సమయంలో అతను బ్రిజాలోవ్ వద్దకు వెళ్లి, కాసేపు తచ్చాడి, చివరకు ధైర్యం కూడగట్టుకొని, యిలా గొణిగినాడు:

"నేను మీమీద తుమ్మినాను సార్.... క్షమించండి.... మరి.... నేను అనుకోలేదు...."

"అబ్బ, యేమిటిది.... నేను మరచిపోయినాను, నీవింకా దాన్నే పట్టుకోవాల్నా?" అన్నాడు జనరల్. చిరాకుతో అతని క్రింది పెదవి వణికింది.

"మరచిపోయినానని అంటున్నాడు. కానీ ఆయన కన్నులలోని ఆ చూపు నాకు తృప్తిగా లేదు" అని చెర్వ్యకోవ్, జనరల్ వున్న వైపు అనుమానంగా చూస్తూ అనుకున్నాడు. "నాతో మాట్లాడడం ఆయనకు యిష్టం లేదు. ఆయనకు నేను వివరించాలి, అది అలా పొరపాటున జరిగిందని... అది ప్రకృతి ధర్మమని; లేకపోతే, నా కాయన మీద ఉమ్మెయ్యాలనే ఉద్దేశం వుందని ఆయన అనుకోవచ్చు. యిప్పుడలా అనుకోక పోయినా, తరువాత అనుకోవచ్చు!...."

చెర్వ్యకోవ్ యింటికి పోయినప్పుడు, తన అమర్యాదైన చేష్టని భార్యకు చెప్పి నాడు. తన కథను ఆమె మరీ తేలికగా తీసుకున్నట్టు అతనికి అనిపించింది. ఆమె క్షణం సేపు ఆందోళన పడిన మాట నిజమే, కానీ బ్రిజాలోవ్ "మన" అధికారి కాదని తెలుసుకొని ఆమె నిబ్బరం కోలుకుంది.

"అయినా, మీరు వెళ్లి క్షమాపణ చెప్పుకోవాలి. లేకపోతే, మీకు నలుగురిలో మసులుకోవడం తెలియదని ఆయన అనుకుంటాడు," అని ఆమె చెప్పింది.

"అదే మరి! నేను క్షమాపణ చెప్పుకోడానికి ప్రయత్నించినాను, కానీ ఆయన చిత్రంగా ప్రవర్తించినాడు. అర్థమున్న మాట మాట్లాడలేదు. పైగా, మాట్లాడేం దుకు వ్యవధే లేదు."

మర్నాడు చెర్వ్యకోవ్ తన కొత్త అధికారిక కోటు ధరించి, దారిలో క్రాపు చేయించుకొని, తన ప్రవర్తనను వివరించడానికి బ్రిజాలోవ్ వద్దకు వెళ్లినాడు. జనరల్ రిసెప్షన్ గదినిండా అర్జీదార్లు వుండినారు, జనరల్ కూడా అర్జీలు స్వీకరిస్తూ వుండినాడు అక్కడ. కొద్దిమందితో మాట్లాడి, తర్వాత జనరల్ కన్ను లెత్తి చెర్ వ్యకోవ్‌ను చూసినాడు.

"సార్, రాత్రి, 'ఆర్కేడియ' నాటకశాలలో, మీకు జ్ఞాపక ముంటుంది," అని గుమాస్తా ప్రారంభించినాడు. "నాకు — తుమ్ము వచ్చింది — మీకు క్షమాపణ — చెప్పుకున్నాను..."

"అబ్బే, దానిదేముందిలే!" అంటూ జనరల్ పక్కనున్న అర్జీదారునివైపు తిరిగి "యేమిటి మీ విషయం?" అన్నాడు.

"నేను చెప్పేది వినిపించుకోవడం లేదు!" అనుకుని చెర్వ్యకోవ్ వివర్ణుడైనాడు. "ఆయన కోపంగా వున్నాడన్నమాట... దీన్ని యింతటితో వదలి పెట్టకూడదు.... ఆయనకు వివరించాలి..."

జనరల్ చివరి అర్జీదారుని చూసిన తర్వాత తన ప్రైవేటు గదిలోకి పోడానికి మళ్లినప్పుడు, యిలా గొణుగుతూ అన్నాడు:

"క్షమించండి సార్, నా హృదయపూర్వకమైన పశ్చాత్తాపం వల్లనే మిమ్మల్ని యిబ్బంది పెట్టే సాహసం చేస్తున్నా..."

జనరల్ యేడ్వబోయేవానిలా ముఖం పెట్టి, అతన్ని వెళ్లిపొమ్మన్నట్లు చేయి వూపినాడు.

"అయ్యా, తమరు నన్ను పరిహాసం చేస్తున్నారు" అంటూ అతను గుమాస్తా ముఖంమీద ఫెళ్లున గది తలుపు మూసేసుకున్నాడు.

"పరిహాసమా? యిందులో వినోదం నాకేమీ కనిపించదే. ఆయనకు అర్థం కాదా? జనరల్ కూడా ఆయన. సరే, నా క్షమాపణలతో యిక ఆ పెద్దమనిషిని బాధించను. యెక్కడైనా చావనీ! ఒక ఉత్తరంముక్క రాసి పడేస్తాను, ఆయన వద్దకిక పోనేపోను! పోను — అంతే!" అనుకున్నాడు చెర్వ్యకోవ్.

యింటికి పోతూ అలా అనుకున్నాడు. కానీ ఉత్తరం రాయలేదు. యెంత ఆలోచించినా అతనికి ఉత్తరం యెలా రాయాల్నో తోచలేదు. అందువల్ల అతను మర్నాడు జనరల్‌వద్దకు వెళ్లవలసి వచ్చింది, పరిష్కారం చేసుకోడానికి.

జనరల్ అతనివైపు ప్రశ్నార్థకంగా చూసినప్పుడు అతను చెప్పసాగినాడు:

"నిన్న మిమ్మల్ని యిబ్బంది పెట్టింది, మీరు సూచించినట్లు, మిమ్మల్ని పరిహసించడానికి కాదు. తుమ్మి, మీకు యిబ్బంది కలిగించినందుకు మీకు క్షమాపణలు చెప్పుకోడానికి వచ్చినాను.... యిక పరిహాసమంటే, అలాంటిది నా కలలోకి రాదు. అంత సాహసమా నాకు! పరిహాసం చేయాలని మేము అనుకుంటే, యిక గౌరవం అనేది వుండదు... పెద్దవాళ్లపట్ల గౌరవం అనేది వుండదు...."

జనరల్‌కు ఆగ్రహంతో ముఖం కందగడ్డ అయింది. ఆవేశంతో వణకుతూ, "ఫో బయటికి!" అని గర్జించినాడు.

చెర్వ్యకోవ్ భయంతో కొయ్యబారి, "యేమన్నారు?" అని మెల్లగా గొణిగినాడు.

"పో బయటికి" అని జనరల్ మళ్లీ అన్నాడు, కాలు నేలమీద తాడిస్తూ.

చెర్వ్యకోవ్‌కు తన లోపల యేదో పుటుక్కుమన్నట్లు అనిపించింది. అతను వాకిలి దాకా వెనక్కి అడుగులు వేసుకుంటూ పోయి, వీధిలోకి నడిచి, వీధుల్లో తిరిగినాడు; కానీ అతనికి యేమీ వినిపించనూ లేదు, కనిపించనూ లేదు. అతను యాంత్రికంగా వచ్చి యింట్లో పడినాడు, అలాగే, అధికారిక కోటుతోనే, సోఫాలో పండుకొని... ప్రాణం విడిచినాడు.

1883

•

ఊసరవెల్లి

కొత్త చలికోటు తొడుక్కున్న పోలీస్ ఛీఫ్ ఒచుమేలొవ్* చేతిలో ఒక కట్ట పట్టుకొని మార్కెట్ దాటినాడు. అతని వెనుక య్రెర జుట్టు జవాను యెక్కడ్నో దండుకున్న గూస్‌బ్రెరీ పండ్లు నిండుగా వున్న బుట్టను మోసుకుంటూ నడిచినాడు. చుట్టూ అంతా నిశ్శబ్దం... మార్కెట్‌లో ఒక్క పిట్ట లేదు... చిన్న దుకాణాలవీ, హోటళ్లవీ వాకిళ్లు, ఆకలిగొన్న నోళ్లలాగా, ప్రపంచంవైపు విచారపూరితంగా తెరచుకొని వున్నాయి. వాటి దగ్గర బిచ్చగాళ్లు కూడా లేరు.

హఠాత్తుగా ఒక కంఠధ్వని ఒచుమేలొవ్ చెవుల పడింది. "అయితే కరుస్తా వన్నమాట, గలీజు కుక్కా! దాన్ని వదలిపెట్టకండి, అబ్బాయిలూ! యీ రోజుల్లో కరవడం చెల్లదు. పట్టుకోండి అయ్!"

కుక్క మూలుగు వినిపించింది. ఒచుమేలొవ్ శబ్దం వచ్చిన దిశలో చూసినాడు. అతనికి కనిపించింది యిది: పిచూగిన్ అనే వర్తకుని కలప అడితీనుండి ఒక కుక్క మూడు కాళ్లమీద పరుగెత్తుకుంటూ వచ్చింది. గంజి పెట్టిన పింటు చొక్కా, గుండీలు పెట్టుకోని వేస్టుకోటూ తొడుక్కున్న ఒక మనిషి దాన్ని వెంట బడినాడు. అతని దేహ మంతా ముందుకు వంగింది. ఆ మనిషి తొట్రుటుకొని, కుక్క వెనక కాలు ఒకటి పట్టుకు న్నాడు. మరొక మూలుగు వచ్చింది, మళ్లీ ఒక కేక: "దాన్ని వదలిపెట్టవద్దు!" దుకాణాలలోనుండి నిద్ర ముఖాలు వెలికి వచ్చినాయి, రెప్పపాటులో నేల యీనినట్లు కలప అడితీచుట్టూ జనం పోగైనారు.

"యేదో అల్లరిలా వుంది సార్!" అన్నాడు జవాను.

ఒచుమేలొవ్ అటు తిరిగి, గుంపు వద్దకు నడిచినాడు. సరిగ్గా అడితీ గేటు

---

* ఒచుమేలొవ్ అంటే వెర్రివాడు. — సం.

ముందర అతనికి పైన చెప్పిన గుండీలు పెట్టుకొని వేస్టుకోటు మనిషి కనిపించినాడు. ఆ మనిషి తన కుడిచేయి పైకెత్తి, రక్తం కారే వేలును జనానికి చూపిస్తూ వుండినాడు. "నీకు శాస్తి చేస్తాను, సైతాన్!" అనే భావం అతని మత్తు ముఖంమీద స్పష్టంగా కనిపిస్తూవుండింది, ఆ వేలు విజయ పతాకలాగ వుండింది. ఆ మనిషి కంసాలి హ్ర్యూకిన్* అని ఒచుమేలొవ్ గుర్తించినాడు. సరిగ్గా గుంపు మధ్యన, ముందరి కాళ్లు దూరదూరంగా పెట్టుకొని, దోషి కూర్చొని వుంది, దేహమంతా వణకుతూ — అది తెల్లని బొర్జోయ్ కుక్క, దానికి కొన దేలిన ముక్కూ, వీపున పసుపురంగు మచ్చా వున్నాయి. దాని తడి కన్నులలో విస్సహాయతా, భయమూ నిండివుండినాయి.

ఒచుమేలొవ్ గుంపులోకి తోసుకుంటూ పోయి, "యేమి టిదంతా?" అని అడిగినాడు. "యేమి చేస్తున్నా విక్కడ? యెందుకు వేలు యెత్తిపెట్టినావు? యెవరు అరిచింది?"

హ్ర్యూకిన్ పిడికిట్లోకి దగ్గతూ ప్రారంభించినాడు:

"నేను దారివెంట పోతూవుండినాను. మేకపిల్లలాగ మెల్లగా పోతూవుండినాను. కలప గురించి నాకు యీ మీత్రిచ్‌తో కాస్త పని వుండింది. హఠాత్తుగా, నిష్కారణంగా, ఆ పాడుది నా వేలు కరిచింది. క్షమించండి, సార్, మరి నేను పనిచేసుకునేవాణ్ణి.... నాది చాలా సున్నితమైన పని. నాకు నష్ట పరిహారం యిప్పించండి — బహుశా వారందాకా నేనీ వేలు కదిలించలేకపోవచ్చు. మనం క్రూర మృగాలను భరించాలని చట్టంలో లేదు గదండి, సార్. ప్రతిదీ యిలా కరవడం మొదలుపెడితే, బతుకు దుర్భరంగా వుంటుంది...."

"ఊఁ..... సరే," అన్నాడు ఒచుమేలొవ్ కఠినంగా, దగ్గుతూ, కనుబొమలు ముడివేస్తూ. "సరే, సరే... యెవరిదీ కుక్క? దీన్ని యింతటితో వదలిపెట్టను. కుక్కలను వూరిమీద వదలే వాళ్లకు బుద్ధిచెప్పాలి! నియమాలకు లోబడదలచుకోని పెద్దమనుషుల మీద చర్య తీసుకోవాలి! జరిమానా పడుతుంది బద్మాష్‌కు — కుక్కలనూ, నానా రకాల జంతువులనూ వీధుల్లో తిరగనివ్వడమంటే యేమిటో వానికి తెలియజెప్తాను! యేది యేదైందీ వానికి చూపిస్తాను!" అతను జవానువైపు తిరుగుతూ కొనసాగించినాడు: "ఎల్దీరిన్, యిది యెవరి కుక్కో కనుక్కో, రిపోర్టు తయారు చెయ్. కుక్కను వెంటనే తుదముట్టించాలి. యిది పిచ్చి కుక్కేమో.... యెవరిదీ కుక్క, చెప్పండి?"

"యిది జనరల్ జిగాలొవ్ దనుకుంటాను," అని జనంలో నుండి ఒక గొంతు వినిపించింది.

"జనరల్ జిగాలొవ్‌దా? ఎల్దీరిన్, నా కోటు విప్పాలి... అబ్బ, యెంత ఉక్కగా వుంది! వర్షం వచ్చేటట్లుంది." అతను హ్ర్యూకిన్‌వైపు తిరిగి అన్నాడు: "ఒక

---

* హ్ర్యూహ్ర్యూ — పంది అరుపు. — సం.

విషయం నాకు అర్థం కాలేదు — అది నిన్ను కరవడం యెలా జరిగింది? దానికి వేలు యెలా దొరికింది? అంత చిన్న కుక్క, నీవేమో గుర్రంలా వున్నావు! నీ వేలికి యెక్కడో చీల గీసుకొని వుంటుంది, డబ్బు సంపాయించచ్చునని తరువాత నీకు ఆలోచన వచ్చి వుంటుంది. మీ సంగతి నాకు తెలుసు — వట్టి వెధవలు!''

"అతను కాలే సిగరెట్‌తో తమాషాకు దాని మూతి కాల్చినాడు సార్. అది కరిచింది, అదేం తెలివితక్కువదా! ఆ హ్ర్యూకిన్ యెప్పుడూ యేదో ఒక తుంటరి పని చేస్తుంటాడు!''

"ఒరేయ్ మెల్లకన్నుగా, యెందుకురా అబద్ధాలు! నేను సిగరెట్టుతో కాల్చడం నీవు చూడలేదుగా, మరి యెందుకు అబద్ధాలు? ఈయన అన్నీ తెలిసినవాడు. యెవరు అబద్ధమాడేదీ, యెవరు వచ్చి నిజం చెప్పేదీ యీయన తెలుసుకుంటాడు. నేను అబద్ధమాడుతూ వుంటే, నన్ను కోర్టులో విచారించండి! చట్టంలో యేముం దంటే... మానవులందరూ సమానమని. పోలీసు డిపార్టుమెంటులో నాకూ ఒక తమ్ముడున్నాడు, నీకు తెలియదేమో...''

"వాదించద్దు!''

"ఊహూఁ, అది జనరల్ కుక్క కాదు,'' అని జవాను ధీమాగా తన అభిప్రాయం యేమిటో చెప్పినాడు. "జనరల్‌కు అలాంటి కుక్క లేదు. ఆయన కుక్కలన్నీ వేట కుక్కలు.''

"నీకు బాగా తెలుసా?''

"బాగా తెలును సార్.''

"నీమాట నిజమే! జనరల్ కుక్కలన్నీ ఖరీదైనవి, జాతికుక్కలు. యిదేమో — చూడు యెలా వుందో! అసహ్యపు గజ్జికుక్క! యిలాంటి వాటిని యెందుకుంచుకోవాలి యెవరైనా? నీకేమైనా తిక్కా? యిలాంటి కుక్క మాస్కోలోనో, పీటర్స్‌బుర్గ్‌లోనో వుంటే, దాన్ని యేం చేస్తారో తెలుసా? చట్టాన్ని యెవరూ పట్టించుకోరు — దాన్ని క్షణంలో లాగిపారేస్తారు. హ్ర్యూకిన్, నీకు అన్యాయం జరిగింది. నా మాట విను, దీన్ని యింతటితో వదలెయ్యవద్దు. వానికి బుద్ధి చెప్పాలి! తప్పక చెప్పాలి...''

జవాను తనలో తాను అనుకున్నట్టుగా అన్నాడు: "యింతకూ అది జనరల్‌దే కావచ్చు. చూస్తూనే చెప్పలేముగా. ఆమధ్య అలాంటి కుక్కనే ఆయన పెరట్లో చూసినాను.''

"అది నిస్సందేహంగా జనరల్‌దే!'' జనంలోనుండి ఎవరిదో గొంతు వినిపించింది.

"హుం! ఎల్దిరిన్, కోటు తొడుక్కోవాలి... చలి వేస్తున్నది. నాకు వణుకు వస్తున్నది. దీన్ని జనరల్ యింటికి తీసుకపోయి, అక్కడ అడుగు. నాకు కనిపిస్తే పంపినానని చెప్పు. బయటికి వదలవద్దని వాళ్లతో చెప్పు. యిది ఖరీదైన కుక్క కావచ్చు. ప్రతి గాడిదా మూతి సిగరెట్లు పెడితే, త్వరలో పాడౌతుంది యిది. కుక్క సుకుమార

మైన జంతువు. నీవింక చెయ్యి దించు వెధవా! నీ వెధవ వేలు అందరికీ చూపించడం మానుకో! తప్పు నీదే...."

"అదుగో, జనరల్ వంటమనిషి వస్తున్నాడు, అడుగుదాం.... ఓయ్, ప్రొహోర్, యిలారా. యీ కుక్కను చూడు... మీదేనా యిది?"

"భలేవాళ్లే! యిలాంటిది మాకెప్పుడూ లేదు!"

"యిక అడగక్కర లేదు," అన్నాడు ఒచుమేలొవ్. "యిది దారితప్పిన కుక్క. యిక్కడ నిలబడి మాట్లాడుతుంటే యేం లాభం? దారితప్పిన కుక్క అన్నానుగా, దారి తప్పిందే. దాన్ని చంపేసి, యిక ఆ విషయం ముగించండి."

"యిది మాది కాదు," అంటూ ప్రొహోర్ కొనసాగించివాడు. "యిది జనరల్ తమ్మునిది. ఆయన యిటీవల వచ్చివాడు. మా జనరల్‌కు బొర్జోయ్ కుక్కలమీద యిష్టంలేదు. ఆయన తమ్మునికి యిష్టం...."

"యేమిటి, జనరల్ తమ్ముడు వచ్చివాడా? వ్లదీమిర్ ఇవానిచ్?" అంటూ ఒచుమేలొవ్, ముఖం చేటంత అయేట్టు చిరునవ్వు నవ్వుతూ ఉత్తేజపడివాడు. "చిత్రంగా వుందే! నాకు తెలియనే లేదు. అన్నని చూడాలని వచ్చివాడా?"

"అవును."

"అంటే, అన్నకోసం బెంగపెట్టుకున్నాడూ... నాకు తెలియనేలేదు. అయితే యిది ఆయన కుక్కన్న మాట? బ్రహ్మాండం! యెత్తుకో దీన్ని... ముచ్చటైన బుల్లి కుక్క! వాని వేలు కాటేసినావ్? హాహాహా! యిదుగో, వణకవద్దు! గ్ర్-గ్ర్.... చిట్టి ముండకు కోపం వచ్చింది.... ఓ, యేం కుక్క!"

ప్రొహోర్ కుక్కను పిలుచుకొని కలప అడితీనుండి వెళ్లిపోయివాడు. జనం ఖ్ర్యూకిన్‌ను చూసి నవ్వివారు.

"యెప్పుడో ఒకసారి నీ పని చూస్తాను!" అంటూ ఒచుమేలొవ్ అతన్ని బెదిరించి, చలికోటు చుట్టూ కప్పుకొని మార్కెట్‌లో తన ప్రయాణం కొనసాగించివాడు.

1884

బురఖా

ఒక సోషల్ క్లబ్బులో ధర్మకార్యార్థం విచిత్ర వేషాల నృత్య పార్టీ, లేదా స్థానిక యువతీమణుల భాషలో బాల్ వరే, యేర్పాటుచేశారు.

అర్ధరాత్రి పంద్రెండు గంటలు. నృత్యం చేయని మేధావులు, బురఖాలు లేని వాళ్లు — వాళ్లు అయిదుమంది వుండివారు — రీడింగు రూంలోని పెద్ద టేబుల్ చుట్టూ కూర్చొని, తమ ముక్కులూ, గడ్డాలూ వార్తాపత్రికలలో ముంచేసి, చదువు కుంటూ, తూగుతూ — మాస్కో, పీటర్స్‌బుర్గ్ వార్తాపత్రికల ప్రత్యేక విలేకరి మాటల్లో చెప్పాలంటే (అతను మహా ఉదార హృదయుడు) — "ధ్యానం చేస్తూ వుండి నారు."

నృత్యశాలమండి సంగీతం తేలియాడుతూ వస్తూవుండింది. వెయిటర్లు ప్లేట్ల గలగలలతో యెడతెరపి లేకుండా వాకిలి ముందర ధణధణ వస్తూపోతూ వుండినారు. కానీ రీడింగు రూం లోపల ప్రగాఢ నిశ్శబ్దం రాజ్యం చేస్తూ వుండింది.

హఠాత్తుగా, పొగగొట్టంలోనుంచి వచ్చినట్లున్న సన్నని, ముద్ద కంఠధ్వని ఆ నిశ్శబ్దాన్ని భంగం చేసింది.

"యిక్కడ సుఖంగా వుంటుంది. రండి! యిలా."

తలుపు తెరచుకుంది. విశాలమైన భుజాలుగల దిట్టమైన వ్యక్తి, గుర్రబ్బండి వాని దుస్తులలో, టోపీకి నెమలి యీకలతో, బురఖా ధరించి, రీడింగు రూంలో ప్రవే శించివాడు. అతనివెంట బురఖాలున్న యిద్దరు మహిళలూ, ట్రే పట్టుకొని ఒక వెయ్ టరూ వచ్చినారు. ట్రేలో ఒక లావాటి పానీయం సీసా, మూడు య్రెరవైన్ సీసాలూ, కొన్ని గ్లాసులూ వుండినాయి.

"యిటు. యిక్కడ చల్లగా వుంటుంది," అన్నాడు ఆ వ్యక్తి. "ట్రే టేబుల్ మీద పెట్టు. కూర్చోండి యువతులారా. మరి, అయ్యలారా, తమరు దయ చేయండి... తమరు మాకు అడ్డం వున్నారు."

అతను టేబుల్‌మీదనుండి కొన్ని పత్రికలను కిందికి తోసివేస్తూ, కొద్దిగా ఊగినాడు.

"యిక్కడ పెట్టు. యిక, చదివే పెద్దమనుషులారా, మీరు బయటికి వెళ్లండి. మీ పత్రికలకూ, రాజకీయాలకూ యిది సమయంకాదు. వాటిని పక్కన పెట్టేసేయండి!"

"మీరు కొంచెం శాంతించాలని కోరుతున్నాను" అన్నాడు ఒక మేధావి, బురఖా వ్యక్తిని తన కళ్లద్దాలగుండా పరిశీలిస్తూ. "యిది రీడింగు రూం – పానశాల కాదు.... తాగడానికిది స్థలం కాదు."

"యెవరన్నారు? టేబుల్ నిలకడగా వుండదా, లేక మిద్దెకప్పుమీద పడుతుందా? చిత్రం కానీ మాటలు పెట్టుకోడానికి నాకు తీరిక లేదు. పత్రికలు వదిలేయండి.... యింతసేపూ చదివినారుగా, దానితో తృప్తిపడండి. యిప్పటికే మీకు తెలివి యెక్కువైంది, పైగా మీకు కండ్లు చెడిపోతాయి, కానీ అంతకంటె ముఖ్యమైన దేమిటంటే – నేను ఒప్పుకోను, అంతే."

వెయిటర్ టేబుల్‌మీద ట్రే పెట్టి, చేతిమీద తుండుగుడ్డతో వాకిలివద్ద నిల బడినాడు. మహిళలు వెంటనే యెర్రవైన్ పని పట్టనారంభించినారు.

"యిలాంటి పానీయాలకు బదులు వార్తాపత్రికలు కోరుకునే తెలివిపరులు వున్నా రన్నమాట" అని నెమలి యీకల వ్యక్తి, గ్లాసులో పానీయం పోసుకుంటూ అన్నాడు. "గౌరవనీయులారా, నా నమ్మకం యేమిటంటే, మీకు పానీయాలకు డబ్బు లేకనే వార్తాపత్రికలమీద అంత ప్రీతి. నిజమేనా? హాహా వాళ్లు చదవడం చూడండి.... మీ వార్తాపత్రికల్లో యేమి రాసినారు? కళ్లద్దాల మనిషీ! కొత్త వార్తలు చెప్పు! హాహా! చాలించు యిక! నీ వేషాలు కట్టిపెట్టు! పానీయం పుచ్చుకో!"

నెమలి యీకల మనిషి చేయి జాపి కళ్లద్దాల మనిషి చేతుల్లోని పత్రికను లాగిపారవేసినాడు. ఆ మనిషి, ముఖం వో సారి యెర్రబడుతూ, వో సారి పాలిపోతూ వుండగా, యితర మేధావులవైపు ఆశ్చర్యంగా నిలజూసినాడు, వాళ్లూ అతనివైపు అలాగే చూసినారు.

"మీ స్థానం మీరు విస్మరిస్తున్నారండీ" అని అతను అరిచినాడు. "రీడింగు రూంను మీరు కల్లుదుకాణంగా మారుస్తున్నారు. అల్లరి చేయడమూ, యితరుల చేతు ల్లోనుండి వార్తాపత్రికలు గుంజుకోవడమూ చేయవచ్చు ననుకుంటున్నారు మీరు. అలాంటివి నేను సహించను! మీరు యెవరితో మాట్లాడేది మీకు తెలియదు. నేను బాంకి మేనేజర్ జెస్త్యకోవ్‌ను."

"నీవు జెస్త్యకోవ్ అయినా నాకేమీ లెక్క లేదు. నీ వార్తాపత్రికలను గురించి నే నేమనుకునేదీ యిదుగో చూడు."

అంటూ ఆ మనిషి పత్రికను పైకెత్తి ముక్కలు ముక్కలుగా చింపేసినాడు.

జెవ్త్యకోవ్ ఆగ్రహంతో కొయ్యబారి, గొంతులోనే గొణుక్కున్నాడు: "యేమిటండీ దీని అర్థం? మహా చిత్రంగా వుంది, యిది, యిది.... చాలా చిత్రంగా వుంది!"

"ఓ, కోపం వచ్చింది వీరికి!" అంటూ ఆ మనిషి పకపక నవ్వినాడు. "అమ్మ బాబోయ్, నా కెంత భయంగా వుందని! నా కాళ్ళ యెలా వణకుతున్నాయో చూడండి! గౌరవనీయులైన పెద్దమనుషులారా, నేను చెప్పేది వినండి. హాస్యాలు అటుంచి, నాకు మీతో మాట్లాడాలని లేదు.... యీ యువతులతో నేను యేకాంతంగా వుండదలచు కున్నాను, నేను ఖుషీ చేసుకోవాలి. కనుక, దయవుంచి, యిబ్బంది కలిగించకుండా, పూరకే వెళ్ళండి. అదుగో వాకిలి. మిస్టర్ బెలెబూహిన్! దాటు బయటికి! యెందుకలా మోర యెత్తుతున్నావ్? నేను వెళ్ళమంటే, వెళ్ళాలి! పరుగు పుచ్చుకో, నిన్ను గెంటెయ్యక ముందే."

అనాథ శరణాలయం కోశాధికారి బెలెబూహిన్, జేవురించిన ముఖంతో, భుజాలు కుదిస్తూ "యేమన్నావ్?" అని అడిగినాడు. "నాకు అర్థం కావడం లేదు. ఒక పొగరు బోతు గదిలో దూరి, హఠాత్తుగా నానా హంగామా ప్రారంభించినాడు."

"యేమన్నావ్? పొగరుబోతవా!" నెమలి యీకల మనిషి, కోపంతో వివశుడై, టేబుల్‌మీద పిడికిళ్ళతో బాదుతూ గద్దించినాడు. ట్రేలోని గ్లాసులు యెగిరిపడినాయి. "నీవు యెవరితో మాట్లాడుతున్నావో తెలుసా? నాకు బురఖా వుందని, నీ యిష్టం వచ్చినట్లు అనవచ్చు ననుకున్నావు గదూ. నీకు లేదూ తలబిరుసు! నేను బయటికి దాటమంటే దాటాలి! బాంకి మేనేజరు కూడా దయచెయ్యొచ్చు. మొత్తం మూక అంతా వెళ్ళండి. ఒక్క వెధవ కూడా గదిలో వుండకూడదు! ఊఁ, లేవండి — మీ పందుల దొడ్డికి మీరు వెళ్ళండి."

"ఆ సంగతి చూద్దాంగా" అన్నాడు జెవ్త్యకోవ్, కంపించిపోతూ. ఆ కంపంతో అతని కళ్ళద్దాలకే చెమట పట్టినట్లుంది. "నీకు చూపిస్తాను! ఏయ్, క్లబ్బు మేనేజర్‌ను పిలువు!"

ఒక నిముషంలో యెర్రజుట్టు క్లబ్బు మేనేజర్ వచ్చినాడు, అతని కోటు ఛాతీకి నీలం రిబ్బనుముక్క అలంకరించి వుంది. నాట్యం చేసి అలిసి గసపెడుతూ వున్నాడు.

"దయచేసి గది వదలండి" అంటూ అతను ప్రారంభించినాడు. "యిది తాగే స్థలం కాదు. దయచేసి అల్పాహారాల గదికి వెళ్ళండి."

"నీ వెక్కడమండి వూడిపడి నావోయ్?" అని అడిగినాడు బురఖా వ్యక్తి. "నేను నిన్ను పిలవలేదే?"

"అధిక ప్రసంగం వద్దండీ, దయచేసి వెళ్ళండి."

"యిటు చూడు, మిత్రమా.... నీకు సరిగ్గా ఒక నిముషం వ్యవధి యిస్తున్నాను.... నీవు మేనేజర్‌వు గనుక, యిక్కడ ముఖ్యమైన వ్యక్తివి గనుక, యీ కళాకారులను

బయటికి తోలెయ్. మా యువతిరత్నాలకు కొత్తవాళ్ల మధ్య వుండడం యిష్టం లేదు.... వాళ్ళు సిగ్గుపడుతున్నారు; మరి నేనేమో డబ్బు ఖర్చుపెట్టినాను, వాళ్ల నగ్నసౌందర్యం చూడడానికి...."

"యిది పందుల దొడ్డి కాదని యీ మొద్దుకు తెలిసినట్లు లేదు!" అని బిగ్గరగా అరిచినాడు జెన్స్క్యకోవ్. "యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్‌ని పిలవండి!"

"యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్!" క్లబ్బు మార్మోగింది. "యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్ యెక్కడ?"

పోలీసు దుస్తులలో వున్న వృద్ధుడు యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్ ఆదరాబాదరా వచ్చినాడు.

భీకరమైన కండ్లు మిటకరిస్తూ, రంగు వేసిన మీసాల కొనలు మెలిపెడుతూ "దయచేసి గది వదలండి" అన్నాడు అతను కరకుగా.

"నే నెంతగా జడుసుకున్నానని!" అంటూ ఆ వ్యక్తి ఉల్లాసంగా నవ్వసాగినాడు. "నిజం, దేవుని తోడు! బాప్‌రే, యెంత తమాషా అయిన ఆకారం! పిల్లి మీసాలూ, మిడిగుడ్లూ.... హాహాహా!"

"మాటలు అనవసరం!" గొంతెత్తి అరిచినాడు యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్, కోపంతో వణకిపోతూ. "బయటికి నడు, లేదా గెంటేయిస్తాను!"

రీడింగు రూమంతా అల్లకల్లోలమైంది. యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్ యెర్రగా కంద గడ్డలాగా అయి, కేకలు వేసినాడు, కాలు నేలమీద తాడించినాడు. జెన్స్క్యకోవ్ కేకలు వేసినాడు. బెలెబూహిన్ కేకలు వేసినాడు. మేధావులందరూ కేకలు వేసినారు. కానీ వాళ్ల కంఠాలన్నీ బురఖా మనిషి బొంగురు ముద్ద కంఠంకింద అణగిపోయినాయి. అంతా అల్లకల్లోలం అవడంతో నృత్యం ఆగిపోయి, అతిథులందరూ నృత్యశాలలోనుండి వచ్చి రీడింగు రూంలో గుమికూడినారు.

యెవ్‌ట్రాత్ స్పిరిదోనిచ్ దర్పంగా అప్పుడు క్లబ్బు ఆవరణలో వుండిన పోలీసుల నందరినీ అక్కడికి పిలిపించి, రిపోర్టు రాయడానికి కూర్చున్నాడు.

"రాసుకో!" అన్నాడు ముసుగు మనిషి, పేనాకింద తన వేలు దూరుస్తూ. "అయ్యో, యిక నా గతి యేమౌతుంది? పాపం నా గతి! నాబోటి అనాథను యెందుకు నాశనం చేస్తారు? హాహా! కానీండి అయితే! రిపోర్టు తయారైందా? అందరూ సంతకాలు చేసినారా? యిక చూడండి! ఒకటి, రెండు, మూడు...."

అతను లేచి, నిల్చి నిలబడి, బురఖా లాగిపారవేసినాడు. మత్తెక్కిన అతని ముఖం అందరికీ కనిపించింది. దాని ప్రభావం వాళ్లమీద యెలా వుందో అని అతను అందరినీ కలయజూసి, కుర్చీలో మళ్లీ కూలబడి, విరగబడి నవ్వసాగినాడు. దాని ప్రభావం అనూహ్యంగా వుండింది. మేధావులు భయకంపిత దృక్కులతో ఒకరినొకరు చూసుకొని, పాలిపోయినారు;

కొంతమంది బుర్రగోక్కోవడం కూడా కనిపించింది. యెవ్‌స్త్రాత్ స్పిరిదోనిచ్ తెలియక ఘోరమైన తప్పు చేసినవానిలాగా గొంతు సవరించుకున్నాడు.

ఆ అల్లరి మనిషిని అందరూ గుర్తించినారు. అతను వంశపారంపర్యంగా గౌరవ నీయుడైన వ్యతిగోరొవ్, స్థానిక కోటీశ్వర ఉత్పత్తిదారుడు, రాడీతనానికీ, దానశీల తకూ, స్థానిక పత్రికలు విసుగు లేకుండా నిరంతరం కొనియాడుతున్నట్లు విద్యాభిమా నానికీ పేరుకెక్కినవాడు.

క్షణం సేపు ఆగి వ్యతిగోరొవ్ అన్నాడు: "మరి, పోతారా యిక?"

మేధావులు నోరెత్తకుండా రీడింగు రూంలోనుండి మునిగాళ్లమీద బయటికి నడి చినారు. వ్యతిగోరొవ్ తలుపు తాళం వేసుకున్నాడు.

తరువాత యెవ్‌స్త్రాత్ స్పిరిదోనిచ్ వ్యతిగోరొవ్ రీడింగు రూంలోకి వైన్ తెచ్చిన వెయిటర్‌ను భుజం పట్టుకొని వూపుతూ అడిగినాడు: "అతను వ్యతిగోరొవ్ అని నీకు తెలుసు కదా. ఒక మాటైనా చెప్పలేదు?"

"చెప్పవద్దన్నారండి."

"చెప్పవద్దన్నారు! ఒకనెల జైల్లో పెడతానుండు దొంగవెధవా, అప్పుడు తెలుస్తుంది చెప్పవద్దనడానికి అర్థమేమిటో. పో, అవతలికి!" మేధావులవైపు తిరిగి అతను కొనసాగించి నాడు: "మీరందరూ మంచి బుద్ధిమంతులయ్యా. యెంత గొడవ చేసినారు! ఒక్క పదినిముషాలు రీడింగు రూం వదలివుండలేరా? సరే, అడుసులో దిగినారు, యెలా బయటపడతారో మీ యిష్టం. అయ్యా, మీ పద్ధతులు నాకేమీ నచ్చలేదు, భగవంతుని సాక్షిగా చెపుతున్నాను, నాకేమీ నచ్చలేదు...."

మేధావులు దిగులుగా, మొగాలు వేలాడేసుకొని, పశ్చాత్తాపంతో, ఒకరితో ఒకరు గుసగుసలాడుతూ, ప్రమాదం వస్తోందని తెలిసి కాలు నిలవకుండా క్లబ్బులో తిరిగినారు. వాళ్ల భార్యలూ, బిడ్డలూ వ్యతిగోరొవ్‌కు "అవమానం" జరిగిందనీ, కోపగించుకున్నాడనీ తెలిసి, మూతులు ముడుచుకొని, యిండ్లకు బయలుదేర సాగినారు. నృత్యం ఆగిపోయింది.

తెల్లవారు జామున రెండు గంటలకు వ్యతిగోరొవ్ రీడింగు రూంలోనుండి బయ టికి వచ్చినాడు. అతను చిత్తుగా తాగినాడు. నృత్యశాలలోకి పోయి అతను వాద్యగాళ్ల పక్కన కూర్చొని, సంగీతం వింటూ తూగసాగినాడు. చివరకు విషాద పూరితంగా అతని తల వాలింది, గురక ప్రారంభమైంది.

"సంగీతం ఆపండి!" అని మేనేజరు వాద్యగాళ్లకు కేకవేసినాడు. "ష్.... అయన నిద్రపోతున్నాడు."

కోటీశ్వరుని చెవిదాకా వంగి, "అయ్యా, మిమ్మల్ని యింటికి తీసుకెళ్లమంటారా?" అని బెలెబూహిన్ అడిగినాడు.

బుగ్గ మీద వాలిన యీగను పారదోలడానికి ప్రయత్నిస్తున్నట్లు వ్యతిగోరావ్ పెదవులు ముందుకు సాచినాడు.

"మిమ్మల్ని యింటికి తీసుకెళ్లమంటారా?" అని బెలెబూహిన్ మళ్లీ అడిగినాడు. "లేక మీ బండిని యిక్కడికి తెమ్మనమంటారా?" అన్నాడు.

"ఏయ్? యేమిటి? హా! నీవా.... యేమిటి?"

"మిమ్మల్ని యింటికి తీసుకెళ్తాను.... వేళైంది."

"యింటికి. నేను యింటికి పోవాలి.... నన్ను తీసుకెళ్లు."

సంతృప్తితో ముఖం కళకళలాడగా బెలెబూహిన్ వ్యతిగోరావ్‌ను పట్టుకొని నిల బెట్టినాడు. ముఖాల నిండా చిరునవ్వులతో యితర మేధావులు పరుగెత్తుకుంటూ వచ్చినారు. అందరూ కలిసి వంశపారంపర్యంగా గౌరవనీయుడైన పౌరుని పట్టుకొని, అపారమైన జాగ్రత్తతో బండిదాకా నడిపించుక పోయినారు.

ఆ కోటీశ్వరుణ్ణి బండిలోకి యెక్కించేటప్పుడు "కళాకారుడు మాత్రమే, యెంతో ప్రజ్ఞ గలవాడు మాత్రమే అంతమందిని బోల్తా కొట్టించగలడు" అంటూ జెన్స్త్యకోవ్ ఉల్లాసంగా వదరుతూ వుండినాడు. "నాకు నిజంగా ఆశ్చర్యం కలిగింది వ్యతిగోరావ్ గారూ. నేను నవ్వు పట్టలేకుండా వున్నాను, యిప్పటికీ.... హాహాహా.... మేమందరమూ ఉద్రేకపడి యెంత గొడవ చేసినాము! హాహాహా! నేను నాటకశాలలో కూడా యింతగా యెప్పుడూ నవ్వలేదంటే నమ్మండి. యెంత హాస్యకళా చాతుర్యం! యీ మరపురాని పాయంత్రం నాకు జన్మంతా జ్ఞాపకముంటుంది."

వ్యతిగోరావ్‌ను సాగనంపిన తర్వాత మేధావులకు సంతోషమూ, ఊరటా కలిగినాయి.

"ఆయన నాతో కరచాలనం చేసినాడు" అని జెన్స్త్యకోవ్ ఆనందాతిరేకంతో బడాయి కొట్టినాడు. "అనగా అంతా సరిగా వుందన్నమాట. ఆయనకు కోపమేమీ లేదు."

"అని ఆశిద్దాం!" యెవ్‌స్త్రాత్ స్పిరిదోనిచ్ నిట్టూర్చినాడు. "అతను బద్మాష్, దుష్టుడు — కానీ మనకు ఉపకారి. జాగ్రత్తగా వుండాలి!"

1884

సీతాకోకచిలుక

1

ఓల్గ ఇవానొవ్నా మిత్రులూ, పరిచితులూ అందరూ ఆమె పెండ్లికి పోయినారు.

భర్తవైపు తల వూపుతూ, "అతన్ని చూడండి – అతనిలో యేదో వుంది, వుంది కదూ?" అన్నది ఆమె మిత్రులతో. ఒక మామూలు మనిషిని, యే విశేషమూ లేని వాణ్ని, పెండ్లిచేసుకోడానికి తాను యెలా ఒప్పుకున్నదీ వివరించడానికి ఆమె తహతహ లాడుతున్నట్లుంది.

ఆమె భర్త ఓసిప్ స్తెపానొవిచ్ దీమొవ్, డాక్టరు, గౌరవ సలహాదారు. అతను రెండు ఆస్పత్రులలో – ఒకదానిలో నాన్‌రెసిడెంట్ డాక్టరుగానూ, మరొకదానిలో శవాలు కోసేవాడుగానూ – పనిచేస్తాడు. ఉదయం తొమ్మిదినుండి పండ్రెండుదాకా ఔట్‌పేషెంట్లను చూసి, తన వార్డు చూసుకునేవాడు, అపరాహ్ణం గుర్రపు బగ్గీలో రెండవ ఆస్పత్రికి వెళ్ళి, అక్కడ శవపరీక్ష చేసేవాడు. అతని ప్రైవేటు ప్రాక్టీసు చాలా చిన్నది, సంవత్సరానికి సుమారు అయిదు వందల రూబుళ్ళ ఆదాయం వస్తుందంతే. అతన్ని గురించి చెప్పవలసింది యింకేమీ లేదు. కానీ ఓల్గ ఇవానొవ్నా, ఆమె మిత్రులూ, పరిచితులూ మామూలు మనుషులు కారు. వాళ్ళలో ప్రతివొకరూ యేదో ఒక విధంగా విశిష్టత గలవాళ్ళు, కేవలం అనామకులు కారు, యిప్పటికే పేరు సంపాయించుకొని, కొంత ప్రసిద్ధి పొందినవాళ్ళు, లేదా, యింకా ప్రసిద్ధులు కాకపోయినా, ఉజ్వలమైన భవిష్యత్తు గలవాళ్ళగా కనిపించేవాళ్ళు. ఒకడు నటుడు, అతని నిజమైన నటనాప్రజ్ఞ యిప్పటికే గుర్తింపు పొందింది. అతను నాజూకైనవాడు, తెలివిపరుడు, ఉచితానుచితజ్ఞుడు, మనోహరమైన వాచికం గలవాడు; అతను ఓల్గ ఇవానొవ్నాకు వక్తృత్వం నేర్పుతూ వుండినాడు. మరొకడు సంగీత నాటకాలలో గాయకుడు, లావుపాటి, సరదా అయిన మనిషి. అతను నిట్టూర్చుస్తూ, ఓల్గ ఇవానొవ్నాకు గట్టిగా చెప్పేవాడు, ఆమె తన్ను తాను పాడుచేసుకుంటున్నదని – ఆమె అంత సోమరి కాకపోతే, ఒక్కసారి పూనుకుంటే, మంచి గాయకురాలు అవుతుందని. వీళ్ళు కాక యింకా పలువురు కళా

కారులు వుండినారు. వాళ్లలో ముఖ్యుడు ర్యాబొవ్స్కియ్. అతను మానవ చిత్రాలూ, జంతు చిత్రాలూ, ప్రకృతి చిత్రాలూ చిత్రించేవాడు. ఆ మహా అందమైన పాలికేండ్ల యువకుని చిత్రాలు ప్రదర్శనలలో పేరు తెచ్చుకున్నాయి; అతని తాజా చిత్రానికి అయిదు వందల రూబుళ్లు వచ్చినాయి. అతను ఓల్గ ఇవానొవ్నా బొమ్మలకు మెరుగులు దిద్దేవాడు; ఆమె చిత్రకళ ఒక దారికి రావచ్చునని అతను యెప్పుడూ అనేవాడు. తరువాత — ఒక సెల్లో వాద్యగాడు వుండినాడు. అతను సెల్లో "యేడ్చే"టట్లు వాయించేవాడు. తనకు తెలిసిన ఆడవాళ్లలోకల్లా ఓల్గ ఇవానొవ్నా ఒక్కతే తనకు పక్కవాద్యం వాయించ గలిగిందని బాహాటంగా ప్రకటించేవాడు. యిక — నవలికలూ, నాటకాలూ, కథలూ రాసిన రచయిత వుండినాడు, యువకుడు, కానీ అప్పటికే ప్రసిద్ధుడు. యింకా యెవరు? ఆం — వసీలియ్ వసీల్యెవిచ్ వుండినాడు, సౌజన్యవంతుడైన భూస్వామి, ఔత్సాహిక పుస్తక చిత్రకారుడు, విన్యేట్ చిత్రాల సృష్టికర్త. అతనికి పురాతన రష్యన్ శైలిపట్లా, పురాణ గాథలపట్లా నిజమైన అభినివేశం వుండింది. అతను కాగితంమీదా, పింగాణీమీదా, గాజుమీదా అద్భుతాలు సృష్టించేవాడు. వీళ్లందరూ కళానందన్న, విజ్ఞాన వికసిత సమాజానికి చెందిన వాళ్లు, అదృష్టదేవత ముద్దుబిడ్డలు, వినయశీలురూ, సుసంస్కారులూ అయినప్పటికీ, తాము జబ్బు పడినప్పుడు మాత్రమే డాక్టర్లు అనే వాళ్లు వున్నారని జ్ఞాపకం వచ్చేవాళ్లు. దీమొవ్ అనే పేరు వీళ్ల చెవులకు సీదొరొవ్, తరాసొవ్ అనే పేర్ల లాగ అతిసాదాగా వినిపిస్తుంది. వీళ్ల మధ్య దీమొవ్ — నిజానికతను చాలా పొడవుగా, విశాల భుజాడుగా వుండినప్పటికీ — పరాయివాడుగా, అక్కరలేనివాడుగా, అల్పవ్యక్తిగా కనిపించేవాడు. అతని కోటు మరొకరి కోసం కుట్టినట్లు, అతని గడ్డం వర్తకుని గడ్డంలాగ వుండేవి. నిజమే, అతను రచయితో, చిత్రకారుడో అయివుంటే, ఆ గడ్డం మూలంగా అతను ఎమిలి జోలాలాగ కనిపిస్తాడని అందరూ అనేవాళ్లు.

నటుడు ఓల్గ ఇవానొవ్నాతో అన్నాడు — లేత బంగారు రంగు జుట్టుతో, తెల్లని పెళ్లికూతురు దుస్తులలో ఆమె అచ్చంగా వసంతంలో మృదు సుమభరితమైన వన్నని చెర్రీ వృక్షంలా వుందని.

"నేను చెప్పేది వినండి" అన్నది ఓల్గ ఇవానొవ్నా, అతని చేయి పట్టుకుంటూ. "యిది యెలా జరిగిందో తెలుసా? వినండి, నే చెప్పేది వినండి.... మా నాన్నా, దీమొవూ ఒకే ఆస్పత్రిలో పనిచేసేవాళ్లు గదూ. పాపం మా నాన్న జబ్బు పడినప్పుడు, దీమొవ్ రేయింబగళ్లు ఆయన మంచంపక్కనే వున్నాడు. అంత స్వార్థత్యాగం! వినండి, ర్యాబొవ్స్కియ్! మీరు వినండి రచయితా, మీకు చాలా ఆసక్తికరంగా వుంటుంది. యింకా దగ్గరికి రండి. అంత స్వార్థత్యాగం, అంత నిష్కపటమైన సానుభూతి. నేను కూడా రాత్రిళ్లు నిద్రపోలేదు, మా నాన్నదగ్గర కూర్చునేదాన్ని. ఉట్టిపాటుగా — ఆ దృఢ యువకుని హృదయం నేను చూరగొన్నాను — అంతే జరిగింది! నా దీమొవ్‌కు పరవశ

మైన ప్రేమ కలిగింది. విధి యెంత చిత్రంగా వుంటుంది! మా నాన్న చనిపోయిన తర్వాత దీమొవ్ అప్పుడప్పుడు నన్ను చూడడానికి వచ్చేవాడు, అప్పుడప్పుడు బయట కలుసుకునేవాళ్లం. ఒక రోజు — యేం జరిగిందనుకున్నారు — హఠాత్తుగా, పిడుగుపాటుగా పెండ్లి ప్రతిపాదన చేసినాడు! ఆ రాత్రంతా యేడ్చినాను, నాకు కూడా పిచ్చిప్రేమ కలిగింది. యిప్పుడు చూస్తే, నేను పెండ్లైన స్త్రీని. అతనిలో యేదో బలీయమైనది, శక్తివంతమైనది, భల్లూకపు పట్టులాంటిది, యేదో వుంది, కదూ? అతని ముఖం యిప్పుడు కొంచెం అటు తిరిగి వుంది, వెలుతురు అతని ముఖంమీద బొత్తిగా పడడం లేదు. అతను పూర్తిగా మనవైపు తిరిగినప్పుడు, అతని నొసలు ఒకసారి చూడండి. అలాంటి నొసలును యేమంటావ్ ర్యాబొవ్‌స్కియ్? దీమొవ్, నిన్ను గురించే మాట్లాడుతున్నాం," అంటూ ఆమె భర్తను కేకవేసింది. "యిలా రా! ర్యాబొవ్‌స్కియ్‌తో కరచాలనం చెయ్.... ఆఁ, అదీ! మీరిద్దరూ స్నేహితులుగా వుండాలి."

దీమొవ్ అమాయకంగా, సరసంగా చిరునవ్వు నవ్వుతూ ర్యాబొవ్‌స్కియ్‌కి చేయి అందించినాడు.

"సంతోషం," అన్నాడు అతను. "కాలేజిలో నాతోపాటు ఒక ర్యాబొవ్‌స్కియ్ వుండేవాడు. అతను మీకేమీ బంధువు కాదనుకుంటాను."

2

ఓల్గ ఇవానొవ్నాకు యిరవై రెండేండ్లు, దీమొవ్‌కు ముప్పై ఒకటి. పెండ్లి అయిన తర్వాత వాళ్ల జీవితం అద్భుతంగా వుండింది. ఓల్గ ఇవానొవ్నా తామూ, తన మిత్రులూ వేసిన రేఖాచిత్రాలు — ఫ్రేములతోనూ, ఫ్రేములు లేకుండానూ — డ్రాయింగు రూం గోడల నిండా పెట్టేసింది, పియానోచుట్టూ, ఫర్నిచర్‌చుట్టూ చైనా గొడుగులూ, చిత్రకారుల శ్టాండులూ, రంగురంగుల వస్త్రాలూ, బాకులూ, చిన్న విగ్రహాలూ, ఫొటోలూ కళాత్మకమైన కలగూరగంపగా పెట్టింది. భోజనాల గదిలో ఆమె చౌక రంగుల పటాలూ, తాట బూట్లూ, బాకులూ గోడకు వేలాడదీసి, మూలన కొడవలీ, పండ్లకోలా పెట్టి, భోజనాల గదికి రష్యన్ వాతావరణం కల్పించింది. పడక గది కప్పునూ, గోడలనూ ఆమె నల్లని బట్టతో కప్పి, గదిని గుహలా కనిపించేటట్లు చేసి, మంచాలపైన వెనిస్ లాంపు వేలాడగట్టి, వాకిలివద్ద గండ్రగొడ్డలి పట్టుకున్న బొమ్మను పెట్టింది. యువ దంపతులు అందమైన గూడు యేర్పరచుకున్నారని అందరూ అన్నారు.

ఓల్గ ఇవానొవ్నా రోజూ ఉదయం పదకొండింటికి లేచి, పియానో వాయించేది, లేదా, యెండ కాస్తూవుంటే, తైలవర్ణాలతో చిత్రాలు వేసేది. పండ్రెండు దాటిన

కాసేపటికి ఆమె తన దర్జీవద్దకు వెళ్లేది. ఆ దంపతులకు డబ్బు చాలా కొద్దిగా, వాళ్ల అవసరాలకు బొటాబొటిగా చాలినంత మాత్రమే వుండింది; మరి ఆమె నిత్యం కొత్త దుస్తుల్లో పసందుగా కనిపించాలంటే, ఆమే, దర్జీ రకరకాల యుక్తులకు దిగవలసి వచ్చేది. వాళ్ళు యెన్నోసార్లు కేవలం అద్భుతాలు సాధించేవాళ్లు — పాత అద్దకం ఫ్రాకూ, కాసిన్ని సిల్కు ముక్కలూ, లేసూ కలిపి — అది దుస్తు గాదు, స్వప్న సౌందర్యం, అనిపించేటట్లు — పరమ సమ్మోహనకరమైనదాన్ని సృష్టించేవాళ్లు. దర్జీవద్దనుండి ఓల్గ ఇవానొవ్నా మామూలుగా తన మిత్రురాలైన ఒక నటివద్దకు వెళ్లేది. అక్కడ వుండగా యేదైనా మొదటి రాత్రి ప్రదర్శనకో, యెవరి "ఉపకారార్థ"మైనా యిచ్చే ప్రదర్శనకో టికెట్లు సంపాయించడానికి ప్రయత్నించేది. నటివద్దనుండి ఆమె ఒక కళాకారుని స్టూడియోకు వెళ్లేది, లేదా చిత్రాల ప్రదర్శనకు వెళ్లేది, అక్కడనుండి యెవరైనా ప్రసిద్ధ వ్యక్తి వద్దకు వెళ్లేది, ఆ వ్యక్తిని తన యింటికి ఆహ్వానించడానికో, లేక మర్యాదార్థమో, లేక వూరక పిచ్చాపాటీ మాట్లాడడానికో. ప్రతిచోటా ఆమెకు సరదా అయిన హార్దిక స్వాగతం లభించేది, తన మంచితనం గురించీ, మధుర ప్రవర్తన గురించీ, విశిష్టత గురించీ ఆమెకు నమ్మకం కలిగించబడేది.... ప్రసిద్ధులనీ, గొప్పవాళ్లనీ ఆమె యెవరిని అంటుందో వాళ్ళు ఆమెను తమలో ఒకరినిగా, తమతో సమానురాలినిగా స్వీకరించేవాళ్లు; తన ప్రతిభను అన్ని మార్గాలలో వృథాచేయకపోతే, ఆమెకు గల ప్రజ్ఞలతో, అభిరుచితో, మనఃపరిపాకంతో ఆమె యేదైనా గొప్పది సాధించగలదు, అని వాళ్లు అనేవాళ్లు. ఆమె పాడుతుంది, పియానో వాయిస్తుంది, తైలవర్ణంతో చిత్రిస్తుంది, మట్టితో బొమ్మలు చేస్తుంది, ఔత్సాహిక నాటకాలలో నటిస్తుంది — యివన్నీ చేసేది యెలా పడితే అలా కాదు, నిజమైన ప్రజ్ఞతో. ఆమె యేది చేసినా సరే, లాంపులు తయారుచేసినా, ముస్తాబు చేసుకున్నా కేవలం యెవరికైనా టై కట్టినా, అది కళాత్మకంగా, అందంగా, మనోహరంగా తయారయ్యేది. కానీ, అన్నిటికంటె యెక్కువగా ఆమె ప్రజ్ఞ, ప్రసిద్ధ వ్యక్తులతో క్షణకాలంలో మైత్రి చేసుకొని, వాళ్లతో సన్నిహితంగా మెలగగల ఆమె సామర్థ్యంలో కొట్టవచ్చినట్లు కనపడేది. యెవరైనా యే కొంచెమైనా పేరు వున్నా, లేక పదిమంది నోళ్లలో పడినా, మరుక్షణమే ఆమె వాళ్లతో యెలాగో పరిచయం కల్పించుకొని, వెంటనే మైత్రి చేసుకొని, తన యింటికి ఆహ్వానించేది. కొత్త పరిచయం కలిగిన ప్రతిసారీ ఆమెకు మహా ముఖ్యమైన దినం. ప్రఖ్యాతులను ఆమె ఆరాధించేది, వాళ్లను చూసి గర్వించేది, వాళ్లను గురించి ప్రతి రాత్రీ కలగనేది. ప్రసిద్ధుల పట్ల ఆమెకు దాహంలాంటిది వుండింది, ఆ దాహం యెన్నడూ తీరేది కాదు. పాత మిత్రులు అదృశ్యమై, విస్మృతమయ్యేవాళ్లు, వాళ్ల స్థానంలోకి కొత్తవాళ్లు వచ్చేవాళ్లు. కానీ త్వరలో వాళ్లంటే కూడా ఆమెకు విసుగు కలిగేది, లేదా ఆశాభంగం కలిగేది, ఆమె తిరిగి కొత్త మిత్రుల కోసం, కొత్త ప్రసిద్ధుల కోసం

తహతహతో వెదకడం ప్రారంభించేది, వాళ్ళు దొరికినప్పుడు యితర్లకోసం వెదకేది. యెందుకు?

నాలుగు, అయిదు గంటలమధ్య ఆమె యింటివద్ద భర్తతో కలిసి భోంచేసేది. అతని సరళత్వమూ, లోకజ్ఞానమూ, ప్రసన్నతా ఆమెకు పరవశత్వం కలిగించేవి. ఆమె పదేపదే తటాలున లేచి అతని మెడచుట్టూ చేతులు వేసి, అతనిమీద ముద్దులు కురిపించేది.

"నీవు విజ్ఞుడివి దీమొవ్, ఉదాత్త మనుష్యుడివి," అనేది ఆమె. "కానీ, నీలో ఒక తీవ్రమైన లోపం వుంది. నీకు కళలలో బొత్తిగా ఆసక్తి లేదు. సంగీతాన్నీ, చిత్ర లేఖనాన్నీ పూర్తిగా ఉపేక్షిస్తావు."

"అవి నాకు అర్థం కావు," అన్నాడు అతను నమ్రతతో. "నా జీవితమంతా నేను ప్రకృతిశాస్త్రంలోనూ, వైద్యశాస్త్రంలోనూ కృషిచేసినాను; కళలు నేర్చుకోడానికి నాకు యెప్పుడూ తీరిక లేదు."

"అది దారుణం, దీమొవ్!"

"యెందుకు? నీ మిత్రులకు ప్రకృతిశాస్త్రం గురించీ, వైద్యశాస్త్రం గురించీ యేమీ తెలియదు; దానికి నీవు వాళ్లను నిందించవే. యెవరి అభిరుచులు వాళ్లవి. నాకు ప్రకృతి చిత్రాలూ, సంగీత నాటకాలూ అర్థం కావు, కానీ నేననుకునే దేమంటే: కొంతమంది తెలివిపరులు తమ యావజ్జీవితాలూ వాటికి అర్పిస్తున్నారు, మరికొంత మంది తెలివిపరులు వాటికొరకు అపారమైన డబ్బు ఖర్చుపెడుతున్నారు. కనుక అవి అవసరం అయివుండాలి. నాకు అవి అర్థం కావు; కానీ అంతమాత్రాన నేను వాటిని ఉపేక్షిస్తున్నానని అర్థం కాదు."

"విస్మయజనకమైన నీ చెయ్యి నొత్తనీ!"

భోజనం తర్వాత ఓల్గ ఇవానొవ్నా మిత్రుల యిండ్లకు వెళ్లేది, తరువాత నాటక శాలకో, సంగీతశాలకో వెళ్లి, అర్ధరాత్రి దాటేక గానీ యింటికి వచ్చేది కాదు.

బుధవారం సాయంత్రాలు ఆమె యింటికి అతిథులను ఆహ్వానించేది. అప్పుడు పేకాట గానీ, నృత్యం గానీ వుండేది కాదు, అందరూ కలిసి కళలతో పొద్దుబుచ్చే వాళ్ళు. సుప్రసిద్ధ నటుడు వాచికాభినయం చేసేవాడు, గాయకుడు పాడేవాడు, చిత్రకారులు ఓల్గకు గల అసంఖ్యాకమైన ఆల్బాంలలో బొమ్మలు గీసేవాళ్లు, సెల్లో వాద్యగాడు సెల్లో వాయించేవాడు, గృహిణి స్వయంగా రేఖా చిత్రాలు గీసేది, మట్టితో బొమ్మలు చేసేది, పక్క వాద్యాలు వాయించేది. వాచికానికీ, జంత్రానికీ, గాత్రానికీ మధ్యన వాళ్లు సాహిత్యం గురించీ, నాటకశాల గురించీ, చిత్రకళ గురించీ మాట్లాడుకునే వాళ్ళు, చర్చించుకునేవాళ్లు. వాళ్లలో ఆడవాళ్లు వుండరు; యెందుకంటే, నటీమణులూ, తన దర్జీ తప్ప, ఆడవాళ్లందరూ తృణప్రాయులనీ, విసుగు పుట్టిస్తారనీ ఓల్గ ఇవా

నొవ్నా అభిప్రాయం. ప్రతి బుధవారమూ, వాకిలి గంట మోగినప్పుడల్లా ఆమె విజయోత్సాహపు ముఖంతో "అతనే!" అనేది; కొత్తగా ఆహ్వానింపబడిన యెవరో ఒక ప్రసిద్ధునికి సంకేతం ఆ సర్వనామం. దీమొవ్ యెప్పుడూ డ్రాయింగురూంలో వుండేవాడు కాదు, అతను యెవరికీ జ్ఞాపకం కూడా వుండేవాడు కాదు. కానీ, సరిగ్గా పదకొండున్నరకు భోజనాల గది వాకిలి తెరచుకునేది, దీమొవ్ వాకిట్లో ప్రత్యక్షమై, తన ప్రసన్న, సౌజన్యపు చిరునవ్వుతో, చేతులు రుద్దుకుంటూ, "భోజనానికి రండి," అనేవాడు.

అందరూ భోజనాల గదిలోకి వరుసగా వచ్చేవాళ్లు. ప్రతిసారీ వాళ్ల కండ్లకు అవే పదార్థాలు కనిపించేవి: రొయ్యలూ, పంది మాంసం, లేదా దూడ మాంసం, చేపలూ, చీజూ, చేపగుడ్లూ, ఊరబెట్టిన పుట్టగొడుగులూ, వోద్కా, రెండు జాడీల వైనూ.

"ఓ, నా యింటి మేనేజరూ!" అని ఓల్గ ఇవానొవ్నా పరవశత్వంతో చేతులు నలుపుకుంటూ అనేది. "నీవు కేవలం మోహనమూర్తివి! అందరూ యిలా చూడండి యితని నొసలు! దీమొవ్, నీ పార్శ్వ రేఖ మాకు చూపించు. చూడండి అందరూ — బెంగాల్ వ్యాఘ్రంలాంటి ముఖం, లేడిపిల్ల లాంటి సాధు, దయార్ద్ర ముఖ భంగిమ! ఓ, నా వజ్రాల గనీ!"

అతిథులు దీమొవ్‌వైపు చూపులు విసరి, "నిజంగా మంచివాడే యితను," అనుకుంటూ భోంచేసేవాళ్లు, కానీ కాసేపట్లో అతన్ని మరచిపోయి, నాటకశాల గురించీ, సంగీతం గురించీ, చిత్రకళ గురించీ మాట్లాడుకుంటూ వుండేవాళ్లు.

యువ దంపతులు ఆనందంగా వుండినారు, వాళ్ల జీవితం సాఫీగా నడిచింది. నిజమే, వాళ్ల మధుమాసపు మూడవ వారం అంత ఆనందంగా గడవలేదు; నిజానికది విషాదంగా వుండింది. దీమొవ్‌కు ఆస్పత్రిలో ఎరుసిపెలాస్ అనే జబ్బు అంటుకొని, అతను ఆరు రోజులు మంచంలో వుండవలసి వచ్చింది, అందమైన నల్లని జుట్టు అంటకత్తెర వేయించుకోవలసి వచ్చింది. ఓల్గ ఇవానొవ్నా అతని మంచం పక్కన కూర్చొని తీవ్రంగా యేడ్చింది; కానీ అతనికి కొంచెం నయమైన తర్వాత అతని తలకు తెల్లని గుడ్డ కట్టి, అరబ్బుగా అతని వర్ణ చిత్రం వేయసాగింది. యిద్దరికీ అది మహా తమాషాగా వుండింది. అతను పూర్తిగా కోలుకొని మళ్లీ ఆస్పత్రికి పోవడం ప్రారంభించిన మూడు రోజులకు అతనికి మరో దురదృష్టం దాపురించింది.

అతను ఆమెతో ఒకనాడు భోజనంవద్ద "నాకు అదృష్టం లేదు బుజ్జీ," అన్నాడు. "యీ రోజు నాలుగు శవాలు కోయవలసి వచ్చింది. నాకు ఒకేసారి రెండు వేళ్లు తెగివాయి. యింటికి వచ్చినాక మాత్రమే గమనించినాను."

ఓల్గ ఇవానొవ్నాకు భయమైంది. అతను చిరునవ్వు నవ్వి, అది చాలా స్వల్ప విషయమనీ, శవపరీక్షలో చాలాసార్లు తన చేతులు గంట్లు పడినాయనీ చెప్పినాడు.

"నేను పనిలో లీనమైపోతాను బుజ్జీ, అప్పుడు నా కేదీ జ్ఞాపకముండదు."

సెప్టిక్ అవుతుందేమో అని ఓల్గ ఇవానొవ్నా ఆందోళన పడింది, అది జరగకుండా వుండాలని ప్రతి రాత్రీ భగవంతుని ప్రార్థించింది. ప్రమాదం లేకుండా అది గడచి పోయింది. విషాద స్పర్శా, ఆందోళన స్పర్శా లేని పాత ఆనందమయ ప్రశాంత జీవితం మళ్లీ మొదలైంది. వర్తమానం అద్భుతంగా వుంది, త్వరలో వసంతం రాబోతున్నది, అమడ దూరాననుండి చిరునవ్వులు విరజిమ్ముతూ, వంద ఆహ్లాదాలు వాగ్దానం చేస్తూ. యీ ఆనందం అనంతంగా కొనసాగుతుంది. ఏప్రిల్, మే, జూన్ మాసాలు మాస్కోకు చాలా దూరాన గ్రామీణ గృహంలో గడువుతారు, అక్కడ షికార్లూ, రేఖాచిత్రాలూ, చేపలవేటా, కోకిలయా వుంటాయి, తరువాత జూలైనుండి ఆకురాలు కాలం దాకా వోల్గనదిమీద కళాకారుల విహారయాత్ర వుంటుంది; ఆ యాత్రలో ఓల్గ ఇవానొవ్నా తప్పకుండా పాల్గొంటుంది. ఆమె అప్పటికే ప్రయాణానికి రెండు ముతక మాలు దుస్తులు తయారుచేసుకుంది, రంగులూ, కుంచెలూ, కాన్వాసూ, కొత్త పాలెట్ కొంది. ఆమె చిత్రలేఖనం యెలా సాగేదీ చూడడానికి ర్యాబొవ్స్కియ్ దాదాపు రోజూ ఆమె యింటికి వచ్చేవాడు. ఆమె తన కృషిని అతనికి చూపించినప్పుడు, అతను జేబు ల్లోకంటా చేతులు దూర్చి, పెదవులు బిర్రుగా బిగబట్టి, మూల్గుతూ యిలా అనేవాడు:

'ఊఁ, ఊఁ.... అది సాయంకాలపు వెలుగు కాదని ఆ మేఘం మొత్తుకుంటున్నది. పైభాగం కాస్త గజిబిజిగా వుంది; యిక, యేదో వెలితి వుంది—యేమిటంటే, మీకు తెలుసుగా.... ఆ గుడిసె అణగారి దీనంగా శోకిస్తున్నట్లుంది.... ఆ మూలన వెలుతురు తగ్గిస్తే మేలు. అయినా, మొత్తంమీద యిది అంత అధ్వాన్నంగా లేదు.... నాకు సంతృప్తిగా వుంది."

అతను యెంత నిగూఢంగా మాట్లాడితే అంత సులభంగా అతని భావం ఓల్గ ఇవానొవ్నాకు అర్థమయ్యేది.

3

దిమొవ్ సోమవారంనాడు సాయంత్రం దీమొవ్ బయటికి వెళ్లి, తన భార్య కోసం కొన్ని మిఠాయిలూ, తినుబండారాలూ కొన్నాడు. అతను ఆమెను చూడక రెండు వారాలైంది, ఆమె లేని వెలితి అతనికి చాలా బాధగా వుండింది. రైలులోనూ, తరువాత చిక్కని చెట్లమధ్య ఆమె యిల్లు కనుక్కోడానికి వెదకేటప్పుడూ అతనికి కడుపులో పేగులు పీకినాయి; రాత్రికి భార్యతో కలిసి తీరికగా భోంచేయవచ్చునవీ, తరువాత పడకమీద వాలిపోవచ్చునవీ అతను కలలుగన్నాడు. చేపగుడ్లూ, చీజూ, కాల్చిన చేపలూ వున్న పొట్లం చూసి అతను ఊరట పొందినాడు.

అతను యిల్లు కనుక్కొని గుర్తుపట్టేటప్పటికి పొద్దుగూకింది. అమ్మగారు యింట్లో లేరనీ, కాసేపట్లో రావచ్చునవీ వయసు మళ్లిన పనిమనిషి అతనితో చెప్పింది. యిల్లు

మహా అనాకర్షణీయమైన కట్టడం, యెత్తులేని కప్పు, గోడలకు చౌకబారు కాగితం యెక్కడ చూసినా తెరవలతో నేల హెచ్చుతగ్గులుగా వుంది, గదులు మూడే వున్నాయి. ఒక గదిలో ఒక మంచం వుండింది. మరొక గదిలో కాన్వాసులూ, రంగు కుంచెలూ, మకిలి కాగితం ముక్కా, కుర్చీలమీదా, కిటికీలలోనూ మగవాళ్ల కోట్లూ, టోపీలూ వుండినాయి. మూడవ గదిలో దీమొవ్‌కు ముగ్గురు కొత్తవాళ్లు కనిపించినారు — యిద్దరు గడ్డాలున్న చామన చాయవాళ్లు, మూడవవాడు శుభ్రంగా క్షౌరం చేసుకున్న లావుపాటి మనిషి, నటుడై వుంటాడు. టేబుల్‌మీద సమొవార్‌లో నీళ్లు మరుగుతున్నాయి.

నటుడు దీమొవ్‌వైపు అయిష్టంగా చూసి, బొంగురు గొంతుతో అడిగినాడు: "యేం పని? ఓల్గ ఇవానొవ్నాను చూడడానికా? ఒక నిముషం ఆగండి, వస్తుంది."

దీమొవ్ కూర్చొని ఆమె రాక కోసం చూస్తూ వుండినాడు. ఒక చామన చాయ మనిషి నిద్రమత్తు నిర్లిప్తతతో అతనివైపు చూస్తూ, కప్పులో టీ పోసుకొని, "టీ తాగుతారా?" అని అతన్ని అడిగినాడు.

దీమొవ్‌కు ఆకలిగానూ, దప్పికగానూ వుండింది; కానీ తన ఆకలి మందగిస్తుందని టీ వద్దన్నాడు. కాసేపట్లో అడుగుల సవ్వడీ, పరిచితమైన నవ్వూ వినిపించినాయి. తలుపు ధణేల్ మన్నది, ఓల్గ ఇవానొవ్నా గదిలోకి దూకింది. ఆమె పెద్ద టోపీ పెట్టుకుంది. చేతిలో ఒక పెట్టె వుంది. ఆమె వెనక, యెరుపెక్కిన చెక్కిళ్లతో, పొంగి పొర్లే ఉత్సాహంతో పెద్ద గొడుగూ, మడత కుర్చీ పట్టుకొని ర్యాబొవ్‌స్కియే వచ్చినాడు.

"దీమొవ్!" కేకవేసింది ఓల్గ ఇవానొవ్నా. ఆమె ముఖం సంతోషంతో కందింది. తలా, చేతులూ అతని రొమ్ముకు ఆనించి, "దీమొవ్!" అని మళ్లీ అన్నది. "నీవే గదూ! యిన్నాళ్లు నీవెందుకు రాలేదు? యెందుకు చెప్పు? యెందుకు?"

"యెప్పుడు వచ్చేది బుజ్జీ? నాకు యెప్పుడూ తీరిక వుండదు. యెప్పుడైనా తీరిక వుంటే, ఆ సమయానికి రైలు వుండనే వుండదు."

"అబ్బ! నిన్ను చూడడం యెంత ఆనందంగా వుందని! రాత్రంతా నీవు కలలో వచ్చినావు, రాత్రంతా. నీకేమైనా జబ్బో, యేమో అని భయమైంది. ఓ, నీవు యెంత బంగారు బాబువో! యిప్పుడు నీవు రావడం యెంత అదృష్టమో తెలుసా? నీవు నా ముక్తిదాతవు! నీవొక్కడివే నన్ను రక్షించగలవాడివి," అంటూ ఆమె నవ్వుల మధ్య కొనసాగించింది, మగని టై విప్పుతూ, మళ్లీ కట్టుతూ. "స్టేషన్‌లోని టెలిగ్రాఫ్ ఆపరేటర్‌ది పెండ్లి — చికెల్‌దేయెవ్ అతని పేరు. అందమైన కుర్రవాడు, మొద్దబ్బాయి కాదులే, అతని ముఖంలో యేదో స్థిరత్వమూ, పట్టుదలా కనిపిస్తాయి. వరాంజియన్ యువకుని చిత్రం వేయడానికి అతన్ని నమూనాగా పెట్టుకోవచ్చు. వేసవికి యిక్కడికి వచ్చిన మా బృందమందరికీ అతనంటే యిష్టం, అతని పెండ్లికి వస్తామని మాట యిచ్చినాము.... అతనికి డబ్బు లేదు, అన్న వాళ్లెవరూ లేరు. బిడియస్తుడు,

అతనికి సానుభూతి చూపకపోవడం మహా పాపం, చర్చిలో ప్రార్థన అవుతూనే పెండ్లి, చర్చినుండి అందరూ నేరుగా పెండ్లికూతురు యింటికి పోతారు.... వనమూ, పక్షుల పాటలూ, గడ్డిమీద యెండ పొడలూ, మరే, తళతళలాడే పచ్చని గడ్డిమీద రంగుల పొడల్లా మేము అందరమూ — ఓ, యెంత బావుంటుంది, ఫ్రెంచి ఎక్స్‌ప్రెషనిస్టుల చిత్రంలా. మరి, దీమొవ్, చర్చిలో నేను యే బట్టలు వేసుకోవాలి?" అన్నది ఓల్గ ఇవానొవ్నా విషాదం కమ్మిన్నట్టు ముఖం పెట్టి. "నా కిక్కడ యేమీ లేవు, యేమే గాని లేవు. బట్టలు లేవు, పూలు లేవు, గ్లొవ్స్ లేవు.... నువ్వే నన్ను బయట పడెయ్యాలి! నా యిబ్బంది తప్పించాలనే భగవంతుడు నిన్ను పంపినాడు. నా ప్రేమ మూర్తివి గదూ, నా తాళం చెవులు తీసుకొని యింటికి వెళ్లి, బట్టల బీరువాలోని లేత యెరుపు బట్టలు పట్టుకరా. నీకు తెలుసు అది, యెదురుగ్గా వేలాడుతూంటుంది.... యిక, సామాన్ల గదిలో నేలమీద రెండు అట్ట పెట్టెలు వుంటాయి. పైదాని మూత తీస్తే అందులో అన్నీ సిల్కు ముక్కలే కనిపిస్తాయి, రకరకాలవి, వాటి అడుగున పూలు కనిపిస్తాయి. పూలన్నీ జాగ్రత్తగా, మహా జాగ్రత్తగా తీసుకో, నలిగిపోకుండా చూడు, యేం నా బంగారు కొండా, వాటిలో యేదైనా ఒకటి నేను యేరుకుంటానులే తరువాత. మరి, నాకొక జత గ్లొవ్స్ కొనుక్కురా."

"సరే," అన్నాడు దీమొవ్. "రేపు వెళ్లి పంపిస్తాలే."

కొయ్యబారిన ముఖంతో అతనివైపు చూస్తూ "రేపా?" అన్నది ఓల్గ ఇవానొవ్నా. "రేపు నీవు వేళకు రా లేకపోతే! అమ్మో! మొదటి రైలు రేపు ఉదయం తొమ్మిదికి బయలుదేరుతుంది, పెండ్లి పదకొండుకు. వద్దు నా బంగారు బుజ్జీ, నీవివాళే వెళ్లాలి, వెళ్లక తప్పదు! రేపు స్వయంగా నీవు రాలేకపోతే, అన్నీ యెవరితోనైనా పంపు. వెళ్లు యిక.... రైలు కాసేపట్లో వస్తుంది. ఆలస్యం చెయ్యద్దు, మంచి వాడివి కదూ."

"సరే."

"నువ్వు వెళ్లిపోవడం నాకెంత బాధగా వుంటుందో!" అన్నది ఓల్గ ఇవానొవ్నా; ఆమె కండ్లలో నీరుబికింది. "టెలిగ్రాఫ్ ఆపరేటర్‌కు మాట యిచ్చి యెంత తెలివి తక్కువ పనిచేశాను!"

దీమొవ్ ఒక బిస్కట్ కొరుక్కొని, ఒక గ్లాసు టీ గొంతులో పోసుకొని, వినమ్రంగా చిరునవ్వు నవ్వి, స్టేషన్‌కు వెళ్లినాడు. చేపగుడ్లూ, చీజూ, కాల్చిన చేపలూ ఆ యిద్దరు చామన చాయ మనుషులకూ, లావుపాటి నటునికీ భోజనమైనాయి.

4

జూలై నెలలో ఒక ప్రశాంతమైన వెన్నెల రాత్రి ఓల్గ ఇవానొవ్నా వోల్గా స్టీమర్ డెక్కుమీద నిలబడి, కాసేపు నీళ్లవైపూ, కాసేపు మనోహరమైన నదీ తీరంవైపూ

చూస్తున్నది. ఆమె పక్కన ర్యాబొవ్‌స్కీయ్ నిలబడి ఆ నీళ్లమీద కనిపించే నల్లని నీడలు నీడలు కావనీ, అవొక స్వప్నమనీ, అన్నీ మరచిపోవడం, మరణించడం, ఒక స్మృతిగా మారిపోవడం మంచిదనీ చెప్తున్నాడు. మన జీవితాలు వ్యర్థమనీ, ఉన్నతమైన, శాశ్వతమైన, బ్రహ్మానందకరమైన దేదో మరొకటి వుందనీ మనకు తెలియజేసే యీ మిల మిలలాడే యింద్రజాల సౌందర్యపు నీళ్లూ, యీ అనంతమైన ఆకాశం, యీ శోకభర, విచారపూరిత నదీ తీరాలు పరివేష్టించి వుండగా, ఒక స్మృతిగా మారిపోవడం మంచిదనీ చెప్తున్నాడు. గతం తృణప్రాయం, భవిష్యత్తు వుత్తదీ, మళ్లీ యెన్నటికీ రాబోని యీ అనిర్వచనీయమైన రాత్రి కూడా త్వరలో అంతమౌతుంది, అనంత కాలంలో కలిసి పోతుంది — కనుక యెందుకు బతకడం?

ఓల్గ ఇవానొవ్నా కాసేపు ర్యాబొవ్‌స్కీయ్ గొంతూ, కాసేపు రాత్రి నిశ్శబ్దమూ వింటూ, తనలో తాను అనుకొన్నది, తాను అమరజీవిననీ, తన కెప్పటికీ మరణం వుండదనీ. అంతవరకు తను చూసిన వాటితో దేంతోనూ పోలిక లేని యీ తళుకు మిల మిలల నీరూ, యీ ఆకాశమూ, యీ నదీ తీరాలూ, యీ నల్లని నీడలూ, తన హృదయంలో నిండిన అనిర్వచనీయ ఆనందమూ, అన్నీ — ఆమె యేనాడో జకనాడు గొప్ప కళాకారిణి అవుతుందనీ, యెక్కడో, ఆ దూరానికి ఆవల, వెన్నెల రాత్రికి ఆవల, అనంత అవధులలో విజయమూ, యశస్సూ, ప్రజానురాగమూ తనకోసం కాచుకున్నాయనీ — ఆమెకు చెప్పినాయి. దూరంలోకి దీర్ఘంగా, రెప్ప లార్పకుండా ఆమె విల జూసినప్పుడు అక్కడ ఆమెకు జన సమూహాలూ, దీపాలూ, గంభీర సంగీతపు ధ్వనులూ, ఉత్సాహపు కేకలూ, తెల్లని దుస్తులలో తామూ, అన్ని దిక్కులనుండీ తనమీద వర్షించే పూలజల్లులూ కనిపించినట్లైంది. తన పక్కన, కమ్మీమీద ఆనుకొని, ఒక మహా పురుషుడు, మహా ప్రజ్ఞాశాలి, కారణజన్ముడు, నిలబడివున్నాడని ఆమె అనుకొంది.... యింతవరకు అతను చేసినదంతా అద్భుతంగా, నవనవోన్మేషంగా, అసాధారణంగా వుంది, యికముందు, యేండ్లు గడిచి అతని ప్రజ్ఞ పరిణతి నందుకున్నప్పుడు, అతని కృషి యశస్కరంగా అవధిలేనంత గొప్పదిగా వుంటుంది, యిదంతా అతని ముఖంలోనూ, అతని ఆత్మ వ్యక్తీకరణ పద్ధతిలోనూ, ప్రకృతిపట్ల అతని వైఖరిలోనూ కనిపిస్తున్నది. నీడలనూ, సాయం సంధ్యా వర్ణాలనూ, వెన్నెల తళతళలనూ వర్ణించడానికి అతనికి ప్రత్యేకమైన సొంత భాష వుంది; ప్రకృతిమీద అతని సమ్మోహనకర శక్తి దాదాపు దుర్వారమైనది. అతను అందగాడు కూడా, అతను అద్వితీయుడు, అతని జీవితం, స్వతంత్రమైన స్వేచ్ఛాయుతమైన, భవబంధాలు లేని అతని జీవితం, విహంగమ జీవితం లాగుంది.

"చలి వేస్తోంది," అన్నది ఓల్గ ఇవానొవ్నా. ఆమె వణికింది.

ర్యాబొవ్‌స్కీయ్ ఆమెకు తన కోటు కప్పి, విషాద స్వరంతో అన్నాడు:

"నేను మీ అధీనంలో వున్నాననిపిస్తున్నది. నేను మీ బానిసను. యీనాడు యేమిటి నన్నింత సమ్మోహితుణ్ణి చేస్తున్నారు?"

అతను కదల మెదలకుండా కన్నార్పకుండా ఆమెవైపే తదేకంగా చూస్తూ వుండి నాడు. అతని కన్నులలో యేదో భయంకరమైనది వుండింది. అతనివైపు చూడడానికి ఆమెకు భయమైంది.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను, పిచ్చిగా" అని ఆమె చెంపదాకా వంగి అతను గుసగుసలాడినాడు. "మీరు ఊఁ అంటే చాలు, నేను ప్రాణమిస్తాను, కళను త్యజి స్తాను...." అని అతను, గాఢంగా చలించిపోయి గొణిగినాడు. "నన్ను ప్రేమించండి, నన్ను ప్రేమించండి...."

"అలా మాట్లాడకండి," అన్నది ఓల్గ ఇవానొవ్నా, కన్నులు మూసుకుంటూ. "అది ఘోరం. దీమొవ్ సంగతి యేమిటి?"

"దీమొవ్ సంగతి యేమైతేనేం? దీమొవ్ సంగతి యెందుకు? దీమొవ్‌తో నాకేం పని? వోల్గ నది, చంద్రుడు, సౌందర్యం, నా ప్రేమ, నా తన్మయత్వం, కానీ దీమొవ్ వద్దు.... ఓ, నాకేమీ తెలియదు.... నాకేమీ తెలియదు.... నాకు గతం అక్కరలేదు, నాకు ఒక్క క్షణం మాత్రం యివ్వండి.... క్షణంలో సగం!"

ఓల్గ ఇవానొవ్నా గుండె దడదడ కొట్టుకుంది. ఆమె తన మగని గురించి ఆలో చించడానికి ప్రయత్నించింది, కానీ గతమంతా, తన పెండ్లీ, దీమొవూ, తన బుధవారం సాయంత్రాలూ, అంతా ఆమెకు అల్పంగా, తృణప్రాయంగా, నిస్తేజంగా, నిరర్థ కంగా, సుదూర విషయంగా కనిపించింది.... యేమైనా — దీమొవ్ సంగతి యేమైతేనేం? దీమొవ్ సంగతి యెందుకు? దీమొవ్‌తో తనకేం పని? దీమొవ్ అనే మనిషి నిజంగా వున్నాడా, అతను వట్టి కల కాదా?

"అతను అనుభవించిన ఆనందం అతనిలాంటి సాదా మనిషికి చాలు," అని ఆమె తనలో తాను అనుకుంది, చేతులతో ముఖం కప్పుకుంటూ. "అక్కడ వాళ్ళు నన్ను విమర్శించనీ, వాళ్ళు నన్ను శపించనీ, నేను నాశన మౌతాను, అవును, నాశన మౌతాను, కేవలం వాళ్ళమీద కసితో.... మనిషి ఒకసారి అన్నీ చవిచూడాలి. భగవంతుడా, యెంత భయంకరం, యెంత మనోహరం!"

ఆమె చుట్టూ చేతులు వేసి, మెల్లగా అతన్ని తోసివేయడానికి ప్రయత్నించే ఆమె చేతులను ఆత్రంగా ముద్దు పెట్టుకుంటూ, "యేమంటావ్? యేమంటావ్?" అని గుసగుసలాడినాడు చిత్రకారుడు. "నీవు నన్ను ప్రేమిస్తున్నావా? ప్రేమిస్తున్నావా? ఓ, యేమి రాత్రి! యెంత అనిర్వచనీయమైన రాత్రి!"

కన్నీళ్లతో మెరిసే అతని కన్నులలోకి చూస్తూ, "అవును, యేమి రాత్రి!"

గునగునమన్నది ఆమె. తరువాత ఆమె వడిగా చూపులు పక్కకు తిప్పకొని, అతని చుట్టూ చేతులు వేసి, అతన్ని పెదవులమీద గట్టిగా ముద్దుపెట్టుకుంది.

"యింకో నిముషంలో కీనెష్మ చేరుతాము," అని డెక్కు అవలివైపునుండి యెవరో అన్నారు.

బరువైన అడుగుల చప్పుడు వినిపించింది. అల్పాహారశాలలో పనిచేసే మనిషి అతను అలా వెళ్తూ వున్నాడు.

"యిదుగో," ఓల్గ ఇవానొవ్నా అతన్ని పిలిచింది, ఆనందం పట్టలేక నవ్వుతూ, యేడుస్తూ. "మాకు కాస్త వైన్ పట్టుకరా."

చిత్రకారుడు ఆందోళనతో పాలిపోయి, బెంచీమీద కూర్చున్నాడు, మెప్పూ, కృతజ్ఞతా నిండిన కన్నులతో ఓల్గ ఇవానొవ్నావైపు చూస్తూ. తరువాత అతను కండ్లు మూసుకొని, బరువైన చిరునవ్వుతో అన్నాడు:

"నేను అలసిపోయినాను."

అతను కమ్మీమీద తల మోపినాడు.

5

సెప్టెంబర్ రెండవ తేదీ వెచ్చగా ప్రశాంతంగా వుండింది, కానీ మసకగా వుండింది. ఉదయం వోల్గనదిమీద పల్చని పొగమంచు వుండింది, తొమ్మిది గంటల తర్వాత తుంపర ప్రారంభమైంది. అది వెలుస్తుందనే ఆశ యేమాత్రమూ కనిపించలేదు. ఉదయ వాస్తా దగ్గర ర్యాబొవ్‌స్కియ్ ఓల్గ ఇవానొవ్నాతో మాట్లాడుతూ చిత్రలేఖనం మహా అసంతృప్తికరమైనదనీ, విసుగు కలిగించే కళ అనీ, తాను చిత్రకారుడే కాదనీ, తనకు ప్రజ్ఞ వుందని బుద్ధిహీనులు తప్ప యెవరూ నమ్మరనీ చెప్పినాడు. హఠాత్తుగా, యేమీ సూచన యివ్వకుండా అతను కత్తి తీసుకొని, తన అత్యంత విజయవంతమైన రేఖాచిత్రాన్ని చీల్చివేసినాడు. ఉదయ భోజనం తర్వాత అతను కిటికీ దగ్గర దిగులుగా కూర్చొని, నదివైపు చూసినాడు. వోల్గ యిప్పుడు తళతళ మనడం లేదు, మసకగా, నిస్తేజంగా, నిర్లిప్తంగా వుంది. విషాద, నిర్జీవ శరదృతువు సమీపిస్తున్నదని ప్రతిదీ సూచిస్తోంది. నది గట్లుమీది పచ్చని రత్న కంబళాలని, రత్నాలలాంటి సూర్యకిరణ ప్రతిబింబాలని, నీల స్ఫటికంలాంటి ఆకాశాన్ని, ప్రకృతి సుకుమార సౌందర్యం సమస్తాన్ని వోల్గనుండి వొలిచివేసి వచ్చే వసంతందాకా పెట్టెలో భద్రంగా దాచిపెట్టినట్లుంది. కాకులు నదిమీద ఆడుతూ, "కావు, కావు" అంటూ నదిని ఆట పట్టించినట్లుంది. ర్యాబొవ్‌స్కియ్ వాటి కూతలు విని తనలో తాను అనుకున్నాడు: తన చిత్రకళా శక్తినంతా ఖర్చుపెట్టేసినాడు, తన ప్రజ్ఞ నశించింది, ప్రపంచంలో ప్రతిదీ గతానుగతి

కంగా, సాపేక్షంగా, మతిహీనంగా వుంది, యీ స్త్రీతో తాను సంబంధం పెట్టుకొని వుండనే కూడదు.... ఒక్క మాటలో చెప్పాలంటే, అతని మనస్సు బాగా లేదు.

ఓల్గ ఇవానోవ్నా, తన అందాల లేతబంగారు జుట్టును వ్రేళ్లతో చిక్కుతీసుకుంటూ, తాను తన యింటి డ్రాయింగురూంలో, పడకగదిలో, భర్త పఠనాలయంలో వున్నట్లు ఊహించుకుంటూ, గదిని రెండు భాగాలుగా విభజించే దడికి ఆవల మంచంమీద కూర్చొని వుంది. ఊహా విహంగంమీద ఆమె నాటకశాలకు వెళ్లింది, తన దర్జీవద్దకు వెళ్లింది, తన ప్రసిద్ధ మిత్రుల వద్దకు వెళ్లింది. యిప్పుడు వాళ్ళు యేం చేస్తుంటారో? వాళ్లెప్పుడైనా తనను జ్ఞాపకం చేసుకుంటారా? అతిథుల రాకపోకల మొదలైంది, తన బుధవారం సాయంత్రాల గురించి ఆలోచించవలసిన సమయం వచ్చింది. మరి దీమొవో? ప్రియతమ దీమొవ్! ఉత్తరాలలో తనను యింటికి రమ్మని అతను యెంత విన్రమంగా, యెంత పసితనపు ఆక్రందనతో ప్రాధేయ పడుతున్నాడు! ప్రతినెలా అతను 75 రూబుళ్ల పంపుతున్నాడు; చిత్రకారుందగ్గర తాను వంద రూబుళ్ల బదులు తీసుకున్నానని రాస్తే, అతను మరొక వంద పంపినాడు. యెంత మహోదారుడు! ఈ యాత్రతో ఓల్గ ఇవానోవ్నా అలసిపోయింది, ఆమెకు విసుగైంది. యీ రైతులకు దూరంగా, నదిలోనుండి వచ్చే సీము వాసనకు దూరంగా వెళ్లిపోవాలనీ, రైతుల గుడిసెలలో వుంటూ, వూరూరూ తిరుగుతూ వుండగా తనను వెంటాడే యీ అపరిశుభ్రతా భావాన్ని విదలించుకోవాలనీ ఆమెకు మనసు పీకుతున్నది. సెప్టెంబర్ యిరవైదాకా వాళ్లతో కలిసివుంటానని చిత్రకారులకు ర్యాబొవ్‌స్కియ్ మాట యిచ్చి వుండకపోతే, తాము యీ రోజే వెళ్లిపోయి వుండవచ్చు. యెంత బాగుండేది!

"భగవంతుడా," మూలిగినాడు ర్యాబొవ్‌స్కియ్. "యీ జన్మలో సూర్యుడు బయటికి వస్తాడా? యెండ లేకుండా నేను ఎండకాలపు ప్రకృతి దృశ్యం యెలా కొనసాగించేది?"

"మబ్బులు పట్టిన ఆకాశం గల రేఖాచిత్రం ఒకటి వుంది మీది" అన్నది ఓల్గ ఇవానోవ్నా, దడి ఆవతలినుండి యివతలికి వస్తూ. "జ్ఞాపకం లేదూ కుడి భాగంలోపైన వనమూ, యెడమన ఆవుల మందా, బాతులూ వుండేది. యిప్పుడది పూర్తిచెయ్యండి."

"మీకు పుణ్యముంటుంది!" చిత్రకారుడు ముఖం మాడ్చుకున్నాడు. "చెయ్యండట! నేనేం చెయ్యవలసిందీ నాకు తెలియనంత మూర్ఖుణ్ణనుకున్నావా?"

"నాపట్ల యెంతగా మారిపోయినారు!" అని ఓల్గ ఇవానోవ్నా నిట్టూర్చింది.

"మంచి పని జరిగింది!"

ఓల్గ ఇవానోవ్నాకు ఒళ్లంతా జలదరించింది. ఆమె నెగడు వద్దకు పోయి, అక్కడ యేడుస్తూ నిలుచుంది.

"కన్నీళ్లు కూడానా! దేనికైనా పరిమితి వుండాలి. ఆవు! నాకు యేడ్వడానికి వెయ్యి కారణాలు వున్నాయి, కానీ నేను యేడ్వడం లేదు."

"కారణాలు!" ఓల్గ ఇవానొవ్నా వెక్కిళ్లు పెట్టింది. "ముఖ్య కారణం, నీకు నామీద వెగటు కలిగింది. వెగటు!" వెక్కిళ్లు యింకా యెక్కువైనాయి. "అసలు సంగతి యేమిటంటే, మన ప్రేమకు మీరు సిగ్గుపడుతున్నారు. చిత్రకారులు గమనిస్తారని మీరు భయపడుతున్నారు. యెలా దాగుతుందనుకున్నారు? వాళ్లకు యెప్పటి నుండో తెలును."

"ఓల్గ, నిన్ను ఒకటే కోరుతున్నాను," అన్నాడు చిత్రకారుడు ప్రాధేయపడుతూ. "ఒక్కటే — నన్ను ఒంటరిగా వదలిపెట్టు. నిన్ను నేను కోరేది అంతే."

"మరి నన్నింకా ప్రేమిస్తున్నానని ప్రమాణంచేయండి."

"యిది చిత్రహింస!" పండ్లు బిగబట్టి కస్సుమంటూ చిత్రకారుడు చటుక్కున నిలబడినాడు. "నేను వోల్గలోనైనా పడిచస్తాను, లేదా నాకు పిచ్చైనా ఎక్కుతుంది! నన్ను ఒంటరిగా వుండనీయండి."

"అయితే నన్ను చంపండి ఊఁ, నన్ను చంపెయ్యండి!" రోదించింది ఓల్గ ఇవానొవ్నా. "నన్ను చంపెయ్యండి!"

వెక్కివెక్కి యేడుస్తూ ఆమె మళ్లీ దడి చాటుకు పోయింది. గడ్డి కప్పుమీద చినుకులు సరసర మంటున్నాయి. ర్యాబొవ్‌స్కియ్ తల అణగబట్టుకొని, గదిలో చాలాసేపు అటూ యిటూ పచారుచేసినాడు. తరువాత అతను, యెవరితోనో వాదం ముగిస్తున్నట్లు దృఢనిశ్చయం చేసుకున్న ముఖ భంగిమతో, నెత్తిన టోపీ పెట్టుకొని, తుపాకి భుజాన వేసుకొని, గుడిసెలోనుండి వెళ్లిపోయినాడు.

అతను వెళ్లి పోయిన తర్వాత ఓల్గ ఇవానొవ్నా చాలాసేపు మంచంమీద పండుకొని యేడ్చింది. విషం తీసుకోవాలనీ, ర్యాబొవ్‌స్కియ్ తిరిగివచ్చి తాను చచ్చి పడివుండడం చూస్తే యెంతో బాగుంటుందనీ మొదట ఆమెకు ఆలోచన వచ్చింది. కానీ కాసేపట్లోనే ఆమె ఆలోచనలు తన డ్రాయింగురూమ్‌కీ మగని పతనాలయానికీ పరుగెత్తినాయి. తాను దీమొవ్ పక్కన నిశ్చలంగా కూర్చొని ప్రశాంతి పరిశుభ్రతల సుఖం అనుభవిస్తున్నట్లు ఊహించుకుంది, తరువాత నాటకశాలలో కూర్చొని మజీనీ సంగీతం వింటున్నట్లు ఊహించుకుంది. నాగరికత కొరకూ, నగర ధ్వనుల కొరకూ, ప్రసిద్ధుల కొరకూ ఆమె గుండె విలవిల లాడింది. ఒక పల్లె స్త్రీ గుడిసెలోకి వచ్చి, తీరికగా నెగడు రాజేయ నారంభించింది, వంటకు సన్నాహంగా. రాజుకునే కొట్టెల వాసన వచ్చింది, పొగతో గాలికి నీలిరంగు వచ్చింది. చిత్రకారులు బురద కొట్టిన బూట్లతో, వానకు తడిసిన ముఖాలతో వచ్చి, ఒకరి రేఖాచిత్రాలు ఒకరు చూసి, చెడ్డ వాతావరణంలో కూడా వోల్గనది కొక మనోహరత్వం వుందనుకుంటూ తమ్ము తాము ఊరడించుకున్నారు.

గోడమీది చౌక గడియారం టిక్‌టిక్ మంటూ ఆడుతున్నది. చలి యీగలు సన్నగా బుజ్ మంటూ, దేవుని బొమ్మల పక్కన వున్న మూలన మూగినాయి; బెంచీలకింద కుక్కిన ఫైళ్లచుట్టూ బొద్దింకలు పారాడుతున్నాయి....

ర్యాబొవ్‌స్కీయ్ పొద్దు గూకే వేళకి తిరిగివచ్చినాడు. అతను టోపీ టేబుల్‌మీద విసరి వేసినాడు, పాలిపోయి, నీరసించి, బురద బూట్లతోనే బెంచీమీద కూలబడి, కండ్లు మూసుకున్నాడు.

"అలసిపోయినాను," అన్నాడు అతను. కను రెప్పలు తెరిచే ప్రయత్నంలో అతని కనుబొమలు చిటచిటలాడినాయి.

ఓల్గ ఇవానొవ్నా, అతనికి ప్రీతిపాత్రురాలు కావాలనీ, తనకు నిజంగా కోపం లేదని తెలపాలనీ తహతహలాడుతూ, అతని వద్దకు వెళ్లి, నిశ్శబ్దంగా అతన్ని ముద్దు పెట్టుకుంది, అతని లేత గోధుమరంగు జుట్టులో దువ్వెన దూర్చింది. అతని తల దువ్వాలని ఆమెకు హఠాత్తుగా కోరిక కలిగింది.

చల్లని వస్తువేదో తనకు తాకినట్లు అతను ఉలికిపడి "యేమిటిది?" అంటూ కండ్లు తెరచినాడు. "యేమిటిది? నా జోలికి రావద్దు, నీకో నమస్కారం!"

అతనామెను యెడంగా తోసి, దూరంగా జరిగినాడు. అతని ముఖంలో విసుగూ, అసహ్యమూ కనిపించినాయి ఆమెకు. సరిగ్గా అప్పుడే ఆ పల్లె స్త్రీ కాబేజి పులుసు ప్లేటు జాగ్రత్తగా రెండు చేతులతోనూ పట్టుకొని అతని దగ్గరికి వచ్చింది; ఆమె మొద్దు బొటన వేళ్లు పులుసుతో తడిసి వుండడం ఓల్గ ఇవానొవ్నా గమనించింది. కడుపు చుట్టూ బిగదీసిన స్కర్టు గల అపరిశుభ్రపు పల్లె స్త్రీ, ర్యాబొవ్‌స్కీయ్ అంత ఆత్రంగా యెగబడిన కాబేజి పులుసూ, గుడిసే, సరళత్వంలో, కళాత్మక అవ్యవస్థలో మొదట అంత ఆహ్లాదకరంగా కనిపించిన యీ జీవితమూ యిప్పుడామెకు దారుణంగా కనిపించినాయి. హఠాత్తు అవమానానికి గురై ఆమె నిర్లిప్తంగా అన్నది:

"కొంత కాలంపాటు మనం విడిపోవాలి, లేకపోతే వట్టి విసుగుతో మనం పోట్లాడు కుంటాం. యిదంతా నాకు వెగటుగా వుంది! యీ రోజు నేను వెళ్లిపోతాను."

"యెలా వెళ్తావ్? రెక్కలున్నాయా?"

"యీ దినం గురువారం. తొమ్మిదిన్నరకు స్టీమర్ వస్తుంది.

నాప్‌కిన్ లేనందువల్ల టవల్‌తో మూతి తుడుచుకుంటూ, "ఆఁ? ఓ, ఔను.... సరే అయితే, వెళ్లు," అన్నాడు ర్యాబొవ్‌స్కీయ్ మెల్లగా. "నీకిక్కడ నిస్సారంగా వుంది. నిన్ను ఆపడానికి ప్రయత్నించేటంత స్వార్థపరుణ్ణి కాదు నేను. వెళ్లు, యిరవయ్యవ తేదీ తరువాత మళ్లీ కలుసుకుందాం."

తేలికపడిన హృదయంతో ఓల్గ ఇవానొవ్నా సామాన్లు సర్దుకోసాగింది; సంతృప్తితో ఆమె బుగ్గలు ఎర్రబడినాయి. "నిజమా? త్వరలో నేను డ్రాయింగురూంలో కూర్చోవడమూ,

పడకగదిలో నిద్రపోవడమూ గుడ్డ కప్పిన టేబుల్‌మీద భోం చేయడమూ నిజంగా జరుగుతాయా?" అనుకుంది ఆమె. భుజాలమీద వున్న బరువు తొలగిపోయినట్లైంది, చిత్రకారునిమీద ఆమె కిప్పుడు కోపమేమీ లేదు.

"నా రంగులూ, కుంచెలూ నీకోసం యిక్కడ వదిలేస్తాను ర్యాబుష," అని ఆమె అంది. "యేమైనా మిగిలితే నీవు వెనక్కి పట్టుకరావచ్చు.... నేను లేనప్పుడు సోమరిగా వుండవద్దు, దిగులుపడుతూ కూర్చోకు – పనిచెయ్! మంచివానివి గదూ, ర్యాబుష!"

తొమ్మిది గంటలప్పుడు అతను ఆమెను వీడ్కోలు ముద్దుపెట్టుకున్నాడు – డెక్కుమీద చిత్రకారుల ముందర ముద్దుపెట్టుకోవడం యిష్టం లేక, అలా చేసివాడని ఆమెకు గట్టి నమ్మకం. ఓడ యెక్కే వేదికదాకా అతనామెను సాగనంపినాడు. కాసే పట్లో స్టీమర్ వచ్చింది, ఆమెను యెక్కించుకొని పోయింది.

రెండున్నర రోజులకు ఆమె యిల్లు చేరింది. టోపీ, వాన కోటూ తీసివేయకుండానే, ఆందోళనవలన బరువుగా ఊపిరి తీసుకుంటూ, ఆమె డ్రాయింగురూంలోకి వెళ్ళింది, అక్కడినుండి భోజనాల గదిలోకి వెళ్ళింది. దీమొవ్ చొక్కాలో, వేస్టుకోటు గుండీలు పెట్టుకోకుండా, టేబుల్‌వద్ద కూర్చొనివుండినాడు, ఫోర్కుమీద కత్తికి పదును పెడుతూ; అతని యెదుట ప్లేటులో వేయించిన కోడి వుంది. మగనికి యేమీ తెలపగూడదనీ, దానికి తగిన సామర్థ్యమూ శక్తీ తనకు వున్నాయనీ దృఢమైన విశ్వాసంతో ఓల్గ ఇవానొవ్నా యింట్లో ప్రవేశించింది. కానీ ఆ ప్రఫుల్ల, సాధు, ఆహ్లాదభర దరహాసమూ, అతని కన్నులలో మెరిసే సంతోషమూ చూసి, యిలాంటి మనిషిని మోసగించడం నీచమనీ, యేహ్యమనీ ఆమెకు అనిపించింది, అపనిందలు వేయడమూ, దొంగతనం చేయడమూ, హత్యలు చేయడమూ యెలా తనకు సాధ్యం కాదో, యిదీ అలాగే తనకు సాధం కాదని ఆమెకు అనిపించింది. తక్షణమే ఆమె జరిగిందంతా అతనికి చెప్పెయ్యాలని, నిర్ణయానికి వచ్చింది. అతను తనను కౌగలించుకొని, ముద్దుపెట్టుకున్నదాకా వుండి, ఆమె అతనిముందు మోకాళ్లమీద వాలి, తన చేతులతో ముఖం కప్పుకుంది.

"యేమిటిది? యేమిటిది బుజ్జీ?" అతను మృదువుగా అడిగినాడు. "నాకోసం అంత బెంగపెట్టుకున్నావా?"

ఆమె ముఖమెత్తింది, సిగ్గుతో యెర్రబడిన ముఖంతో, అతనివైపు దోషిలా చూసింది, ప్రాధేయపూర్వకమైన చూపు. సిగ్గుతో, భయంతో ఆమె సత్యం చెప్పలేకపోయింది.

"యేమీ లేదు...." అన్నది ఆమె. "వూరక...."

"కూర్చుందాం పద," అంటూ అతను ఆమెను లేవనెత్తి, టేబుల్‌వద్ద కూర్చో బెట్టినాడు. "ఆఁ, అలా.... కాస్త కోడి మాంసం తిను. నీకు ఆకలి వేస్తున్నది, బంగారు బుజ్జీ."

ఆ సుపరిచిత వాతావరణాన్ని ఆమె ఆత్రంగా ఆస్వాదించింది, కోడి మాంసం తింది. అతను ఆపేక్షగా ఆమెను పరికిస్తూ, ఆహ్లాదంతో నవ్వుతూవుండినాడు.

6

చలి కాలం మధ్యలో యెప్పుడో తనవామె మోసగిస్తున్నట్లు, దీమొవ్‌కు అనుమానం కలగసాగింది. స్వచ్ఛంగా లేనిది తన అంతరాత్మే అయినట్లు తన భార్య కళ్ళలోకి అతను చూడలేకపోయివాడు; ఆమెను కలుసుకున్నప్పుడు అతను సంతోషపు చిరునవ్వు నవ్వడం లేదు; ఆమెతో వీలైనంత తక్కువగా యేకాంతంగా వుండడానికి అతను తరుచుగా తన మిత్రుడు కొరొస్తెలేవ్‌ను యింటికి భోజనానికి పిల్చుక వచ్చేవాడు. కొరొస్తెలేవ్ ముడుతల ముఖం గల చిన్న మనిషి; ఓల్గ ఇవానొవ్నా అతనితో మాట్లాడిన ప్పుడల్లా అతను పట్టి బిడియంతో కోటు గుండీలు విప్పుకుంటూ, తగిలించుకుంటూ వుండేవాడు, తరువాత కుడిచేత్తో యెడమ మీసం మెలిపెడుతూ వుండేవాడు. భోజన సమయంలో డాక్టర్లు, ఉదరవితానం మరీ పైన వుంటే ఒకోసారి గుండెదడ వస్తుం దనీ, లేదా యిటీవల నరాల వ్యాధులు యెక్కువగా వున్నాయనీ, లేదా రక్తక్షీణ వ్యాధితో మరణించినట్లు చెప్పబడిన ఒక రోగికి గత పాయంత్రం దీమొవ్ శవపరీక్ష చేయగా పాంక్రియాస్ కాన్సర్ కనిపించిందనీ ఏదేదో మాట్లాడుకునేవాళ్ళు. ఓల్గ ఇవానొవ్నాకు మాట్లాడడానికి, అనగా అబద్ధమాడడానికి, అవకాశం యివ్వకుండా వుండడానికే వాళ్ళు యీ వైద్యశాస్త్ర సంభాషణ జరిపినట్లుండేది. భోజనానంతరం కొరొస్తెలేవ్ పియానోవద్ద కూర్చునేవాడు, దీమొవ్ నిట్టూర్చి చెప్పేవాడు:

"కాసీవోయ్, యేదైనా మంచిది, విషాదభరితమైంది వినిపించు."

భుజాలు యెత్తి, వేళ్ళు విప్పి కొరొస్తెలేవ్ కొద్ది మెట్లు నొక్కి, సన్నని కంఠంతో పాట యెత్తుకునేవాడు: "యేదీ మన దేశంలో, రష్యన్ రైతు దుఃఖించని చోటు యేదైనా చూపించు నాకు!" దీమొవ్ మరోకసారి నిట్టూర్చి, పిడికిలిమీద తల మోపి, ఆలోచనలో మునిగిపోయేవాడు.

యిప్పుడు ఓల్గ ఇవానొవ్నా మహా అజాగ్రత్తగా ప్రవర్తించడం ప్రారంభించింది. ప్రతి ఉదయం ఆమె భారమైన హృదయంతో నిద్రలేచి, ర్యాబొవ్‌స్కియ్‌మీద తన కిక ప్రేమ లేదనీ, దేవుని దయవల్ల తనకూ అతనికీ తెగిపోయిందనీ అనుకునేది. కాఫీ తాగిన తర్వాత ఆమె తనకు తాను జ్ఞాపకం చేసుకునేది, ర్యాబొవ్‌స్కియ్ తననుండి తన భర్తను అపహరించివాడనీ, తన కిప్పుడు మగడూ లేడు, ర్యాబొవ్‌స్కియ్ లేడు అనీ. తరువాత ఆమెకు జ్ఞాపకం వచ్చేది, ర్యాబొవ్‌స్కియ్ యిప్పుడు ప్రదర్శన కొరకు పూర్తిచేస్తున్న యేదో అద్భుతమైన చిత్రం గురించి తమ మిత్రులు చెప్పుకుంటున్న

విషయం; అది పొలేనొవ్ శైలిలో, ప్రకృతి దృశ్యాన్ని సమస్యతో మేళవించిన చిత్రమట; అతని స్టుడియోకు వెళ్లివచ్చినవాళ్లందరూ దాన్ని మైమరచి పొగడుతున్నారు. కానీ అతను తన ప్రభావంకింద యీ చిత్రం సృష్టించినాడనీ, తన ప్రభావం మూలంగా అతను అపారంగా అభివృద్ధి అయినాడనీ ఆమె తన మనస్సుకు చెప్పకుంది. తన ప్రభావం యెంతో ఉపకారకమైనది, యెంతో వాస్తవమైనది, తాను అతన్ని వదలిపెడితే అతను భ్రష్టుపట్టిపోవచ్చు. ఆమెకు మరొకటి కూడా జ్ఞాపకం వచ్చేది: పోయినసారి అతను తన్ను చూడడానికి వచ్చినప్పుడు వెండిలాంటి జరీ దారాలు గల బూడిద రంగు కోటూ, కొత్త టై ధరించి, "నేనెలా వున్నాను?" అని మార్దవభరితమైన కంఠంతో అడిగినాడు. ఆ అందమైన కోటులో, నిడుపాటి ఉంగరాల జుట్టుతో, నీలి కన్నులతో అతను నిశ్చయంగా అందంగా వుండినాడు (కనీసం ఆమెకలా అనిపించింది), ఆమె పట్ల అతను చాలా అపేక్షగా వుండినాడు కూడా.

యివన్నీ, మరికొన్నీ జ్ఞాపకం చేసుకొని, వీటినుండి తన సొంత నిర్ధారణలు లాగి, ఓల్గ ఇవానొవ్నా బట్టలు వేసుకొని, మహా ఉద్విగ్న స్థితిలో ర్యాబొవ్స్కియ్ స్టుడియోకు పోయేది. ఆమె వెళ్లేటప్పటికి అతను మామూలుగా మంచి ఉత్సాహంలో వుండేవాడు, తన చిత్రాన్ని తెగ మెచ్చుకునేవాడు, నిజానికి ఆ చిత్రం చాలా బాగుండింది. అతను హాస్య మనస్థితిలో వుండేవాడు – చిలిపిగా తిరుగుతూ, గురుతరమైన ప్రశ్నలను హాస్యోక్తులతో దాటవేసేవాడు. ఓల్గ ఇవానొవ్నాకు ఆ చిత్రంమీద యీర్ష్య కలిగింది, దానిని యేవగించుకొంది, కానీ ప్రతిసారీ దానిముందు వినయమౌనంతో అయిదు నిముషాలు నిలబడి తరువాత గుడిలో మనుషులు నిట్టూర్చినట్లు నిట్టూరుస్తూ యిలా అనేది:

"అవును, యీ మాదిరి నీవెన్నడూ చిత్రించలేదు. దీన్ని చూస్తే నాకు భయమౌతున్నది."

తరువాత ఆమె అతన్ని ప్రాధేయపడేది, తనను ప్రేమించమనీ, తనను వదలిపెట్టవద్దనీ, దురదృష్టవంతురాలైన తనను జాలిదలచమనీ. ఆమె యేడ్చేది, అతని చేతులు ముద్దుపెట్టుకునేది, అతను తనని ప్రేమిస్తున్నాడని చెప్పించ ప్రయత్నించేది, తన సత్ప్రభావం లేకుంటే అతను దారి తప్పి భ్రష్టుపడతాడని గుర్తుచేసేది. అప్పుడు, అతన్ని పూర్తిగా అస్వస్థచిత్తుని చేసి, తాను అవమానపడి, ఆమె దర్జీవద్దకో, నాటకశాల టికెట్టు కొరకు నటి మిత్రురాలివద్దకో వెళ్లేది.

అతను తన స్టుడియోలో కనిపించని రోజు ఆమె చీటీ రాసిపెట్టి పోయేది, ఆ రోజే అతను తన్ను చూడడానికి రాకపోతే తాను విషం మింగుతానని. అతను భయపడి ఆమె వద్దకు వెళ్లి, భోజనానికి ఆగేవాడు. ఆమె భర్త వున్నాడనే జంకులేకుండా అతను అవమానకరమైన మాటలు అనేవాడు, ఆమె అతనికి మారు పడ్డించేది. తాము ఒకరి కొకరు అడ్డం వున్నామనీ, తాము నియంతలమనీ, శత్రువులమనీ వాళ్లకిద్దరికీ అని

పించేది, దానితో వాళ్ళు కోపోద్రిక్తు లయ్యేవాళ్ళు, తమ కోపోద్రేకంలో తమ ప్రవర్తన యెంత అసభ్యంగా వుండేదీ, కొరొస్తెలేవ్‌కు కూడా అన్నీ అర్థం కాక తప్పదనీ వాళ్ళకు గమనం వుండేది కాదు. భోజనం తర్వాత ర్యాబొవ్‌స్కియ్ తొందరగా సెలవు తీసుకొని వెళ్ళిపోయేవాడు.

"యెక్కడికి పోతున్నావ్?" అని హాలులో ఓల్గ ఇవానొవ్నా ద్వేషంతో అతనివైపు చూస్తూ అడిగేది.

అతను ముఖం చిట్లించి, కనుబొమలు ముడివేస్తూ, తమకిద్దరికీ తెలిసిన యేదో ఒక స్త్రీ పేరు చెప్పేవాడు; స్పష్టంగా తెలుస్తూవుంటుంది, అతను ఆమె యీర్ష్యను యెగతాళి చేస్తున్నాడనీ, ఆమెను ఉడికించడానికి ప్రయత్నిస్తున్నాడనీ. ఆమె పడకగదిలోకి పోయి, పండుకునేది. యీర్ష్యతో, కోపంతో, అవమానంతో, సిగ్గుతో ఆమె దిండు నోట గరచుకొని, బిగ్గరగా యేడ్చేది. అప్పుడు దీమొవ్ కొరొస్తెలేవ్‌ను డ్రాయింగురూంలో వదలి, పడకగదిలో అడుగుపెట్టి, బిడియపడుతూ, సంకోచపడుతూ, మెల్లగా అనేవాడు:

"యేడవాకు బుజ్జీ! యేమి లాభం? మనసులో దాచుకోవాలి. యితర్లకు తెలియ నియ్యకూడదు... జరిగిందేదో జరిగిపోయిందిలే."

ఆణచుకోలేని యీర్ష్యతో కణతలు అదురుతుండగా, పరిస్థితులు చక్క దెట్టు కోడానికి సమయం మించిపోలేదనుకుంటూ ఆమె లేచి కన్నీటి చారల ముఖం కడు క్కొని, పౌడరు రుద్దుకొని, అతను చెప్పిన స్త్రీ యింటికి పురికేది. ర్యాబొవ్‌స్కియ్‌ని అక్కడ కానక ఆమె మరొకరి యింటికీ, మరొకరి యింటికీ పరుగులెత్తేది.... మొదట మొదట యీ ప్రయాణాలకు ఆమె సిగ్గుపడేది, కానీ త్వరలో వాటికి అలవాటుపడింది, ఒకోసారి ఒకే సాయంత్రం తనకు తెలిసిన అందరి యిండ్లకూ వెళ్ళేది ర్యాబొవ్‌స్కియ్‌ని వెదక్కుంటూ; ఆమె ఉద్దేశం వాళ్ళందరికీ తెలును.

ఒకసారి తన మగన్నిగురించి ఆమె ర్యాబొవ్‌స్కియ్‌తో అన్నది:

"ఆ మనిషి మహౌదార్యంకింద నేను నలిగిపోతున్నాను."

యీ నుడికారం ఆమెకెంత యింపుగా వుండిందంటే, తనకూ ర్యాబొవ్‌స్కియ్‌కీ మధ్య గల ప్రణయ రహస్యం యెరిగిన చిత్రకారులలో యెవరినైనా ఆమె కలుసుకు న్నప్పుడు, మగని ప్రసక్తి తెచ్చి, చేయి బలంగా వూపుతూ అనేది:

"ఆ మనిషి మహౌదార్యంకింద నేను నలిగిపోతున్నాను."

వాళ్ళ జీవిత క్రమచర్య గత సంవత్సరం లాగే నడిచింది. బుధవారం సాయంత్రాలు అతిథి సమ్మేళనాలు వుండేవి. నటుడు వాచికాభినయం చేసేవాడు, చిత్రకారులు బొమ్మలు గీసేవాళ్ళు, సెల్లో వాద్యగాడు వాయించేవాడు, గాయకుడు పాడేవాడు, తప్పనిసరిగా

పదకొండున్నరకు భోజనశాల వాకిలి తెరచుకునేది, దీమొవ్ చిరునవ్వుతో "మిత్రులారా, భోజనానికి రండి" అనేవాడు.

ముందులాగే ఓల్గ ఇవానొవ్నా గొప్పవాళ్ల కోసం వెదకేది, వాళ్లను పట్టుకునేది, అప్పటికీ తృప్తిలేక, యితర్ల కోసం వెదకేది. ముందులాగే ఆమె రోజా రాత్రి ఆలస్యంగా యింటికి వచ్చేది; కానీ పోయిన సంవత్సరం లాగ, ఆమె యింటికి వచ్చేటప్పటికి దీమొవ్ నిద్రపోవడం లేదు, తన పఠనాగారంలో యేదో పని చేసుకుంటూ వుండేవాడు. అతను మూడుకు పండుకొని, యెనిమిదికి లేచేవాడు.

ఒక రోజు సాయంత్రం ఆమె నాటకశాలకు పోయేముందు, చివరిసారి అద్దంలో చూసుకుంటూవుండగా, దీమొవ్ ఫ్రాక్‌కోటుతో, తెల్ల టైతో పడకగదిలోకి వచ్చినాడు. అతను సాధువుగా చిరునవ్వు నవ్వి, ముందులాగ ఆమె కన్నుల్లోకి సూటిగా చూసినాడు. అతని ముఖం కళకళలాడుతూ వుంది.

"థీసీసు సమర్పించి వస్తున్నాను," అన్నాడు అతను, కూర్చొని మోకాళ్లవద్ద పంట్లాం ముడుతలు చేత్తో సర్దుకుంటూ.

"నెగ్గిందా?" అడిగింది ఓల్గ ఇవానొవ్నా.

"ఓ, నెగ్గదూ?" నవ్వినాడు అతను, అద్దంలో భార్య ముఖం చూడడానికి మెడ సాచుతూ — ఆమె యింకా వీపు అతనివైపు తిప్పే వుంది, సిగకు చివరి మెరుగులు దిద్దుతూ. "నెగ్గదూ?" అన్నాడు మళ్లీ అతను. "మరే, నన్ను సాధారణ పథోలాజీ అసిస్టెంటు ప్రొఫెసర్ చెయ్యవచ్చు. చేసేటట్లే వుంది."

అతని సంతోషంలో, అతని విజయంలో ఓల్గ ఇవానొవ్నా పాలుపంచుకొనివుంటే, అతను సమస్తమూ క్షమించేవాడు, వర్తమానమూ, భవిష్యత్తూ అన్నీ, సమస్తమూ మరచిపోయేవాడు — అతని ఆనందపూర్ణ, ప్రఫుల్ల ముఖ భంగిమలో అది తేట తెల్లంగా కనిపిస్తూవుండింది. కానీ, ఆమెకు అసిస్టెంటు ప్రొఫెసర్ అంటే యేమిటో, సాధారణ పథోలాజీ అంటే యేమిటో అర్థం కాలేదు. పైగా, నాటకశాలకు వేళ మీరుతుందేమో అని ఆమె మనసు పీకుతూ వుండింది. అందువలన ఆమె యేమీ అనలేదు.

అతను కొద్ది నిముషాలు కూర్చొని, క్షమాపణపూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ, బయటికి పోయినాడు.

7

ఆ రోజు మహా ఆందోళనకరమైన దినం.

దీమొవ్‌కు తల పేలిపోతూవుండింది. అతను ఉదయ భోజనం తినలేదు, ఆస్పత్రికి పోలేదు, రోజంతా తన పఠనాగారంలోని సోఫాలో పండుకున్నాడు. ఓల్గ ఇవానొవ్నా మామూలు ప్రకారం పండ్రెండు దాటుతూనే ర్యాబొవ్‌స్కియ్ వద్దకు

బయలుదేరింది, తాను వేసిన రేఖా చిత్రాన్ని అతనికి చూపించడానికీ, గత దినం తనను చూడడానికి యెందుకు రాలేదని అతన్ని అడగడానికీ. తన రేఖా చిత్రం బాగలేదని ఆమెకు తెలుసు; అతన్ని పోయి చూడడానికి సాకు వుండాలనే ఆమె దాన్ని చిత్రించింది.

ఆమె వాకిలిగంట వాయించకుండా లోపలికి వెళ్ళింది, హాలులో బూట్ల తొడుగులు విప్పుతుండగా, స్టూడియోలో మెత్తని అడుగుల చప్పుడూ, స్త్రీ బట్టల సవసవా ఆమెకు వినిపించినట్లైంది. ఆమె తొందరతొందరగా లోపలికి చూసినప్పుడు, ఒక గోధుమ వర్ణం స్కర్టు క్షణకాలంపాటు మెరుపులా తళుక్కుమని మరుక్షణంలో పెద్ద కాన్వాసు వెనుక అదృశ్యమైంది; ఆ కాన్వాసుకు పైనుండి నేలదాకా పెద్ద కాలికో గుడ్డ కప్పబడింది. అక్కడొక స్త్రీ దాక్కున్నదనడంలో సందేహం లేదు. యీ కాన్వాసు చాటున ఓల్గ ఇవానొవ్నా యెన్నిసార్లు దాక్కోలేదు! ర్యాబొవ్స్కియ్ విలువుగా యిబ్బందిపడి పోయినట్లు కనిపిస్తూనేవుంది. ఆమె రాకకు ఆశ్చర్యపడినట్లు అతను రెండు చేతులూ ముందుకు సాచి, బలవంతపు చిరునవ్వుతో అన్నాడు:

"ఆ — ! మీ దర్శనం ఆనందకరం! యేమిటి విశేషాలు?"

ఓల్గ ఇవానొవ్నా కళ్ళల్లో నీరు నిండింది. ఆమెకు సిగ్గూ, అవమానమూ కలిగినాయి. ప్రాణం పోయినా తాను ఒక్క మాట కూడా మాట్లాడదు, ఆ మరొక స్త్రీ ముందర; ఆ కాన్వాసు చాటున వున్నది తనకు పోటీదారు, బొంకులాడి, బహుశా తన్ను చూసి ముసిముసినవ్వులు నవ్వుతున్నది.

"యేమీ లేదు, నా రేఖాచిత్రం మీకు చూపిద్దామనుకున్నాను," అన్నది ఆమె బిగ్గరగా, పిరికి గొంతుతో. ఆమె పెదవులు కంపించినాయి. "యిది ప్రకృతి దృశ్యం."

"ఆ... రేఖాచిత్రం...."

చిత్రకారుడు రేఖాచిత్రాన్ని చేతుల్లోకి తీసుకొని దానిమీద చూపులు నిలిపి, పరధ్యానంగా నడిచినట్లు నడుస్తూ అవతలి గదిలోకి పోయినాడు.

ఆమె అణకువగా అతన్ని అనుసరించింది.

"ప్రకృతి దృశ్యం, పశ్యం, పశ్యం, పశ్యం" అతను గొణుక్కున్నాడు యాంత్రికంగా.

వడివడిగా వేసిన అడుగుల చప్పుడూ, స్కర్టు సవసవా స్టూడియోనుండి వినిపించినాయి. ఆ స్త్రీ వెళ్ళిపోయిందన్నమాట. ఓల్గ ఇవానొవ్నాకు బిగ్గరగా యేడ్వాలనీ, చిత్రకారుని యేదైనా బరువైనదానితో తలమీద బాది, పారిపోవాలనీ గట్టిగా అనిపించింది. కానీ ఆమె కండ్లనిండా నీరు క్రమ్మింది, అవమాన భారంతో క్రుంగిపోయింది, తాను ఓల్గ ఇవానొవ్నా కానట్లూ, చిత్రకారిణి కానట్లూ, యెవరో దౌర్భాగ్యపు అల్పిష్టి మరుగుజ్జు అయినట్లూ అనిపించింది.

"నేను అలసిపోయినాను," అన్నాడు చిత్రకారుడు క్షీణ కంఠంతో, రేఖా చిత్రాన్ని చూస్తూ, తన ఆయాసాన్ని శిరఃకంపంతో పారద్రోలడానికి ప్రయత్నిస్తూ. "బాగానే

వుంది, నిజమే, కానీ యీ రోజు ఒక రేఖాచిత్రం, నిరుడు ఒక రేఖాచిత్రం, ఒక నెలకు మరొక రేఖాచిత్రం.... మీకు విసుగు పుట్టడం లేదూ? నన్నడిగితే, చిత్రకళ వదిలేసి, సంగీతమో, మరొకటో నిష్ఠగా చేపట్టండి. మీరు చిత్రకారిణులు కాదు, తెలుసా, మీరు గాయకురాండ్రు. ఓ — యెంతగా అలసిపోయినానో! కాస్త టీ తెమ్మంటాను, సరేనా?''

అతను గదిలోనుండి వెళ్లిపోయినాడు. అతను పరిచారకునితో మాట్లాడడం ఓల్గ ఇవానొవ్నాకు వినిపించింది. సెలవు తీసుకోవడమూ, గొడవ జరగడమూ తప్పించుకోడానికి, అన్నిటికంటె ముఖ్యంగా తాను విగ్రహం కోల్పోయి యేడ్వడం పరిహరించడానికి, ఆమె ర్యాబొవ్‌స్కియ్ రాకముందే బూట్లు తొడుగులు తగిలించుకొని, వెళ్లిపోయింది. వీధిలో పడిన వెంటనే ఆమె స్వేచ్ఛగా వూపిరి పీల్చుకుంది. ర్యాబొవ్‌స్కియ్‌నీ, చిత్రకళనూ, స్టుడియోలో తాను అనుభవించిన దుర్భరమైన అవమాన భారాన్నీ శాశ్వతంగా కడిగేసుకున్నట్లు ఆమెకు అనిపించింది. యిది అంతం.

ఆమె తన దర్జీవద్దకు వెళ్లింది, తరువాత అప్పుడప్పుడే తిరిగివచ్చిన బర్నాయ్ వద్దకు వెళ్లింది, అక్కడినుండి సంగీతం దుకాణానికి వెళ్లింది. దారి పొడుగునా ఆమె ఆలోచిస్తూ వుండింది, ర్యాబొవ్‌స్కియ్‌కి నిర్లిప్తంగా, నిర్దాక్షిణ్యంగా, ఆత్మగౌరవ పూర్ణమైన ఉత్తరం రాయాలనీ, వసంతంలో గానీ, వేసవిలో గానీ దీమొవ్‌తో కలిసి క్రైమియాకు పోవాలనీ, అక్కడ పాత జీవితాన్ని శాశ్వతంగా విదిల్చేసుకుని కొత్త జీవితం ప్రారంభించాలనీ.

ఆమె యిల్లు చేరేటప్పటికి బాగా ఆలస్యమైంది. కానీ, బట్టలు మార్చుకోడానికి తన గదిలోకి వెళ్లకుండా, ఆమె ఉత్తరం రాయడానికి నేరుగా డ్రాయింగురూంలోకి వెళ్లింది. ర్యాబొవ్‌స్కియ్ తాను చిత్రకారిణి కాదని తనతో అన్నాడు, కసి తీర్చుకోడానికి యిప్పుడామె అతనితో అంటుంది, అతను ప్రతి యేడూ అదే చిత్రం చిత్రిస్తుంటాడనీ, ప్రతి రోజూ అవే విషయాలు చెప్తుంటాడనీ, అతను పతనంచెందినాడనీ, యిప్పటికి సాధించినదాన్ని మించి అతనింక యేమీ సాధించలేడనీ. తన సత్ప్రభావానికి అతను చాలా రుణపడివున్నాడనీ, యిప్పుడతని ప్రవర్తన బాగలేనందుకు కారణం యీనాడు చిత్రం వెనుక దాక్కున్న అప్రతిష్ఠపు జీవివంటివాళ్ల మూలంగా తన ప్రభావం కుంటుపడడమనీ ఆమె జోడించ దలచుకొంది.

''బుజ్జీ,'' దీమొవ్ తన పఠనాగారంనుండి పిలిచినాడు, తలుపు తెరవకుండా. ''బుజ్జీ!''

''యేం కావాలి?''

''నా దగ్గరికి రావద్దు బుజ్జీ, వాకిలి వద్దకు రా. ఆఁ, అంతే. నాకు నిన్ననో మొన్ననో ఆస్పత్రిలో డిఫ్తీరియా అంటుకుంది.... నాకేమీ బాగలేదు. కొరొస్తెలేవ్‌ను పిలిపించు.''

ఓల్గ ఇవానొవ్నా తన మిత్రులందరినీ పిలిచినట్లే మగణ్ణి యింటిపేరుతో పిలిచేది. అతని పేరు ఓసిప్, అది ఆమెకు యిష్టం లేదు, యెందుకంటే అది గొగోల్ పరిచారకుని పాత్ర అయిన ఓసిప్‌నూ, అర్‌హిప్ అనే పేరుతో ఆ శబ్దానికి గల సామ్యం మూలంగా యేర్పడిన చౌక హాస్యాన్నీ ఆమెకు జ్ఞాపకంచేసేవి. కానీ యిప్పుడామె కేకవేసింది:

"ఓ — ఓసిప్, నిజమా!"

"అతన్ని పిలిపించు. నాకేమీ బాగలేదు...." అన్నాడు దీమొవ్ గదిలోపలి నుండి. అతను సోఫాదాకా నడిచి, అక్కడ పండుకోవడం ఆమెకు వినిపించింది. "అతన్ని పిలిపించు." అతని గొంతు యెక్కడో పాతాళంలోనుండి వచ్చినట్లుంది.

"యిది నిజమా?" అనుకుంది ఓల్గ ఇవానొవ్నా. భయ కంపంతో ఆమె ఒళ్లు చల్లబడింది. "అది ప్రమాదకరమైన వ్యాధి."

యెందుకో తనకే తెలియకుండా ఆమె మైనపువత్తి వెలిగించి పడకగదిలోకి తీసుకపోయింది. యేమి చేయాలిసిందీ నిర్ణయించుకోడానికి ప్రయత్నిస్తుండగా ఆమెకు అద్దంలో తన రూపం కనిపించింది. పాలిపోయిన, భయం పులిమిన ముఖంతో, పప్పుల, పొట్టి చేతుల జాకెట్‌లో, స్కర్టుమీద విడ్డూరపు మూలల మూలల చారలతో తన రూపమే ఆమెకు ఘోరమైన వికారంగా, అసహ్యమైన జీవిగా కనిపించింది. దీమొవ్ పట్ల, తనొక తనమీద అతనికి గల అవధులు లేని ప్రేమ పట్లా, అతని తరుణ జీవితంపట్లా, చివరకు అతని ఒంటరి మంచంపట్ల కూడా — ఆ మంచంలో అతను పండుకొని చాలా కాలమైంది — ఆమెకు అంతు లేని జాలి కలిగింది. అతని నిత్య సాధు, విధేయ దరహాసం ఆమెకు జ్ఞాపకం వచ్చింది. ఆమె తీవ్రంగా యేడుస్తూ, కొరొస్తెలేవ్‌కు ప్రార్థనా పూర్వకమైన ఉత్తరం రాసింది. అప్పుడు రాత్రి రెండు గంటలైంది.

8

నిద్ర లేమి వలన భారమైన తలతో, దువ్వని జుట్టుతో, ముఖంమీద దోషి ముద్రతో, అతి సాదాగా కనపడుతూ, ఉదయం యేడు గంటల తర్వాత ఓల్గ ఇవానొవ్నా తన పడకగదిలోనుండి బయటికి వచ్చినప్పుడు ఒక నల్ల గడ్డం వ్యక్తి, డాక్టరై వుంటాడు, హాలులో ఆమెను దాటిపోయినాడు. అక్కడ మందుల వాసన వేస్తూ వుండింది. కొరొస్తెలేవ్ పఠనాలయంలో వాకిట్లో నిలబడి వుండినాడు, కుడిచేత్తో యెడమ మీసం మెలివేస్తూ.

"క్షమించండి, మిమ్మల్ని అతని వద్దకు వెళ్ల నివ్వను," కరకుగా అన్నాడు అతను ఓల్గ ఇవానొవ్నాతో. "మీకది అంటుకోవచ్చు. పైగా, మీరతని వద్దకు వెళ్లడంలో అర్థం లేదు. అతను అపస్మారకంలో వున్నాడు."

"అతనికి నిజంగా డిఫ్తీరియానా?" ఓల్గ ఇవానొవ్నా లోగొంతులో అడిగింది.

ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, "అనవసరంగా అపాయం కొనితెచ్చు కొనేవాళ్లను జైలుకు పంపాలి," అంటూ కొరొస్తెలేవ్ గొణిగినాడు, "అతనికెలా అంటుకుందో తెలుసా? డిఫ్తీరియా వున్న చిన్న కుర్రవాని గొంతులోని చీము అతను పీల్చినాడు. దేని కొరకు? వట్టి తెలివితక్కువ, బుర్రలేదు!"

"అది చాలా ప్రమాదకరమైందా?" ఓల్గ ఇవానొవ్నా అడిగింది.

"అవును. అతనికి జబ్బు తీవ్రంగా వుందని అంటున్నారు. మనం చేయవలసిం దేమిటంటే, డాక్టరు ష్రేక్‌ను పిలిపించడం."

పొడవు ముక్కూ, యూదు ఉచ్చారణా, యెర్ర జుట్టూ గల పొట్టి మనిషి వచ్చినాడు. తరువాత ముతక జుట్టు గల యెత్తైన, వంగిన మనిషి, మత గురువులా కనిపించేవాడు, వచ్చినాడు. తరువాత అంత వయసులేని, కళ్లద్దాలు గల, లావుపాటి, యెర్ర ముఖం మనిషి వచ్చినాడు. వాళ్లందరూ తమ సహచరుని మంచం పక్కన వంతులు వేసుకో డానికి వచ్చినారు. కొరొస్తెలేవ్ తన కావలి ముగిసిన తర్వాత యింటికి పోకుండా, ప్రేతంలా గదులు కలదిరుగుతూ వుండినాడు. పరిచారిక డాక్టర్లకు టీ చేసిపెడుతూ, నిత్యం మందుల దుకాణానికి పరుగెడుతూ వుండింది; కనుక యెవరూ గదులు శుభ్రం చేయలేదు. అంతా చాలా నిశ్శబ్దంగా, బిక్కు బిక్కుమంటూ వుండింది.

ఓల్గ ఇవానొవ్నా తన పడకగదిలో కూర్చొని, మగణ్ణి మోసగించినందుకు తనను భగవంతుడు శిక్షిస్తున్నాడని మనసులో అనుకుంది. యెన్నడూ విసుగు యెరగని యీ మౌన, నిగూఢ వ్యక్తి, సౌజన్యంచేత తన వ్యక్తిత్వం క్షీణించి, లొంగిపోయి, మితిమీరిన దయవలన బలహీనపడి, యిప్పుడు మౌనంగా బాధపడుతూ సోఫాలో పండుకొని వున్నాడు. అతను ఫిర్యాదులు చేసివుంటే, కనీసం సంధిలో ప్రలాపించి వుంటే, అతని బాధ డిఫ్తీరియా ఒక్కటే కాదని అతని పక్కన కావలి కాచే డాక్టర్లు తెలుసుకునేవాళ్లు. వాళ్లు కొరొస్తెలేవ్‌ను అడిగివుంటే వాళ్లకి అంతా తెలిసివుండేది, అతనికి అంతా తెలును. అసలు దుష్టశక్తి ఆమె అయినట్లూ, డిఫ్తీరియా కేవలం ఆమెకు సహాయకు రాలు అయినట్లూ, అతను తన మిత్రుని భార్యవైపు అలా చూసేది వురికే కాదు. వోల్గనదిమీది వెన్నెల రాత్రినీ, ప్రేమ వాగ్దానాలనూ, రైతు గుడిసెలోని కవితామయ జీవితాన్నీ ఆమె మరచిపోయింది, ఆమెకు జ్ఞాపకమున్నదల్లా అసహ్యమైన రొంపిలో తాను తలక్రిందులుగా దూకినానని, శుభ్రంగా కడిగేసుకోవడం తన కెన్నటికీ సాధ్యం కానిదనీ — అదైనా వట్టి చాపల్యంచేత, తృణప్రాయమైన వినోదం కోసం.

"నేనెంత బొంకులాడిని!" అనుకుంది ఆమె, తనకూ, ర్యాబొవ్‌స్కియ్‌కీ మధ్య వుండిన ఉద్విగ్న ప్రణయం జ్ఞాపకం వచ్చి. "అదంతా నాశనం కాను!"

నాలుగు గంటలకు ఆమె కొరొస్తెలేవ్‌తో కలిసి భోంచేసింది. అతను యేమీ

తినలేదు, మూతి విరుస్తూ కాస్త య్రైన్ మాత్రం తాగినాడు. ఆమె కూడా యేమీ తినలేదు. ఆమె మౌనంగా దేవుని ప్రార్థించింది, దీమొవ్ తేరుకుంటే, అతన్ని మళ్లీ ప్రేమిస్తానని, విశ్వాసం గల భార్యగా వుంటానని భగవంతునికి వాగ్దానం చేసింది. తరువాత, ఒక క్షణం తన బాధలు మరచిపోయి, ఆమె కొరొస్తెలేవ్‌ను చూసి ఆశ్చర్య పడేది: "ముఖం యింతలా ముడుతలు పడి మట్టు మర్యాద లేని ప్రవర్తనతో, యింత తృణప్రాయమైన, అనామక వ్యక్తిగా వుండడం యెంత విసుగో!" మళ్లీ వెంటనే ఆమెకు అనిపించేది, వ్యాధి అంటుకుంటుందన్న భయంతో తాను మగని పఠనాగారంలోకి ఒక్కసారైనా పోనందుకు భగవంతుడు యీ క్షణమే తన్ను కూల్చేస్తాడని. యిప్పుడామె మనసునిండా వుండింది కరకు వ్యథా, తన జీవితం నాశనమై, దిద్దడానికి వీలులేనంతగా భ్రష్టుపట్టిందన్న నమ్మకమూ.

భోజనం ముగించిన కాసేపట్లో చీకటిపడింది. ఓల్గ ఇవానొవ్నా డ్రాయింగురూంలోకి పోయినప్పుడు, కొరొస్తెలేవ్ సోఫాలో పండుకొని, బంగారు దారంతో కుట్టుపని చేసిన సిల్కు దిండుమీద తల పెట్టి "హుమ్వా, హుమ్వా," అని గురకలు పెడుతూ, నిద్రపోతూ వుండినాడు.

డాక్టర్లు రోగివద్దకు వస్తూ పోతూ యీ క్రమభంగాలను గమనించలేదు. డ్రాయింగు రూంలో గురకలు పెట్టే వింత మనిషీ, గోడల మీద చిత్రాలూ, విద్దూరపు ఫర్నీచరూ, తల దువ్వుకోకుండా, నలిగిన బట్టలతో యింట్లో తిరిగే యజమానురాలూ, యివన్నీ యిప్పుడు యేమాత్రమూ ఆసక్తి కలిగించేవిగా లేవు. ఒక డాక్టరు యెందుకో నవ్వినాడు, ఆ నవ్వు వింతగా వుండింది, అది అందరినీ అస్వస్థ చిత్తులను చేసేటట్టు వుంది.

ఓల్గ ఇవానొవ్నా మళ్లీ డ్రాయింగురూంలోకి పోయినప్పుడు, కొరొస్తెలేవ్ లేచి, సోఫామీద కూర్చొని, సిగరెట్టు తాగుతూ వుండినాడు.

అతను మెల్లగా అన్నాడు: "డిఫ్తీరియా అతని నాసా పుటాల్లో స్థిరపడింది. గుండెకు అప్పుడే బరువు కనపడుతున్నది. పరిస్థితి బాగలేదు."

"డాక్టరు ష్రేక్‌ను యెందుకు పిలిపించరు?" ఓల్గ ఇవానొవ్నా అడిగింది.

"పిలిపించినాము. అతనే గమనించింది డిఫ్తీరియా ముక్కు కెక్కిందని. యింతకూ ష్రేక్ యెవరు? ష్రేక్ అంటూ యెవరూ లేరు, నిజంగా. అతను ష్రేక్, నేను కొరొస్తెలేవ్, అంతే."

కాలం బాధాకరమైనంత మెల్లగా గడిచింది. ఓల్గ ఇవానొవ్నా దుస్తులతోనే, ఉదయంనుంచి పర్చకుండా అలానే వున్న మంచంమీద తూగుతూ పడివుంది. యిల్లంతా, నేలనుండి కప్పుదాకా, పెద్ద యినప దిమ్మెతో నిండినట్లు కనిపించింది; యీ దిమ్మెను తొలగిస్తే అందరికీ ఉల్లాసం కలుగుతుందని ఆమెకు అనిపించింది. ఉలిక్కిపడి లేచి,

అది యినప దిమ్మె కాదనీ, దీమొవ్ వ్యాధి అనీ, ఆమె గుర్తుకు తెచ్చుకుంది.

మళ్లీ తూగుతూ, ఆమె అనుకుంది: "ప్రకృతి చిత్రం.... చిత్రం.... పాత్రం.... ప్రేక్ యెవరు? ప్రేక్, ప్రెక్.... రెక్.... ప్రెక్. నా మిత్రులందరూ యెక్కడున్నారు? మేము యిబ్బందిలో వున్నామని వాళ్లకు తెలుసా? భగవంతుడా, మమ్మల్ని రక్షించు, కనికరించు.... ప్రేక్, ప్రెక్...."

మళ్లీ యినప దిమ్మె.... కింది అంతస్తులో గోడ గడియారం యెప్పుడూ గంటలు కొట్టినట్లే వున్నప్పటికీ క్షణమొక యుగంలా భారంగా గడుస్తోంది కాలం. మాటి మాటికీ వాకిలిగంట మోగుతూవుండింది, దీమొవ్ కొరకు డాక్టర్లు వస్తూవుండినారు.... ప్లేటుమీద ఖాళీ గ్లాసుతో పరిచారిక గదిలోకి వచ్చింది.

"మీ పడక సర్దనా అమ్మగారూ?" అడిగింది ఆమె.

జవాబు లేకపోవడంతో ఆమె మళ్లీ వెళ్లిపోయింది. కింది అంతస్తులోని గడియారం గంటలు కొట్టింది. వోల్గనదిమీద వర్షం పడుతున్నట్లు ఓల్గ ఇవానొవ్నాకు కల వచ్చింది. మళ్లీ యెవరో గదిలోకి వచ్చినారు, కొత్తవాళ్ల లాగుంది. కానీ మరు క్షణమే ఆమె కొరొస్తెలేవ్‌ను గుర్తుపట్టి, మంచంమీద లేచికూర్చుంది.

"యెంత పొద్దయింది?" అని అడిగింది ఆమె.

"సుమారు మూడు."

"అత నెలా వున్నాడు?"

"యెలా వుండడమేమిటి? ప్రాణం పోతోందని చెప్పడానికి వచ్చినాను."

అతను వెక్కిళ్లు దిగమింగినాడు, ఆమె పక్కన మంచంమీద కూర్చొని, కన్నీళ్లు తుడుచుకున్నాడు. ఆమెకు మొదట బుర్ర కెక్కలేదు, కానీ వెంటనే హఠాత్తుగా స్తంభించిపోయి, మెల్లగా శిలువ గుర్తు వేసుకుంది.

"చచ్చిపోతున్నాడు," అతను మళ్లీ అన్నాడు బిగ్గరగా, మళ్లీ వెక్కిళ్లు పెట్టి నాడు. "తన్ను తాను బలిచేసుకున్నాడు గనుక చచ్చిపోతున్నాడు. శాస్త్ర విజ్ఞానానికి యెంత నష్టం!" వ్యథతో అతను మాటలు నొక్కి పలికినాడు. "మా అందరితో పోలిస్తే అతను గొప్పవాడు, మేలిమి బంగారం. యెంత ప్రజ్ఞ! మా అందరిలో యెన్ని ఆశలు రగిలించినాడు!" నొసలు బాదుకుంటూ కొరొస్తెలేవ్ కొనసాగించినాడు. "భగ వంతుడా — అతను గొప్ప శాస్త్రజ్ఞు డయ్యేవాడు, అపురూపమైన శాస్త్రజ్ఞు డయ్యేవాడు! ఓసిప్ దీమొవ్, ఓసిప్ దీమొవ్, యెంత పని చేసినావ్? భగవంతుడా!"

వేదనతో, కొరొస్తెలేవ్ రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు.

"యెంత మహానుభావుడు!" అతనికి యెవరిమీదనో కోపం పెరుగుతున్నది. "యెంత స్వచ్ఛమైన, స్ఫటికం లాంటి హృదయం! మనుషులమీద యెంత దయ! యెంత ఆపేక్ష! శాస్త్ర విజ్ఞానానికి సేవచేస్తూ, ఆ సేవలోనే మరణించినాడు. యెద్దులా పనిచేసి

నాడు, రేయింబగళ్లు, యెవరూ అతన్ని పాపమనలేదు. యువకుడు, వ్యుత్పన్నుడు, రేపో మాపో ప్రొఫెసర్ కావలసినవాడు, ప్రైవేటు ప్రాక్టీసు కోసం చూడవలసివచ్చింది, రాత్రిళ్లు మేలుకొని అనువాదాలు చేయవలసివచ్చింది — వీటి కోసం, యీ దౌర్భాగ్యపు తుంపుల కోసం!"

కొరొప్తైలేవ్ ఓల్గ ఇవానొవ్నా వైపు యేహ్యాభావంతో చూసి, దుప్పట్ని రెండు చేతులతో పట్టుకొని, ఆగ్రహంగా చించివేసినాడు, తప్పంతా దానిదైనట్లు.

"తన్ను తాను జాలితలచలేదు, యెవరూ అతన్ని జాలితలచలేదు. యీ మాటలతో యేం లాభం?"

"అవును, అతను మేలిమి బంగారం" యెవరో డ్రాయింగురూంలో గంభీర కంఠంతో అన్నారు.

ఓల్గ ఇవానొవ్నా అతనితో తాను కలిసి జీవించిన జీవితమంతా, మొట్టమొదటినుండి, స్వల్ప వివరాలు మొదలుకొని నెమరువేసుకుంది. తనకు తెలిసిన వాళ్లందరితోనూ పోలిస్తే, అతను విశిష్ట వ్యక్తి అని, అపురూపమైన వ్యక్తి అని, మహాపురుషుడని, ఆమెకు హఠాత్తుగా మనసుకి తట్టింది. అతనిపట్ల స్వర్గస్థుడైన తన తండ్రి వైఖరీ, అతని సహచరులందరి వైఖరీ జ్ఞాపకంచేసుకొని, వాళ్లందరూ అతన్ని భావి ప్రసిద్ధ పురుషునిగా చూడడం, ఆమె గుర్తించింది. గోడలూ, కప్పూ, లాంపూ, నేలమీద రత్న కంబళీ అన్నీ ఆమెవైపు యెకసెక్కెపు చూపులు చూసినాయి, "అవకాశం జారవిడుచుకున్నావ్!" అని ఆమెతో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లు. ఆమె యేడుస్తూ పడకగదిలోనుండి బయటికి వురికింది, డ్రాయింగురూంలో యెవరినో కొత్త మనిషిని దాదాపు ఢీకొని, పఠనాగారం లోని భర్తవద్ద వాలింది. అతను సోఫాలో నిశ్చలంగా పండుకొని వున్నాడు, నడుముదాకా దుప్పటి వుంది. అతని ముఖం దారుణంగా ముడుతలు పడి, చిక్కిపోయి వుంది; పసుపు మించిన బూడిద చాయ ముఖానికి వచ్చింది. బతికివున్నవాళ్లలో యెప్పుడూ కనిపించదు అలాంటిది. అతని నుదురూ, నల్లని కనుబొమలూ, మామూలు చిరునవ్వూ మాత్రమే అతను దీమొవ్ అని తెలియజేస్తున్నాయి. ఓల్గ ఇవానొవ్నా అతని రొమ్మూ, నుదురూ, చేతులూ వడివడిగా తాకింది. రొమ్ము యింకా వెచ్చగా వుంది, నుదురూ, చేతులూ విపరీతమైనంత చల్లగా వున్నాయి. అరమూత పడిన కన్నులు నిలజూస్తున్నాయి, ఓల్గ ఇవానొవ్నావంక కాదు, దుప్పటివంక.

"దీమొవ్! దీమొవ్!" ఆమె బిగ్గరగా పిలిచింది.

జరిగిందంతా పొరపాటనీ, యింకా సర్వమూ నష్టమైపోలేదనీ, జీవితం మనోహరంగా, సంతోషమయంగా వుండే అవకాశం యింకా వుందనీ, అతను విశిష్టమైన వ్యక్తి అనీ, అపురూపమైన వ్యక్తి అనీ, మహాపురుషుడనీ, తాను అతన్ని జీవితమంతా

ఆరాధిస్తానని, అతనిముందు మోకరిల్లుతానని, అతనిపట్ల పవిత్ర భక్తిభావం కలిగి వుంటానని ఆమె అతనికి వివరించా లనుకుంది.

"దీమొవ్!" అంటూ అతని భుజం పట్టుకొని వూపుతూ ఆమె పిలిచింది, అతనిక యెప్పటికీ లేవడని ఆమెకు నమ్మకం కలగడం లేదు. "దీమొవ్, దీమొవ్, యిటుచూడు!"

డ్రాయింగురూంలో కొరొస్తెలేవ్ పరిచారికతో చెప్తూవుండివాడు:

"అడిగేదేముంది? చర్చి వద్దకు పోయి, శరణాలయం స్త్రీలు యెక్కడ వుండేదీ అడుగు. వాళ్లు శవాన్ని శుభ్రంచేసి, అన్నీ చక్కబెడతారు — చేయవలసిందంతా వాళ్లు చేస్తారు."

1892

ఇయోనిచ్

1

ఆ పట్టణానికి కొత్తగా వచ్చినవాళ్ళు అక్కడి జీవితం విసుగుగా, రోకటిపాటగా వుంటుందని ఫిర్యాదుచేస్తారు. కాని అది చాలా ఆసక్తికరమైన పట్టణమనీ, అక్కడ గ్రంథాలయమూ, నాటకశాలా, క్లబ్బూ వున్నాయనీ, నృత్య పార్టీలు జరుపుతారనీ, యింకా గొప్ప సంగ, తెలివితేటలు ఉట్టిపడుతూ ఆసక్తికరంగా, ఆహ్లాదకరంగా వుంటాయి అక్కడి కుటుంబాలనీ వాటితో పరిచయం చేసుకోవచ్చుననీ, అక్కడి పాత కాపురస్తులు దాని సద్గుణాలను పేర్కొనే వాళ్ళు. సమస్త సంస్కృతికీ, ప్రతిభకూ ఉదాహరణగా వాళ్ళు తూర్కిన్ కుటుంబాన్ని పేర్కొనేవాళ్ళు.

తూర్కిన్ కుటుంబం పెద్ద వీధిలో గవర్నర్ యింటి పక్కన వాళ్ళ సొంత ఇంట్లో వుంటుంది. ఆ కుటుంబ యజమాని నల్ల జుట్టూ, జులపాలూ గల లావుపాటి, అందమైన ఇవాన్ పెత్రోవిచ్ తూర్కిన్. అతను ధర్మకార్యార్థం నాటకాలు వేయించేవాడు, వాటిలో వృద్ధ సేనానాయకుల పాత్రలు వేసేవాడు, మహా నవ్వు పుట్టించేటట్లు దగ్గేవాడు. అతని పొట్టనిండా కథలూ, యక్షప్రశ్నలూ, సామెతలూ వుండినాయి, అతనికి హాస్యోక్తులంటే ప్రీతి; నిజానికతను మంచి చమత్కారి; అతని ముఖం చూసి అతను హాస్యమాడేదీ, నిజమాడేదీ కనుక్కోవడం అసాధ్యం. అతని భార్య వేర యోసిఫొవ్నా బక్కపలచని మనిషి, ముచ్చటగా వుంటుంది ఆమె ముఖం. ఆమె కండ్లద్దాలు పెట్టుకునేది, కథలూ, నవలలూ రాసేది, యెవరొచ్చినా వాటిని చదివి వినిపించడానికి యెప్పుడూ సిద్ధంగా వుండేది. యెకతెరీనా ఇవానొవ్నా అని, వాళ్ళకొక కూతురు వుండింది. ఆ యువతి పియానో వాయించేది. అనగా, కుటుంబంలో ప్రతి వొకరికీ యేదో ఒక ప్రజ్ఞ వుందన్నమాట. తూర్కిన్‌లు అతిథిసత్కారానికి మారుపేరు; వాళ్ళు తమ ప్రజ్ఞలను తేలికగా, నిష్కపటమైన సరళత్వంతో ప్రదర్శించేవాళ్ళు. పెద్ద, రాతి మిద్దె వేసవిలో యెప్పుడూ చల్లగా వుండేది; దాని వెనక కిటికీలు నీడలు నిండిన పాత తోటలోకి వుండేవి; వసంతంలో ఆ తోటలో కోకిలలు పాడేవి. యింట్లో అతిథులు వున్నప్పుడు,

వంటయింట్లో పదును పెట్టే కత్తుల చప్పుడుతో యిల్లంతా మార్మోగేది, రాత్రికి రాజ భోజనం వుంటుందని చాటిస్తూ, వేయించిన ఉల్లిపాయల వాసనతో తోటంతా గుమాళించేది.

కొత్తగా జేమ్స్త్వో* మెడికల్ ఆఫీసర్‌గా నియమితుడైన ద్మీత్రి ఇయోనిచ్ స్తార్త్సెవ్ ఆ పట్టణానికి ఆరు మైళ్ల దూరాన వున్న ద్యలీజ్‌లో మకాం పెట్టిన వెంటనే అతనితో చెప్పినారు, సంస్కారవంతుడుగా అతను తూర్కిన్‌లతో తప్పక పరిచయం చేసుకోవాలని. చలికాలంలో ఒక రోజు అతనికి వీధిలో ఇవాన్ పెత్రోవిచ్‌ని యెవరో పరిచయంచేసినారు. వాళ్లు వాతావరణాన్నీ, నాటకాలమూ, కలరానూ గురించి మాట్లాడుకున్నారు, మాటలవెంట ఆహ్వానం వచ్చింది. వసంతకాలంలో వచ్చే చర్చి సెలవుల్లో ఒక రోజు — ఆ రోజు అసెన్షన్ — అతను రోగులనందరినీ చూసిన తర్వాత, మానసికోల్లాసం కొరకూ, పనిలో పనిగా కొన్ని వస్తువులు కొనడానికీ పట్టణానికి బయలుదేరినాడు. తీరికగా అడుగులు వేస్తూ, దారి పొడుగునా కూనిరాగాలు తీస్తూ అతను కాలి నడకన పోయినాడు (అతనింకా పొంతబండి పెట్టుకోలేదు):

"జీవిత ఘషకంలో కన్నీళ్లను నే చవిచూడక మునుపే."

అతను పట్టణంలో భోంచేసినాడు, పార్కులో షికారు చేసినాడు, ఇవాన్ పెత్రోవిచ్ ఆహ్వానం సంగతి జ్ఞాపకం రాగా, తూర్కిన్‌లు యెలాంటి మనుషులో వెళ్లి చూపొద్దామని నిశ్చయించుకున్నాడు.

"నమస్తే! న్నమస్తే!" అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్, వరండాలో అతన్ని కలుసుకొని. "మీకు స్వాగతం యిచ్చే భాగ్యం కలిగింది. లోపలికి రండి, మా ఆవిడని మీకు పరిచయం చేస్తాను." భార్యకు డాక్టర్‌ను పరిచయం చేసిన తర్వాత అతను చెప్పుక పోయినాడు: "వేరా, నేనీయనతో అంటున్నదేమిటంటే, ఆస్పత్రికే అంటుక పోవడానికి యీయనకే హక్కూ లేదని. తన తీరిక సమయాన్ని పదిమందికీ ప్రసాదించడం ధర్మం ఈయనకు. యేమంటావ్ ప్రియా, నే నన్నది నిజమేనా?"

"యిలా కూర్చోండి" అంటూ వేర యోసిఫొవ్నా తన పక్కనున్న కుర్చీ చూపించింది. "మీరు నాతో సరసాలాడవచ్చు. నా భర్తకు ఒథెల్లో కున్నంత యీర్ష్య. అయినా, మనం వెనకా ముందూ చూసుకుంటుందాం. సరేనా?"

"చిలిపి దయ్యం!" అని ఇవాన్ పెత్రోవిచ్ మృదువుగా గొణిగి, ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు. "మీరు మంచి సమయానికి వచ్చినారు," అన్నాడు అతను మళ్లీ అతిథివైపు తిరిగి. "మా ఆవిడ ఒక బృహత్తరమైన గొప్ప నవల యిప్పుడే ముగించింది, యీ సాయంత్రం మనకు వినిపించబోతున్నది."

---

* స్థానిక స్వపరిపాలన సంస్థ. — సం.

"జీన్, బంగారూ" అన్నది వేర యోసిఫొవ్నా మగనితో. "Dites que l'on nous donne du thé."*

స్తార్త్సెవ్‌ని తరువాత యెకతెరీనా ఇవానొవ్నాకు పరిచయం చేసినారు. ఆమె పద్దెనిమిదేండ్ల పడుచు, అచ్చు గుద్దినట్లు తల్లి పోలిక. అలాగే బక్కపలుచగా, అలాగే ముచ్చటైన ముఖంతో వుంటుంది. సుకుమారమైన, నాజూకైన శరీరంతో ఆమె యింకా చిన్నపిల్లలా కనిపించింది. అప్పటికే వికసించడం ప్రారంభించిన ఆమె రొమ్ము లలో, ఆ కన్నెతనపు రొమ్ముల అందంలో, ఆరోగ్య సంపదలో, వసంతం, అచ్చమైన వసంతం, స్ఫురించింది. తరువాత వాళ్లు జామ్, తేనె, మిఠాయీ, నోట్లో పెట్టుకుంటే కరిగిపోయే అద్భుతమైన బిస్కట్లూ కలిపి, టీ తాగడానికి కూర్చున్నారు. చీకటి పడ బోతుండగా అతిథులు ఒకరొకరే రాసాగినారు. ఇవాన్ పెత్రోవిచ్ చిరునవ్వు తొణికిసలాడే కన్నులతో వాళ్లందరికీ "నమస్తే! న్నమస్తే!" చెప్పినాడు.

అందరూ వచ్చిన తరువాత, వాళ్లందరూ గంభీరమైన ముఖాలతో డ్రాయింగు రూంలో ఆసీనులైనారు, వేర యోసిఫొవ్నా తన నవల చదివింది. "పొపిష్ఠి చలిగా వుండింది...." అన్న మాటలతో నవల ప్రారంభమైంది. కిటికీలు బార్ల తెరచి వుండి నాయి, వాటిగుండా వంటగదిలో ఖంగు ఖంగుమనే కత్తుల శబ్దమూ, వేయించిన ఉల్లిపాయల వాసనా వస్తూవుండినాయి.... డ్రాయింగురూంలోని మసక వెలుతురులో సోమరితనంగా మినుకు మినుకుమనే దీపాలకింది, మెత్తని కుర్చీలలో కూర్చొనివుండడం ప్రశాంతంగా వుంది. యీ వేసవి సాయంసంధ్యలో, వీధిలోనుండి కంఠధ్వనులూ, నవ్వులూ వినవస్తూవుండగా, లైలాక్ పూల పరిమళం తోటలోనుండి తేలివస్తూవుండగా, "పొపిష్ఠి చలిగా వుండింది" అనీ, సాయం సూర్యుని చల్లని కిరణాలు మంచు కప్పిన మైదానాన్నీ, ఒంటరి బాటసారినీ వెలిగిస్తూ వుంటాయనీ మనసు కెక్కడం కష్టం. వాస్తవ జీవితంలో యెన్నడూ జరగని వాటిని వర్ణిస్తూ, అందమైన పడుచు కౌంటెస్ తన గ్రామంలో పాఠశాలలూ, వైద్యశాలలూ, గ్రంథాలయాలూ పెట్టించిందనీ, దేశదిమ్మరి చిత్ర కారుని ప్రేమించిందనీ వేర యోసిఫొవ్నా చదివింది. వినేవాళ్ల మనసులో ప్రశాంత, ఆహ్లాదకర ఆలోచనలు మెదలుతూ వుండగా, ఆమె పఠనం వినడం యెంత హాయిగా, మనఃప్రియంగా వుండిందంటే, యెవరికీ లేవాలనిపించలేదు....

"నాస్తి పరవా!" అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్ మృదువుగా.

మనసు యెక్కడో అతి దూరాన పెట్టుకొని వింటూ వుండిన ఒక అతిథి వినపడీ వినపడనట్లు మెల్లగా అన్నాడు:

"ఆఁ, అవును...."

---

* ఫ్రెంచి భాషలో 'మనకు టీ తెప్పించమని చెప్పండి.' — సం.

ఒక గంట గడిచింది, మరొక గంట గడిచింది. సమీపంలోని పార్కులో జంత్ర సమ్మేళనం వినబడుతూ వుండింది. వేర యోసిఫొవ్నా తన రాత పుస్తకం మూసి పెట్టినప్పుడు, అయిదు నిముషాల సేపు యెవరూ మాట్లాడలేదు — అందరూ గాయిక సమ్మేళనం పాడే జానపద పాటను వింటూవుండినారు, నవలలో లేనిదీ, వాస్తవ జీవితమూ ఆ పాటలో వాళ్లకు లభించింది.

"మీ రచనలు పత్రికల్లో ప్రచురిస్తారా?" స్తార్‌త్సెవ్ అడిగినాడు వేర యోసిఫొవ్నాను.

"లేదు," అన్నది ఆమె సమాధానంగా. "బొత్తిగా ప్రచురించను. నేను వాటిని రాసి, పెట్టెలో పడేస్తాను. యెందుకు ప్రచురించాలి? మాకు తిండికీ బట్టకీ లోటు లేదు" ఆమె వివరణ యిచ్చింది.

యెందుకో అందరూ నిట్టూర్చినారు.

"కిట్టీ, యిక కొంత సంగీతం వినిపించు," అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్ కూతురుతో.

పియానో మూత యెత్తేరు. సంగీతం పుస్తకాలు అక్కడే సిద్ధంగా వుండినాయి, జంత్రం తెరిచేరు. యెకతెరీనా ఇవానొవ్నా కూర్చొని రెండు చేతులతో మెట్లు నొక్కింది. శక్తికొద్దీ ఆమె మళ్లీ వాటిని నొక్కింది, మళ్లీ మళ్లీ నొక్కింది. ఆమె భుజాలూ, రొమ్ములూ కంపించినాయి. వాటిని పియానో లోపలికి దిగగొట్టిందాకా మానుకొనే ఉద్దేశం లేనట్లు, పట్టుదలతో ఆమె అదే మెట్లు నొక్కుతూ వుండింది. డ్రాయింగు రూం గర్జనతో నిండిపోయింది; అన్నీ గర్జించినాయి — నేలా, కప్పూ, ఫర్నిచర్.... యెకతెరీనా ఇవానొవ్నా క్లిష్టమైన గమకం వాయించింది; దాని విలువ అంతా దానిని వాయించడంలోని కష్టంలో వుంది. అది దీర్ఘంగా, రోకటిపాటలాగ వినుగుగా వుండింది. యెకతెరీనా ఇవానొవ్నా అతనికి మహా ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, అది వింటూవున్నప్పుడు స్తార్‌త్సెవ్‌కు పెద్ద పర్వత శిఖరంనుండి శిలలు కిందికి దొర్లుతున్న చిత్రం మనోనేత్రం ముందు నిలిచింది; శిలలు ఒకదానివెంట ఒకటి దొర్లుతూనే వుండినాయి; అవి ఆగితే బాగుండుననిపించింది అతనికి. బలంగా, చురుకుగా, శ్రమతో యెరుపెక్కిన బుగ్గలతో, నుదుటిమీద పడుతున్న ఒక పాయ ముంగురులతో ఆమె అతనికి మహా ఆకర్షణీయంగా కనిపించింది. రోగుల మధ్యా, రైతుల మధ్యా ద్యలీజ్‌లో ఒక శీతకాలం గడిపిన తర్వాత, డ్రాయింగురూంలో కూర్చోవడం చాలా హాయిగా వుండింది, పడుచుదనమూ, నాజూకూ గల యీ జీవిని, పరిశుద్ధమైనదని పనిగట్టుకు వేరే చెప్పనక్కరలేని జీవిని, చూస్తూ, యీ వినుగు కలిగించే పెద్ద ధ్వనులను, అయినా సంస్కారవంతమైన వాటిని, వింటూ....

ఆమె ముగించి, లేచి నిలబడగానే, ఆమె తండ్రి ఇవాన్ పెత్రోవిచ్, నీళ్లు తిరిగిన కన్నులతో, "కిట్టీ, యీ రోజు మరీ అద్భుతంగా వుంది," అన్నాడు. "నువ్వు చచ్చినా యింతకంటె బాగా వాయించలేవు."

అభినందిస్తూ, ఆశ్చర్యపడుతూ, తమ జన్మలో యిలాంటి సంగీతం వినలేదని ప్రమాణం చేస్తూ, అందరూ ఆమె చుట్టూ చేరినారు. ముఖంమీద రేఖామాత్రమైన చిరునవ్వుతో, సర్వాంగాలలోనూ వ్యక్తమయ్యే విజయానందపు తన్మయత్వంతో, అన్నీ ఆమె మౌనంగా విన్నది.

"అద్భుతం! అమోఘం!"

స్తార్త్సెవ్ కూడా, ఆ ఉత్సాహపు వాతావరణానికి లొంగిపోయి, "అమోఘం!" అని అన్నాడు. "యెక్కడ నేర్చుకున్నారు? సంగీత కళాశాలలోనా?" అని అడిగినాడు అతను యెకతెరీనా ఇవానొవ్నాను.

"లేదు, సంగీత కళాశాలకు పోవాలనుకుంటున్నాను. యీలోగా యిక్కడే మదాం జవ్లోవ్స్కయావద్ద పాఠాలు చెప్పించుకుంటున్నాను."

"యిక్కడ హైస్కూలు చదువు ముగించినారా?"

"ఓ, లేదు" ఆమె తరవున తల్లి నేర యోసిఫొవ్నా జవాబు చెప్పింది. "యింటి వద్ద పంతుళ్లను పెట్టించినాము. మీకు తెలుసుగా, హైస్కూలులోనూ, బోర్డింగు స్కూలులోనూ చెడ్డ సావాసాలు వుంటాయి. ఆడపిల్ల పెరిగేటప్పుడు తల్లి ఒద్దికలో తప్ప యెవరి ఒద్దికలోనూ వుండకూడదు."

"కానీ, నేను సంగీత కళాశాలకు వెళ్లాలనుకుంటున్నాను," అన్నది యెకతెరీనా ఇవానొవ్నా.

"ఓయ్, లేదు. మా కిట్టీకి అమ్మంటే ప్రాణం. మా కిట్టీ అమ్మకూ, నాన్నకూ దుఃఖం కలిగించదు."

"నేను వెళ్తాను, వెళ్తాను!" అన్నది యెకతెరీనా ఇవానొవ్నా పరిహాసపు అలకతో, కాలు నేల తాటిస్తూ.

రాత్రి భోజనం వేళ విద్యాప్రదర్శన చేసే వంతు ఇవాన్ పెత్రోవిచ్‌ది. అతను కండ్లతో మాత్రమే నవ్వుతూ కథలూ, చతురోక్తులూ చెప్పినాడు, హాస్యకరమైన సమస్యలు యిచ్చి, తానే విప్పినాడు, నిత్యం తన సొంత వింత భాషలో మాట్లాడుతూ. అతను తన దీర్ఘ వాక్చమత్కారపు సాధనలో అలవరచుకొన్న భాష అది, యిప్పుడతనికి అలవాటుగా మారినట్లున్న భాష: అద్భుతోఘం, వాస్తి వరవా, పవినయ పంపన్నంగా కృతజ్ఞణ్ణి.

అంతటితో అయిపోలేదు. అతిథులు, తృప్తులై, పంతుష్టులై, తమ కోట్ల కొరకూ, చేతికర్రల కొరకూ హాలులో మూగినప్పుడు, పొట్టి క్రాపూ, పూదు బుగ్గలూ గల పద్నాలుగేండ్ల నౌకరు కుర్రవాడు పావెల్ — అందరూ అతన్ని పావా అంటారు వాళ్ల చుట్టూ తచ్చాడుతూ వుండినాడు.

"పావా, యేదీ, చూపించు!" అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్.

పావా ఒక భంగిమలో నిలబడి, ఒక చేయి యెత్తి, విషాద కంఠంతో ఉచ్చరించినాడు:

"వశించు, దుఃఖిత వనితా!"

అందరికీ నవ్వు వచ్చింది.

"వినోదకరం!" అనుకుంటూ స్తార్త్సెవ్ బయటికి పోయినాడు.

అతను బీరు తాగడానికి రెస్టారెంటుకు వెళ్లినాడు, తరువాత ద్యలీజ్‌కు నడుచు కుంటూ పోయినాడు. దారి పొడుగునా అతను గొంతులో రాగం తీసుకుంటూ వెళ్లినాడు:

"నీ మృదు కంఠధ్వని నయగారంలో...."

ఆరు మైళ్ళ నడిచి అతను పడకమీద చేరేటప్పటికి అణుమాత్రమూ ఆయాసము నిపించలేదు; యింకొక ఆరుమైళ్ళ హాయిగా నడవగలనని అతను అనుకున్నాడు.

"వాస్తి పరవా!" అన్న మాట అతనికి జ్ఞాపకం వచ్చి, నవ్వుకుంటూ నిద్రలో మునిగినాడు.

2

స్తార్త్సెవ్ మళ్లీ తూర్కిన్‌ల యింటికి వెళ్లిరావాలని అనుకుంటూనే వుండినాడు; కానీ ఆస్పత్రిలో పని యెక్కువై అతనికి యెప్పుడూ ఒకటి రెండు గంటలు కూడా తీరిక దొరకలేదు. యిలా పనిలో, ఒంటరితనంలో యేడాదికి పైగా గడిచింది. ఒకనాడు పట్టణంనుండి అతనికి నీలం కవరులో జాబు వచ్చింది....

వేర యోసిఫొవ్నాకు చాలా కాలంగా అప్పుడప్పుడు తలనొప్పి వస్తూవుండింది; కానీ, కిట్టీ సంగీత కళాశాలకు వెళ్తానని రోజూ మారాం చేయడంతో, అది మరీ తరుచుగా రాసాగింది. పట్టణంలోని డాక్టర్లందరూ ఆమెకు చికిత్స చేసినారు, చివరకు జేమ్స్త్వో డాక్టరు వంతు వచ్చింది. వచ్చి తన బాధ తొలగించమని, వేర యోసిఫొవ్నా అతనికి ఆర్ద్రమైన ఉత్తరం రాసింది. స్తార్త్సెవ్ వెళ్లినాడు, అది మొదలు తరుచుగా, అతి తరుచుగా తూర్కిన్‌ల యింటికి వెళ్లసాగినాడు.... అతను నిజంగా వేర యోసిఫొవ్నాకు కొద్దిగా గుణం కలిగించినాడు. అతను అసాధారణమైన, పరమాద్భుతమైన డాక్టర్ అని ఆమె తన యింటికి వచ్చేవాళ్లందరితోనూ చెప్పింది. కానీ అతనిప్పుడు తూర్కిన్‌ల యింటికి వెళ్లేది ఆమె తలనొప్పి మూలంగా కాదు.

ఆ రోజు సెలవు దినం. యెకతెరీనా ఇవానొవ్నా పియానోమీద విసిగించే దీర్ఘసాధన ముగిసింది. అందరూ టీ తాగుతూ భోజనశాలలోని పెద్ద టేబుల్‌వద్ద కూర్చున్నారు. ఇవాన్ పెత్రోవిచ్ వినోదకరమైన కథ మధ్యలో వుండగా, వాకిలి గంట మోగింది; యెవరు వచ్చారో చూడ్డానికి అతను లేచి వెళ్లవలసి వచ్చింది. స్తార్త్సెవ్ ఆ క్షణ కాలపు గడబిడను ఆసరాగా తీసుకొని, తీవ్రంగా ఆందోళన చెందుతూ యెకతెరినా ఇవానొవ్నా చెవిలో మెల్లగా చెప్పినాడు:

"నన్ను హింసించవద్దు, మీకు పుణ్య ముంటుంది. తోటలోకి వెళ్దాం పద."

ఆమె ఆశ్చర్యపడినట్లూ, అతను కోరేదేమిటో అర్థం కానట్లూ భుజాలు కుదిపింది; కానీ, లేచి బయటికి వెళ్లింది.

ఆమెవెంట నడుస్తూ అతను చెప్పినాడు: "మీరు మూడు నాలుగు గంటలు సాధన చేస్తారు, తరువాత మీ అమ్మ దగ్గర కూర్చుంటారు. మీతో మాట్లాడడానికి యెవ్వరూ అవకాశమే వుండదు. నాతో పది నిముషాలు వుండండి, మీకు పుణ్యముంటుంది!"

ఆకురాలు కాలం సమీపిస్తూ వుండింది. పాత తోట నిశ్చలంగా, విచారపూరితంగా వుండింది. కాలి బాటలనిండా ఆకులు పడివుండినాయి. పగటి పొద్దు తగ్గుతూ వుండింది.

"మిమ్మల్ని చూడక వార మైంది," అంటూ స్తార్త్సెవ్ కొనసాగించినాడు. "అది నాకెంత యాతనగా వుందో తెలుసా! కాసేపు కూర్చుందాం. మీతో మాట్లాడాలి."

విస్తారమైన కొమ్మలు గల పాత మేపుల్ చెట్టుకింద బెంచీ వుంది – తోటలో అది వాళ్ల అభిమాన స్థలం. అక్కడ కూర్చున్నారు వాళ్లు.

"యేమిటి మీరు కోరేది?" యెకతెరీనా ఇవానొవ్నా అడిగింది వ్యవహార ధోరణిలో, నిర్లిప్త కంఠంతో.

"మిమ్మల్ని చూడక వారం దాటింది, మీ గొంతు వినక యుగాలు గడిచినాయి. మీ కంఠధ్వని కాంక్షిస్తున్నాను, మీ పలుకుల కొరకు దగగొన్నాను! మాట్లాడండి!"

ఆమె నవవికాసమూ, ఆమె చూపులోని అమాయకత్వమూ, నిష్కపటపు చెక్కిళ్లూ అతన్ని వివశుణ్ని చేసినాయి. ఆమె దుస్తుల పొందికలో కూడా అతనికి మహా మధురమైనదేదో కనిపించింది, వాటి సరళమైన, అమాయకమైన సారస్యంలో హార్దికమైనదేదో కనిపించింది. కానీ, అంత అమాయకత్వంలోనూ ఆమె చాలా తెలివి పరురాలుగా, వయసుకు మించిన విజ్ఞురాలుగా కనిపించింది అతనికి. అతను సాహిత్యం గురించి గానీ, కళల గురించి గానీ, తనకు యిష్టం వచ్చిన దేన్ని గురించైనా గానీ ఆమెతో మాట్లాడవచ్చు, జీవితంమీదా, మనుషులమీదా ఆమెతో ఫిర్యాదు చేయవచ్చు – గురుతరమైన సంభాషణ మధ్యలో ఆమె ఒకోసారి బేజారు కలిగించే విధంగా పకపక నవ్వడమూ, ఒకోసారి యింట్లోకి పరుగెత్తిపోవడమూ నిజమే అయినప్పటికీ. ఆ పట్టణం లోని అత్యధిక భాగం ఆడపిల్లల లాగే ఆమె పుస్తకాలు బాగా చదివేది (ఆ పట్టణంలో పుస్తక పఠనం చాలా తక్కువ; ఆడపిల్లలూ, యువ యూదులూ లేకపోతే గ్రంథాలయం మూసివేయవచ్చు అని స్థానిక గ్రంథాలయాధికార్లు ప్రకటించినారు), యిది స్తార్త్సెవ్‌కు మహదానందం కలిగించింది. అతను ఆమెను చూసినప్పుడల్లా, ఆమధ్య ఆమె యేమి చదువుతూ వుండేదీ ఉత్సుకతతో అడిగేవాడు, ఆమె జవాబును పరవశత్వంతో వినేవాడు.

"యీ వారం యేమి చదువుతూ వుండినారు, మనం కలుసుకున్నప్పటినుండి?" అతను అడిగినాడు ఆమెను. "చెప్పండి."

"పీసెమ్‌స్కీయ్ రచన చదువుతూ వుండినాను."

"యే పుస్తకం?"

" 'వెయ్యి ఆత్మలు'," కిట్టీ జవాబు చెప్పింది. "పీసెమ్‌స్కీయ్ పేరు యెంత తమాషాగా వుంది – అలెక్సేయ్ ఫెయొఫీలక్టిచ్!"

ఆమె హఠాత్తుగా లేచి, యింటిపైపు నడిచింది. "యెక్కడికి?" అంటూ స్టార్ట్సెవ్ గాభరాగా అరిచినాడు. "నేను మీతో తప్పక మాట్లాడాలి. మీతో ఒక విషయం చెప్పాలి.... ఆగండి – కనీసం అయిదు నిముషాలైనా ఆగండి, మీకు పుణ్యముంటుంది!"

యేదో చెప్పబోయేదానిలా ఆమె ఆగింది. తరువాత అస్తవ్యస్తంగా అతని చేతిలో ఒక చీటీ పెట్టి యింట్లోకి పరుగెత్తింది; వెంటనే అక్కడ మళ్లీ పియానోవద్ద కూర్చుంది.

"యీ రాత్రి పదకొండు గంటలకు శ్మశానంలో దెమెట్టి సమాధివద్ద వుండండి," స్టార్ట్సెవ్ చదువుకున్నాడు.

ఆశ్చర్యంనుండి తేరుకున్న తర్వాత, "యిది నిజంగా అర్థం లేనిది," అనుకున్నాడు అతను. "శ్మశానం యెందుకు? ఎందుకబ్బా?"

అంతా తేటతెల్లంగా వుంది: కిట్టీ తనను ఆడిస్తున్నది. వీధిలో గానీ, మునిసిపల్ పార్కులో గానీ అంత సులభంగా కలునుకునే అవకాశముండగా, బుద్ధి వున్నవాళ్లెవ్వరూ రాత్రివూట, వూరికి అంత దూరాన కలుసుకోవాలనుకోరు. యిక, తాను, డాక్టరు, వివేకమూ, సంఘంలో మర్యాదా గల పెద్దమనిషి, ఒక ఆడపిల్ల కోసం నిట్టూర్చడమూ, చీటీలు స్వీకరించడమూ, శ్మశానాలలో సంచారం చేయడమూ, యీ కాలపు బడిపిల్లలకి కూడా నవ్వు తెప్పించే తెలివి తక్కువ పనులు చేయడమూ ఉచితమా? యీ ప్రేమ కలాపం యెక్కడికి తీసుకపోతుంది. తన సహోద్యోగులకు తెలిస్తే యేమంటారు? క్లబ్బులో టేబుళ్లమధ్య దారిచేసుకుంటూ వెళ్లేటప్పుడు స్టార్ట్సెవ్‌కి కలిగిన ఆలోచనలు యివీ. కానీ పదిన్నర గంటలకు అతను హఠాత్తుగా శ్మశానానికి బయలుదేరినాడు.

యిప్పుడతనికి సొంత జోడుగుర్రాలబండి వుండింది, వెల్వెట్ వేస్టుకోటు వేసుకునే పాంతెలెయ్‌మోన్ అనే బండివాడు వుండినాడు. వెన్నెల కాస్తూవుండింది. అంతా నిశ్చలంగా, వెచ్చగా వుండింది, కానీ అది ఆకురాలు కాలపు వెచ్చదనం. పట్టణం వెలుపల కబేళా దగ్గర కుక్కలు మొరుగుతూ వుండినాయి. స్టార్ట్సెవ్ పట్టణం చివర ఒక సందులో బండి దిగి, కాలి నడకన శ్మశానానికి పోయినాడు. "వ్యక్తికొక బుద్ధి అంటారు. కిట్టీ చిత్రమైన పిల్ల. యేమో, యెవరికి తెలుసు? – ఆమె నిజంగా అనుకుందేమో? అక్కడ వుంటుందేమో?" అనుకున్నాడు అతను. యీ ఆడియాస కైపుకు అతను లొంగిపోయినాడు.

దారిలో చివరి భాగం పొలంలో వుండింది. శ్మశానం దూరాన నల్లగా వనంలా, ఓ పెద్ద పార్కులా వుండింది. ఒక తెల్లని రాతి గోడ కనిపించింది, తరువాత ఒక

గేటు కనిపించింది.... వెన్నెలలో గేటుమీద రాత చదవడం వీలైంది: "నీ సమయం కూడా వస్తుంది." స్టార్‌త్వైట్ కొయ్యగేటు తోసి, లోపలికి పోయి, విశాలమైన దారిలో నిలబడినాడు; దారికి రెండువైపులా తెల్లని శిలువలూ, స్మారక మందిరాలూ, పొడవైన పాప్లర్ చెట్లూ వుండినాయి, అన్నీ అతని దారి కడ్డంగా పొడవైన నల్లని నీడలు పరుస్తూ. ప్రతిదీ నల్లగనో, తెల్లగనో వుండింది, నిద్రమత్తు చెట్లు తెల్లని రాళ్ల మీదికి కొమ్మలు సాచినాయి. పొలంలో కంటె యిక్కడ వెలుతురు యెక్కువ వున్నట్లుం డింది. మేపుల్ చెట్ల ఆకులు పంజాలలాగ కనపడుతూ, దారిలోని పసుపు రంగు యిసుక పక్కనా, తెల్లని సమాధిరాళ్ల పక్కనా మరింత స్పష్టంగా వున్నాయి; స్మారక చిహ్నంమీది రాతలు స్పష్టంగా కనిపిస్తూ వుండినాయి. స్టార్‌త్వైట్ మనసు ఒక ఆలో చనతో నిండిపోయింది: జీవితంలో బహుశా మళ్లీ యెప్పుడూ చూడబోనిదాన్ని తాను మొట్టమొదటిసారి చూస్తున్నాడు—యే ప్రపంచంతోనూ పోలిక లేని ప్రపంచాన్ని, అదే తన ఊయెల తొట్టి అయినట్లు వెన్నెల మృదువుగా మధురంగా వున్న ప్రపంచాన్ని, ప్రాణం అనేది బొత్తిగా లేని ప్రపంచాన్ని, కానీ నిశ్చలమైన, అతిలోక సుందరమైన శాశ్వత జీవితాన్ని వాగ్దానం చేస్తున్న నిగూఢ రహస్యం చీకటిలోని ప్రతి పాప్లర్ చెట్టు లోనూ, ప్రతి సమాధిలోనూ యింద్రియ స్పృశితమయ్యే ప్రపంచాన్ని. సమాధిరాళ్ల నుండీ, వాడిపోయే పూలనుండీ, హేమంతంలో కుళ్లిపోయే ఆకుల వాసనుండీ దుఃఖమూ, శాంతీ తేలియాడుతూ వచ్చినట్లుండింది.

చుట్టూ నిశ్శబ్దం. నక్షత్రాలు ప్రగాఢ వినమ్రతతో నింగినుండి నేలమీద చూపులు నిలిపినాయి; స్టార్‌త్వైట్ అడుగులు ఆ నిశ్శబ్దంలో పరుషంగా, అసహజంగా ధ్వనించి నాయి. చర్చి గడియారం గంటలు కొడుతుండగా, తాను మరణించినాననీ, శాశ్వతంగా సమాధిచేయబడినాననీ అతను ఊహించుకుంటూ వుండినాడు. అప్పుడు మాత్రమే తనవైపు యెవరో చూస్తున్నట్లు అతనికి అనిపించి, అది ప్రశాంతీ, నిశ్చలత్వమూ కాదనీ, నిర్జీవత్వపు ప్రగాఢ విషాదమనీ, అణచిపెట్టబడిన నిస్పృహ అనీ.... క్షణకాలం ఒక ఊహకు లోనైనాడు.

దెమెట్టి స్మారక మందిరం కప్పుమీద దేవదూతతో గుడిలాగ వుండింది; పూర్వం యెప్పుడో ఒక యిటాలియన్ సంగీత నాటక బృందం ఆ పట్టణానికి వచ్చింది; వాళ్లలో ఒక గాయకురాలు యిక్కడే మరణించి, పూడ్చిపెట్టబడింది; ఆమె స్మృత్యర్థం యీ మందిరం కట్టబడింది. యిప్పుడు పట్టణంలో యెవరికీ ఆమె జ్ఞాపకం లేదు; కానీ ఆమె సమాధి ద్వారంలో వ్రేలాడే దీపంమీద వెన్నెల పడి ప్రతిఫలించినప్పుడు, ఆ దీపం వెలుగుతున్నట్లు కనపడుతుంది.

యెవరూ కనిపించలేదు. అర్ధరాత్రి వేళ యెవరొస్తారు యిక్కడికి? కానీ స్టార్ త్వైట్ కాచుకున్నాడు, వెన్నెల అతని ప్రేమను రగిలించినట్లు, ముద్దులూ, కౌగిలింతలూ

ఊహించుకుంటూ.... ఉబలాటంతో కాచుకున్నాడు, అర్ధగంటసేపు అతను సమాధి పక్కన కూర్చున్నాడు, తరువాత దగ్గరున్న ఒక కాలిబాటలో అటూయిటూ పచారు చేయసాగినాడు, టోపీ చేత పట్టుకొని ఆమె కోసం యెదురు చూస్తూ అతను మనసులో అనుకొన్నాడు: యీ సమాధులలోని స్త్రీలూ, పడుచులూ యెందరెంత అందంగా, మనోమోహనంగా వుండివారో, యెందరెంతగా ప్రేమించి, రాత్రివేళ ప్రణయాగ్నిలో యెంతగా జ్వలించి, తమ ప్రియుల కౌగిళ్లలో ఒదిగిపోయినారో. ప్రకృతి మాత మానవులతో యెంత విచారకరమైన ఆట ఆడుతుంది! దీనిని ఒప్పుకోవలసి రావడం యెంత తలవంపులు! యీ విషయాలన్నీ ఆలోచిస్తుండగా స్తూర్‌త్సెవ్‌కు తనకు ప్రేమ తప్పనిసరిగా కావాలని, యేమైనా సరే కావాలని బిగ్గరగా అరవాలని కాంక్ష కలిగింది! అతని మనసులో యిప్పుడు తెల్లని పాలరాతి ఫలకాలు లేవు, దేహాలు వుండినాయి, నునుసిగ్గుతో చెట్లనీడలలో దాక్కునే వాటి రూపాలు కనిపించినాయి అతనికి, వాటి వెచ్చదనం తగిలింది అతనికి, చివరకు వలపు తాపం దుర్భరమైంది అతనికి.

హఠాత్తుగా, తెర దించినట్లు, చంద్రుడు మేఘాల చాటుకు పోయినాడు, చుట్టూ చీకటి అలముకుంది. గేటు కనుక్కోవడం స్తూర్‌త్సెవ్‌కు యెంతో కష్టమైంది, హేమంత నిశి యెంత చీకటిగా వుంటుందో అంత చీకటి అయింది అప్పటికి; తన బండి వదలిపెట్టి వచ్చిన సందు కనుక్కోలేక అతను గంటన్నరసేపు వెదదిరిగినాడు.

"యెంతగా అలసిపోయినానో, కాళ్ల నిలవడం లేదు," అన్నాడు అతను పాంతెలెయ్‌మోన్‌తో.

సీటులో సుఖంగా వాలిపోతూ అతను మనసులో అనుకున్నాడు:

"నేను యింత లావు కాకూడదు."

3

పెండ్లి ప్రతిపాదన చేయాలని గట్టిగా అనుకొని, మరుదినం సాయంత్రం అతను తూర్కిన్‌ల యింటికి వెళ్లినాడు. కానీ సమయం అనుకూలించలేదు — కేశాలంకర్త వచ్చి, యెకతెరీనా ఇవానొవ్నాకు ఆమె పడకగదిలో కేశాలంకారం చేస్తూ వుండింది. ఆమె క్లబ్బులో నృత్యానికి పోతూవుండింది.

మళ్లీ భోజనశాలలో టీ తాగుతూ చాలాసేపు గడపవలసివచ్చింది. తన అతిథి మబ్బుగా, పరధ్యానంగా వుండడం ఇవాన్ పెత్రోవిచ్ గమనించి, తన వేస్టుకోటు జేబునుండి కొన్ని కాగితాలు తీసి, తమాషా అయిన వచ్చీరాని రష్యన్ భాషలో ఒక జర్మన్ మేనేజరు రాసిన ఉత్తరం బిగ్గరగా చదవసాగినాడు.

పరధ్యానంగా వింటూ, స్తూర్‌త్సెవ్ అనుకున్నాడు: "ఆమెకు మంచి కట్నం ఇవ్వవచ్చు."

రాత్రంతా నిద్ర లేక అతను కొయ్యబారిన స్థితిలో వుండినాడు, నిద్ర కలిగించే మధురమైన పానీయం యేదో తాగినవానిలా. అతని హృదయంలో అస్పష్టమైన, ఆహ్లాదకరమైన సుఖానుభూతి యేదో వుండింది, కానీ అతని బుర్రలో పరుషమైన, భారమైన పురుగు తొలుస్తూ వుండింది:

"చేతులు కాలకముందే ఆగు. ఆమె నీకు జోడా? ఆమె గారాబంతో చెడ బెరిగింది, గర్విష్ఠి, పగలు రెండుదాకా నిద్రలేవదు, నీవు మతగురువు కొడుకువు, జేమ్‌స్త్వో డాక్టర్‌వు...."

"అయితే యేం?" అనుకున్నాడు అతను.

"పైగా, ఆమెను పెళ్లి చేసుకుంటే," ఆ పురుగు కొనసాగించింది, "ఆమె బంధువులు నీవు జేమ్‌స్త్వో ఉద్యోగం వదలిపెట్టి, పట్టణంలో కాపురం పెట్టేటట్లు చేస్తారు."

"కానీలే," అనుకున్నాడు అతను, "పట్టణంలో యెందుకుండకూడదు? వాళ్లు ఆమెకు కట్నం యిస్తారు, మేము పట్టణంలో కాపురం పెడతాం...."

చివరకు యెకతెరీనా ఇవానొవ్నా వచ్చింది, నవనవోన్మేషంగా, అందమైన దుస్తులలో ముచ్చటగా. స్తార్‌త్సెవ్ కన్నుల కరువు దీర ఆమెను అలోచిస్తూ, యెంతగా పరవశుడైనాడంటే, నోట మాట లేకుండా వూరక ఆమెను చూస్తూ, నవ్వుతూ వుండినాడు.

ఆమె అందరి దగ్గరా సెలవు తీసుకుంటూ వుండింది. అతనికిక అక్కడ ఆగవలసిన పనేమీ లేదు, అందువలన అతనూ లేచినాడు, యింటికి పోయేవేళ అయిందని అంటూ. రోగులు అతని కోసం యెదురుచూస్తుంటారు.

"అన్యాయం!" అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్. "సరే, వెళ్లండి! అన్నట్టు, కిట్టీని క్లబ్బువద్ద దింపేసి వెళ్లొచ్చుగా మీరు!"

బయట చీకటిగా వుండింది, తుంపర పడుతూ వుండింది. పాంతెలెయ్‌మోన్ గుర్రం సకిలింపుమబట్టి మాత్రమే వాళ్లు బండి యెక్కడున్నదీ కనుక్కోగలిగినారు. బండి మూత మూయబడివుండింది.

ఇవాన్ పెత్రోవిచ్ నోరు మూతబడకుండా హాస్యాలాడుతూ, కూతురును బండిలో యెక్కించి, హాస్యంగా సెలవు చెప్పినాడు. "వెళ్లిరండర్రా! సుఖీ భవ!"

"నిన్న నేను శ్మశానానికి వెళ్లినాను," అన్నాడు స్తార్‌త్సెవ్. "మీకు బొత్తిగా కనికరం అనేది లేదు, వట్టి రాతిగుండె...."

"శ్మశానానికి వెళ్లినారా?"

"ఆఁ. దాదాపు రెండు గంటలదాకా కాచుకున్నాను. ఆ బాధ...."

"మీకు కుదరవలసిందే — హాస్యం అర్థం కాదా?"

యెకతెరీనా ఇవానొవ్నా తన ఆరాధకుని అంత బాగా బురిడీ కొట్టించినందుకూ, అంత గాఢంగా అతని ప్రేమను చూరగొన్నందుకూ సంతోషం పట్టలేక, గలగల నవ్వింది. మరుక్షణంలో ఆమె గాభరాగా కేకవేసింది – క్లబ్బు గేటువద్ద గుర్రాలు హఠాత్తుగా మలుపు తిరిగినాయి, బండి ఒరిగింది. స్టార్‌త్సెవ్ ఆమె నడుముచుట్టూ చేయి వేసినాడు. భయ కంపంలో ఆమె అతనిమీద వాలింది. అతను ఆమెను మరింత బిగువుగా పట్టుకొని, ఆమె పెదవులమీదా, గడ్డంమీదా ఆవేశపు ముద్దులు కురిపించ కుండా వుండలేకపోయినాడు.

"యిక చాల్లెండి," అన్నది ఆమె నిర్లిప్తంగా.

క్షణం గడిచేటప్పటికి ఆమె బండిలో లేదు; దీపాల కాంతిలో వెలిగిపోతున్న గేటు వద్ద వున్న పోలీసు జవాను పంతెలెయ్‌మోన్‌ను ఉద్దేశించి కిరాతకంగా అరిచినాడు:

"యింకా యెందుకున్నావ్ మొద్దూ? కదులు!"

స్టార్‌త్సెవ్ యింటికి పోయి, కాసేపట్లో మళ్లీ బయటికి వచ్చినాడు. యెవరిదో ఫ్రాక్‌కోటు తొడుక్కొని, ముడుచుకొని ఒక పక్కకు జారిపోయే తెల్లని బిరుసు టై కట్టుకొని, అర్ధరాత్రి వేళ క్లబ్బు డ్రాయింగురూంలో కూర్చొని, తన్మయత్వంతో యెకతెరీనా ఇవానొవ్నాతో చెప్తూవుండినాడు:

"యెన్నడూ ప్రేమించనివాళ్లకు యేం తెలుస్తుంది! ప్రేమను యెవరూ యథాతథంగా వర్ణించలేదని నాకు అనిపిస్తుంది. నిజానికీ సుకుమారమైన, ఆనందమయమైన, యాతనాభరమైన అనుభూతి వర్ణనకందదు. దాన్ని, ఒక్కసారైనా సరే, అనుభవించిన వాళ్లు మాటలలో వర్ణించడానికి పూనుకోరు. ఉపోద్ఘాతాలూ, వర్ణనలూ యెందుకు? యీ అనవసర వాగ్గుంఫన యెందుకు? నా ప్రేమ అవధులెరగనిది.... మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను, మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను," అసలు విషయం వెళ్లగక్కుతూ, స్టార్‌త్సెవ్ ముగించినాడు, "నా అర్ధాంగిగా నన్ను గ్రహించండి!"

"ద్మిత్రీ ఇయోనిచ్" అన్నది యెకతెరీనా ఇవానొవ్నా, ఒక క్షణం ఆగి, మహా గంభీరమైన ముఖభంగిమతో. "ద్మిత్రీ ఇయోనిచ్, మీరు చూపిన మన్ననకు చాలా కృతజ్ఞురాలిని. మీమీద నాకు గౌరవముంది, కానీ...." ఆమె లేచి నిలబడి చెప్పసాగింది, "కానీ, క్షమించండి, నేను మీ భార్యగా వుండలేను. మనం మొహమాటం లేకుండా మాట్లాడుకుందాం. మీకు బాగా తెలును గదా ద్మిత్రీ ఇయోనిచ్, నాకు జీవితంలోకెల్ల కళ ప్రియతమమైనది, సంగీతమంటే నేను ప్రాణం విడుస్తాను, దాన్ని ఆరాధిస్తాను, దానికి నా జీవితం యావత్తూ మీదుగట్టినాను. నేను సంగీత విద్వాంసురాలిని కావాల నుకున్నాను, నాకు కీర్తి కావాలి, విజయం కావాలి, స్వేచ్ఛ కావాలి. యీ పట్టణంలోనే నివసిస్తూ, నాకు దుర్భరంగా తయారైన యీ నిస్సారపు వ్యర్థజీవితం కొనసాగిస్తూ వుండమంటారా నన్ను? యెవరికో భార్యగా? వద్దు, మీ దయవల్ల! మనిషికి ఉన్నత

మైన, ఉజ్వలమైన లక్ష్యం వుండాలి, మరి కుటుంబ జీవితం నన్ను శాశ్వతంగా బంధిస్తుంది. ద్మిత్రి ఇయోనిచ్" (ఆమె లీలగా చిరునవ్వు నవ్వింది – "ద్మిత్రి ఇయోనిచ్" పేరు ఉచ్చరించినప్పుడు ఆమెకు "అలెక్సేయ్ ఫియొఫీలక్తిచ్" జ్ఞాపకం రాక మానడం లేదు), "ద్మిత్రి ఇయోనిచ్, మీరు దయాపరులు, ఉదారులు, ధీమంతులు, తక్కిన వాళ్లందరికంటె మీరు మేలైనవాళ్ళు –" ఆమె కన్నులలో నీరు తిరిగింది, "మీపట్ల నాకు హృదయ పూర్వకమైన సానుభూతి వుంది, కానీ... కానీ, నాకు నమ్మకముంది మీరు అర్థం చేసుకుంటారని...."

యేడుపు బలవంతాన ఆపుకోడానికి ఆమె పక్కకు తిరిగి, డ్రాయింగు రూంలో నుండి వెళ్లిపోయింది.

స్తార్త్సెవ్ గుండె యిప్పుడు ఆదుర్దాతో దడదడ కొట్టుకోలేదు. క్లబ్బులోనుండి వీధిలోకి పోయినాక అతను చేసిన మొట్టమొదటి పని బిరుసు టై లాగిపారవేసి గట్టిగా ఊపిరి తీసుకోవడం. అతనికి కొద్దిగా లజ్జ కలిగింది, అతని అహంకారానికి దెబ్బ తగిలింది – ఆమె తన్ను నిరాకరిస్తుందని అతను అనుకోలేదు – తన కలలూ, వేదనలూ, ఆశలూ ఔత్సాహికులు నటించే చిన్న సుఖాంత నాటకంలోని అంతిమ రంగంలా యింత నిస్సారంగా అంతమైనాయని అతను నమ్మలేకపోయినాడు. తన హృదయానుభూతులకూ, తన యీ ప్రేమకూ అతనికి విచారం కలిగి, యేడవాలనిపించింది, లేదా పాంతెలెయ్‌మోన్ పెద్ద భుజాలమీద తన యావత్తు శక్తితోనూ తన చేతిలోని గొడుగుతో ఒకటి వేయాలనిపించింది.

మూడు రోజులు అతనికి అన్నీ అస్తవ్యస్తంగా వుండినాయి, అతను అన్నం తినలేదు, నిద్రపోలేదు. కానీ, యెకతెరీనా ఇవానొవ్నా సంగీత కళాశాలలో చేరడానికి మాస్కోను పోయిందన్న వార్త అతనికి అందినప్పుడు, అతను నిమ్మళించి, ముందు మాదిరే జీవించసాగినాడు.

తరువాత, తాను శ్మశానంలో తిరిగిందీ, ఫ్రాక్‌కోటు కొరకు వూరంతా వెదకిందీ జ్ఞాపకం వచ్చినప్పుడు అతను బద్ధకంగా ఒళ్లు విరుచుకొని "ఎంత వెంగళాయితనం!" అనుకున్నాడు.

4

నాలుగేండ్లు గడిచినాయి. స్తార్త్సెవ్‌కు పట్టణంలో పెద్ద ప్రాక్టీసు వుండింది. ప్రతి ఉదయం అతను ద్యలీజ్‌లోని తన రోగులను తొందర తొందరగా పరీక్షించి, తరువాత పట్టణంలోని తన రోగులను చూడడానికి పోయేవాడు. యిప్పుడతను జోడు గుర్రాల బండిలో పోవడం లేదు, కలనాదం చేసే గంటలు గల మూడు గుర్రాలబండిలో పోయేవాడు, రాత్రి పొద్దుబోయిన తర్వాత యింటికి వచ్చేవాడు. అతను లావై, తూకమెక్కినాడు,

నడక మానుకున్నాడు; నడిస్తే అతనికి గుండె దడ వచ్చేది. పాంతెలెయ్‌మోన్ కూడా లావైనాడు; అతని చుట్టుకొలత పెరిగేకొద్దీ, విషాదకరంగా నిట్టూర్చి, తన దుర్గతికి వగచేవాడు: "యెప్పుడూ ఒకటే ప్రయాణం!"

స్తార్‌త్సెవ్ చాలా యిండ్లకు వెళ్లేవాడు, చాలామందిని కలుసుకునేవాడు; కానీ యెవరికీ అతను సన్నిహితుడు కాలేదు. పట్టణవాసుల సంభాషణా, అభిప్రాయాలూ, వాళ్ల వైఖరే అతనికి చిరాకు కలిగించేది. అతను క్రమక్రమంగా ఒకటి తెలుసుకున్నాడు — తాను ఆ పట్టణంలో యెవరితో నైనా పేకాట ఆడినంతసేపూ, అతనితో కలిసి భోంచేసినంతసేపూ అతను ప్రశాంతుడుగా, సరసుడుగా, కాస్త తెలివిపరుడుగా కూడా వుంటాడు, కానీ సంభాషణ తిండిని గురించి కాక మరి దేనికైనా, రాజకీయాలకో, శాస్త్ర విజ్ఞానానికో మళ్లిందా, మరుక్షణమే అతను తికమకపడతాడు, లేదా యెంత తెలివి లేని, హృదయం లేని సిద్ధాంతం చెప్పడం ప్రారంభిస్తాడంటే, యెవరైనా అతన్ని వదిలేసి వెళ్లిపోవలసిందే. దేవుని దయవల్ల మానవ జాతి పురోగమిస్తూ వుందనే విషయంగురించీ, కొంత కాలానికల్లా మనం పాస్‌పోర్ట్లనూ, ఉరిశిక్షనూ విసర్జించ వచ్చుననే విషయం గురించీ స్తార్‌త్సెవ్ ఒక విజ్ఞానవంతునితో మాట్లాడడానికి ప్రయత్నిస్తే, అతని వృచ్చకుడు అతనివైపు అపనమ్మకపు కోరచూపు చూసి, అడిగేవాడు: "అంటే, యిక యిష్టం వచ్చినట్లు వీధుల్లో ఒకరి గొంతులొకరు కోసుకోవచ్చునన్న మాటా?" యిక, అందరూ పనిచేయాలనీ, పని లేకుండా జీవితం అసంభవమని స్తార్‌త్సెవ్ భోజనం దగ్గరో, టీ దగ్గరో అంటే, అక్కడున్నవాళ్లందరూ దాన్ని నిందగా స్వీకరించి, పట్టుదలగా వాదం ప్రారంభించేవాళ్లు. కానీ యీ సాదా మనుషులు యే పనీ, బొత్తిగా యే పని గానీ, చేయరు, వాళ్లకు దేనిలోనూ ఆసక్తి లేదు, వాళ్లతో దేన్ని గురించీ మాట్లాడడం అసాధ్యం. స్తార్‌త్సెవ్ సంభాషణ తప్పించుకునేవాడు, వాళ్లతో కలిసి భోంచేయడమూ, పేకాట ఆడడమూ మాత్రం చేసేవాడు. యెవరైనా శుభ కార్యానికి ఆహ్వానిస్తే, అతను వాళ్ల యింటికి పోయి, తన ప్లేటుమీదనుండి దృష్టి పక్కకు తిప్పకుండా, మౌనంగా భోంచేసేవాడు. అలాంటి సందర్భాలలో వాళ్ల మాట్లాడే మాటలన్నీ వినబుద్ధిగానివి, అన్యాయమైనవి, పట్టి మతిమాలినవి, అతనికి చిరాకు కలిగి, చిర్రెత్తేది; కానీ అతను నోరు కట్టేసుకునేవాడు. అతనెప్పుడూ ప్రగాఢమైన మౌనంతో ప్లేటువైపు చూస్తూ వుండినందున, అతని శరీరంలో పోలిష్ రక్తం ఒక చుక్క కూడా లేనప్పటికీ, పట్టణంలో అతన్ని "కోపిష్ఠి పోలిష్ మనిషి" అనేవాళ్లు.

అతను నాటకాలూ, పాట కచేరీలూ పరిహరించివాడు, కానీ పేకాటలో ప్రతి సాయంత్రం సుమారు మూడు గంటలు పాల్గొని ఆనందం పొందేవాడు. క్రమ క్రమంగా, అతనికే తెలియకుండా, మరొక ఆనందకారణం యేర్పడింది అతనికి: ఆ రోజు పట్టణంలో రోగుల యిండ్లవద్ద వచ్చిన డబ్బును రాత్రి జేబుల్లోనుండి బయ

టికి తీయడమే అది; జేబుల నిండా కూరిన ఆ నోట్లు — పసుపురంగువీ, పచ్చరంగువీ, సెంటు వాసన వచ్చేవీ, వినిగార్ వాసన వచ్చేవీ, ధూపం వాసన వచ్చేవీ, చేపల వాసన వచ్చేవీ — ఒకోసారి డెబ్బై రూబుల్ల దాకా వుండేవి. అవి కొన్ని వందలు అయినప్పుడు అతను బాంకిలో జమకట్టేవాడు.

యెకతెరీనా ఖవానొవ్నా వెళ్లిపోయిన నాలుగేండ్లలో అతను రెండుసార్లు మాత్రమే, వేర యోసిఫొవ్నా ఆహ్వానంమీద, ఆమె తలనొప్పికి మందు యివ్వడానికి, తూర్కిన్ల యింటికి వెళ్లినాడు. యెకతెరీనా ఇవానొవ్నా ప్రతి వేసవిలోనూ యింటికి వచ్చేది, కానీ అత నెప్పుడూ ఆమెను చూడలేదు — యెందుకో అది తటస్థపడలేదు.

యిప్పుడు నాలుగేండ్లు గడచిపోయినాయి. ఒక ప్రశాంతమైన వెచ్చని ఉదయం ఆస్పత్రికి జాబు వచ్చింది. ద్మిత్రీ ఇయోనిచ్‌కి వేర యోసిఫొవ్నా రాసింది, ఆమె అతన్ని చూడక చాలా కాలమైందనీ, అతను తప్పక వచ్చి తన్ను చూడాలనీ, తన తలపోటు తగ్గించాలనీ, ఆ రోజు తన జన్మదినం అనీ. ఉత్తరం అడుగున తాజా కలం వుండింది: "అమ్మ అభ్యర్థనలో నేనూ పాల్గొంటున్నాను. కిట్టీ."

స్తార్త్సెవ్ పోదామా వద్దా అని యోచించి, సాయంత్రం వెళ్లినాడు తూర్కిన్ల యింటికి.

ఇవాన్ పెత్రోవిచ్ కండ్లలో మాత్రమే నవ్వుతూ, తన మామూలు "హలో లోలో!"తో స్వాగతమిచ్చి, "నమస్తే! న్నమస్తే!" అన్నాడు.

యీ మధ్యలో బాగా వయసెక్కి, తల తెల్లబడిన వేర యోసిఫొవ్నా స్తార్త్సెవ్ చేయి నొక్కి, కృత్రిమంగా నిట్టూర్చి, యిలా అన్నది:

"డాక్టర్, మీరు మా యింటికి రావడమే లేదు, నాతో సరసాలాడడం మీకు యిష్టం లేనట్లుంది. నేను మీకు మరీ ముసలిదాన్ని అయినాను. కానీ యిప్పుడు పదుచుది వుందిగా. అమ్మాయికైనా అదృష్టం వుంటుందను కుంటాను."

మరి కిట్టీయో? ఆమె మరింత సన్నగా, మరింత పాలిపోయి వుంది, కానీ మరింత మనోహరంగా, మరింత నాజూకుగా వుంది. ఆమె యిప్పుడు కిట్టీ కాదు, యెకతెరీనా ఇవానొవ్నా. ఆమె నవనవోన్మేషమూ, బాల్యస్నిగ్ధమైన అమాయకత్వమూ అదృశ్యమైనాయి. యిక్కడ, యీ తూర్కిన్ గృహంలో, తాను పరాయి దైనట్లు, యేదో పిరికితనమూ, దోషి మనస్సంకోచమూ, ఆమె చూపులలో కొత్తది యేదో వుంది.

"మనం కలుసుకోక యెన్ని యుగాలైందో" అన్నది ఆమె, అతనితో కరచాలనం చేస్తూ; ఆమె గుండె మహా వేగంగా కొట్టుకుంటున్నదని స్పష్టంగా తెలుస్తూవుండింది. అతని ముఖంలోకి నిశ్చలంగా ఉత్సుకతతో చూస్తూ ఆమె కొనసాగించింది: "మీరు బాగా లావైనారు! అప్పటికంటె నల్లబడి, పూర్తిగా వయసు వచ్చినట్లు కన పడుతున్నారు, కానీ మొత్తంమీద పెద్ద మార్పు లేదు."

అతని దృష్టికామె యింకా ఆకర్షణీయంగా, మహా ఆకర్షణీయంగా, కనపడింది. కానీ ఆమెలో యేదో వెలితి కనపడింది, లేదా యేదో అనవసరమైంది కనపడింది, యేదైందీ అతనికి సరిగా తెలియలేదు. యేదైనప్పటికీ, పూర్వంలా అతని హృదయం స్పందించ కుండా అది అరికట్టింది. అతనికి ఆమె పాలిన రంగు నచ్చలేదు, ఆమె చూపులు నచ్చ లేదు, ఆమె ఛాయామాత్రపు చిరునవ్వు నచ్చలేదు, ఆమె స్వరం నచ్చలేదు, కాసేపట్లో అతనికి ఆమె దుస్తులమీద అయిష్టం కలిగింది, ఆమె కూర్చున్న కుర్చీమీద అయిష్టం కలిగింది, తాను ఆమెను పెండ్లి చేసుకున్నంత పని జరిగిన గతంలోని దేనిమీదనో అయిష్టం కలిగింది. అతనికి తన ప్రేమా, తన ఆశలూ, తన కలలూ, నాలుగేండ్ల క్రితం తనను సంచలింపజేసినవన్నీ జ్ఞాపకం వచ్చి, యిబ్బంది పడినాడు.

కేకులు తిని, టీ తాగినారు. వేర యోసిఫోవ్నా వాస్తవ జీవితంలో యెన్నడూ జరగని దాన్ని గురించిన తన నవల చదివింది. స్తార్‌త్సెవ్ ఆమె అందమైన నెరసిన తలవైపు చూస్తూ కూర్చొని, ఆమె యెప్పుడు ముగిస్తుందా అని యెదురు చూస్తూ, విన్నాడు.

"నవలలు రాయలేని మనిషి కాదు అప్రయోజకుడు; రాసి, ఆ విషయం దాచు కోలేని మనిషి," అనుకున్నాడు అతను మనసులో.

"నాస్తి పరవా!" ఇవాన్ పెత్రోవిచ్ అన్నాడు.

తరువాత యెకతెరీనా ఇవానోవ్నా చాలాసేపు చాలా గోలగోలగా వాయించింది. ఆమె ఆపినప్పుడు అందరూ చాలాసేపు ఆమెకు కృతజ్ఞతలూ, అభినందనలూ తెలిపినారు.

"యేమైనా, నేను ఆమెను చేసుకోకపోవడం మేలైంది," అనుకున్నాడు స్తార్‌త్సెవ్.

తోటలోకి పోదామని అతను తన్ను పిలుస్తాడని ఆమె అనుకుంది. ఆ ఉద్దేశంతోనే ఆమె అతనివైపు చూసింది; కానీ అతనేమీ అనలేదు.

అతని దగ్గరికి పోయి, "మాట్లాడుకునేదేమీ లేదా?" అన్నది ఆమె. "మీరెలా వున్నారు చెప్పండి? యిక్కడ మీ జీవితం యెలా వుంది? యిన్నాళ్లూ నేను మిమ్మల్ని గురించి తలుచుకుంటున్నాను," అంటూ ఆమె అధీరంగా చెప్పసాగింది. "మీకు ఉత్తరం రాద్దామనుకున్నాను, ద్యలీజ్‌కు వచ్చి మిమ్మల్ని చూద్దామనుకున్నాను, నిశ్చ యించుకున్నాను. కానీ, మళ్లీ మనసు మార్చుకున్నాను — నన్ను గురించి యిప్పుడు మీరు యేమనుకుంటున్నారో! యీవేళ మీరు వస్తారని యెంతో తహతహతో కాచుకు న్నాను. బయటికి తోటలోకి వెళ్దాం పదండి."

వాళ్లు తోటలోకి పోయి, నాలుగేండ్ల క్రితంలాగే, పురాతన మేపుల్ వృక్షంకింద బెంచీమీద కూర్చున్నారు.

"యిక చెప్పండి, యెలా వున్నారు?" అన్నది ఆమె.

"బాగున్నాను, మీ దయవల్ల" స్తార్‌త్సెవ్ జవాబిచ్చినాడు.

ఆపైన యేమి చెప్పడానికీ అతనికి తోచలేదు. యిద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"నా మనసేమీ బాగలేదు" అంటూ యెకతెరీనా ఖావొవ్నా తన ముఖంమీద చేయి పెట్టుకుంది. "మీరేమీ అనుకోకండి! నేను యింటికి వచ్చినందుకు యెంతో సంతోషంగా వుంది, అందరినీ చూసినందుకు సంతోషంగా వుంది, దీనికి నేను అలవాటు పడలేకున్నాను. ఓ, యేమి స్మృతులు! మీరూ, నేనూ తెల్లవార్లూ మాట్లాడుకుంటూ కూర్చుంటా మనుకున్నాను!"

ఆమె ముఖమూ, తళతళ మెరుస్తున్న కళ్ళులూ అతనికి కనిపిస్తూ వుండినాయి; యిక్కడ, చీకటిలో, ఆమె గదిలో కంటె పడుచుదిగా కనిపించింది, పూర్వపు పసిపిల్లలాంటి వాలకం కూడా ఆమెకు మళ్ళీ వచ్చినట్లు కనిపించింది. అతనికి కనిపిస్తూనే వుంది, తనవైపు ఆమె అమాయకమైన ఉత్సుకతతో చూస్తున్నదని — అతనికి మరింత సన్నిహితం కావాలనీ, ఒకప్పుడు తనను అంత గాఢంగా, అంత మృదువుగా, అంత నిష్ఫలంగా ప్రేమించిన ఆ మనిషిని అర్థం చేసుకోవాలనీ ఆమె కోరుతున్నట్లుంది ఆ ఉత్సుకత. ఆ ప్రేమకు గాను ఆమె కళ్ళు అతనికి కృతజ్ఞత తెలిపినాయి. జరిగిందంతా — స్వల్ప వివరాలదాకా, తాను శ్మశానంలో తిరిగింది, అలసిపోయి రాత్రి మూడవ జాముగ యింటికి పోయింది — అతను కూడా జ్ఞాపకం చేసుకున్నాడు. హఠాత్తుగా, గతానికి పశ్చాత్తాపంతో అతనికి దుఃఖం కలిగింది. అతని గుండెలో ఒక జ్వాల జ్వలించింది.

"మిమ్మల్ని క్లబ్బుకు తీసుకుపోయిన రాత్రి జ్ఞాపక ముందా?" అన్నాడు అతను.

"వర్షం పడుతూ వుండింది, చీకటి...."

అతని గుండెలోని మంట పెద్దదైంది. మాట్లాడాలనీ, తన జీవితం గురించి బాధ వెళ్ళబోసుకోవాలనీ అతనికిప్పుడు అనిపించింది.

"ఓహ్, నేనా!" అంటూ అతను నిట్టూర్చినాడు. "నా జీవితం గురించి అడుగుతున్నారా? యిక్కడ మేమెలా జీవిస్తున్నామా? మేము జీవించడం లేదు. మేము వయసెక్కుతూ, లావెక్కుతూ వుంటాం, దానికేమీ నిర్బంధాలు పెట్టుకోము. ఒక రోజు లాగే మరొక రోజు వుంటుంది, జీవితం గడుస్తూ వుంటుంది, నిస్సారంగా, నిర్జీవంగా, యే అనుభూతులూ, ఆలోచనలూ లేకుండా.... పగలు డబ్బు సంపాదనలో గడుస్తుంది, సాయంత్రం క్లబ్బులో గడుస్తుంది, పేకాటగాళ్ళతోనూ, త్రాగుడుగాళ్ళతోనూ, వాగుడుగాళ్ళతోనూ — వాళ్ళందరూ నాకు అసహ్యమే. యిదేలాంటి జీవితమంటారా?"

"మీకు మీ పని వుందిగా, జీవితంలో ఒక ఉదాత్తమైన లక్ష్యం. మీ ఆస్పత్రిని గురించి మాట్లాడడం మీ కంత యిష్టంగా వుండేది. అప్పుడు నేనొక వింత జంతువును, నేనొక గొప్ప పియానో వాద్యగత్తె ననుకునేదాన్ని. యీ రోజుల్లో ఆడపిల్ల లందరూ పియానో వాయిస్తారు, అందరిలాగే నేనూ వాయించినాను; కానీ నాలో యే ప్రత్యేకతా లేదు. అమ్మ నవలలు రాయడం యెంతో, నేను పియానో వాయించడమూ అంతే.

నేనప్పుడు మిమ్మల్ని అర్థం చేసుకోలేదనుకోండి, కానీ, తరువాత, మాస్కోలో, మిమ్మల్ని చాలాసార్లు తలుచుకున్నాను. డేమ్స్ట్సోవ్ డాక్టర్‌గా వుండడం, రోగ పీడితులకు సాయం చేయడం, మానవులకు సేవచేయడం యెంత ఆనందం! యెంత ఆనందం!" అంటూ యెకతెరీనా ఇవానొవ్నా ఉత్సాహంగా చెప్పింది. "మాస్కోలో మిమ్మల్ని గురించి తలుచుకున్నప్పుడు, మీరు నాకు ఆదర్శ, ఉదాత్తచరితులుగా కనిపించినారు...."

ప్రతి సాయంత్రం జేబులోనుండి అంత సంతృప్తితో వెలికితీసే నోట్లు జ్ఞాపకం వచ్చినాయి స్తార్త్సెవ్‌కు; అతని గుండెలోని జ్వాల ఆరిపోయింది.

యింట్లోకి పోడానికి అతను లేచినాడు. ఆమె అతని చేతిని ఆనరాగా పట్టుకుంది.

"నాకు తెలిసినవాళ్లలో కెల్ల మీరు ఉత్తములు" అంటూ ఆమె కొనసాగించింది. "మనం అప్పుడప్పుడు కలుసుకుంటూ, మాట్లాడుకుంటూ వుందాం, యేమంటారు? అలా మాట యివ్వండి నాకు. నేను నిజమైన పియానో వాద్యగత్తెను కాదు, నన్ను గురించి నాకేమీ భ్రమలు లేవు; మీముందర నేనెప్పుడూ పియానో వాయించను, సంగీతం గురించి మాట్లాడను."

వాళ్లు యింట్లోకి పోయినప్పుడు, గది వెలుతురులో స్తార్త్సెవ్ ఆమె ముఖాన్నీ, ఆమె తనవైపు చూసిన దుఃఖభరితమైన, తీక్ష్ణమైన, కృతజ్ఞతా పూర్వకమైన చూపునూ గమనించి, కాస్త చలించినాడు, కాని మళ్లీ తనకు తాను నచ్చచెప్పుకున్నాడు:

"నేను ఆమెను చేసుకోకపోవడం మేలైంది."

అతను సెలవు తీసుకున్నాడు.

"భోజనం చేయకుండా వెళ్లిపోడానికి మీకు యెవరిచ్చినారు హక్కు!" అన్నాడు ఇవాన్ పెత్రోవిచ్, అతన్ని సాగనంపుతూ. "మీదంతా చాలా పీడ్‌దూరామ్‌గా వుంది. యేదీ, నీ నటన చూపించు!" అంటూ అతను హాలులో వున్న పావాను కేకవేసినాడు.

పావా యిప్పుడు కుర్రవాడు కాదు, మీసం వచ్చిన యువకుడు. అతను ఒక భంగిమలో నిలబడి, చేయి యెత్తి, విషాద కంఠంతో అన్నాడు:

"నశించు, దుఃఖిత వనితా!"

యిదంతా యిప్పుడు స్తార్త్సెవ్‌కు చిరాకు మాత్రమే కలిగించింది. అతను బండిలో కూర్చొని, చీకటిలోని ఆ యింటినీ, తోటనూ, ఒకప్పుడు తనకు అంత ప్రీతిపాత్రమైనవాటిని తొంగిచూసినప్పుడు, పాత స్మృతులన్నీ అతన్ని చుట్టు ముట్టినాయి — వేర యోసిఫొవ్నా నవలలూ, కిట్టీ పియానో వాద్యమూ, ఇవాన్ పెత్రోవిచ్ హాస్యాలూ, పావా విషాద భంగిమా, అన్నీ. పట్టణంలో మహా ఘనమైన ప్రతిభావంతులు వీళ్లే యింత అప్రయోజకులుగా వుంటే, యిక అసలు పట్టణం యెలా వుండాలని, అతను తన్ను తాను ప్రశ్నించుకున్నాడు.

మూడు రోజుల తర్వాత, యెకతెరీనా ఇవానొవ్నానుండి పావా అతనికి ఒక జాబు తెచ్చినాడు.

"మీరు మా యింటికి రావడమే లేదు. యెందుకు?" అని ఆమె రాసింది అందులో. "మాపట్ల మీ మనసు మారిందేమో అని నాకు అనుమానంగా వుంది. యీ అనుమానం నన్ను భయకంపితురాలిని చేస్తున్నది. నాకు ఊరట కలిగించండి, వచ్చి నా అనుమానం నిరాధారమని చెప్పండి.

"నేను మిమ్మల్ని చూసితీరాలి. భవదీయురాలు యె. తూ."

అతను జాబు చదువుకున్నాడు, ఒక క్షణం ఆలోచించి, పావాతో యిలా అన్నాడు:

"అబ్బాయ్, యీ రోజు రాలేనని చెప్పు. చాలా పని వుంది. ఒకటి రెండు రోజుల్లో వస్తాను."

మూడు రోజులు గడిచినాయి, వారం గడిచింది, కానీ అతను వెళ్లలేదు.

ఒకసారి అతను తూర్కిన్ యింటి దారిన బండిలో పోతూవుండగా, అతనికి అనిపించింది కొద్ది నిముషాలసేపే అయినా, వెళ్లి చూసిరావడం బాగుంటుందని. అతను కాస్త పర్యాలోచించినాడు.... ఆగకుండా సాగిపోయినాడు.

తూర్కిన్‌ల యింటికి మళ్లీ యెప్పుడూ వెళ్లలేదతను.

5

మరి కొద్ది సంవత్సరాలు గడిచినాయి. స్తార్‌త్సెవ్ యింకా లావైనాడు, బాగా స్థూలకాయుడైనాడు, గసపెట్టేవాడు, నడిచేటప్పుడు తల వెనక్కి వాల్చవలసి వచ్చేది. అతను బండిలో వెళ్లేటప్పుడు — అతనూ, అతని జేవురించిన, గుండ్రని పూదు ముఖమూ, గంటలు గల్లుగల్లుమనే మూడు గుర్రాలూ, సారథి స్థానంలో పాంతెలెయ్‌మోన్, అతనికి కూడా జేవురించిన గుండ్రని పూదు ముఖమూ, మెడమీద దట్టమైన కొవ్వు పొరలూ, కొయ్యవైనట్లు ముందుకు చాచిన రెండు చేతులూ, "కుడి పక్కన వుండు!" అంటూ యెదురుగా వచ్చే సారథులకు కేకలు వేయడమూ — చూడడానికి చిత్రంగా వుండేది. బండిలో వెళ్లేది మనిషి కాక, యెవరో ఆటవిక జాతుల దేవుడైనట్లుండేది. పట్టణంలో స్తార్‌త్సెవ్‌కు యిప్పుడు ప్రాక్టీసు ఊపిరి సలపనంత విస్తారంగా వుంది, అతనికి పల్లె సీమలో ఒక యెస్టేటు వుంది, పట్టణంలో రెండు యిండ్లు వున్నాయి, మరింత లాభకరమైన యింకొక యింటిమీద ఒక కన్ను వుంచినాడు. యేదైనా యిల్లు త్వరలో వేలానికి వస్తున్నట్లు అతను బాంకిలో విన్నాడా, యే తతంగమూ లేకుండా అతనా యింట్లో దూరి, యింట్లోని ఆడవాళ్లూ, పిల్లలూ అతనివైపు భయ సంభ్రమాలతో చూస్తున్నా లెక్కచేయకుండా; ప్రతి గది తలుపునూ చేతికర్రతో తట్టుతూ, గదులన్నీ కలదిరిగేవాడు.

"యిది వఠనాగారమా? యిది పడకగదా? యిదేం గది?" అంటూ అడిగేవాడు.

అంత సేపూ అతను గసపెడుతూ, నుదుటి చెమట తుడుచుకుంటూ వుండేవాడు.

అతనికి బరువు బాధ్యతలు చాలా వుండివాయి, అయినా జేమ్స్ట్వో డాక్టరు పని అతను వదిలేయలేదు; దురాశా పీడితుడైన అతనికి ప్రతిచోటా వచ్చేది రాబట్టుకోవాలని కాంక్ష. ద్యలీజ్‌లోనూ, పట్టణంలోనూ యిప్పు డతన్ని అందరూ "ఇయోనిచ్" అని ప్రస్తావించేవాళ్ళు. "యెక్కడికి ఇయోనిచ్ బయలుదేరివాడు?" అనో, లేక "ఇయోనిచ్‌ని పిలిపించడం మంచిది కదూ?" అనో.

అతని గొంతు — బహుశా కంఠం చుట్టూ పెరిగిన కొవ్వు పొరల మూలంగా — కీచు గొంతు అయింది. అతని మనస్థితి కూడా మారి, చిరాకూ, విరసత్వమూ యెక్కువైవాయి. రోగులను పరీక్షించేటప్పుడు అతను తరుచుగా ఓర్పు కోల్పోయి, అసహనంతో నేలమీద చేతికర్రతో బాది, విరసంగా అనేవాడు:

"బాబూ నా ప్రశ్నలకు జవాబులు మాత్రమే యివ్వండి. అనవసరంగా మాట్లాడకండి."

అతను ఒంటరిగా జీవిస్తున్నాడు. అతని జీవితం గానుగెద్దు బతుకులా వుంది, అతనికి దేనిలోనూ ఆసక్తి లేదు.

ద్యలీజ్‌లోని అతని జీవిత కాలంలో అతనెరిగిన ఒకే ఒక ఆనందం, బహుశా చివరి ఆనందం, కిట్టీ పట్ల అతనికి కలిగిన ప్రేమ. అతను యెప్పుడైనా ఒక రోజు సాయంత్రం క్లబ్బులో పేకాట ఆడుతాడు, తరువాత పెద్ద టేబుల్‌వద్ద ఒంటిగా కూర్చొని, భోంచేస్తాడు. క్లబ్బు నౌకర్లందర్లోకీ పాతవాడూ, అందరూ గౌరవించేవాడూ అయిన ఇవాన్ యెప్పుడూ అతనికి వడ్డిస్తాడు. అతనికి లాఫిట్ నంబర్ 17 పానీయం యిస్తారు; క్లబ్బు నిర్వహణోద్యోగులకూ, వంటవాళ్లకూ, నౌకర్లకూ, అందరికీ అతని యిష్టానిష్టాలు తెలుసు, అందరూ అతన్ని సంతుష్టి పరచడానికి ప్రయత్నిస్తారు; లేకపోతే, అతను ఉగ్రతాండవం చేస్తూ, నేలమీద చేతికర్రతో బాదుతుంటాడు.

యెప్పుడైనా ఒకసారి అతను పక్కకు తిరిగి, సంభాషణలో పాల్గొనేవాడు.

"యేమిటి మీరు మాట్లాడేది? ఆఁ? యెవరు?"

పక్క టేబుల్‌వద్ద సంభాషణ తూర్కిన్‌లమీదికి మళ్లితే, అతను అడుగుతాడు:

"తూర్కిన్‌లను గురించా మీరు మాట్లాడేది? వాళ్లమ్మాయి పియానో వాయిస్తుందే, వాళ్లేనా?"

అతన్ని గురించి చెప్పవలసిందంతా దాదాపు అంతే.

యిక తూర్కిన్‌లా? ఇవాన్ పెత్రోవిచ్‌కి వయసెక్కినట్లు లేదు, యేవిధంగానూ మారలేదు, అతవింకా హాస్యాలాడుతూ, తమాషా కథలు చెప్తాడు. వేర యోసిఫొవ్నా

యెప్పటిలాగే ఉబలాటంగా, మోమోటం లేకుండా, వచ్చిన వాళ్లకి తన నవలలు చదివి వినిపిస్తుంది. కిట్టీ రోజా నాలుగు గంటలు సంగీత సాధనచేస్తుంది. ఆమెకు వయసు యెక్కినట్లు స్పష్టంగా కనపడుతున్నది, తరుచుగా జబ్బు పడుతున్నది; ప్రతి శరత్తులోనూ తల్లితో కలిసి క్రైమియాకు పోతుంది.

ఇవాన్ పెత్రోవిచ్ వాళ్లను సాగనంపేటప్పుడు, స్టేషన్‌లోనుండి రైలు కదలుతుండగా, "సుఖీ భవ!" అని అరుస్తూ, కండ్లు తుడుచుకుంటాడు. చేతి రుమాలు వూపుతాడు.

1898

గుల్లలో జీవించిన మనిషి

ఆ వేటగాళ్లకు మిరొనొసిత్స్కాయె గ్రామం దగ్గర చీకటిపడింది; వాళ్ళ గ్రామపెద్ద ప్రొకోఫియ్‌కి చెందిన దొడ్డిలో ఆ రాత్రి గడపడానికి నిశ్చయించుకున్నారు. వాళ్ల యిద్దరు — పశు శస్త్రవైద్యుడు ఇవాన్ ఇవానిచ్, హైస్కూలు టీచరు బూర్కిన్. ఇవాన్ ఇవానిచ్‌కి చిత్రమైన యింటిపేరు వుండింది: చీమ్షు-హిమలైస్కీ. ఆ పేరు అతనికి అతికినట్లు లేదు; అందరూ అతన్ని పేరుతోనూ, పైతృక నామంతోనూ — ఇవాన్ ఇవానిచ్ అని పిలిచేవాళ్ళు. అతను పట్టణానికి దగ్గర్లో వున్న పశుపోషణ కేంద్రంలో వుండినాడు; యిప్పుడు ఆరుబయట విహారార్థం వేటకు వచ్చినాడు. హైస్కూలు టీచరు బూర్కిన్ ప్రతి వేసవి పి. ప్రభువుగారి యెస్టేటులో గడిపేవాడు; ఆ ప్రాంతాల జనం అతన్ని తమలో ఒకనిగానే పరిగణించేవాళ్ళు.

యిద్దరూ నిద్రపోలేదు. ఇవాన్ ఇవానిచ్ సన్నగా, పొడవుగా, పెద్ద మీసాలతో వున్న వృద్ధుడు. పైపు కాలుస్తూ వాకిలి బయట వెన్నెలలో కూర్చున్నాడు. బూర్కిన్ లోపల చీకటిలో కనిపించకుండా గడ్డిమీద పండుకున్నాడు.

వాళ్ళ కథలు చెప్పుకుంటూ పొద్దుబుచ్చినారు. గ్రామపెద్ద భార్య మ్రాానను గురించి వాళ్ల మాట్లాడుకున్నారు. ఆమె సకల విధాలా ఆరోగ్యం గల మనిషి, యే విధంగానూ తెలివితక్కువది గాదు; ఆమె జీవితంలో స్వగ్రామం దాటి బయటికి వెళ్లి యెరగదు. ఆమె బస్తీ చూడలేదు, రైలు చూడలేదు, గత పదేండ్లూ పొయ్యి దగ్గర కూర్చొని గడిపింది, రాత్రిపూట మాత్రమే బయటికి మొగం చూపేది.

“అయినా, అదేమంత చిత్రం?” అన్నాడు బూర్కిన్. “యీ ప్రపంచంలో బోలెడుమంది వున్నారు అలాంటివాళ్ళు, స్వభావతః యేకాంతజీవులు, నత్తలాగ తమ గుల్లలో దూరుకోడానికి ప్రయత్నించేవాళ్ళు. బహుశా యిది కేవలం పునః పురా జీవితపు వ్యక్తీకరణ — మన పూర్వులు సంఘజీవులు కాకముందు, ఒంటరిగా గుహలలో జీవించిన నాటి కాలానికి తిరిగిపోవడం — కావచ్చు. లేక, మానవులలో వాళ్లూ ఒక

జాతి కావచ్చు — యెవరికి తెలుసు? నేను ప్రకృతి శాస్త్రజ్ఞుణ్ని కాదు; యిలాంటి సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నించడం నా పని కాదు; మా్ాలాంటివాళ్లు అరుదు కాదని మాత్రమే నేను చెప్పదలచుకొన్నది. అంతెందుకు — ఒకటి రెండు నెలల కితమే మా వూర్లో నా సహోద్యోగి ఒకాయన — గ్రీకు భాష టీచరు బేలికావ్ — మరణించివాడు. అతన్ని గురించి మీరు వినివుంటారు. అతను యెంత మంచి వాతావర ణంలోనైనా గొడుగూ, బూట్ల తొడుగులూ, చలి కోటూ లేకుండా యిల్లు కదిలేవాడు కాదని ప్రసిద్ధి. అతను గొడుగు ఒక తొడుగులో పెట్టేవాడు, అతని గడియారానికి ఒక చర్మం తొడుగు వుండేది, అతను పెన్సిలు చెక్కుకోడానికి కత్తి తీసుకుంటే, అది కూడా ఒక తొడుగునుండి తీయవలసి వచ్చేది. అతని ముఖానికి కూడా ఒక తొడుగు వున్నట్లుండేది — ముఖం యెప్పుడూ పైకెత్తిన కోటు కాలరు చాటున వుండేది. అతను నల్ల కండ్లద్దాలూ, మందం స్వెట్టరూ ధరించేవాడు, చెవులలో దూది పెట్టుకునేవాడు, గుర్రపుబండి యెక్కితే, గూడు మూయమనేవాడు. నిజానికతను తనకొక ముసుగు — అది తన్ను యేకాంతపరచి, బాహ్య ప్రభావాలనుండి రక్షించే తొడుగు అయినట్లు — సృష్టించుకోవాలనే నిత్య, దుర్వార ప్రేరణ కనబరచేవాడు. వాస్తవం అతనికి చిరాకూ, ఆందోళనా కలిగించి, నిత్య భీతావహంలో వుంచేది. బహుశా తన పిరికితనాన్నీ, వర్తమానం తనలో కలిగించిన అసహ్యాన్నీ సమర్థించుకోడానికి అతను నిత్యం భూతకాలాన్నీ, యెప్పుడూ యెక్కడా లేని వాటినీ ప్రశంసించేవాడు. అతను బోధించే మృత భాషలు సైతం అతనికీ, వాస్తవ జీవితానికీ మధ్య వున్న బూట్ల తొడుగులూ, గొడుగులూ వంటివి మాత్రమే.

" 'గ్రీకు భాష యెంత అందమైనది, యెంత శ్రావ్యమైనది!' అనేవాడు అతను ఆనంద పరవశత్వంతో. దానిని రుజువుచేయడానికి అతను కన్నులు సగం మూసి, ఒక వేలు పైకెత్తి, 'ఆం — త్రో — పాస్!'* అనేవాడు.

"బేలికావ్ తన ఆలోచనలను కూడా ఒక తొడుగులో పెట్టడానికి ప్రయత్నించే వాడు. యేదో ఒకదానిని నిషేధించే సర్క్యులర్లూ, పత్రికా వ్యాసాలూ మాత్రమే అతని బుద్ధికి అందేవి. బడిపిల్లలు రాత్రి తొమ్మిది గంటల తర్వాత వీధుల్లో వుండడాన్ని నిషేధించే ఆదేశాలు సర్క్యులేట్ చేసినప్పుడు, లేదా కామ వ్యాపారాన్ని ఖండించే వ్యాసం ప్రచురించినప్పుడు, అతనికి అన్నీ స్పష్టంగా, నిశ్చితంగా వుండివాయి — యీ విష యాలు శాశ్వతంగా నిషేధింపబడినాయి. అనుమతించడమన్నా, ప్రోత్సహించడమన్నా, అతని దృష్టిలో, వాటిలో యేదో సందేహం, యేదో చెప్పకుండా మిగిలిపోయింది, అస్ప ష్టమైనది వున్నట్లుండేది. ఒక నాటక బృందమో, రీడింగురూమో, కాఫీ హోటల్లో

* ఆంత్రొపాస్ అంటే గ్రీకు భాషలో "మనిషి." — సం.

ప్రారంభించడానికి అనుమతించినప్పుడు, అతను తల తిప్పుతూ, మెత్తగా అనేవాడు:

" 'అది మంచి పనే అనుకోండి, కానీ... దాని వలన హాని యేదీ జరగదని ఆశిద్దాం'.

"నిబంధనలకు ఉల్లంఘన గానీ, ఉపేక్ష గానీ, యే కొంచెం జరిగినా, అది అతనికి యేమాత్రమూ సంబంధించనిదైనా సరే, అతను అమాంతం కుంగిపోయేవాడు. అతని సహోద్యోగి యెవరైనా ప్రార్థనకు ఆలస్యంగా వచ్చినా, బడిపిల్లల టక్కరితనం గురించి పుకార్లు యేవైనా అతని చెవులబడినా, పిల్లల ప్రవర్తనకు బాధ్యత వహించే మహిళ యెవరైనా రాత్రి పొద్దుపోయిన తర్వాత మిలిటరీ ఆఫీసరు పక్కన కనిపించినా, అతను పూర్తిగా ఆందోళన పడిపోయి, అది క్షేమకరం కాదని పదేపదే అనేవాడు. టీచర్స్ కౌన్సిలు సమావేశాలలో అతను తన అతి జాగ్రత్తలతోనూ, సందేహాలతోనూ, భయాల తోనూ, సూచనలతోనూ (తొడుగులోని మనస్సుకు విలక్షణమైనవాటితో) మమ్మల్ని బాగా హింసించేవాడు: ఆడపిల్లల బడిలోనూ, మగపిల్లల బడిలోనూ పిల్లలు మరీ సిగ్గుమాలిన విధంగా ప్రవర్తిస్తున్నారు, క్లాసులలో ఘోరమైన అల్లరి చేస్తున్నారు — ఒకవేళ అధికార్లకీ విషయం తెలిస్తే, హాని యేదీ జరగదని ఆశిద్దాం అనేవాడు. రెండవ ఫారంలోని పెత్రోవ్‌నూ, నాల్గవ ఫారంలోని యెగోరొవ్‌నూ బహిష్కరిస్తే బాగుండదా అనేవాడు. మీకు తెలుసా? అతని నిట్టూర్పులతో, మూల్గులలో, చిన్న తెల్లని ముఖం మీద — పిల్లి ముఖం లాంటిది లెండి అది — ఆ చిన్న తెల్లని ముఖంమీద నల్లని కండ్లద్దాలతో, మమ్మల్ని యెంత కుంగిపోయేటట్లు చేసినాడంటే, మేము లొంగిపోయి, పెత్రోవ్‌కూ, యెగోరొవ్‌కూ ప్రవర్తనకు తక్కువ మార్కులు యిచ్చి, వాళ్లను లాకప్‌లో పెట్టించి, చివరకు బహిష్కరించినాము. మా యిండ్లకు వచ్చి మమ్మల్ని చూసే చిత్రమైన అలవాటు వుండింది అతనికి. తోటి ఉపాధ్యాయుని యింటికి పోయి అతను యేమీ మాట్లాడకుండా కూర్చునేవాడు, అప్రమత్త వాలకంతో. యే గంటో అతను అలా కూర్చొని, లేచి వెళ్లిపోయేవాడు. దీని నతను 'సహోద్యోగులతో సత్సంబంధాలు పెట్టుకోవడం' అనేవాడు. అతనికిది సుఖమైన కర్తవ్యం కాదనీ, తోటి ఉపాధ్యాయుని యింటికి పోవడం తన విధిగా భావించినందువల్ల మాత్రమే అతను మమ్మల్ని చూడ డానికి వస్తున్నాడనీ తేటతెల్లంగా వుండేది. అతనంటే మాకందరికీ భయం. చివరకు హెడ్‌మాస్టర్‌కు కూడా. కాస్త ఆలోచించండి! మా టీచర్లు మొత్తంమీద మంచి వాళ్లు, తెలివితేటలు గలవాళ్లు, తుర్గెనెవ్, ష్చెద్రీన్ సాహిత్యాలమీద పెరిగినవాళ్లు. కానీ యీ జానెడు మనిషి, యెప్పుడూ యెడబాయని గొడుగూ, బూట్ల తొడుగులూ గల మనిషి, పదైదేండ్ల పాటు మొత్తం పాఠశాలను తన చేతికింద పెట్టుకున్నాడు! పాఠశాలను మాత్రమే కాదు, మొత్తం పట్టణాన్ని! అతను కనుక్కుంటాడనే భయంతో, మా ఆడవాళ్లు శనివారం నాటకాలు వదలుకున్నారు. మత గురువులు అతని సమక్షంలో మాంసం తినడానికీ, పేకాట ఆడడానికీ భయపడేవాళ్లు. బేలికొవ్ లాంటివాళ్ల ప్రభా

వంతో మా పట్టణంలోనివాళ్లు ప్రతిదానికీ భయపడ సాగినారు. యేమి చేయాలన్నా భయమే వాళ్లకు, బిగ్గరగా మాట్లాడాలన్నా, ఉత్తరాలు రాయాలన్నా, స్నేహాలు చేసు కోవాలన్నా, పుస్తకాలు చదవాలన్నా, బీదవాళ్లకు సాయం చేయాలన్నా, చదువు రాని వాళ్లకు చదువు చెప్పాలన్నా...."

ఇవాన్ ఇవానిచ్ యేదో తూకం గల విషయం చెప్పడానికి సిద్ధపడుతున్నట్లు గొంతు సవరించుకున్నాడు; కానీ మొదట, ఆరిపోయిన పైపును మళ్లీ ముట్టించి, చంద్రుని వైపు చూసి, తరువాత మాత్రమే తీరికగా యిలా అన్నాడు:

"అవును, మంచివాళ్లు, తెలివితేటలు గలవాళ్లు, తుర్గెనెవ్, ష్చెద్రీన్, బోక్లె మొదలైనవాళ్లందరి రచనలూ చదివేవాళ్లు, అయినా వాళ్లు లొంగినారు, అతన్ని భరించినారు.... అంతే."

"బేలికొవ్వూ, నేనూ ఒకే భవనంలో ఒకే అంతస్తులో వుండినాము," అంటూ బూర్కిన్ కొనసాగించినాడు. "మా వాకిలికి సరిగా యెదురుగా అతని వాకిలి, మేము ఒకరి నొకరు నిత్యం చూసుకునే వాళ్లం, అతని గృహ జీవితం గురించి నాకు బాగా తెలును. అది కూడా అదే కథే: డ్రెస్సింగు గౌనూ, రాత్రి టోపీ, మూసిన తలుపులూ, వేసిన గడెలూ, తెగబారెడు పొడవున నిబంధనలూ, నిషేధాలూ, అదే నీతిమాత్రమూ — యే హానీ జరగదని ఆశిద్దాం! లెంట్ పండుగకాలపు ఉపవాసం అతనికి పడేది కాదు; కానీ అతను మాంసం తినలేకపోయేవాడు; తింటే, బేలికొవ్ లెంట్‌ను పాటించలేదని లోకం అంటుంది. కనుక అతను వెన్నలో వేయించిన చేపలు తినేవాడు — అది ఉపవాసం కాదు, కానీ అది మాంసమని కూడా అనలేరు. లోకులు 'యేమైనా' అనుకుంటారని, అతను ఆడ పనిమనుషులను పెట్టుకోలేదు. అతనికొక మగ వంటమనిషి వుండినాడు, అఫనాసియ్ అనే అరవై యేండ్ల ముసలివాడు, తాగుబోతు, తలతిక్క మనిషి, యెప్పుడో కొంత కాలం మిలిటరీలో నౌకరుగా పనిచేసాడు. అంచేత వంటచేయడం తెలును. అఫ నాసియ్ మామూలుగా చేతులు కట్టుకొని, యెప్పుడూ పెద్ద నిట్టూర్పుతో అదే మాట మళ్లీమళ్లీ గొణుగుతూ, వాకిలి బయట నిలుచుకొని వుండేవాడు:

"'ఆ, యీమధ్య యెప్పుడూ కనిపిస్తుంటారు వాళ్లు!'

"బేలికొవ్ బుల్లి పడకగది పెట్టె లాంటిది; మంచానికి చాందినీ వుండేది. పండుకునేటప్పుడు అతను తలకు ముసుగుతన్నేవాడు. గది వేడిగా, ఉక్కగా వుండేది. గాలికి మూసిన తలుపులు ధణధణలాడేవి, పొగగూడు ఓంకారనాదం చేసేది. వంట గదిలో నిట్టూర్పులు, అరిష్టసూచకమైన నిట్టూర్పులు వినపడేవి....

"దుప్పటికింద వణుకుతూ పండుకునేవాడు అతను. యేదో అరిష్టం జరుగు తుందని అతనికి భయం, అఫనాసియ్ తనను ఖూనీచేస్తాడని భయం, యింట్లో దొంగలు పడతారని భయం; యీ భయాలతో అతనికి పీడకలలు వచ్చేవి. ప్రొద్దువపూట మేము

కలిసి బడికి వెళ్లేటప్పుడు అతను యెప్పుడూ పాలిపోయి, నీరసంగా వుండేవాడు. అతను సమీపించే జన సమ్మర్దపు పాతశాల అతని భయానస్యాలకు కారణమనీ, ప్రభావతః యేకాంతజీవి అయిన అతనికి నాపక్కన నడవడం వెగటుగా వుందనీ చెప్పకనే చెప్పినట్లు వుండేది.

"'క్లాసుల్లో తెగ అల్లరి చేస్తారు' అనేవాడు అతను, తన హృదయ భారానికి కారణం చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లు. 'పరమ సిగ్గుమాలిన పని!'

"యేం జరిగిందనుకున్నారు? యీ గ్రీకు టీచరు, యీ గుల్లలోని నత్త ఒకసారి పెండ్లి చేసుకున్నంత పని జరిగింది."

ఇవాన్ ఇవానిచ్ తకీమని పాకవైపు తల తిప్పినాడు.

"నిజంగానా!" అన్నాడు అతను.

"నిజంగా. పెండ్లి చేసుకున్నంత పని జరిగింది – నమ్మడం కష్టమే అనుకోండి. మాకు చరిత్రకూ, భూగోళానికీ ఉక్రేనియన్ మనిషి, మిహాయీల్ సావ్విచ్ కొవలేంకొ అని కొత్త టీచరు వచ్చినాడు. అతని వెంట అతని సోదరి వార్యా కూడా వచ్చింది. అతను యువకుడు, పొడవుగా, చామన చాయగా వుండినాడు, పెద్ద చేతులూ, గంభీరమైన కంఠం. వాటికి నప్పేలాంటి ముఖం. నిజాని కతనిది మేఘగంభీర కంఠం, గుహలోనుండి వచ్చినట్లుండేది శబ్దం.... అతని సోదరి అంత చిన్న వయసుది కాదు, ముప్పై ఆ మధ్య వుంటుంది; ఆమె కూడా పొడగరి; జీలుగ బర్ర లాగ సన్నగా, నల్లని కను బొమలూ, యెర్రని బుగ్గలూ, మహా ముచ్చటైన అమ్మాయి ఆమె; సరదాగా, నోరు మూతపడకుండా, యెప్పుడూ ఉక్రైనా పాటలు పాడుతూ, యెప్పుడూ నవ్వుతూ వుం దేది. మాటకు ముందు గలగలగల నవ్వులు కురిపించేది. ఆ అక్కాతమ్ముళ్లతో మాకు మొట్టమొదట నిజమైన పరిచయం కలిగింది, నాకు జ్ఞాపకమున్నంత వరకు, మా హెడ్మాస్టరు పుట్టిన రోజు పార్టీలో. టీచర్లు కఠినమైనవాళ్లు, సంప్రదాయ బద్ధులు, నిరుత్సాహ జీవులు, పార్టీలకు పోవడం కూడా ఒక విధిగా యెంచేవాళ్లు; అలాంటివాళ్ల మధ్య హఠాత్తుగా, సముద్రపు నురుగులోనుండి ఒక కొత్త అప్సరస, నడుములమీద చేతులు పెట్టుకొని నడిచే అప్సరస, ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ వుండే అప్సరస ఉద్భవించింది. 'గాలి వీస్తున్నది' అనే పాట ఆమె యెంతో ఆవేశంతో పాడేది, తరువాత యింకొక పాట పాడేది, తరువాత మరొకటి; మేమందరమూ ముగ్ధుల మైనాము, బేలికొవ్ కూడా. అతను ఆమె పక్కన కూచొని తియ్యని చిరునవ్వుతో యిలా అన్నాడు:

"'ఉక్రైనా భాష మాధుర్యంలోనూ, ఆహ్లాదకరమైన శ్రావ్యతలోనూ పురాతన గ్రీకు భాషలాంటిది.'

"ఆమె ఉబ్బిపోయి, గద్యాచి తాలూకాలోని తమ పొలం గురించి హృదయ పూర్వ కమైన అనురక్తితో చెప్పసాగింది – అక్కడ వాళ్ల అమ్మ వుంది, అక్కడ యెలాంటి

పియర్స్, యెలాంటి కరబూజ పండ్లూ, యెలాంటి గుమ్మడికాయలూ వున్నాయని! ఉక్రైనాలో గుమ్మడికాయలను మారో అంటారు, నీలి వంకాయలతోనూ, యెర్ర మిరపకాయలతోనూ మహా పసందైన పులుసు చేస్తారు, యెంత బాగుంటుందో తెలుసా అది!

"మేము ఆమె చుట్టూ చేరి, వింటూ కూర్చున్నాము. మా కందరికీ ఒకే ఆలోచన వచ్చింది.

" 'పిల్లిద్దరూ యెందుకు పెండ్లి చేసుకోకూడదు?' హెడ్‌మాస్టరు భార్య మెల్లగా నాతో అన్నది.

"యెందువల్లనో హఠాత్తుగా ప్రతివొకరికీ బేలికొవ్ బ్రహ్మచారి అని గుర్తువచ్చింది. అతని జీవితంలో అంత ముఖ్యమైన విషయాన్ని మేము యెలా గుర్తించలేదో, యెలా అది పూర్తిగా మా దృష్టిని తప్పించుకున్నదో మాకు ఆశ్చర్యమైంది. స్త్రీపట్ల అతని వైఖరి యేమిటి, యీ ముఖ్య సమస్యను అతను యెలా పరిష్కరించుకున్నాడు? దీన్ని గురించి మేమెవ్వరూ ఆలోచించలేదు. యేడాది పొడుగునా బూట్లు తొడుగులు తొడుక్కొని, చాందినీకింద పండుకునేవాడు ప్రేమించగలడనే భావాన్ని మేమెవరమూ ఒప్పుకోలేకపోయి వుండవచ్చు.

" 'అతనికి నలభైకి పైగా వున్నాయి, ఆమెకు ముప్పై....' అంటూ హెడ్‌మాస్టరు భార్య కొనసాగించింది. 'అతన్ని వొప్పుకుంటుందనుకుంటాను.'

"కేవలం యేమీ తోచకపోవడంతో, చిన్న వూళ్లలో యెలాంటి అసంబద్ధమైన, నిరుపయోగమైన పనులు చేస్తామని! యెందుకంటే, చేయవలసిన పని యెవ్వరూ చేయం గనుక. యీ బేలికొవ్‌కు, భర్తని పాత్రలో యెవరూ ఊహించలేని మనిషికి, పెండ్లి చేయడం మా పని అయినట్లు మా కెందుకు అనిపించింది, యెందుకు? హెడ్‌మాస్టరు భార్యకూ, యిన్‌స్పెక్టరు భార్యకూ, పాఠశాలతో సంబంధమున్న ఆడ వాళ్లకందరికీ చివరకు వాళ్ల జీవితంలో ఒక లక్ష్యం యేర్పడినట్లు, ముఖాలు వికసించి నాయి, వాస్తవంగా అందరికీ మరింత అందం వచ్చింది. హెడ్‌మాస్టరు భార్య నాటక శాలలో బాక్సు టిక్కెట్లు తీసుకుంది, ఆ బాక్సులో యెవరున్నారో తెలుసా? వార్యా! పెద్ద విసనకర్రతో విసరుకుంటూ, కళకళలాడుతూ, ఆనందంగా వుండి. ఆమె పక్కన బేలికొవ్ వున్నాడు, చిన్న మనిషి, ముడుచుకొని, తన గదిలోనుండి పట్టకారుతో బయటకి లాగినట్టు! నేనే ఒక పార్టీ యిచ్చినాను; దానికి నేను బేలికొవ్‌నూ, వార్యానూ ఆహ్వానించాలని ఆడవాళ్లు పట్టుబట్టినారు. ఒక్క మాటలో చెప్పాలంటే, మేము తేరు కదిలించినామన్నమాట. పెండ్లి మాట వార్యాకు అయిష్టం కాదని అర్థమైంది. తమ్మునితో కలిసివుండడం ఆమెకు సంతోషంగా లేదు; పొద్దస్తమానం వాళ్లు కీచు లాడుకునేవాళ్లు. వాళ్ల జీవితంలో ఉదాహరణప్రాయమైన ఘట్టం ఒకటి వినండి:

కొవలేంకొ పొడవుగా, బలిష్ఠంగా, వీధిలో అంగలు వేసుకుంటూ నడుస్తుంటాడు. బుటావని చేసిన చొక్కా వేసుకొని, టోపీకిందనుండి నొసటిమీదికి వాలిన ముందరి జూలుతో, ఒక చేతిలో పుస్తకాల కట్టా, మరొక చేతిలో పొట్టులుతిరిగిన చేతికర్ర పట్టుకొని నడుస్తుంటాడు. అతని సోదరి కూడా పుస్తకాలు మోసుకుంటూ అతనివెంట వస్తూ వుంటుంది.

" 'నువ్వు చదవలేదు మిష, అది!' అని ఆమె కేక వేస్తుంది. 'నువ్వు చదవలేదు, నాకు తెలుసు, నీవెప్పుడూ చదవలేదని నాకు నిశ్చయంగా తెలుసు!'

" 'నాకు తెలుసు, నేను చదివినానది,' అని కొవలేంకొ కేకవేస్తాడు, రోడ్డుమీద చేతికర్ర తాటిస్తూ.

" 'నీ పుణ్యమాయిరి మిష! యెందుకంత కోపం? యేమైనా యిది సిద్ధాంతానికి సంబంధించిన విషయం!'

" 'నాకు తెలుసు, నేను చదివినాను!' అని కొవలేంకొ యింకా బిగ్గరగా అరుస్తాడు.

"యిక యింటివద్ద, యెవరైనా వాళ్లను చూడడానికి వెళ్లినప్పుడల్లా, వాళ్ళ కీచులాట ప్రారంభిస్తారు. బహుశా ఆ జీవితంతో ఆమెకు ముఖం మొత్తి, సొంత కాపురం కోసం తపిస్తూ వుండి వుంటుంది. తరువాత, ఆమె వయస్సు: యేరి కోరుకోడానికి వ్యవధి లేదు, ఆడపిల్ల యెవరినైనా పెండ్లి చేసుకుంటుంది, గ్రీకు టీచరునైనా సరే. అన్నట్లు, మన ఆడపిల్లలందరూ అంతే — యెవరినైనా సరే పెండ్లిచేసుకుంటారు, పెండ్లి అనేది చేసుకోడానికి. అది పోనీలే, వార్యా యీ మా బేలికొవ్ పట్ల యిష్టం చూపించడం ప్రారంభించింది.

"యిక బేలికొవో? అతను మా అందరి యిండ్లకు వచ్చినట్లే కొవలేంకొ యింటికీ వెళ్లేవాడు. చూడడానికి వెళ్లి, యేమీ మాట్లాడకుండా కూర్చునేవాడు. అతను మౌనంగా కూర్చొనివుంటే, వార్యా తన నల్లని కన్నులతో అతనివైపు చూస్తూ, 'గాలి వీస్తున్నది' అని పాడేది, లేదా హఠాత్తుగా గలగలగల పగలబడి నవ్వేది.

"హృదయానికి సంబంధించిన వ్యవహారాలలో, ముఖ్యంగా అందులో పెండ్లి యిమిడివున్నప్పుడు, సూచనప్రాయమైన సలహా భరించలేనిది. ప్రతివొకరూ — అతని సహోద్యోగులూ, ఆడవాళ్లూ — బేలికొవ్‌కు నచ్చజెప్పసాగినారు, అతను పెండ్లిచేసుకోవడం న్యాయమనీ, అతనికి పెండ్లి ఒకటే యిక జీవితంలో మిగిలింది అనీ. మేమందరమూ అతన్ని అభినందించి, గంభీరమైన ముఖభంగిమలతో రకరకాల మామూలు మాటలు చెప్పినాము, పెండ్లి అనేది మహత్తరమైనది అనీ, వగైరా. పైగా, వార్యా అనాకర్షణీయమైనది కాదు, ఆకర్షణీయమైనదని కూడా అనవచ్చు, పెద్ద ఉద్యోగస్థుని కూతురు, సొంత పొలం వుంది, అంతకంటె ముఖ్యమైనది యేమిటంటే, అతన్ని ఆపేక్షతో

చూసిన మొట్టమొదటి స్త్రీ. ఆవిధంగా అతను మనసు అర్పించి, పెండ్లిచేసుకోవడం తన విధి అనే నమ్మకానికి వచ్చినాడు."

"అతని గొడుగూ, బూట్లు తొడుగులూ తీసిపారవేసే తరుణం అది!" అన్నాడు ఇవాన్ ఇవానిచ్.

"ఆం — కానీ అది అసాధ్యమైంది! అతను వార్యా ఫొటోను తన డెస్కుమీద పెట్టుకున్నాడు, వార్యాను గురించీ, సంసార జీవితం గురించీ, వివాహంలోని గురుతర బాధ్యత గురించీ మాట్లాడడానికి నాదగ్గరికి వస్తూవుండినాడు, తరుచుగా కొవలేంకొ యింటికి వెళ్లేవాడు, కానీ తన జీవితవిధానం అణుమాత్రమూ మార్చుకోలేదు. మార్చుకోకపోవడమే కాదు — పెండ్లి చేసుకోవాలనే నిర్ణయం అతనిమీద బాధాకరమైన ప్రభావం కలిగించినట్లుంది, అతను యింకా చిక్కిపోయినాడు, యింకా పాలిపోయినాడు, తన గుల్లలోకి యింకా ముడుచుకుపోయినట్లు కనపడినాడు.

" 'వార్యా మంచి అమ్మాయి లాగే వుంది,' అని నాతో తన మామూలు రేఖామాత్రపు వంకర చిరునవ్వుతో అన్నాడు. 'మరి ప్రతివొకడూ పెండ్లిచేసుకోవలసిందే, నాకు తెలుసు, కానీ.... యిదంతా ఉట్టిపాటుగా వుంది, కదూ.... యిది ఆలోచించుకోవలసిన విషయం....'

" 'ఆలోచించుకునే దేముంది? పెండ్లిచేసుకోండి, అంతే,' అని నేను జవాబిచ్చినాను.

" 'లేదు లేదు, పెండ్లి మహత్తరమైన కార్యం, భావి విధులూ, బాధ్యతలూ మొదట బాగా తూకం వేసుకోవాలి.... తరువాత యే హానీ జరక్కుండా.... యిది నన్ను కలచివేస్తున్నది, నాకు రాత్రిపూట నిద్రపట్టడం లేదు. నిజం చెప్పాలంటే, నాకు కాస్త భయంగా వుంది — వాళ్లు అంత చిత్రమైన పద్ధతిలో ఆలోచిస్తారు, ఆమే, ఆమె తమ్ముడూ; వాళ్ల దృక్పథం, మీకు తెలుసుగా, చాలా చిత్రమైనది. పైగా ఆమె చాలా సరదా మనిషి. నేను పెండ్లి చేసుకొని, యెందులో అయినా యిరుక్కుంటే....'

"అతను పెండ్లి ప్రతిపాదన వాయిదా వేసినాడు, రోజారోజుకూ వాయిదా వేస్తూ వచ్చినాడు. హెడ్‌మాస్టరు భార్యకూ, యితర ఆడవాళ్లకూ యెంతో ఆశాభంగం కలిగింది. అతను భావి విధులనూ, బాధ్యతలనూ తూకం వేసుకుంటూ వుండినాడు, వార్యాతో కలిసి దాదాపు ప్రతిరోజా షికార్లుపోతూ వుండినాడు, ఆ పరిస్థితిలో అది తన బాధ్యత అనుకున్నాడు గాబోలు; కుటుంబ జీవితాన్ని అన్ని కోణాల నుండీ చర్చించడానికి నావద్దకు వస్తూవుండినాడు. బహుశా చివరకు అతను పెండ్లి ప్రతిపాదన చేసివుండేవాడు; కేవలం యేమీ తోచకపోవడం మూలంగానూ, అంతకు మించిన పనేమీ లేకపోవడం మూలంగానూ. యిక్కడ జరిగే వేలాది మతి లేని, అవసరం లేని పెండ్లిండ్లలో మరొకటి జరిగివుండేది. కానీ, యింతలో, హఠాత్తుగా పెద్ద అకార్యం ఒకటి జరిగింది. మీకు మరొక విషయం చెప్పాలి, వార్యా తమ్ముడు కొవలేంకొకు మొట్టమొదటి నుండీ

బేలికొవ్‌మీద ద్వేషంగా వుండేది, అతన్ని బొత్తిగా భరించలేక పోయేవాడు.

"కొవలేంకొ అనేవాడు, భుజాలు కుదిస్తూ: 'ఆ పీనుని, ఆ మూర్ఖుని, మీరెలా సహించగలరు? మీరిక్కడ యెలా వుండగలుగుతున్నారు? యీ వాతావరణం విషపూరితం, ఊపిరి సలపనివ్వదు. మీరు ఉపాధ్యాయులా, జ్ఞానదాతలా? మీరంతా కుక్షింభరుల మంద. మీ పాఠశాల విజ్ఞాన దేవాలయం కాదు, అనాథ శరణాలయం; పోలీసువాని గుడిసెలాగ, యిది కంపు కొడుతున్నది. మిత్రులారా, నేను మీతో కలిసి చాలా రోజులు వుండను, మా పొలం చేరుకుంటాను, అక్కడ చేపలు పట్టుకుంటాను, మా ఉక్రైనా పిల్లలకు చదువుచెప్తాను. ఆః, నేను వెళ్లిపోతాను, మీ రిక్కడే వుండండి మీ కాలనేమిగానితో కలిసి, వానితో కలిసి చావండి!'

"యింకా ఒకొకసారి అతను మొదట మేఘగర్జ లాగ నవ్వి, తరువాత కండ్లలో నీళ్లు తిరిగే దాకా కీచుకొంతులో నవ్వేవాడు.

" 'యెందుకతను యిక్కడ కూర్చునేది? వూరక కూర్చొని గుడ్లప్పగించి చూస్తుం టాడు — యేమిటి అతని ఉద్దేశం?'

"బేలికొవ్‌కు అతను జోరీగ అని, తన సొంత మారుపేరు పెట్టినాడు.

"సహజంగానే, అతని సోదరి యీ 'జోరీగ'ను పెండ్లాడబోతున్నదనే విషయం అతనిదగ్గర యెత్తడం మానుకున్నాము. బేలికొవ్‌లాంటి గౌరవస్థుని అతని సోదరి పెండ్లాడడం హర్షించదగిన విషయమని హెడ్‌మాస్టరు భార్య కొవలేంకొతో అన్నప్పుడు, అతను బొమలు ముడివైచి, యిలా అన్నాడు:

" 'అది నా వ్యవహారం కాదు. ఆమె పామును చేసుకున్నా నాకు సంబంధం లేదు, యితర్ల వ్యవహారాలలో నేను వేలు దూర్చేవాణ్ని కాదు!'

"యిక, తరువాతి కథ వినండి. యెవడో ఒక చతురుడు ఒక వ్యంగ్య చిత్రం గీసి నాడు: బూట్ల తొడుగులలో బేలికొవ్, పంట్లాం కొనలు పైకి మడిచి వున్నాయి, అతని తలమీద తెరచి పట్టుకున్న గొడుగు; చేతిలో చెయ్యి వేసి వారెంకా; చిత్రంకింద లేఖనం యిలా వుంది: 'ప్రేమించిన ఆంత్రొపాస్.' అతని ముఖభంగిమ అతి సహజంగా వుంది. ఆ చిత్రకారుడు చాలా రోజులు కష్టపడి వుండాలి. యెందుకంటే, మా పట్టణంలోని రెండు పాఠశాలల ఉపాధ్యాయులకూ, ఉద్యోగస్తుల కందరికీ చిత్రం ప్రతులు అంది వాయి. బేలికొవ్‌కు కూడా ఒకటి అందింది. ఆ వ్యంగ్యచిత్రం అతన్ని కుంగదీసింది.

"ఆ రోజు మే మిద్దరమూ యింటినుండి కలిసి వెళ్లినాము. ఆ రోజు మే మొదటి రోజు, ఆదివారం; మొత్తం బడి అంతా, విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, బడివద్ద కలుసుకొని, పట్టణం వెలుపల వున్న వనంలోకి నడిచిపోవాలి. సరే, మేమిద్దరమూ యింటినుండి బయటికి పోయినాము, అతను కుంగిపోయిన మనస్థితిలో వుండినాడు.

"'ప్రపంచంలో యెంత క్రూరులు, ఈర్ష్యాళువులు వున్నారు,' అన్నాడతను; అతని పెదవులు వణకినాయి.

"నాకు అతన్ని చూసి పాప మనిపించింది. మేము నడుస్తూ వుండగా, మాకు యెవరు కనిపించినారో తెలుసా? సైకిలుమీద కొవలేంకొ కనిపించినాడు; అతని వెంట వార్యా కూడా గనపెడుతూ, సైకిలుమీద వస్తున్నది, ఆమె ముఖమంతా యెర్రగా కంది పోయి వుంది, కానీ ఉల్లాసంగా, ఆనందంగా వుంది.

"'మీ అందరికంటె ముందు చేరతామక్కడ!' అని ఆమె కేకవేసింది. 'యీ రోజు దివ్యంగా వుంది కదూ? అద్భుతమైన దినం!'

"త్వరలో వాళ్ళ కనుమరుగైనారు. బేలికొవ్ శవంలాగ పాలిపోయి, కొయ్యబారి పోయినాడు. అతను నిలబడి, నావైపు తేరిచూసినాడు.

"'యేమిటి దీని అర్థం? లేక నా కండ్లు నన్ను మోసగిస్తున్నాయా? అయ్య వార్లకూ, ఆడవాళ్లకూ సైకిళ్ల తొక్కడం ఉచితమా?' అని అడిగినాడు అతను.

"'అనుచితం యేముంది అందులో?' అన్నాను నేను. 'సైకిళ్ళ యెందుకు తొక్కకూడదు వాళ్ళ?'

"'యిది సహించరానిది!' అని అరిచినాడు అతను. 'మీరలా యెలా మాట్లాడ గలుగుతున్నారు?'

"అతనికి తగిలిన ఆఘాతం మితిమీరినది. ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం యిష్టంలేక, అతను యింటికి మళ్లినాడు.

"మరు దినమంతా అతను ఆందోళనగా చేతులు నలువుకుంటూ, ఉలిక్కిపడుతూ వుండినాడు; అతని ఆరోగ్యం బాగా లేనట్లు అతని ముఖం కనిపిస్తూవుండింది. పాఠాలు అయిపోకముందే అతను బడినుండి యింటికి పోయినాడు — అది యెప్పుడూ అతను చేయని పని. ఆ రోజు అతను భోజనం చేయలేదు. సాయంత్రం, అది ఆసలైన వేసవి రోజు అయినప్పటికీ, అతను వెచ్చని దుస్తులు వేసుకొని, కాళ్లీడ్చుకుంటూ కొవలేంకొ యింటికి పోయినాడు. వార్యా యింట్లో లేదు, కానీ తమ్ముడు వుండినాడు.

"'దయచేసి కూర్చోండి,' అన్నాడు కొవలేంకొ ముభావంగా, కనుబొమలు ముడి వేస్తూ. అతను అప్పుడే మధ్యాహ్నం నిద్రనుండి లేచివుండినాడు; ముఖం నిద్రమత్తుతో మజ్జుగా వుండింది, మనస్సేమీ బాగాలేదు.

"సుమారు పది నిముషాలు మౌనంగా కూర్చొన్న తర్వాత బేలికొవ్ ప్రారంభించి నాడు:

"'నేను నా మనోభారం దించుకోడానికి వచ్చినాను. నాకు చాలా బాధ కలిగింది. యెవడో అజ్ఞాత హాస్యగాడు బొమ్మ గీసి, నన్నూ, మనిద్దరికీ ప్రియమైన మరొక వ్యక్తినీ అపహాస్యం చేసినాడు. అది నా తప్పు కాదని మీకు నచ్చచెప్పడం నా ధర్మమను

కుంటున్నాను. అలాంటి అవహాస్యానికి నేనే కారణమూ కల్పించలేదు, పైగా, నేను సర్వదా యెంతో పెద్దమనిషి లాగ వ్యవహరించినాను.'

కొవలేంకొ మౌనంగా, ముఖం మాడ్చుకుంటూ కూర్చున్నాడు. కాసేపు ఆగి, బేలికొవ్ మెల్లగా, దుఃఖపూరిత కంఠంతో కొనసాగించినాడు:

" 'మీతో చెప్పవలసింది మరొకటి కూడా వుంది. నేనీ వుద్యోగంలో పాతకాపును, మీరు కొత్తవాళ్లు; అనుభవం గల సహోద్యోగిగా నేను మీకు హెచ్చరిక యివ్వడం నా ధర్మం. మీరు సైకిల్ తొక్కుతారు; కుర్రవాళ్లకు విద్య చెప్పే లక్ష్యం వున్న వాళ్లకిది చాలా నిందార్హమైన వినోదం.'

" 'యెందుకు?' అన్నాడు కొవలేంకొ, తన సహజ గంభీర కంఠంతో.

" 'దీనికి తాత్పర్యం అవసరమా మిహయీల్ సావ్విచ్? యిది తేటతెల్లంగా తెలుస్తూనే వుందని నా నమ్మకం. అయ్యవార్లు సైకిళ్లమీద పోతే, యిక కుర్రవాళ్లు తలక్రిందులుగా నడవడానికి అభ్యంతర మేముంది? దీన్ని అనుమతించే సర్క్యులర్ యేదీ రాలేదు గనుక, యిది తప్పు. నిన్న నాకు దిగ్భ్రాంతి కలిగింది. మీ అక్కను చూసినప్పుడు నాకు మూర్ఛ వచ్చినంత పనైంది. ఒక ఆడమనిషి సైకిలుమీద — వూహించలేం!'

" 'యేమిటి మీరు నన్ను కోరేది, సరిగా చెప్పండి?'

" 'మీకు హెచ్చరిక యివ్వడమే నా కోరిక, మిహయీల్ సావ్విచ్. మీరు యువకులు, జీవితమంతా ముందున్నది. మీరు చాలా జాగ్రత్తగా వుండాలి, కానీ మీరు యింత నిర్లక్ష్యంగా వున్నారు, యింత మహా నిర్లక్ష్యంగా! మీరు బుటా పనిచేసిన చొక్కాలలో తిరుగుతారు, యేవేవో పుస్తకాలు పట్టుకొని నిత్యం వీధుల్లో కనిపిస్తారు, యిప్పుడీ సైకిలు. మీరూ, మీ అక్కా సైకిళ్లు తొక్కే సంగతి హెడ్‌మాస్టరుకు చెప్తారు, అది పాఠశాల పోషకుని చెవుల్లో పడుతుంది.... యిది క్షేమం కాదు.'

" 'నేనూ, మా అక్కా సైకిళ్లు తొక్కినా, తొక్కకపోయినా, యెవరికేం సంబంధం!' అన్నాడు కొవలేంకొ, యెర్రబడిన ముఖంతో. 'మా యింటి వ్యవహారాలలోనూ, కుటుంబ వ్యవహారాలలోనూ యెవరైనా వేలుపెడితే, వాళ్లు యే యేట్లో పడిచచ్చినా నేను లెక్కచెయ్యను.'

"బేలికొవ్ వివర్ణుడై, లేచి నిలబడినాడు.

" 'మీరీ ధోరణి వహిస్తున్నారు గనుక, యిక నేనేమీ చెప్పజాలను,' అన్నాడు అతను. 'మన పై అధికార్లను గురించి నా సమక్షంలో మీరు జాగ్రత్తగా మాట్లాడండని ప్రార్థిస్తున్నాను. అధికార్లను గౌరవంతో చూడాలి.'

" 'అధికార్లను గురించి నేను తప్పుగా మాట్లాడినానా?' అతన్ని ద్వేషంతో చూస్తూ, అడిగినాడు కొవలేంకొ. 'అయ్యా, నా జోలికి రాకండి. నేను కపటమెరగని

వాణ్ని, మీలాంటివాళ్లతో నాకు మాట్లాడవలసిందేమీ లేదు. నాకు విష్వరుగులంటే అసహ్యం.'

"బేలికొవ్ తత్తరపాటుతో తొందర తొందరగా కోటు తొడుక్కున్నాడు; అతని ముఖం కంపరంతో నిండిపోయింది. అతని జీవితంలో అతన్ని యెవరూ యింత అమర్యాదగా మాట్లాడలేదు.

" 'మీ యిష్టం వచ్చినట్లు అనండి,' అన్నాడు అతను మెట్లవద్దకు పోతూ. 'మీకు హెచ్చరిక యివ్వాలి: మన మాటలు యెవరైనా వినివుండవచ్చు. మన మాటలకు యెవరూ అపార్థం కల్పించకుండా, దానివల్ల దుష్ఫలితాలు కలగకుండా వుండడానికి, మన సంభాషణ సారాంశాన్ని నేను హెడ్‌మాస్టరుకు రిపోర్టు చేయవలసి వుంటుంది.... దాని ముఖ్యాంశాలు. అది నా విధి.'

" 'యేమిటీ? రిపోర్టా? పో, చేసుకో పో!'

"అంటూ కొవలేంకొ అతని కాలరు పట్టుకొని ఒక తోపు తోసినాడు. బేలికొవ్ మెట్లగుండా దొర్లుతూ పడినాడు, బూట్ల తొడుగులు మెట్లకు కొట్టుకున్నాయి. మెట్ల వరుస ఎత్తుగా నిటారుగా వుంది, కానీ బేలికొవ్ నిరపాయంగా అడుగున చేరి, లేచి నిలబడి, కండ్లద్దాలు పగిలిపోయినాయేమో అని, భ్రూమధ్యం తడుముకున్నాడు. కానీ, అతను మెట్లగుండా కిందికి దొర్లేటప్పుడు, వార్యా, మరి యిద్దరు స్త్రీలూ అక్కడికి వచ్చినారు; వాళ్లు ముగ్గురూ మెట్ల దగ్గర నిలబడి అతన్ని చూసినారు — బేలికొవ్‌కు కలిగిన బాధలన్నింటిలోకీ అది పెద్దది. యీ సన్నివేశాలు స్థితిలో కనిపించడం కంటె, కాళ్లూ, చేతులూ విరిగి వుండినా అతను సహించేవాడు. యిప్పుడు వూరందరికీ యీ విషయం తెలుస్తుంది, హెడ్‌మాస్టరుకు చెప్తారు, బహుశా పాఠశాల పోషకునికి కూడా. దానిమీద యేమి జరుగుతుందో! యెవరైనా మరొక వ్యంగ్య చిత్రం గీయవచ్చు, అప్పుడు తాను రాజీనామా చేయవలసివుంటుంది....

"అతను లేచినప్పుడు వార్యా అతన్ని గుర్తుపట్టింది; ఆమె అతని పరిహాసాస్పదమైన ముఖమూ, నలిగిన కోటూ, బూట్ల తొడుగులూ చూసింది; యేమి జరిగిందో ఆమెకు యీషణ్మాత్రమూ తెలియదు, కానీ అతను కాలుజారి పడివుంటాడని ఆమె ఊహించుకొని, నవ్వు పట్టలేక, తన సహజ ధోరణిలో 'హాహాహా' అని పగలబడి నవ్వింది.

"యీ ఉల్లాసవు 'హాహాహా'తో — బేలికొవ్ ప్రణయానికీ, భూమిమీద అతని మనుగడకూ స్వస్తి జరిగింది. అప్పుడు అతనికి వార్యా యేమన్నదీ వినపడలేదు, యేమీ కనపడలేదు. అతను యింటికి పోయిన వెంటనే చేసిన మొదటి పని తన డెస్కు మీదనుండి వార్యా ఫోటోను తీసివేయడం; తరువాత అతను మంచంమీద పండుకున్నాడు, యిక మళ్లీ లేవలేదు.

"మూడు రోజుల తర్వాత అఫనాసియ్ వచ్చి, తన యజమాని చాలా చిత్రంగా

ప్రవర్తిస్తున్నాడనీ, డాక్టర్ను పిలిపించాల్నా అనీ నన్నడిగినాడు. నేను బేలికొవ్‌ను చూడ డానికి వెళ్లినాను. అతను తన చాందినీకింద, దుప్పటి కప్పుకొని నోట మాట లేకుండా, పండుకున్నాడు. నా ప్రశ్నలకు 'ఔను' అనో, 'కాదు' అనో పొడి మాటలతో అతను జవాబులు చెప్పినాడు. అతను అక్కడ పండుకొని వుండగా, అఫనాసియ్ మూతి ముడుచుకొని, ముఖం మాడ్చుకొని, మంచంవద్ద దబదబ అడుగులు వేస్తూ, కల్లు దుకాణంలాగ కంపుకొడుతూ, నిట్టూర్పులు నిగిడిస్తూ వుండినాడు.

"ఒక నెల గడిచింది, బేలికొవ్ మరణించినాడు. అందరూ, — అంటే, రెండు పాఠశాలలకూ, సెమినరీకీ చెందినవాళ్లందరూ — అతని అంత్యక్రియలకు వెళ్లినారు. అతను శవపేటికలో పండుకొని వుండగా, అతని ముఖం ప్రసన్నంగా వుండింది, యిక యెన్నడూ వదలిపెట్టవలసిన పని లేని గుల్లలో చివరకు తన్ను వుంచినందుకు సంతోషిస్తున్నట్లు, ఉల్లాసంగా కూడా వుండింది. అవును, తన ఆదర్శం సాధించినాడు అతను! అతని గౌరవార్థమా అన్నట్లు ఆ రోజు మబ్బులు పట్టి చిత్తడిగా వుండింది, మేమందరమూ బూట్ల తొడుగులు తొడుక్కొని, గొడుగులు పట్టుకున్నాము. వార్యా కూడా శ్మశానానికి వచ్చింది, శవపేటికను సమాధిలోకి దింపినప్పుడు ఒక కన్నీటి బొట్టు వదలింది. నేను గమనించినంతలో, ఉక్రైనా స్త్రీలు నవ్వనైనా నవ్వాలి, యేడ్వనైనా యేడ్వాలి, యీ రెండిటి మధ్యనా మరే స్థితీ వాళ్లెరగరు.

"బేలికొవ్ లాంటివాళ్లను పూడ్చిపెట్టడం మహా సంతోషకరం అని ఒప్పుకుంటాను. కానీ, శ్మశానంనుండి మేము వేలాడే ముఖాలతో తిరిగివచ్చినాము, మాకు కలిగిన స్వేచ్ఛాభావాన్ని యెవరమూ వెల్లడించ దలచుకోలేదు — పెద్దవాళ్లు యెక్కడికైనా వెళ్లిపోతే, గంటో రెండు గంటలో పూర్తి స్వేచ్ఛగా ఆడుకోవచ్చునని చిన్నప్పుడెప్పుడో మేము అనుభవించిన స్వేచ్ఛాభావం లాంటిది అది. ఆ, స్వేచ్ఛ! దాని సూచన చాలు, అది లభిస్తుందనే రేఖామాత్రపు ఆశ చాలు, మన ఆత్మలకు రెక్కలు వస్తాయి, కదూ?

"శ్మశానంనుండి మేము ఉత్సాహంతో వచ్చినాము. కానీ, గట్టిగా వారం తిరగక ముందే, సారం లేని, అర్థం లేని, ఆయాసకర నిత్య జీవితం, యిటు నిషిద్ధం కానిదీ, అటు అనుమతించినటువంటిదీ. కానిదీ, యథాప్రకారంగా కొనసాగింది; అంతకు ముందు కంటె పరిస్థితులేమీ మెరుగు కాలేదు. యెంతైనా, కాస్త ఆలోచిస్తే, మేము బేలికొవ్‌ను పూడ్చిపెట్టినప్పటికీ, గుల్లలో జీవించేవాళ్లు యింకా బోలెడు మంది వున్నారు, పుట్టబోయేవాళ్లు యింకా బోలెడుమంది వున్నారు."

"అవును, నిజమే," పైపు ముట్టించుకుంటూ, అన్నాడు ఇవాన్ ఇవానిచ్.

"పుట్టబోయేవాళ్లు యింకా బోలెడుమంది వున్నారు!" పునశ్చరణం చేసినాడు బూర్కిన్.

హైస్కూలు టీచరు పాకలోనుండి బయటికి వచ్చినాడు, బట్టతలతోనూ, దాదాపు

నడుముదాకా వున్న పెద్ద, నల్లని గడ్డంతోనూ. అతను పొట్టిగా, లావుగా వుండేవాడు.

అతను పైకి చూస్తూ, "యేమి చంద్రుడు!" అన్నాడు.

అర్ధరాత్రి దాటింది. గ్రామమంతా కుడివైపున కనిపిస్తూ వుండింది, పొడవైన వీధి మూడు మైళ్లదాకా వ్యాపించింది. అన్నీ ప్రగాఢ, ప్రశాంత నిద్రలో మునిగి పోయినాయి. ఒక చప్పుడు లేదు, ఒక అలికిడి లేదు, ప్రకృతి యింత ప్రశాంతంగా వుండడం నమ్మశక్యం కాదనిపించింది. వెన్నెల రాత్రిలో విశాలమైన గ్రామ వీధినీ, అందులోని యిండ్లనూ, గడ్డివాములనూ, నిద్రించే విల్లోచెట్లనూ చూస్తే, మన ఆత్మలను ప్రగాఢమైన శాంతి ఆవరిస్తుంది. సకల శ్రమనుండీ, బాధ్యతలనుండీ, దుఃఖంనుండీ రాత్రి నీడలచేత రక్షింపబడి, తన ప్రశాంతిలో, గ్రామం సౌమ్యంగా, విచారంగా, అందంగా కనపడుతుంది, నక్షత్రాలే గ్రామాన్ని దయార్ద్రంగా చూస్తున్న ట్లుంటాయి, ప్రపంచంలో చెడ్డ అనేదే లేనట్లూ, అంతా మంచే అయినట్లూ అనిపిస్తుంది. యెడమ వైపున గ్రామం అంతమై, అక్కడనుండి పొలాలు వ్యాపించి వాయి; దూరంగా, కనుచూపు మేరదాకా వ్యాపించిన ఆ పొలాలు కూడా విశ్రలంగా, నిశ్శబ్దంగా వున్నాయి, విశాలమైన మైదానం వెన్నెల వరదలో మునిగిపోయింది.

"అవును, నిజమే," అని మళ్లీ అన్నాడు ఇవాన్ ఇవానిచ్. "మనం పట్టణాలలో, గాలి రాని యిరుకు గదులలో వుండడమూ, అక్కరకు రాని కాగితాలు రాయడమూ, పేకాట ఆడడమూ, యిదంతా కూడా గుల్లలో జీవించడం కాదా? కుక్షింభరుల మధ్యా, కుసంస్కారపు కోర్టువనితల మధ్యా, పని లేని, మతి లేని ఆడవాళ్ల మధ్యా మన జీవితమంతా గడువుతూ, నిత్యం చెత్త మాట్లాడుతూ, చెత్త వింటూ వుండడం, యిదంతా మటుకు మన నత్తగుల్ల బతుకు కాదా? యీ విషయాన్ని వివరించే మంచి కథ ఒకటి చెప్తాను, మీరు వినదలచుకుంటే...."

"నిద్రకు వేళైంది అనుకుంటాను, అది రేపటికి వుంచండి," అన్నాడు బూర్కిన్.

యిద్దరూ దొడ్డిలోకి పోయి, పండుకున్నారు. వాళ్లు గడ్డిలో పడక పొందించుకొని, నిద్రమత్తుకు లోబడుతుండగా, బయటినుండి సన్నని అడుగుల చప్పుడు వినవచ్చింది. దొడ్డికి దగ్గర్లో యెవరో తిరుగుతూ వుండినారు; నాలు గడుగులు, తరువాత ఆగడం, మళ్లీ తేలికగా నాలుగడుగులు. కుక్కలు మొరిగినాయి.

"మావ్రా షికారు అది," అన్నాడు బూర్కిన్.

అడుగులు తరువాత వినపడలేదు.

ఇవాన్ ఇవానిచ్ అటువైపు పొర్లుతూ అన్నాడు: "మనుషులు చెప్పే అబద్ధాలు గుడ్ల ప్పగించి చూస్తూ, వింటూ వుండడమూ, తరువాత, ఆ అబద్ధాల నన్నిటినీ సహించినం దుకు తిట్లు తినడమూ, అపచారాలూ, అవమానాలూ దిగమింగడమూ, నిజాయితీ గల స్వేచ్ఛా మానవుల పక్షాన నిలబడడానికీ, మాట్లాడడానికీ ధైర్యం లేకపోవడమూ,

మనమే అబద్ధా లాడడమూ, చిరునవ్వులు ఒలకబోయడమూ, యివన్నీ యెందుకంటే, పట్టెడన్నం కోసమూ, కాస్త సుఖ జీవనం కోసమూ, యేదో ఒక దౌర్భాగ్యపు పదవి కోసమూ — ఛీఛీ, జీవితం నరకం!"

"యిది మరొక యితివృత్తం, ఇవాన్ ఇవానిచ్," అన్నాడు టీచరు. "యిక నిద్రపోదాం."

పది నిముషాలలో బూర్కిన్ నిద్రపోయినాడు. కానీ ఇవాన్ ఇవానిచ్ నిట్టూరుస్తూ, గడ్డిమీద పొర్లుతూ వుండినాడు. తరువాత అతను లేచి, మళ్లీ బయటికి పోయినాడు, వాకిలి పంచన కూర్చొని, పైపు ముట్టించినాడు.

1898

కుక్కను వెంటబెట్టుకున్న మహిళ

1

యెవరో కొత్త మనిషి – కుక్కను వెంటబెట్టుకున్న మహిళ – విహారపథంలో కనిపించిందని జనం అనుకుంటున్నారు. ద్మిత్రీ ద్మిత్రిచ్ గూరొవ్ యాల్టాకు వచ్చి పదైదు రోజులైంది; ఆ వూరి పద్ధతులకు అలవాటుపడి, అతను కూడా కొత్త ఆగంతుకులలో ఆసక్తి కలిగించుకోసాగినాడు. అతను వెర్నె ఆరుబయలు హోటల్‌లో కూర్చొని వుండగా, విహారపథంలో టోపీ పెట్టుకొని నడుస్తూవుండిన యువతి కనిపించింది. ఆమె వెంట తెల్ల పామెరేనియా కుక్క వుండింది.

తరువాత ఆమె మునిసిపల్ పార్కులోనూ, చౌకులోనూ అతనికి రోజూ పలుసార్లు యెదురైంది. ఆమె యెప్పుడూ అదే టోపీ పెట్టుకొని; ఒంటిగా వుండేది, ఆ కుక్క యెప్పుడూ వెంట వుండేది. ఆమె యెవరైందీ యెవరికీ తెలియదు; కేవలం "కుక్కను వెంటబెట్టుకున్న మహిళ"గా జనం ఆమెను గురించి ప్రస్తావించేవాళ్ళు.

"ఆమె యిక్కడ భర్త లేకుండా, మిత్రులెవరూ లేకుండా వుంటే, ఆమె పరిచయం చేసుకుంటే బాగనే వుంటుంది," అనుకున్నాడు గూరొవ్.

అతనికింకా నలభై నిండలేదు; కానీ అతనికి పన్నెండేండ్ల కూతురూ, బళ్ళో చదువుకునే కొడుకులూ వుండినారు. కాలేజీలో రెండవ యేడులో వుండగా అతను మాటలకు లోబడి పెండ్లి చేసుకున్నాడు; అతని భార్య యిప్పుడు దాదాపు తనకు రెండంతలు వయసు వున్నట్లు కనపడుతుంది. ఆమె నల్లని కనుబొమలతో, యెత్తుగా, నిటారుగా, గంభీరంగా వుండేది, "ఆలోచనాశీలి"నని తన్ను గురించి తాను చెప్పుకునేది. ఆమె యెక్కువగా పుస్తకాలు చదివేది, ఉత్తరాలలో వ్యావహారిక రూపాలు వాడేది, భర్తను ద్మిత్రీ అనకుండా దిమిత్రీ అనేది. ఆమె అజ్ఞురాలు అనీ, సంకుచిత మనస్కురాలనీ, అస్తవ్యస్తపు దుస్తుల మనిషి అనీ అతను మనసులో అనుకున్నా, ఆమెకు భయపడేవాడు, యింటివద్ద వుండడానికి అయిష్టపడేవాడు. అతను ఆమె కన్ను గప్పి తిరగడం ప్రారంభించి చాలా కాలమైంది. యిప్పుడతను పరస్త్రీలతో తిరుగుతున్నాడు,

అందువల్లనే స్త్రీలను గురించి నిరసనగా మాట్లాడేవాడు, వాళ్లను అధమ జాతి అనేవాడు.

బాధాకరమైన అనుభవంద్వారా నేర్చుకున్న గుణపాఠాల మూలంగా, వాళ్లను తన యిష్టం వచ్చినట్లు అనే హక్కు తనకు వుందని అతను అనుకునేవాడు; కానీ యీ "అధమ జాతి" లేకుండా అతను ఒక్క రోజు కూడా బతకగలిగేవాడు కాదు. పురుషుల మధ్య వున్నప్పుడు అతను యేమీ తోచక, యిబ్బందిపడేవాడు, వాళ్లతో యెప్పుడూ ముభావంగా, నిర్లిప్తంగా వుండేవాడు. కానీ స్త్రీల మధ్య అతను చాలా సాఫీగా వుండేవాడు; వాళ్లతో యేమి మాట్లాడవలసిందీ, యెలా ప్రవర్తించవలసిందీ అతనికి కచ్చితంగా తెలుసు; వాళ్ల సాహచర్యంలో ఆవగింజంత యిబ్బందిపడకుండా అతను మౌనంగా కూడా వుండగలిగేవాడు. అతని వాలకంలోనూ, వైఖరిలోనూ యేదో అనిర్వచనీయమైన సమ్మోహనత్వం వుండేది. అది స్త్రీలను ఆకర్షించి, వాళ్ల సానుభూతిని చూరగొనేది. యిది అతనికి తెలుసు. అతనే యేదో అదృశ్య శక్తిచేత వాళ్లవైపు ఆకర్షితుడయ్యేవాడు.

ప్రతి కొత్త పరిచయమూ మొదట నిత్య జీవితంలోకి అంత ఆహ్లాదకరమైన వైవిధ్యం ప్రవేశపెట్టి, మనోహరమైన తేలిక ప్రణయకలాపంగా కనపడి, తరువాత, మర్యాదస్తుల మధ్య (ముఖ్యంగా, మనుషులు అంత అస్థిర మనస్కులుగా, అంత మందగమనులుగా వుండే మాస్కోలో) మహా జటిలమైన సమస్యగా పరిణమించి, సహించరానంత సంకటకరమైన సన్నివేశానికి దారితీస్తుందని పదేపదే కలిగిన బాధాకరమైన అనుభవం అతనికి నేర్పింది. కానీ ఆకర్షణీయమైన స్త్రీ కనిపించిన ప్రతిసారీ అతను యీ అనుభవమంతా మరిచిపోయేవాడు, అతనిలో జీవిత కాంక్ష ఉప్పొంగేది, హఠాత్తుగా అంతా సరళంగా, వినోదకరంగా కనిపించేది.

ఒక రోజు రాత్రి అతను పార్కులోని హోటల్‌లో భోజనం చేస్తూవుండగా ఆ టోపీ స్త్రీ మెల్లగా అడుగులు వేసుకుంటూ లోపలికి వచ్చి, పక్క టేబుల్‌వద్ద కూర్చుంది. ఆమె వాలకమూ, నడకా, దుస్తులూ, కేశాలంకరణా, అన్నిటినీబట్టి అతనికి అర్థమైంది, ఆమె ఉన్నత వర్గాలకు చెందినదనీ, వివాహిత అనీ, యాల్టాకు మొదటిసారి వచ్చిందనీ, అక్కడ ఒంటిగా వుందనీ, పొద్దుపోక అవస్థపడుతున్నదనీ.... యాల్టాకు వచ్చేవాళ్ల అవినీతిని గురించిన కథలలో అతిశయోక్తులు చాలా వుంటాయి. వాటిలో అధికభాగం, చేతనైతే సంతోషంగా నీతిని ఉల్లంఘించేవాళ్ల కల్పితాలు అని అతనికి తెలిసినందున, అతను వాటిని లక్ష్యపెట్టలేదు. కానీ, ఆ స్త్రీ తనకు కొద్ది గజాల దూరంలో పక్క టేబుల్ వద్ద కూర్చున్నప్పుడు, యీ సులభ విజయాల కథలూ, కొండలలో షికార్ల కథలూ అతని మనసులో మెదలినాయి. సత్వర తాత్కాలిక ప్రణయం, తనకు పేరైనా తెలియని స్త్రీతో ప్రేమకలాపం, కలగవచ్చుననే భావం అతని మనస్సును హఠాత్తుగా లోబరచుకుంది.

కుక్కవైపు చూస్తూ అతను చిటిక వేసినాడు, అది తనదగ్గరికి వచ్చినప్పుడు చూపుడు వేలు ఆడించినాడు. పామెరేనియా కుక్క మొరిగింది. గూరొవ్ మళ్లీ వేలు ఆడించినాడు.

ఆమె అతనివైపు చూసి, వెంటనే కండ్లు దించుకుంది.

"అది కరవదు" అంటూ ఆమె సిగ్గుపడింది.

"యెముక ముక్క యివ్వనా?" అని అడిగినాడు అతను. ఆమె అలాగేనన్నట్లు తల ఆడించగా, అతను హార్దిక స్వరంతో అన్నాడు: "మీరు యాల్టాకు వచ్చి చాలా రోజులైందా?"

"అయిదు రోజు లైంది."

"నే నిక్కడ రెండవ వారం యీడుస్తున్నాను."

కొద్ది నిముషాల సేపు యెవరూ మాట్లాడలేదు.

"రోజులు త్వరగా గడుస్తాయి, కానీ యిక్కడ బొత్తిగా పొద్దుబోదు," అతనివైపు చూడకుండా, అన్నదామె.

"పొద్దుబోదనడం యిక్కడ మామూలు. బెలేవ్, జీబ్ర లాంటి పాపిష్ఠి వూర్లలో పొద్దుబోదని యెవరూ ఫిర్యాదు చేయరు. కానీ వాళ్లు యిక్కడికి వచ్చి 'ఓ, యెంత నిర్జీవం! ఓ, యెంత దుమ్ము!' అంటారు. వాళ్లు యే గ్రెనడానుండో వచ్చినట్లు మాట్లాడుతారు."

ఆమె నవ్వింది. తరువాత, పూర్తిగా కొత్తవాళ్లైనట్లు యిద్దరూ మౌనంగా భోంచేయసాగినారు. కానీ భోజనం తర్వాత హోటల్‌నుండి యిద్దరూ కలిసి బయటికి వెళ్లినారు. స్వేచ్ఛ, సంతృప్తి గలవాళ్లు, ఫలానా చోటికి పోవాలి, ఫలానా విషయం మాట్లాడాలి అనేదేమీ లేనివాళ్లు మాట్లాడే తేలిక, హాస్యపూరిత సంభాషణ ప్రారంభించినారు. వాళ్లు తీరికగా అడుగులు వేస్తూ, సముద్రంమీద కనపడే వింత కాంతిని గురించి మాట్లాడుకుంటూ వెళ్లినారు. నీళ్లు ఆహ్లాదకరమైన వూదా రంగులో వుండినాయి, నీళ్లమీద వెన్నెల బంగారు చారగా పడింది. పగలంతా వేడిగా వుండి, యిప్పుడు చాలా ఉక్కగా వుందని వాళ్లు చెప్పుకున్నారు. తాను మాస్కో వాసిననీ, నిజానికి తాను భాషాశాస్త్రవేత్త అయినా బాంకిలో పనిచేస్తున్నాననీ గూరొవ్ తన గురించి చెప్పినాడు. ఒకప్పుడు తాను సంగీత నాటకాల కంపెనీలో పాడడానికి సాధనచేసి, తరువాత ఆ అభిప్రాయం వదలి పెట్టినాననీ, తనకు మాస్కోలో రెండు యిండ్లు వున్నాయనీ.... తరువాత ఆమె చెప్పగా అతను ఆమె గురించి తెలుసుకున్నాడు. ఆమె పీటర్స్‌బుర్గ్‌లో పెరిగింది. యస్. పట్టణంలో పెండ్లిచేసుకుంది, రెండేండ్లుగా అక్కడ వుంటున్నది, యాల్టాలో యింకా ఒక నెల వుంటుంది, తన భర్తకు కూడా విశ్రాంతి అవసరం గనుక అతను త్వరలో అక్కడికి రావచ్చును అని ఆమె చెప్పింది. తన భర్త గుబెర్నియా కౌన్సిలు

సభ్యుడైన సంగతీ, జేమ్స్ట్వో* బోర్డు సభ్యుడైన సంగతీ ఆమె బొత్తిగా చెప్పలేక, చెప్పలేనందుకు చాలా వినోదపడింది. ఆమె పేరు అన్నా సెర్గేయెవ్నా అని కూడా గూరొవ్ తెలుసుకున్నాడు.

తన గదికి తిరిగివచ్చిన తర్వాత అతను ఆమెను గురించి ఆలోచించినాడు, మరు దినం మళ్లీ ఆమెను కలుసుకుంటానని అతనికి నమ్మకంగా తోచింది. అది తప్పదు. మంచంమీద పండుకుంటూ అతను అనుకున్నాడు, మొన్నమొన్నటిదాకా ఆమె తన కూతురులాగే బడికి పోతూ, పాఠాలు నేర్చుకుంటూ వుండిందని; ఆమె నవ్వులోనూ, కొత్తవానితో మాట్లాడే పద్ధతిలోనూ యెంత సిగ్గూ, బిడియమూ వున్నదీ అతనికి జ్ఞాపకం వచ్చింది — ఆమె ఒంటరిగా వుండడమూ, ఆమె పసిగట్టకుండా వుండ జాలని ఒక నిత్య, రహస్య లక్ష్యంతో పురుషులు ఆమెను అనుసరించి, గమనించి, ఆమెతో మాట్లాడే స్థితిలో ఆమె వుండడమూ బహుశా యిది మొదటిసారి కావచ్చు. ఆమె సన్నని, సుకుమారమైన మెడనూ, అందమైన ధూసరవర్ణపు కన్నులనూ అతను జ్ఞాపకం చేసుకున్నాడు.

"అయినా ఆమెలో విషాదకరమైంది యేదో" నిద్రలో మునుగుతూ, అనుకున్నాడతను.

2

వాళ్లకు పరిచయమై వారం గడిచింది. ఆరోజు సెలవు దినం. యిండ్లలో ఉక్కగా వుండింది, కానీ బయట గాలికి దుమ్ము మేఘాలలాగా లేస్తూవుండింది, తలలమీద టోపీలు కొట్టుకపోతూ వుండినాయి. ఆ రోజు దగగొలిపే దినం; అన్నా సెర్గేయెవ్నా కోసం పండ్ల రసాలూ, ఐస్‌క్రీమూ తేవడానికి గూరొవ్ ఆరుబయలు హోటల్‌కు పదేపదే పోతూవుండినాడు. వేడి దుర్భరంగా వుండింది.

సాయంత్రం, గాలి తగ్గినాక, రాబోయే స్టీమర్‌ను చూడడానికి వాళ్లు రేవుకు వెళ్లినారు. ప్రయాణికులు దిగేచోట చాలామంది జనం వుండినారు. కొంతమంది, చేతులలో పూలతో, మిత్రులను కలుసుకుంటూ వుండినారు. నవనాగరికపు యాల్టా గుంపులో రెండు విశేషాలు స్పష్టంగా కనిపిస్తూవుండినాయి — వయసుమళ్లిన స్త్రీలు అందరూ వయసుకత్తెలలాగ దుస్తులు వేసుకోడానికి ప్రయత్నించినారు, మిలిటరీ జనరల్‌లు చాలామంది వున్నట్లుండింది.

సముద్రంలో అలలులేస్తూ వుండినందున స్టీమరు ఆలస్యంగా వచ్చింది, పొద్దు

---

* స్థానిక స్వపరిపాలన సంస్థ. — సం.

గుంకిన తర్వాత; రేవు పక్కన వచ్చి నిలవడానికి అది కొంతసేపు అటూయిటూ మళ్ల వలసి వచ్చింది. అన్నా సెర్గేయెవ్నా తనకు తెలిసిన యెవరికోసమో వెదకుతున్నట్లు, బైనాకులర్లగుండా స్టీమరునూ, ప్రయాణీకులనూ కలయజూసింది; ఆమె గూరొవ్ వైపు మళ్లినప్పుడు, ఆమె కన్నులు తడితో తళతళలాడినాయి. ఆమె చాలా యెక్కువగా మాట్లాడింది, పొలూ పొందూ లేని ప్రశ్నల వర్షం కురిపించింది, తాను తెలుసుకోగోరిందేమిటో వెంటనే మరిచిపోతూ వుండింది. తరువాత జనం రద్దీలో ఆమె తన బైనాకులర్ను పోగొట్టుకుంది.

నవనాగరికపు గుంపు విడిపోసాగింది, రూపురేఖలు గమనించడం అసాధ్యమైంది, గాలి బాగా తగ్గింది, స్టీమరులోనుండి యింకా యెవరి రాకకొరకో కాచుకున్నట్లు గూరొవ్వూ, అన్నా సెర్గేయెవ్నా అక్కడ నిలుచున్నారు. అన్నా సెర్గేయెవ్నా గూరొవ్వైపు చూడకుండా పారిపారికీ తన చేతిలోని పూలు మూచూస్తూ, మౌనంగా వుండిపోయింది.

"మంచి సాయంత్రంగా మారింది," అన్నాడు అతను. "యేం చేద్దాం? బండిలో షికారు వెళ్లవచ్చు."

ఆమె జవాబు చెప్పలేదు.

అతను ఆమెవైపు నిశ్చలంగా చూసివాడు, హఠాత్తుగా ఆమెను కౌగిలించుకొని, పెదవులు ముద్దుపెట్టుకున్నాడు, పూల పరిమళమూ, తడీ అతన్ని చుట్టుముట్టివాయి, కానీ మరుక్షణం అతను భయంతో వెనక్కి తిరిగిచూసివాడు — తమ నెవరైనా చూసినారా?

"మీ గదికి వెళ్దాం పద," అతను మెల్లగా అన్నాడు.

వడివడిగా యిద్దరూ కలిసి నడిచిపోయినారు.

ఆమె గది ఉక్కగా వుండింది, జపాన్ దుకాణంలో కొన్న యేదో సెంటు వాసన వేస్తూవుండింది. గూరొవ్ ఆమెవైపు చూసి, అనుకున్నాడు: "జీవితం నిండా యెన్ని చిత్రమైన కలయికలు!" దిగులూ భయమూ లేని సహృదయులైన స్త్రీలు కామక్రీడ చేత ప్రహర్షచిత్తలై, యెంత స్వల్ప కాలికమైనదైనా తానిచ్చిన ఆనందానికి తనకు కృతజ్ఞత చూపిన స్త్రీలు అతనికి జ్ఞాపకమున్నారు. యిక మరి కొందరు వుండివారు — వాళ్లలో తన భార్య ఒకతె — వాళ్ల ఆలింగనాలు కపటంగా, కృత్రిమంగా, ఉన్మాదంగా, బోలెడు అనవసరపు మాటలతో కలిసి వుండేవి; యిదంతా వట్టి కామక్రీడ కానట్లూ, మోహావేశం కానట్లూ, అంతకంటె ముఖ్యమైనదేదో అయినట్లూ వుండేది వాళ్ల వికలం. తరువాత, యిద్దరు ముగ్గురు నిర్లిప్తలైన సుందరాంగులు వుండివారు; వాళ్ల ముఖలక్షణాలలో యేదో ఘాతుక భావం తారాడుతూ వుండేది, జీవితంనుండి అది యివ్వగలిగినదానికంటె యెక్కువ పిండుకోవాలనే దీక్షను వ్యక్తంచేస్తూ; వాళ్లు ప్రథమ యివ్వనం దాటినవాళ్లు, చపలచిత్తలు, పెత్తందారీ బుద్ధులు, బొత్తిగా మెదడు లేనివాళ్లు. వాళ్లపట్ల గూరొవ్ వ్యామోహం చల్లబడిన తర్వాత వాళ్ల సౌందర్యం

అతనికి యేవగింపు మాత్రమే కలిగించేది, వాళ్ల లోపలి దుస్తుల లేసులు అతనికి చేపల పొలుసులను గుర్తుకు తెచ్చేవి.

కానీ యిక్కడ యివ్వనంలోనూ, అనుభవ రాహిత్యంలోనూ వుండే పిరికితనమూ, అస్తవ్యస్తతా యింకా స్పష్టంగా వున్నాయి. అకాలంలో యెవరో తలుపు తట్టినట్లు, ఆమె మనసులో ఆందోళన భావం వుంది. అన్నా సెర్గేయెవ్నా, "కుక్కను వెంటబెట్టు కున్న మహిళ," యీ వ్యవహారాన్ని యేదో మహా ప్రత్యేకమైనదిగా, మహా గురుతరమైనదిగా పరిగణిస్తున్నది, తాను పతిత అయినట్లు పరిగణిస్తున్నది; ఆ భావం అతనికి విడ్డూరంగా, మనశ్శాంతిహారిగా వుండింది. ఆమె ముఖలక్షణాలు విచారపూరితంగా వున్నాయి, ముఖానికి యిరువైపులా వెంట్రుకలు దుఃఖమయంగా వేలాడుతున్నాయి. ఆమె విచారకర ధ్యానముద్ర ధరించింది, పాతకాలపు వర్ణచిత్రంలోని పశ్చాత్తప పాపిలాగ.

"యిది మంచిది కాదు," అన్నది ఆమె. "మీకు యిక నామీద గౌరవం వుండదు."

టేబుల్‌మీద కర్బూజపండు వుండింది. గూరోవ్ ఒక ముక్క కోసుకొని నిదానంగా తినసాగినాడు. కనీసం ఒక అర్ధగంట మౌనంగా గడిచింది.

అన్నా సెర్గేయెవ్నా అనుతాప జనకంగా వుండింది, జీవితాన్ని చాలా కొద్దిగా చూసిన నిష్కల్మష, అమాయక స్త్రీయొక్క స్వచ్ఛతను వ్యక్తంచేస్తూవుండింది. టేబుల్‌మీద వున్న ఒకేఒక కొవ్వొత్తి వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కనపడలేదు, కానీ ఆమె హృదయం భారంగా వున్నట్లు స్పష్టంగా తెలుస్తూవుండింది.

"నాకు నీమీద గౌరవం యెందుకు తగ్గిపోతుంది?" అని అడిగినాడు అతను. "నీవేమి మాట్లాడేదీ నీకే తెలియదు."

"భగవంతుడు నన్ను క్షమించుగాక! యిది దారుణం," అన్నది ఆమె. ఆమె కండ్లలో నీళ్లు నిండినాయి.

"ఆత్మ సమర్థన చేసుకోవలసిన అవసరం లేదు నీకు."

"ఆత్మ సమర్థన యెలా చేసుకోగలను? నేను దుష్టురాలిని, పతితను; నా మీద నాకే అసహ్యం కలుగుతున్నది, ఆత్మ సమర్థన చేసుకునే ఉద్దేశం నాకే మాత్రమూ లేదు. నేను మోసగించింది నా భర్తను కాదు, నన్నే. యిప్పుడే కాదు, చాలా కాలంగా నన్ను నేను మోసగించుకుంటున్నాను. నా భర్త నిజాయితీపరుడు, యోగ్యుడు, సందేహం లేదు, కానీ ద్రోహకుంగాడు. అతను ఆఫీసులో యేమి చేస్తాడో నాకు తెలియదు, కానీ అతను ద్రోహకుంగాడని నాకు తెలుసు. నేనతన్ని పెండ్లాడినప్పుడు నాకు యిరవై యేండ్లు మాత్రమే, జీవితం యేమిటో తెలుసుకోవాలనే ఉత్సుకతతో నేను చచ్చిపోయినాను, నాకు మరింత ఉన్నతమైనదానిమీద కోరిక కలిగింది. యింతకంటె భిన్నమైన జీవితం మరొకటి వుండాలని మనసులో అనుకున్నాను, ఆ జీవితం నేను జీవించాలి.... నేను ఉత్సుకతతో దహించుకపోయినాను.... మీ కిప్పటికీ అర్థం కాదది; ప్రమాణంచేసి

చెప్తున్నాను, నన్ను నేను నిగ్రహించుకో లేకపోయినాను, నన్నేదీ అరికట్ట లేకపోయింది, నాకు ఒళ్లు బాగలేదని నా భర్తతో చెప్పి, యిక్కడికి వచ్చినాను.... పిచ్చి పట్టినట్లు, దయ్యం పట్టినట్లు తిరగసాగినాను.... యిక యిప్పుడు సాదా మనిషినైనాను, పనికి మాలిన మనిషినైనాను, ప్రతి వాళ్లకూ యిప్పుడు నన్ను అసహ్యించుకొనే హక్కు వుంది."

గూరొవ్ భరించరాని విసుగుతో విన్నాడు. ఆ పసితనపు ఉచ్చారణా, పశ్చాత్తాపమూ మహా అసందర్భంగా, అసలు వూహించనిదిగా వుండింది. ఆమె కన్నులలో ఆ నీరు లేక పోతే, ఆమె హాస్యమాడుతున్నదనో, నటన చేస్తున్నదనో అనుకోవచ్చు.

అతను మృదువుగా అన్నాడు: "నాకు అర్థం కావడంలేదు. యేమిటి నీకు కావలసింది?"

ఆమె అతని రొమ్మున ముఖం దాచుకొని, గట్టిగా అతనికి అనుకుంది.

"నన్ను నమ్మండి. నమ్మమని మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను," అన్నది ఆమె. "జీవితంలో నిష్కపటమూ, పరిశుద్ధమూ అయినదాన్నంతట్నీ నేను ప్రేమిస్తాను, చెడ్డపని నాకు అసహ్యం, నేనేమి చేస్తున్నానో నాకు తెలియదు. మామూలు జనం అంటుంటారు, తాము సైతాను వలలో చిక్కినామని. యిప్పుడు నేను కూడా సైతాను వలలో చిక్కినానని అనగలను."

"ఛీఛీ, యేమిటది!" అని మెల్లగా అన్నాడు అతను.

నిశ్చలమైన, భయవిహ్వలమైన ఆమె కన్నులలోకి అతను నిండాచూసినాడు, ఆమెను ముద్దు పెట్టుకున్నాడు, మెత్తని, ప్రేమార్ద్రమైన మాటలతో ఆమెను అనునయించి నాడు. క్రమక్రమంగా ఆమె శాంతించి, తిరిగి ఉత్సాహం పొందింది. కాసేపట్లో మళ్లీ యిద్దరూ నవ్వుకుంటూ వుండినారు.

కొంతసేపు తర్వాత వాళ్లు బయటికి వెళ్లినారు. విహారపథంలో మనుషులు ఒక్క పిట్ట లేరు, పట్టణమూ, పట్టణంలోని సైప్రస్ చెట్లూ మరణించినట్లుండినాయి, కానీ సముద్రం బీచిమీద యెగిరిపడుతూ యింకా గర్జిస్తూవుండింది. ఏకాకి చేపల పడవ ఒకటి అలలమీద పడుతూ లేస్తూ వుండింది, పడవలోని దీపం నిద్రమత్తుతో మిణుకుమిణుకుమంటూ వుండింది.

వాళ్లకొక గుర్రపుబండి దొరకగా, ఒరియాందకు పోయినారు.

"హాలులో యిప్పుడే నీ పేరు కనుక్కున్నాను," అన్నాడు గూరొవ్ ఆమెతో, "బోర్డుమీద రాసిపెట్టినారు ఫన్ డీడెరిట్స్. నీ భర్త జర్మనా?"

"కాదు. వాళ్ల తాత జర్మన్ అనుకుంటాను. కానీ నా భర్త ఆర్థడాక్స్ మతస్థుడు."

ఒరియాందలో బండి దిగి, వాళ్లు చర్చికి కాస్త దూరంలో బెంచీమీద కూర్చున్నారు. వాళ్లు మాటలు లేకుండా సముద్రంవైపు చూస్తూ వుండినారు. తెల్లవారు జాము పొగమంచులో యాల్టా లీలగా కనిపిస్తూ వుండింది, పర్వత శిఖరాలమీద తెల్లని మేఘాలు నిశ్చలంగా విశ్రమించినాయి. ఆకు అల్లాడటంలేదు, ఆకుతేళ్లు కీచుకీచు మంటూ

వుండినాయి, శాంతిని గురించి, మనందరికోసమూ పొంచుకొనివున్న శాశ్వత శాంతిని గురించి, మాట్లాడుతూ, రోకటిపోట లాంటి సముద్రపు మంద్ర గర్జ వాళ్లకు విని పిస్తూ వుండింది. యాల్టాలూ, ఒరియాందలూ లేనప్పుడూ సముద్రం యిలాగే గర్జిం చింది, యిప్పుడూ గర్జిస్తున్నది, యిక ముందు మనం గతించిన తర్వాత కూడా యిలాగే నిర్లక్ష్యంగా మంద్రంగా గర్జిస్తూ వుంటుంది. యీ అనుస్యూతిలో, జీవ మరణాలపట్ల గల యీ పరమ నిర్లక్ష్యంలో, మన అంతిమ మోక్షంయొక్క, మన గ్రహంమీది జీవ స్రవంతియొక్క, పరిపూర్ణతవైపు దాని నిరంతర గమనంయొక్క రహస్యం వుండవచ్చు. ప్రాతఃకాంతిలో ఎంతో అతిలోకంగా కనపడే ఒక యువతి పక్కన కూర్చొని, సముద్రమూ, పర్వతాలూ, మేఘాలూ, అనంతమైన ఆకాశమూ, యీ అన్నింటి దివ్య సౌందర్య దర్శనంచేత ప్రశాంతుడై, సమ్మోహితుడై గూరొవ్ తనలో అనుకున్నాడు: లోతుగా ఆలోచిస్తే, ప్రపంచంలో ప్రతిదీ, ఉన్నత జీవిత లక్ష్యాలూ, మానవులంగా మన గౌరవమూ మనకు కనుమరుగైనప్పుడు మన ఆలోచనలూ, చేతలూ తప్ప ప్రతిదీ నిజంగా సుందరమైనదే.

యెవరో వాళ్లను సమీపించినారు — వాచ్‌మన్ కావచ్చు. వాళ్లను చూసి అతను వెళ్లిపోయినాడు. యిందులో కూడా నిగూఢమైనదీ, మనోహరమైనదీ యేదో వుండింది. ఫియొదోసియామండి వచ్చిన స్టీమరు, దీపాలు ఆరిపోయి; ఉషఃకాంతిలో రేవువద్దకు రావడం కనిపించింది.

"గడ్డిమీద మంచు చేరింది" అన్నది అన్నా సెర్గేయెవ్నా, మౌనం వదలిపెట్టి.

"అవును. యింటికి పోయే వేళ అయింది."

వాళ్లు పట్టణానికి తిరిగి పోయినారు.

ఆ తర్వాత వాళ్లు ప్రతిరోజూ మధ్యాహ్నం విహారపథంలో కలుసుకునేవాళ్లు, మధ్యాహ్నమూ, రాత్రీ కలిసి భోంచేసేవాళ్లు, షికార్లు పోయేవాళ్లు, సముద్ర సౌంద ర్యాన్ని ఆస్వాదించేవాళ్లు. ఆమె నిద్రపట్టడం లేదనీ, గుండెదడ వస్తున్నదనీ ఫిర్యాదులు చేసేది, మళ్లీమళ్లీ అవే ప్రశ్నలు అడిగేది, ఒకసారి అసూయకూ, మరొకసారి అతను తన్ను నిజంగా గౌరవించడంలేదనే భయానికీ మార్చి మార్చి లోనయ్యేది. తరుచుగా, చౌకులోనో, పార్కులోనో యెవరూ కనిపించనప్పుడు, అతను ఆమెను దగ్గరకు తీసుకొని, ఆవేశంతో ముద్దుపెట్టుకునేవాడు. బొత్తిగా యేమీ పని లేకపోవడమూ, పట్టపగలు పెట్టుకునే యీ ముద్దులూ, వాటివెంట వుండే దొంగ చూపులూ, యెవరికైనా తెలు స్తుందనే భయమూ, వేడీ, సముద్రపు వాసనా, పని లేని, కడుపు నిండిన, నవనాగరి కపు మనుషులు నిత్యం వాళ్ల దృష్టిపథంలోకి వస్తూ పోతూ వుండడమూ యివన్నీ అతనికి కొత్త ఆయుస్సును యిచ్చినట్లుంది. ఆమె అందంగా వుందనీ, మహా ప్రలోభ కరంగా వుందనీ అతను ఆమెతో చెప్పేవాడు, మహా ఆవేశంతో కామక్రీడకు పురికొనే

వాడు, ఒక క్షణం వదలకుండా యెప్పుడూ ఆమె పక్కన వుండేవాడు. ఆమె యెప్పుడూ విచారంగా వుండేది, అతను ఆమెను గౌరవించడంలేదనీ, అణుమాత్రమూ ప్రేమించ డంలేదనీ, ఆమెను సాదా స్త్రీగా పరిగణిస్తున్నాడనీ అతని నోటమ్మట చెప్పించడానికి యెప్పుడూ ప్రయత్నించేది. దాదాపు ప్రతి రాత్రీ వాళ్ళు పట్టణంనుండి బయటికి, ఒరియాండకో, జలపాతంవద్దకో, మరొక సౌందర్య స్థానంవద్దకో బండిలో షికారు వెళ్లేవాళ్లు. ఈ యాత్రలు తప్పనిసరిగా కృతార్థంగా వుండేవి, ప్రతిదీ రాజససౌందర్యపు కొత్త అనుభూతులు సమకూర్చేది.

యీ కాలమంతా వాళ్ళు ఆమె భర్త రాకకు నిరీక్షిస్తూ వుండినారు. కానీ అతని కేదో కండ్ల జబ్బు వచ్చిందని తెలుపుతూ, ఆమెను సాధ్యమైనంత త్వరలో యింటికి రమ్మని అభ్యర్థిస్తూ భర్తవద్దనుండి ఆమెకు ఉత్తరం వచ్చింది. అన్నా సెర్గేయెవ్నా బయలుదేరడానికి తొందర తొందరగా సన్నాహాలు చేసుకుంది.

"నేను వెళ్లిపోవడం మంచిది" అన్నది ఆమె గూరొవ్‌తో. "విధి విలాసం యిది."

ఆమె యాల్టానుండి బండిలో బయలుదేరింది, రైలు స్టేషనుదాకా అతను వెంటపోయివాడు. బండి ప్రయాణం దాదాపు ఒక రోజంతా పట్టింది. ఆమె యెక్స్‌ప్రెస్ రైలు యెక్కి, రెండవ గంట మ్రోగిన తర్వాత యిలా అన్నది:

"యేదీ, మిమ్మల్ని మరొకసారి చూడనివ్వండి.... చివరి చూపు. అః, అదీ."

ఆమె యేడ్వలేదు, కానీ దుఃఖపూరితంగా వుండింది, జబ్బు పడినట్లు కనపడింది, చెక్కిళ్లమీది కండరాలు అదురుతూ వుండినాయి.

"మిమ్మల్ని తలుచుకుంటుంటాను.... నిరంతరం తలుచుకుంటుంటాను," అన్నది ఆమె. "దేవుని దయవల్ల మీకు శుభం కలుగుగాక! నన్ను గురించి దయగా తలుచుకోండి. మనం శాశ్వతంగా విడిపోతున్నాము. అదే మంచిది. యెందుకంటే, మనమసలు కలుసుకొని వుండకూడదు. సెలవు — దేవుని దయవల్ల మీకు శుభం కలుగుగాక!"

రైలు వేగంగా స్టేషన్ దాటిపోయింది, రైలు దీపాలు త్వరలో అదృశ్యమైనాయి, ఒక నిముషం తర్వాత, యీ మధురమైన మైమరపును, యీ ఉన్మాదస్థితిని, వీలైనంత త్వరగా ముగించడానికి ప్రతిదీ కుట్ర పన్నుతున్నట్లు దాని శబ్దం కూడా అంతరించింది. గూరొవ్ ప్లాట్‌ఫారంమీద ఒంటరిగా నిలబడి, అంధకారమయమైన దూరంలోకి చూపులు నిగుడించి, అప్పుడే మెలకువ వచ్చిన అనుభూతి పొందుతూ, ఆకుతేళ్ల కీచునాదమూ, టెలిగ్రాఫ్ తంతెల ఓంకారనాదమూ విన్నాడు. తన జీవితంలో కలిగిన అనేక ప్రణయకలాపాల లాంటిదే యిది మరొకటి అనీ, యిది కూడా ముగిసిందనీ, స్మృతి తప్ప యేమీ మిగలలేదనీ అతను మనసులో అనుకున్నాడు. అతనికి మనస్సు సంచలించింది, దుఃఖం కలిగింది, కించిత్తు పశ్చాత్తాపం కలిగింది. యెంతైనా, మళ్లీ జీవితంలో తానెన్నడూ చూడబోని యీ యువతి నిజమైన సంతోషం పొందలేదు. ఆమెపట్ల

తాను హార్దికంగా, అపేక్షగా వుండినాడు, కానీ తన మొత్తం ప్రవర్తనలో, తన కంఠ స్వరాలలో, తన ఆలింగనాలలోనే ఒక వ్యంగ్య రేఖ వుండింది, అదృష్టవంతుడైన మగ మహారాజుయొక్క అవజ్ఞాపూర్వకమైన ఆదరణ వుండింది; పైగా, తాను వయసులో ఆమెకంటె రెండింతలు పెద్దవాడు. తాను మంచివాడనీ, అసాధారణుడనీ, ఉదాత్తుడనీ ఆమె పట్టుబట్టి అనేది. అనగా తాను తన నిజమైన వ్యక్తిత్వంకంటె భిన్నంగా ఆమెకు కనబడినాడన్నమాట; ఒక్క మాటలో చెప్పాలంటే, తాను అనుకోకుండానే ఆమెను మోసగించినాడు....

గాలిలో హేమంత స్ఫూర్తి వుండింది, సాయంత్రం చలిగా వుండింది.

"నేను కూడా ఉత్తరాదికి వెళ్లే సమయం వచ్చింది," ప్లాట్‌ఫారంమీదనుండి బయటికి నడుస్తూ, అనుకున్నాడు గూరొవ్. "సమయం వచ్చేసింది!"

3

అతను మాస్కో చేరేటప్పటికి చలికాలం ప్రారంభమౌతున్నట్లుండింది; నెగళ్లు రోజూ రాజేస్తూవుండినారు, పిల్లలు బడికి పోడానికి నిద్రలేచేటప్పటికి యింకా చీకటిగా వుండేది, అందువలన దాది కాసేపు దీపం వులిగించేది. చలి ప్రవేశించింది. మొదటి మంచు పడితే, మొదటిసారి మంచుబండిమీద షికారు. పోయినప్పుడు, తెల్లని నేలా, తెల్లని మిద్దె కప్పులూ చూడడం హాయిగా వుంటుంది; స్వేచ్ఛగా, తేలికగా వూపిరి పీల్చుకుంటుంటే, యవ్వనపు రోజులు జ్ఞాపకం వస్తాయి. మంచులో తెల్లగా వున్న పురాతనపు లైమ్‌చెట్లూ, బర్చ్‌చెట్లూ ప్రసన్నంగా కనబడతాయి, సైప్రస్ చెట్లకంటె, పామ్‌చెట్లకంటె హృదయానికి సన్నిహితంగా వుంటాయి; వాటి కొమ్మలకింద పర్వతాల, సముద్రాల స్మృతి మనిషిని వెంటాడదు.

గూరొవ్ యెప్పుడూ మాస్కోలో జీవించినవాడు. అతను ఒక మంచి చలి రోజున మాస్కోకు తిరిగివచ్చి, ఫర్ లైనింగు గల చలికోటూ, మందం గ్లవ్సు ధరించి, పెత్రోవ్కా వీధిలో తీరికగా అడుగులువేస్తూ నడిచినప్పుడూ, శనివారం సాయంత్రం చర్చి గంటల గణగణ విన్నప్పుడూ, అతని యిటీవలి ప్రయాణమూ, అతను చూసిన స్థలాలూ వాటి ఆకర్షణ కోల్పోయినాయి. క్రమక్రమంగా అతను మాస్కో జీవితంలో మునిగిపోయినాడు, ఒకవైపున మాస్కో వార్తాపత్రికలు చదవకపోవడం తన నియమం అని చెప్పుకుంటూ, అలగా రోజూ మూడు వార్తాపత్రికలు చదివేవాడు. మళ్లీ అతను రెస్టరెంటుల, క్లబ్బుల, విందుల, వినోదాల సుడిగుండంలో చిక్కుకున్నాడు. మళ్లీ అతను సుప్రసిద్ధ న్యాయవాదులూ, నటులూ తన యింటికి వస్తారనీ, మెడికల్ క్లబ్బులో తాను ఒక ప్రొఫెసర్‌తో పేకాట ఆడుతాననే గర్వకారకమైన స్పృహతో ఉబ్బిపోయినాడు.

ఒక నెలలో అన్నా సెర్గేయెవ్నా పట్ల అస్పష్ట స్మృతిగా వుంటుందనీ, ఆ కాంక్షా భారపు దరహాసంతో, ఆమెలాంటి యితర స్త్రీలలాగే, తనకు అప్పుడప్పుడు కలలో మాత్రం వస్తుందనీ అతను నమ్మినాడు. కానీ, యిప్పుడు నెల బాగా గడిచిపోయి, చలి కాలం పడికొనింది; అయినా, నిన్ననే అన్నా సెర్గేయెవ్నా విడిపోయినంత స్పష్టంగా వుంది అతని మనసులో అంతా. అతని స్మృతులు అంతకంతకూ గాఢమైనాయి. అతను తన పఠనాగారంలో వుండగా, సాయంత్రపు నిశ్చలత్వంలో, పాఠాలు చదువుకునే తన పిల్లల గొంతులు చెవులబడినప్పుడూ, రెస్టారెంటులో ఒక పాటో, యంత్ర నాదమో వినబడినప్పుడూ, పొగగూట్లో గాలి గీపెట్టినప్పుడూ, అతనికి వెనకటివన్నీ: రేవువద్ద ప్రత్యూష కాలమూ, పొగమంచు చాటున పర్వతాలూ, ఫియొదోసియానుండి వచ్చే స్టీమరూ, ముద్దులూ గుర్తు వచ్చేవి. చాలాసేపు అతను తన గదిలో అటూయిటూ పచార్లు చేస్తూ, తన స్మృతులపట్ల చిరునవ్వు నవ్వుకునేవాడు, తరువాత స్మృతి పగటికలగా మారేది, అతని ఊహలో జరిగిందీ జరగబోయేదీ కలగలిసిపోయేవి. అన్నా సెర్గేయెవ్నా అతనికి కలలో రాలేదు, ఆమె నీడలాగా, అతను యెక్కడికి పోయినా అనుసరిస్తూ యెప్పుడూ అతని వెంట వుండింది. అతను కండ్లు మూసుకుంటే, ఆమె సాక్షాత్తుగా యెదుట నిలబడినట్లుండేది, వాస్తవంగా ఆమె వుండినంతకంటె మనోహరంగా, పడుచుదిగా, కోమలంగా; వెనక్కి చూసుకుంటే, అతనికి అతనే యాల్టాలో వున్నంతకంటె బాగా కనిపించేవాడు. సాయంత్రంపూట ఆమె బుక్‌షెల్ఫులలోనుండీ, పొయ్యివద్దనుండీ, గది మూలలనుండీ అతనివైపు చూసేది; ఆమె వూపిరి తీసుకోవడమూ, ఆమె దుస్తుల శ్రావ్యమైన సవసవా అతనికి వినిపించేవి. వీధుల్లో అతను స్త్రీలను కలయజూసేవాడు, ఆమెలాంటి వాళ్లెవరైనా కనిపిస్తారేమో అని....

తన స్మృతులు యెవరితోనైనా చెప్పుకోవాలని అతనికొక బలవత్తరమైన కోరిక కలగసాగింది. తన ప్రేమను గురించి అతను యింట్లో మాట్లాడలేదు, యిక బయట తన మనసు విప్పడానికి యెవరున్నారు? తన యింట్లో అద్దెకున్నవాళ్లా, కాదు; బాంకిలో తన సహోద్యోగులా, కానేకాదు. యింతకూ చెప్పడానికి యేముందని? తనకు కలిగింది ప్రేమేనా? అన్నా సెర్గేయెవ్నాతో తనకు గల సంబంధాలలో అతిలోక సుందరమైనదేమైనా వుందా? కవితామయమైనదేమైనా వుందా? జ్ఞానదాయకమైనది గానీ, చివరకు వినోదకరమైనదిగానీ యేమైనా వుందా? ప్రేమను గురించీ, స్త్రీలను గురించీ అతను అస్పష్టమైన మాత్రాలు మాత్రం మాట్లాడ గలిగినాడు; అతని ఉద్దేశమేమిటో యెవరికీ అర్థం కాలేదు. కానీ, అతని భార్య, తన నల్లని కనుబొమలు ముడివేస్తూ యిలా అన్నది:

"షోకిల్లా పాత్ర నీకు బొత్తిగా పరిపడదు దిమిత్రీ."

ఒక సాయంత్రం, ప్రభుత్వోద్యోగి అయిన ఒక పేకాట మిత్రునితో కలిసి మెడికల్ క్లబ్బులోనుండి బయటికి వస్తూ, అతను వుండబట్టలేక యిలా అన్నాడు:

"యాల్టాలో నేను యెంత మనోహరమైన స్త్రీని కలుసుకున్నానో తెలుసా!"

ఉద్యోగి మంచుబండిలో యెక్కి, సరిగ్గా బయలుదేరేటప్పుడు కేకవేసినాడు:

"దీమ్నితి దీమ్నిత్రిచ్!"

"ఆఁ?"

"మీరన్నది నిజమే – చేప కాస్త కాటుబోయింది."

యీ మాటలు, అంత మామూలువైనా, యెందువల్లనో గూరొవ్‌కు మంట పుట్టించినాయి, అవమానకరంగా, అసహ్యంగా కనిపించినాయి. యెంత ఆటవిక మర్యాదలు, యేం మనుషులు! యెంత వృథా అయిన సాయంత్రాలు, యెంత విసుగు కలిగించే నిస్సారపు దినాలు! ప్రాణంమీదికి వచ్చినట్లు పేకాడడమూ, చెడ తినడమూ, చెడ తాగడమూ, ఒకే విషయం గురించి యెడతెగకుండా మాట్లాడడమూ. యెవరికీ అక్కరకు రాని విషయాలలోనూ, చర్చించిన విషయాన్నే మళ్లీమళ్లీ చర్చించడంలోనూ మనిషికున్న కాలంలోనూ, శక్తిలోనూ అధిక భాగం వ్యయమైపోతున్నాయి; వీటికన్నిటికీ ఫలితంగా దక్కింది యేమిటంటే, యిలకరుచుకున్న అవిటి బతుకూ, కొరగాని చిల్లర విషయాల పరంపరా; వీటినుండి తప్పించుకొనిపోడానికి మరొకచోటు లేదు; యిదంతా పిచ్చాసుపత్రిలోనో, జైలులోనో వున్నట్లుంది!

గూరొవ్‌కు ఆ వేడితో ఆ రాత్రంతా నిద్రపట్టలేదు, మరుదినం పగలంతా అతను తలనొప్పితో తిరిగినాడు. తరువాతి రాత్రిళ్లు కూడా అతనికి సరిగా నిద్రపట్టక, ఆలోచిస్తూ మంచంలో లేచికూర్చొనేవాడు, లేదా గదిలో పచారుచేసేవాడు. అతనికి పిల్లలన్నా, బాంకన్నా వెగటు కలిగింది, యెక్కడికి పోవడానికీ, యేమి మాట్లాడడానికీ యిష్టం లేకపోయింది.

క్రిస్మస్ సెలవులు వచ్చినప్పుడు అతను సామాన్లు సర్దుకొని, ఒక యువకుని పనిమీద పీటర్స్‌బుర్గ్‌కు పోతున్నానని భార్యతో చెప్పి, యస్. పట్టణానికి బయలుదేరినాడు. యేం చెయ్యాలని? అతనికే సరిగా తెలియదు. అతనికి తెలిసిందల్లా తాను ఆన్నా సెర్గేయెవ్నాను చూడాలి, ఆమెతో మాట్లాడాలి, వీలైతే సమావేశం కుదిరించుకోవాలి.

పొద్దున్నే అతను యస్. చేరినాడు, హోటల్లోకెల్ల మంచి గది అద్దెకు తీసుకున్నాడు. దానిలో నేలమీద బూడిద రంగు రత్నకంబళి వుంది, టేబుల్‌మీద ధూళి నిండిన కలందాను వుంది, దానిమీద చేతితో టోపీ యెత్తిపట్టుకొని, తల లేని అశ్వికుని బొమ్మ వుంది. అతనికి కావలసిన సమాచారం హోటల్ నౌకరు చెప్పినాడు: ఫన్ డీడెరిట్స్‌కి స్తారొ గొంచార్నయ వీధిలో సొంత యిల్లు వుంది. అది హోటల్‌కు దూరం కాదు. అతను దర్జాగా, వైభవంగా జీవిస్తున్నాడు, అతనికి గుర్రపుబండ్లు వున్నాయి, వూళ్లో అందరికీ అతను తెలుసు. అతని పేరును నౌకరు "ద్రిదిరిట్స్" అని ఉచ్చరించినాడు.

స్త్రారో గొంచార్నయ వీధిలో గూరొవ్ మెల్లగా నడుచుకుంటూ వెళ్లి, ఆ యిల్లు కనుక్కున్నాడు. యింటికి యెదురుగా పొడవైన, కొయ్య పలకల బూడిద రంగు కంచె వుంది; పలకలమీద పదును పాటు పైకి వుండేటట్లు మేకులు దిగగొట బడినాయి.

ఆ యింటి కిటికీలవైపూ, కంచెవైపూ చూస్తూ గూరొవ్ అనుకున్నాడు: "యిలాంటి కంచె చాలు, యెవరికైనా పారిపోవాలనిపిస్తుంది."

ఆరోజు సెలవు గనుక, ఆమె భర్త యింట్లో వుండవచ్చునని అతను తర్కించుకున్నాడు. యేమైనా, తాను ఆ యింట్లోకి పోయి ఆమెను యిబ్బంది పెట్టడం అనుచితంగా వుంటుంది. చీటీ పంపిస్తే, ఆమె భర్త చేతుల్లో పడి, కొంప మునిగిపోవచ్చు. అన్నిటికంటె ఉత్తమమైన పని ఆమె కనిపించే అవకాశం కొరకు ఆ ప్రాంతంలో కాచుకోవడం. అతను అవకాశం కొరకు వీధిలో అటూ యిటూ తిరుగుతూ, కంచెకు సమీపంలో తచ్చాడుతూ వుండినాడు. ఒక బిచ్చగాడు గేటులో ప్రవేశించినాడు, అతనిమీదకి కుక్కలు వురికినాయి. ఒక గంట తర్వాత మెల్లని అస్పష్టమైన పియానొ ధ్వనులు అతని చెవుల బడినాయి. అన్నా సెర్గేయెవ్నా వాయిస్తూ వుండవచ్చు. హఠాత్తుగా తలవాకిలి తెరచుకొని, ఒక ముసలామె బయటికి వచ్చింది, పరిచితమైన తెల్ల పామెరేనియా కుక్క ఆమెవెంట వుండింది. గూరొవ్ కుక్కను పిలవడానికి ప్రయత్నించినాడు, కానీ అతని గుండె తీవ్రంగా కొట్టుకొంది, ఆ ఆందోళనలో అతనికి దాని పేరు జ్ఞాపకం రాలేదు.

బూడిద రంగు కంచెను అంతకంతకూ యెక్కువగా ద్వేషిస్తూ, అతను నడుస్తూ ముందుకు సాగినాడు. కోపంగా అతను అన్నా సెర్గేయెవ్నా తన్ను మరచిపోయిందనీ, బహుశా యిప్పటికి మరొకణ్ని చూసుకొని వుంటుందనీ, పొద్దస్తమానం యీ పాపిష్టి కంచెను చూడవలసి వున్న యువతికి అంతకంటె సహజమైనది యేముంటుందనీ తనలో తాను అనుకోడానికి సిద్ధంగా వుండినాడు. అతను హోటల్‌కు తిరిగిపోయి తన గదిలో సోఫామీద కొంతసేపు పండుకున్నాడు, యేమి చేయడానికీ తోచక; తరువాత అతను భోజనం చేసినాడు, భోజనం తరువాత చాలా సేపు నిద్రపోయినాడు.

నిద్ర లేచి, చీకటిగా వున్న కిటికీలవైపు చూస్తూ అతను "యెంత తెలివి తక్కువ, వ్యాకుల పాటు వ్యవహారం," అనుకున్నాడు. అప్పటికి సాయంత్రమైంది. "నిద్రంతా తీరింది. యేం చెయ్యాలి రాత్రికి?"

అతను మంచంమీద లేచి కూర్చున్నాడు. ఆ మంచంమీద కప్పిన చౌక, బూడిద రంగు రగ్గు ఆస్పత్రి దుప్పట్లను గుర్తుకు తెచ్చింది. ఆ కలతలో అతను తన్ను తను నిందించుకో సాగినాడు:

"నీవూ, నీ కుక్కను వెంటబెట్టుకున్న మహిళా.... మంచి ప్రణయ వ్యవహారమే! నీ కష్టాలకు ప్రతిఫల మేమిటో చూడు."

ఆ ఉదయం అతను స్టేషన్‌లో దిగినప్పుడు, స్థానిక నాటకశాలలో 'గెయ్‌షా'

ప్రథమ ప్రదర్శన అని బ్రహ్మాండమైన అక్షరాంలో ప్రకటించే పోస్టర్ చూసినాడు. అది జ్ఞాపకం వచ్చి అతను లేచి, నాటకశాలకు దారితీసినాడు.

"ఆమె మొదటి సారి ప్రదర్శించే నాటకానికి పోతూ వుంటుంది కదా, అది సంభవమే" అనుకున్నాడు అతను.

నాటకశాల నిండివుండింది. అది అచ్చం చిన్న పట్టణాల్లో వుండే నాటకశాల, దీపాల చుట్టూ పొగమంచు చేరుతూ వుండింది, గాలరీలోని జనం వూరకే గోలచేస్తూ వుండినారు. ఫస్టుక్లాసులోని మొదటి వరుసలో స్థానిక షోకిల్లాలు తెర లేవడం కొరకు కాళ్లమీద కాచుకొని వుండినారు. గవర్నర్ బాక్సు ముందు సీటులో గవర్నర్ కూతురు కూర్చొని వుంది, మెడలో బోవా ధరించి; బాక్సు తెరల చాటున గవర్నరు వినయంగా దాక్కున్నాడు, చేతులు మాత్రం బయటికి కనిపించేటట్లు. తెర కదిలింది, ఆర్కెస్ట్రా తమ వాద్యాలు శ్రుతిపెట్టుకోడానికి చాలాసేపు పట్టింది. లోపలికి వచ్చి, తమతమ చోటుల్లో కూర్చునే ప్రేక్షకులను గూరొవ్ కన్నులు ఉత్సుకతతో కలయజూస్తూ వుండి నాయి. అన్నా సెర్గేయెవ్నా కూడా లోపలికి వచ్చింది. ఆమె ఫస్టుక్లాసులోని మూడవ వరుసలో కూర్చుంది. గూరొవ్ చూపు ఆమెమీద పడినప్పుడు, అతని గుండె ఆగిపోయినట్లైంది, యావత్ప్రపంచంలోనూ తనకు యింతకంటె ఆత్మీయమైనవాళ్లూ, ప్రియతమమైనవాళ్లూ లేరని, తన ఆనందానికి యింతకంటె ముఖ్యమైనవాళ్ల లేరని మెరుపులాగ అతనికి మనసుకు వచ్చింది. యీ చిన్న స్త్రీ, చిన్న పట్టణం జనంలో కలిసి పోయినది, యేవిధం గానూ అసాధారణమైనది కానిది, చేతిలో వెధవ బైనాకులర్స్ పట్టుకున్నది, యిప్పుడు తన జీవితమంతా ఆక్రమించింది, తన దుఃఖమూ, తన ఆనందమూ, తన సమస్త వాంఛా అయింది. దుర్బల, అపరిణత వయొలినిస్టులు గల దౌర్భాగ్యపు ఆర్కెస్ట్రామండి వచ్చే ధ్వనులచేత బోకొట్టబడి, ఆమె యెంత అందంగా వుందా అని అతను అనుకున్నాడు.... అనుకుంటూ, కలలలో మునిగిపోయినాడు....

అన్నా సెర్గేయెవ్నావెంట గుండ్రని భుజాలూ, చిన్న వుస్తీలూ గల పొడవాటి యువకుడు వుండినాడు; ఆమె పక్కన కూర్చున్నాడు. అతను అడుగడుగునా తల ఆడిస్తూ, నిత్యం యెవరికో ఒకరికి నమస్కరిస్తున్నట్లు కనిపించినాడు. యితను ఆమె భర్త అయివుండాలి – యాల్టాలో ఆమె, మంట పుట్టినప్పుడు, "బోకుకుంగాడు" అన్న మనిషి. అతని బండాక్షర లాంటి ఆకారంలోనూ, వుస్తీలలోనూ, నడినెత్తిన వున్న కాస్త బట్టతలలోనూ నిజంగా సేవకుని దాస్యభావం కొంత వుండింది. అతను తియ్యని చిరునవ్వులు నవ్వుతూ వుండినాడు; కోటు కాజాలోవున్న యేదో విజ్ఞానశాస్త్ర సంఘపు బాడ్జీ నౌకర్ల దుస్తులమీది నంబరు లాగ వుండింది.

మొదటి ఇంటర్వల్‌లో భర్త సిగరెట్టు కాల్చుకోడానికి బయటికి వెళ్లినాడు.

ఫస్టుక్లాసు సీటులో కూర్చొని వుండిన గూరొవ్ ఆమె వద్దకు వెళ్ళి, కంపిస్తున్న కంఠంతో, బలవంతపు చిరునవ్వుతో "నమస్తే" అన్నాడు.

ఆమె అతనివైపు కన్నులెత్తి, పాలిపోయింది, భయంతో మళ్లీ అతనివైపు చూసింది, తన కన్నులనే నమ్మలేకపోయింది, చేతిలోని విసనకర్రనూ, బైనాకులర్లనూ అణగబట్టుకుంది, స్మృతితప్పి పడిపోకుండా వుండడానికి ప్రయత్నిస్తున్నదని అర్థమౌతున్నది. యెవరూ ఒక మాట కూడా మాట్లాడలేదు. ఆమె అక్కడే కూర్చొని వుంది; ఆమె యిబ్బంది వలన అస్తిమితుడై, కూర్చొనే సాహసం లేక, అతను ఆమె పక్కనే నిలబడి వున్నాడు. ఫిడేళ్లు, వేణువులూ వాటికి పెట్టిన శ్రుతులలో పాడేస్తున్నాయి, అందరి కన్నులూ వాళ్లమీదనే వున్నట్లు, వాతావరణంలో యేదో వ్యగ్రత వుండింది. చివరకు ఆమె లేచి, వడివడిగా ఒక వాకిలివైపు నడిచింది. అతను ఆమెను అనుసరించివాడు, యిద్దరూ లక్ష్య రహితంగా కారిడర్లలోనూ, మెట్ల పైకీ, కిందికీ తిరిగినారు; న్యాయశాఖ ఉద్యోగుల, హైస్కూలు టీచర్ల, సివిల్ ఉద్యోగుల దుస్తులలో వున్న రూపాలు, అన్నీ బాడ్జీలు ధరించినవి మెరిసిపోతున్నాయి; స్త్రీలు ధగధగ మెరిసిపోతున్నారు. గుంజలకు వేలాడే కోట్లు మెరిసిపోతున్నాయి, బుస్సున గాలి వచ్చింది, సిగరెట్టు పీకల వాసనతో. గూరొవ్, గుండె ఉత్పాతంగా కొట్టుకుంటుండగా, అనుకున్నాడు:

"యీ మనుషులందరూ, యీ ఆర్కెస్ట్రా దేనికోసం?..."

మరు నిముషంలో అతనికి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది — ఆరోజు సాయంత్రం స్టేషన్‌లో అన్నా సెర్గేయెవ్నాను సాగనంపిన తర్వాత అతను అనుకున్నాడు, అంతా ముగిసిపోయిందనీ, తాము మళ్లీ యెప్పటికీ కలుసుకోమనీ. ముగింపు యిప్పుడు యెంత దూరాన వున్నట్లు కనపడుతున్నది!

చీకటిగా వున్న ఒక యిరుకు మెట్లమీద ఆమె నిలబడింది; ఆ మెట్లమీద "అప్పర్ సర్కిల్‌కు దారి" అనే బోర్డు వుంది.

బరువుగా వూపిరి తీసుకుంటూ, యింకా పాలిపోయి, సగం కొయ్యబారి, "యెంతగా జడిపించివారు నన్ను!" అన్నదామె. "ఓ, యెంతగా జడిపించివారు! నేను దాదాపు చచ్చిపోయినాను! యెందుకు వచ్చినారు మీరు? యెందుకు వచ్చినారు చెప్పండి?"

"మరి, అన్నా," అన్నాడు అతను, మెత్తగా, వడివడిగా మాట్లాడుతూ. "మరి, అన్నా.... నీవు అర్థం చేసుకోవాలి.... అర్థం చేసుకోడానికి ప్రయత్నించు...."

ఆమె అతనివైపు భయమూ, అభ్యర్థనా, ప్రేమా కలిసిన చూపు చూసింది, తరువాత అతని రూపురేఖలు తన స్మృతిఫలకంమీద స్థిరంగా ముద్రించుకోడానికా అన్నట్లు, నిశ్చలంగా అతనిమీద చూపు నిలిపింది.

"నేను చాలా బాధపడినాను," అంటూ ఆమె కొనసాగించింది, అతని మాటలు పట్టించుకోకుండా. "మరే ఆలోచనకూ తావు లేకుండా ప్రతి నిముషమూ మనసులో

మీరే మెదిలేవాళ్లు; మీ ఆలోచనలమీదనే బతికినాను. మరిచిపోడానికి ప్రయత్నించినాను — ఓ, యెందుకు వచ్చినారు మీరు, యెందుకు చెప్పండి?"

నిచ్చెన వద్ద పై అంతస్తుమీద యిద్దరు స్కూలు పిల్లలు సిగరెట్లు తాగుతూ, కిందికి చూస్తూ వుండినారు; గూరొవ్ వాళ్లను లక్ష్యపెట్టకుండా అన్నా సెర్గేయెవ్నాను దగ్గరకు లాక్కొని, ఆమె ముఖమూ, పెదవులూ, చేతులూ ముద్దుపెట్టుకోసాగినాడు.

"ఓ, యేమిటి మీరు చేసేది, యేమిటి మీరు చేసేది?" అంటూ భయసంభ్రమంతో ఆమె వెనక్కి తగ్గింది. "మనిద్దరికీ మతులు పోయినాయి. యీ రాత్రే వెళ్లిపొండి, యీ క్షణమే వెళ్లిపొండి.... భగవంతుని తోడుగా చెప్తున్నాను, మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను.... ఓ, యెవరో వస్తున్నారు!"

యెవరో మెట్లెక్కుతుండినారు.

"మీరు వెళ్లిపోవాలి," అంటూ అన్నా సెర్గేయెవ్నా గుసగుసగా చెప్పసాగింది. "వినండి ద్మీత్రి ద్మీత్రిచ్. నేను మాస్కోకు మీవద్దకు వస్తాను. నేనెప్పుడూ సుఖపడలేదు, యిప్పుడు బాధపడుతున్నాను, నా కెప్పుడూ సుఖం వుండదు, యెప్పుడూ వుండదు! నా కింకా బాధ కలిగించకండి! నేను మాస్కోకు వస్తాను, మీవద్దకు, ప్రమాణంగా వస్తాను! యిప్పుడిక మనం విడిపోవాలి! నా ప్రేమ పెన్నిధివి కదూ, నా కరుణామూర్తివి కదూ, మనం విడిపోక తప్పదు."

ఆమె అతని చేయి నొక్కి, బిరబిర మెట్లు దిగిపోయింది, అడుగడుగునా వెనక్కి తిరిగిచూస్తూ; ఆమె నిజంగా బాధపడుతున్నదని ఆమె కన్నుల్లో కనపడింది. గూరొవ్ కొంచెం సేపు అక్కడే నిలబడినాడు, వింటూ. సద్దు మణిగిన తర్వాత, అతను తన చలికోటు తీసుకుని నాటకశాలనుండి వెళ్లిపోయినాడు.

4

అన్నా సెర్గేయెవ్నా అతన్ని చూడడానికి మాస్కోకు పోవడం ప్రారంభించింది. రెండుమూడు నెలల కొకసారి ఆమె యస్. పట్టణంనుండి వెళ్లిపోయేది; స్త్రీ వ్యాధుల నిపుణుని సంప్రదించడానికి పోతున్నానని భర్తతో చెప్పేది. భర్త నమ్మేవాడు, నమ్మక పోయేవాడు. ఆమె మాస్కోలో యెప్పుడూ 'స్లవ్యాన్‌స్కీ బజార్' హోటల్లో దిగి, దిగిన మరుక్షణమే ఒక యెర్ర టోపీ మనిషిని గూరొవ్‌వద్దకు పంపేది. గూరొవ్ ఆమెవద్దకు వెళ్లేవాడు. మాస్కోలో యెవరికీ యీ విషయం తెలియదు.

ఒక చలికాలం ఉదయం యథాప్రకారం అతను ఆమెను చూడడానికి పోయినాడు (వార్తాహరుడు ముందు రోజు సాయంత్రం అతని కోసం వచ్చినాడు, కాని అతను యింట్లో లేడు). అతని కూతురు అతని వెంట వుండింది; ఆమె బడి ఆ దారిలోనే

గనుక, అతను పనిలో పనిగా ఆమెను బడిదగ్గర వదలిపెట్టవచ్చు ననుకున్నాడు. సగం మంచూ సగం చినుకులూ బాగా పడినాయి.

గూరొవ్ కూతురుతో అన్నాడు: "సున్నకు పైన మూడు డిగ్రీలు వుంది, కానీ మంచు పడుతున్నది. యెందుకో తెలుసా? భూమికి ఆనుకొని మాత్రమే సున్నకు పైన వుంది, వాతావరణంలోని పైపొరలలో ఉష్ణోగ్రత భిన్నంగా వుంది."

"చలికాలంలో ఉరుములసలు వుండవేం నాన్నా?"

యిది కూడా అతను వివరించినాడు. అతను ఒకవైపున మాట్లాడుతూ, మరొక వైపున జ్ఞాపకం చేసుకుంటూ వుండినాడు, ఒక్క ప్రాణికి కూడా తెలియని, బహుశా యెన్నటికీ తెలియబోని సమావేశానికి తాను పోతున్నానని. తాను ద్వంద్వ జీవితం జీవిస్తున్నాడు — ఒకటి బహిరంగంగా, యెవరికి సంబంధించిందో వాళ్లందరి యెదుటా జీవించేది, సాంప్రదాయిక సత్యంతో, సాంప్రదాయిక వంచనతో నిండినది, సరిగ్గా తన మిత్రుల, పరిచితుల జీవితాల లాంటిది; మరొకటి రహస్యంగా ప్రవహించేది. యేదో వింత, బహుశా కేవలం యాదృచ్ఛికమైన పరిస్థితుల పరంపర చేత, ముఖ్యమైనదీ, ఆసక్తికరమైనదీ, అత్యావశ్యకమైనదీ ప్రతిదీ, దేన్ని గురించి తాను చిత్తశుద్ధిగా వున్నాడో, దేన్ని గురించి తాను ఆత్మవంచన చేసుకోడో ఆ ప్రతిదీ, తన జీవితపు సారమైన ప్రతిదీ, రహస్యంగా జరుగుతున్నది. కానీ తనలో బూటకమైనది ప్రతిదీ, తామూ, తనలోని సత్యమూ దేనిలో దాక్కున్నారో ఆ పొట్టు అయిన ప్రతిదీ — బాంకిలో తన పనీ, క్లబ్బులో చర్చలూ, తన "అధమ శ్రేణీ," భార్యతో కలిసి వార్షికోత్సవాలకు హాజరు కావడమూ — ఉపరితలంలో జరుగుతున్నది. కనపడేదాన్ని యిక యెంతమాత్రమూ నమ్మకుండా, ప్రతి వ్యక్తియొక్కా నిజమైన, ఒకేఒక ఆసక్తికరమైన జీవితం రాత్రి ముసుగులో, రహస్యంగా సాగుతుందని నిత్యం నమ్ముతూ, తనను బట్టి అతను యితర్లను అంచనావేయ నారంభించినాడు. ప్రతి వ్యక్తి ముసుగడా నిగూఢత చుట్టూ పరిభ్రమిస్తుంది; వ్యక్తిగత రహస్యాలకు ఉచితమైన గౌరవం గురించి సంస్కారవంతులందరూ అంత గట్టిగా పట్టుబట్టడానికి ప్రధాన కారణం బహుశా అదే కావచ్చు.

బడి వాకిలివద్ద కూతురును వదలి, గూరొవ్ 'స్లవ్యాన్స్కీ బజార్'కు పోయినాడు. హాలులో అతను చలి కోటు విప్పి, పై అంతస్తుకు పోయి, మెల్లగా తలుపు తట్టినాడు. అన్నా సెర్గేయెవ్నా అతనికి అత్యంత ప్రీతికరమైన బూడిదరంగు దుస్తు ధరించి, ప్రయాణంచేతా, సందిగ్ధ మనస్కతచేతా నీరసించి, గత సాయంత్రంనుండి అతని కోసం నిరీక్షిస్తూ వుండింది. ఆమె పాలిపోయి వుండింది, చిరునవ్వు లేకుండా అతనివైపు చూసింది, కానీ అతను గదిలో అడుగు పెట్టీపెట్టకముందే అతని కౌగిట్లో వాలింది. చాలా యేండ్లగా వాళ్లు కలుసుకోనట్లు, వాళ్ల ముద్దు దీర్ఘంగా, చాలా సేపు సాగింది.

"బాగున్నావా?" అని అతను అడిగినాడు. "యేమైనా కొత్త సంగతులా?"

"ఆగు, ఒక నిముషంలో చెప్తాను.... ఊహూఁ, చెప్పలేను...."

ఆమె మాట్లాడలేకపోయింది, యేడుస్తూ. పక్కకు తిరిగి చేతిగుడ్డ కండ్లకు అద్దుకుంది.

"యేడుపంతా యేడ్చేసిందాకా ఆగుతాను," అనుకుంటూ అతను కుర్చీలో కూల బడినాడు.

అతను గంట నొక్కి టీ తెప్పించుకున్నాడు. అతను టీ తాగుతుండగా, ఆమె యింకా అక్కడ నిలబడే వుంది, కిటికీవైపు ముఖం తిప్పి. ఆమె హృదయ భారంచేత యేడ్చింది, తమ జీవితం యెంత దుఃఖభాజనమైందా అన్న బాధాకర స్పృహచేత యేడ్చింది; తాము ఒకరినొకరు చూసుకునేది రహస్యంగా మాత్రమే, లోకానికి చాటుగా మాత్రమే, దొంగలైనట్లు. తమది భగ్న జీవితం కాదా?

"యేడవాకు," అన్నాడు అతను.

తమ యీ ప్రేమ త్వరలో అంతం కాదనీ, యెప్పు డంతమయ్యేదీ యెవరికీ తెలి యదనీ అతనికి స్పష్టమైంది. అన్నా సెర్గేయెవ్నా తనను అంతకంతకూ ఆపేక్షగా ప్రేమిస్తున్నది, తనను ఆరాధిస్తున్నది, యెప్పుడో ఒకనాడు యీ ప్రేమ అంతం కాకతప్పదని ఆమెతో చెప్పడంలో అర్థం లేదు. నిజానికి ఆమె తన మాట నమ్మదు.

అతను దగ్గరికి పోయి ఆమె భుజాలు పట్టుకున్నాడు, తేలిక మాటలతో ఆమెను లాలించే ఉద్దేశంతో; కానీ అప్పుడే అతనికి అద్దంలో తన రూపం కనపడింది.

అతని తల అప్పుడే తెల్లబడడం ప్రారంభమైంది. గత కొద్ది యేండ్లలో అంతగా తాను వయసెక్కడం అతనికి చిత్రమనిపించింది. తన చేతులకింద వున్న భుజాలు వెచ్చగా, జీవశక్తితో కంపిస్తూ వున్నాయి. యీ జీవంపట్ల, అంత వెచ్చగా, అంత అతిలోకంగా వున్న, కానీ తన జీవంలాగే బహుశా త్వరలో వాడి, వాలిపోనున్న యీ జీవంపట్ల, అతనికి అనుతాపం కలిగింది. యెందుకామె తన్ను అంతగా ప్రేమించింది? స్త్రీలు యెప్పుడూ తనను తన నిజమైన వ్యక్తిత్వంకంటె భిన్నమైనవానిగా నమ్మినారు; వాళ్లు తనను గాక, తన్ను గురించి తమ మనసులో ఊహించుకున్న వ్యక్తిని తమ యావజ్జీవి తాలూ తాము అన్వేషించిన మనిషిని, ప్రేమించినారు. తరువాత వాళ్లు తమ పొర పాటును కనుక్కున్నప్పుడు, యథాప్రకారం ప్రేమిస్తూనే వెండినారు. వాళ్లలో ఒక్కరూ తనతో సుఖపడలేదు. కాలం గడిచేకొద్దీ తాను ఒక స్త్రీ తరువాత మరొకరిని కలుసు కున్నాడు, ప్రతిఒకరితోనూ సన్నిహితుడైనాడు, ప్రతిఒకరితోనూ విడిపోయినాడు, కానీ యెప్పుడూ ప్రేమించలేదు. వాళ్లతో అతనికి నానా రకాల సంబంధాలు వుండినాయి, కానీ ప్రేమ యెప్పుడూ లేదు.

యిప్పుడు తల వెంట్రుకలు తెల్లబడినప్పుడు మాత్రమే, అతనికి చక్కగా, పూర్తిగా, జీవితంలో మొదటిసారి ప్రేమ కలిగింది.

అతనూ, అన్నా సెర్గేయెవ్నా గాఢ సన్నిహితులలాగ, భార్యాభర్తలలాగ, ఆప్త మిత్రులలాగ పరస్పరం ప్రేమించుకున్నారు. విధి వాళ్లను ఒకరికోసం మొకరిని ఉద్దేశించినట్టుంది, మరి ఆమె కొక భర్తా, అతని కొక భార్యా యెందుకుండవలసివచ్చిందో వాళ్లకి అర్థం కాలేదు. చలి కాలంలో దేశాంతరాలకు వలసపోయే పక్షులు, పుంజా, పెట్టా, వేరువేరు పంజరాలలో బంధింపబడినట్లుండినారు వాళ్లు. గతంలోనూ, తమ వర్తమానంలోనూ వాళ్లు ఒకరి మూలంగా ఒకరు సిగ్గుపడిన ప్రతిదానికీ ఒకరి నొకరు క్షమించుకున్నారు; యీ ప్రేమ తమను యిద్దరినీ మార్చినట్లు వాళ్లకు అనిపించింది.

యింతకు మునుపు, విచార సమయాలలో, తనకు యే వాదం మొదట తోస్తే ఆ వాదంతో తన్ను తాను ఓదార్చుకునేవాడు, కానీ యిప్పుడతనికి వాదాలు నిరుపయోగం, అతనికి ప్రగాఢమైన అనుతాపం కలిగింది, నిష్కపటంగా ఆర్ద్రంగా వుండాలని కాంక్ష కలిగింది.

"యేడవాకు అన్నా," అన్నాడు అతను. "యేడువంతా యేడ్చేసినావుగా, యిక అవు.... యిక కాస్త మాట్లాడుకుందాం, యేం చెయ్యాల్సో ఆలోచిద్దాం."

తరువాత వాళ్లు చాలా సేపు తమ పరిస్థితిని చర్చించినారు; దాక్కోవడాలకూ, వంచనకూ, వేరువేరు పూర్లలో వుండడానికీ, అంత దీర్ఘ కాలం కలుసుకోకుండా వుండడానికీ అవసరం లేకుండా చేసుకోవడం యెలాగని ఆలోచించినారు. తాము యీ దుర్భరమైన శృంఖలాలు విదలించుకోవడం యెలాగ?

"యెలాగ? యెలాగ?" మళ్లీ మళ్లీ అన్నాడు అతను, చేతులలో తల పట్టుకొని.

నిర్ణయం జానెడు దూరంలో వున్నట్లూ, ఆ తరువాత అందమైన కొత్త జీవితం ప్రారంభం కానున్నట్లూ వాళ్లకు అనిపించింది. అంతం యింకా చాలా చాలా దూరంలో వుందనీ, అత్యంత కష్టమైన, క్లిష్టమైన భాగం యిప్పుడే ప్రారంభ మౌతున్నదనీ వాళ్లిద్దరూ గుర్తించినారు.

1899

పెండ్లికూతురు

1

అప్పుడే సాయంత్రం పదైంది, తోటమీద పున్నమ చంద్రుడు ప్రకాశిస్తూ వుండినాడు. షూమిన్ం గృహంలో అవ్వ మార్ఫా మిహైలొవ్నా యేర్పాటుచేసిన సాయం ప్రార్థన అప్పుడప్పుడే ముగిసింది. ఒక నిముషం సేపు తోటలోకి జారుకుంది నాద్యా. భోజనశాలలో చల్లని భోజనం వడ్డించడమూ, ఆమె అవ్వ పెద్ద కుచ్చె గల సిల్కు గౌనులో టేబుల్ చుట్టూ తారాడుతూ వుండడమూ, మతగురువు ఫాదర్ అంద్రేయ్ ఆమె అమ్మ నీనా ఇవానొవ్నాతో మాట్లాడుతూ వుండడమూ, కృత్రిమ వెలుతురులో కిటికీగుండా అమ్మ చాలా పడుచుదిగా కనిపించడమూ నాద్యా చూడగలిగింది. అమ్మ పక్కన ఫాదర్ అంద్రేయ్ కొడుకు అంద్రేయ్ అంద్రేయిచ్ శ్రద్ధగా వింటూ నిలబడి వుండినాడు.

తోటలో చల్లగా, నిశ్చలంగా వుండింది, నల్లని నీడలు నేలమీద ప్రశాంతంగా పరుచుకొని వుండినాయి. చాలా దూరంనుండి, బహుశా పట్టణం బయటినుండి, కప్పల బెకబెక వినవచ్చింది. గాలిలో ఆహ్లాదకరమైన మే మాసపు స్ఫూర్తి వుండింది. గుండెలనిండా గాలి పీల్చుకుంటే, యెక్కడో పట్టణానికి అవల చాలా దూరాన, ఆకాశం కింద, చెట్ల కొమ్మలపైన, పొలాలలోనూ, వనాలలోనూ వసంతం తన సొంత జీవితం ప్రారంభిస్తున్నదనే ఊహ వస్తుంది – మాయామయమైన, అతిలోక సుందరమైన జీవితం, సంపన్నమైన, పవిత్రమైన జీవితం, పాపులైన మానవులకు ప్రవేశం లేని జీవితం. యెవరికైనా యేడ్వాలనిపిస్తుంది దాన్ని చూస్తే.

నాద్యాకు యిప్పుడు యిరవైమూడు. పదారేండ్లు వచ్చినప్పటినుండి ఆమె పెండ్లిని గురించి గాఢంగా కలలుగంటూ వుండింది; చివర కిప్పుడామెకు అంద్రేయ్ అంద్రేయిచ్‌తో, భోజనశాలలో నిలబడివున్న యువకునితో, ప్రధానం జరిగింది. అతనంటే ఆమెకు యిష్టం, పెండ్లి జూలై యేడవ తారీకు నిర్ణయమైంది, కానీ ఆమెకు సంతోషం కలగలేదు; ఆమెకు సరిగా నిద్ర పట్టడంలేదు, ఆమెలోని ఉల్లాసమంతా నశించింది....

బేస్‌మెంటు వంటగది కిటికీలు తెరిచి వుండినాయి. వాటి గుండా గోలా, కత్తుల మోత వస్తూవుండినాయి, వేలగట్టిన బరువు మూలంగా మూతబడే తలుపు మాటిమాటికీ ధణామంటూ వుండింది. వేయించిన టర్కీకోడి వాసనా, మసాలా చెర్రీల వాసనా వస్తూ వుండినాయి. యివన్నీ యిలాగే, మార్పు లేకుండా శాశ్వతంగా కొనసాగుతాయనిపించింది.

యెవరో యింట్లోనుండి బయటికి వచ్చి, వాకిలి ముందరి వరండాలో నిలబడినారు. అతను అలెక్సాండర్ తిమొఫేయిచ్; అతన్ని అందరూ సాషా అనేవాళ్ళు. అతను చూసి పోవడానికి సుమారు పది రోజుల క్రితం మాస్కోనుండి వచ్చినాడు. చాలా కాలం కిందట సన్నగా, బక్కగా, సుకుమారంగా వుండే మరియా పెత్రోవ్నా అనే కులీన వితంతువు సహాయం కోసం నాద్యా అవ్వవద్దకు వస్తూవుండేది. ఆమెకూ అవ్వకూ దూరపు బంధుత్వం. మరియాకు సాషా అనే కొడుకు వుండినాడు. యెందుకో అతన్ని అందరూ మంచి కళాకారు డనేవాళ్ళు. అతని తల్లి చనిపోయిన తర్వాత, నాద్యా అవ్వ, పుణ్యం వస్తుందని, అతన్ని మాస్కోలోని కొమిస్సారొవ్ పాఠశాలకు పంపింది. ఒకటి రెండేండ్ల తర్వాత అతను కళా పాఠశాలకు మారి, అక్కడ సుమారు పదిహేనేండ్లు వుండి, చివరకు వాస్తుశిల్ప శాఖలో చివరి పరీక్షల్లో గట్టెక్కినాడు. అతను వాస్తుశిల్పిగా యెన్నడూ పనిచేయలేదు, మాస్కోలోని ఒక ముద్రణాలయంలో పని సంపాయించుకున్నాడు. దాదాపు ప్రతి వేసవీ, సాధారణంగా తీవ్రంగా జబ్బుపడి, విశ్రాంతి కొరకూ, కోలుకోడానికీ అతను యిక్కడికి వచ్చి వుండేవాడు.

అతను గొంతుదాకా గుండీలు పెట్టుకున్న లాంగుకోటూ, అంచులు చీలిపోయిన పాత కాన్వాసు షరాయీ ధరించినాడు, చొక్కా యిస్త్రీ చేయలేదు, మొత్తం అతని రూపమంతా రోతగా వుండింది. అతను వరిటిపోయి, పేరెడేసి కన్నులతో, పొడవైన, పుల్లల్లాంటి వేళ్ళతో, పెరిగిన గడ్డంతో, చామనఛాయ శరీరంతో ఆకర్షణీయంగా వుండినాడు. షూమిన్‌ల యింట్లో అతనికి తనవాళ్ళమధ్య వున్నట్లూ, సొంత యింట్లో వున్నట్లూ వుండేది. యిక్కడికి వచ్చినప్పుడు అతను వుండే గదికి సాషా గది అని చాలా కాలంగా పేరువచ్చింది.

వరండాలోనుండి అతను నాద్యాను చూసి, ఆమెవద్దకు పోయినాడు.

"యిక్కడ బాగుంది," అన్నాడతను.

"చాలా బాగుంది. ఆకురాలు కాలం దాకా నీవు యిక్కడుండాలి."

"అవును. వుండవలసే వుంటుందనుకుంటాను. బహూశా సెప్టెంబర్‌దాకా మీతో కలిసివుంటాను."

కారణమేమీ లేకుండానే అతను నవ్వి, ఆమెపక్కన కూర్చున్నాడు.

"అమ్మను చూస్తూ యిక్కడ నిలుచున్నాను," అన్నది నాద్యా. "యిక్కడనుండి

ఆమె యెంతో వడుచుదిగా కనిపిస్తుంది. మా అమ్మకు ఆమె బలహీనతలు వున్నాయనుకో, నాకు తెలుసు. అయినా ఆమె అద్భుతమైన మనిషి."

"అవును, ఆమె చాలా మంచిది" అని సాషా వత్తాసు పలికినాడు. "తన పద్ధతిలో మీ అమ్మ చాలా మంచిదే, దయగలదే, కానీ... యెలా చెప్పాలో తెలియడం లేదు. యీ దినం పొద్దున్నే నేను వంటగదిలోకి పోయినాను. నలుగురు నౌకర్లు నేల మీదనే నిద్రపోతున్నారు, మంచాలు లేవు, చింపిరి పాతలమీద పండుకున్నారు, కంపు, నల్లులు, బొద్దింకలు.... సర్గిగా యిరవై యేండ్ల కితం వున్నట్లే వుంది, యేమీ మార్పు లేదు. అవ్వనేమీ అనలేమనుకో, ఆమె ముసలిది – కానీ మీ అమ్మ, తన ఫ్రెంచి భాషతో, ఔత్సాహిక నాటకాలతో.... ఆమెకైనా అర్థం కావాలి."

సాషా మాట్లాడేటప్పుడు, పొడవాటి పుల్లల్లాంటి వేళ్లు రెండు వినేవాళ్లవైపు యెత్తి పట్టుకోవడం అతనికి అలవాటు.

"యిక్కడ ప్రతిదీ నాకు చిత్రంగా కనపడుతుంది," అంటూ అతను చెప్ప సాగినాడు. "నేను దీనికి అలవాటు పడలేదేమో. యెవరూ యెప్పుడూ యే పనీ చేయరు! మీ అమ్మ మహారాణి లాగ షికారు వెళ్లడం తప్ప యేమీ చేయదు, అవ్వ యేమే చేయదు, నీవూ అంతే. నీ కాబోయే భర్త అంద్రేయ్ అంద్రేయిచ్ – అతనూ యేమీ చేయడు."

యిదంతా నాద్యా నిరుడు విన్నది, అంతకు ముందటేడు కూడా విన్నట్లు ఆమెకు జ్ఞాపకం వచ్చింది. సాషా ఆలోచనా ధోరణి అదొక్కటే అని ఆమెకు తెలుసు. ఒకప్పుడు అది ఆమెకు వినోదం కలిగించేది, కానీ యిప్పుడెందు వల్లనో అది ఆమెకు చిరాకు కలిగించింది.

"అదంతా పాత చింతకాయ పచ్చడే. విని విని వెగటైంది నాకు," అంటూ ఆమె లేచింది. "కొత్తదేమీ తోచదా నీకు."

నవ్వుతూ అతను కూడా లేచినాడు. యిద్దరూ యింట్లోకి పోయినారు. అందంగా, పొడవుగా, సన్నగా వున్న ఆమె అతని పక్కన నడుస్తుంటే, దాదాపు వెగటు కలిగించేటంత మంచి దుస్తులు వేసుకున్నట్లుగానూ, అంత ఆరోగ్యంగానూ కనిపించింది. ఆమెకే ఆ స్పృహ వుంది; అతని పట్ల ఆమెకు విచారం కలిగింది, యేదో తప్పు చేసిన భావం కలిగింది.

"నీవు చెత్త చాలా మాట్లాడుతావు," అన్నది ఆమె. "నా అంద్రేయ్‌ని గురించి యిప్పుడే యేమన్నావో చూడు – అతన్ని గురించి నీకేమీ తెలియదు, నిజంగా!"

"నా అంద్రేయ్.... నీ అంద్రేయ్‌ని అలా వుంచు! నాకు జాలి కలిగించేది నీ యవ్వనం."

వాళ్లు భోజనశాలలోకి పోయేటప్పటికి, ప్రతివొకరూ అప్పుడే భోజనానికి కూర్చుంటూ వుండినారు. నాద్యా అవ్వ – యింట్లో అందరూ ఆమెను "అవ్వమ్మ" అంటారు – దట్టమైన కనుబొమలూ, మీసకట్టూ గల, కండలు పెరిగిన పొదా వృద్ధురాలు, బిగ్గరగా

మాట్లాడుతూ వుండింది. ఆమె కంఠమూ, మాట్లాడే పద్ధతీబట్టి ఆమె ఆ యింటి నిజమైన యజమానురాలు అని తెలుస్తూ వుండింది. మార్కెట్‌లో ఆమెకు రెండు వరుసల అంగళ్లు వుండినాయి, పాత స్తంభాల యిల్లూ, తోటా ఆమెవే. కానీ, సర్వ నాశనంనుండి రక్షించమని ఆమె ప్రతి ఉదయం భగవంతుని ప్రార్థించేది. ఆమె కోడలు, నాద్యా అమ్మ అయిన నీనా ఖానొవ్నా, లేత గోధుమరంగు జుట్టూ, బిగువు కంచుకమూ, కండ్లద్దాలూ, అన్ని వేళ్లకూ రాళ్ల ఉంగరాలూ గల స్త్రీ; ఫాదర్ అంద్రేయ్, బక్క పల చని, పండ్లు లేని వృద్ధుడు, యెప్పుడూ యేదో మహా తమాషా అయినది చెప్పబోయేవాని లాగ కనిపించే వ్యక్తి; అతని కొడుకూ, నాద్యాకు కాబోయే భర్త అయిన అంద్రేయ్ అంద్రేయిచ్, ఉంగరాల జుట్టు గల భద్రమైన, అందమైన యువకుడు, నటుని లాగో, కళాకారుని లాగో కనిపించే వ్యక్తి — యీ ముగ్గురూ హిప్నటిజం గురించి మాట్లా డుతూ వుండినారు.

"నీ విక్కడ ఒక వారంలో లావౌతావు," అని అవ్వ సాషాతో చెప్పింది. "కానీ నీ వింకా బాగా తినాలి. యెలా వున్నావో చూడు!" ఆమె నిట్టూర్చింది. "ఘోరంగా వున్నావు, బైబిల్‌లోని లేచిపోయిన కొడుకులా వున్నావు, సరిగ్గా అలాంటివాడివే నువ్వు."

"అతను బల్లా జీవితంతో పాడైనాడు," ఫాదర్ అంద్రేయ్ అన్నాడు, మాటలు నిదానంగా బయటికి వదలుతూ, కండ్లు మిలమిలలాడిస్తూ "పందుల మేపడానికి అతన్ని పొలాలలోకి పంపినారు."

"మా నాన్నంటే నాకు ప్రాణం," అన్నాడు అంద్రేయ్ అంద్రేయిచ్, తండ్రిని భుజంమీద తట్టుతూ. "మంచివాడు. మా నాన్న మంచివాడు!"

యెవరూ యేమీ అనలేదు. సాషా హఠాత్తుగా పగలబడి నవ్వి, రుమాలుతో మూతి తుడుచుకున్నాడు.

"హిప్నటిజంలో మీకు నమ్మకముందన్నమాట?" ఫాదర్ అంద్రేయ్ నీనా ఖా నొవ్నాను అడిగినాడు.

"నమ్ముతానని కచ్చితంగా చెప్పలేను," గంభీరమైన, దాదాపు కఠినమైన ముఖ భంగిమ ధరిస్తూ అన్నది నీనా ఖానొవ్నా. "కానీ ప్రకృతిలో నిగూఢమైనదీ, దుర్గ్రా హ్యమైనదీ చాలా వుందని నేను ఒప్పుకోవలసివుంది."

"నేను మీతో యేకీభవిస్తాను, కానీ మాకు భగవద్విశ్వాసం నిగూఢ రంగాన్ని గణనీయంగా కుదిస్తుందని చెప్పక తప్పదు."

చపులూరించే పెద్ద టర్కీకోడిని టేబుల్‌మీద పెట్టినారు. ఫాదర్ అంద్రేయ్, నీనా ఖానొవ్నా మాట్లాడుతూనే వుండినారు. ఆమె వేళ్లలోని రాళ్లు తళతళ లాడి నాయి, కండ్లలో నీరు తళతళలాడింది, ఆమె హృదయం ఆవేశభరితమైంది.

"మీతో వాదించే సాహసం నాకు లేదనుకోండి. కానీ జీవితంలో అపరిష్కృత సమస్యలు చాలా వున్నాయని ఒప్పుకుంటారు గదా," అన్నది ఆమె.

"లేవు, లేనే లేవు."

భోజనం తర్వాత అంద్రేయ్ అంద్రేయిచ్ ఫిడేలు వాయించినాడు, వీవా ఇవానొవ్నా పక్కవాద్యంగా పియానో వాయించింది. అతను పదేండ్ల కితం విశ్వవిద్యాలయంలో, భాషాశాస్త్రంలో ఉత్తీర్ణుడైనాడు, కానీ అతనికి ఉద్యోగమూ లేదు, నిశ్చితమైన ఒక వృత్తీ లేదు, యెవ్వరైనా ఒకసారి ధర్మకార్యార్థం యిచ్చే కాన్సర్టులలో సంగీతం వాయించే వాడు. పట్టణంలో అతన్ని సంగీత విద్వాంసునిగా చెప్పుకునేవాళ్లు.

అంద్రేయ్ అంద్రేయిచ్ వాయిస్తూ వుండినాడు, అందరూ నిశ్శబ్దంగా వింటూ వుండినారు. టేబుల్‌మీద సమొవార్ మరుగుతూ వుండింది, సాషా ఒక్కడే టీ తాగుతూ వుండినాడు. సరిగ్గా పన్రెండు గంటల కొట్టేటప్పుడు ఫిడేలు తంతె ఒకటి పుటుక్కుమన్నది. అందరూ నవ్వినారు, తరువాత కోలాహలంగా సెలవు తీసుకున్నారు.

కాబోయే భర్తకు నమస్తే చెప్పి, నాద్యా పై అంతస్తులో తామా, తన తల్లీ వుండే గదులకు వెళ్లిపోయింది (కింది అంతస్తులో అవ్వ వుండేది). కింది అంతస్తులో, భోజనశాలలో దీపాలు ఆర్పివేస్తూ వుండినారు, కానీ సాషా టీ తాగుతూ యింకా కూర్చునే వుండినాడు. అతను యెప్పుడూ, మాస్కో పద్ధతిలో, టీ వద్ద చాలా సేపు కూర్చునేవాడు, వరుసగా ఆరేడు గ్లాసులు తాగేవాడు. నాద్యా బట్టలు మార్చుకొని, మంచంమీద పండుకొన్న తర్వాత చాలాసేపటికి నౌకర్లు టేబుల్ శుభ్రం చేయడమూ, అవ్వ తిట్ట డమూ ఆమెకు వినిపించింది. కింది అంతస్తులో సాషా గదిలోనుండి అప్పుడప్పుడు వచ్చే పెద్ద దగ్గు తప్ప, చివరకు యిల్లు నిశ్శబ్దమైంది.

2

నాద్యాకు మెలకువ వచ్చేటప్పటికి — తెలతెలవారుతూ వుందేమో — సుమారు రెండు గంటలై వుండాలి. నైట్ వాచ్‌మన్ గిలక దూరాన వినిపిస్తూ వుండింది. నాద్యాకు నిద్ర పట్టలేదు, ఆమె మంచం సుఖంగా పండుకోడానికి సాధ్యం కానంత మెత్తగా వున్నట్లుంది. యీ మేనెలలో గత రాత్రులన్నింటి లాగే నాద్యా మంచంమీద లేచి కూర్చొని ఆలోచనలలో మునిగిపోయింది. ఆలోచనలు గత రాత్రి లాగే రోకటి పాటగా, నిరర్థకంగా, పట్టు విడువకుండా వుండినాయి — అంద్రేయ్ అంద్రేయిచ్ తన్ను ప్రేమించ డమూ, పెండ్లి ప్రతిపాదన చేయడమూ, తాను అతన్ని చేసుకుందుకు ఒప్పుకోవడమూ, క్రమక్రమంగా యీ మంచివాడైన, చురుకైన మనిషిని మెచ్చుకోవడమూ. కానీ, యెందువల్లనో, పెండ్లికిక నెల మాత్రమే వుండనగా, లీలగా విషాదకరమైనదేదో ఆమెకోసం పొంచుకొని వున్నట్లు ఆమెకు భయమూ, అశాంతీ కలగసాగినాయి.

"టిక్ – టాక్, టిక్ – టాక్," రాత్రి వాచ్‌మన్ సోమరితనంగా గిలక వాయిస్తూ వుండినాడు. "టిక్ – టాక్...."

పాతకాలపు పెద్ద కిటికీగుండా తోటా, దాని కవతల విరగబూసి, చలి గాలిలో మత్తుగా, నీరసంగా వున్న లైలాక్ పొదలూ కనిపిస్తూ వుండినాయి. దట్టమైన తెల్లని పొగమంచు నిశ్శబ్దంగా లైలాక్ పొదలను సమీపించింది, వాటిని ఆవరించే ఉద్దేశం వున్నట్లు. నిద్రమత్తులో వున్న కాకులు దూరపు చెట్లమీద కావుకావు మంటూ వుండినాయి.

"భగవంతుడా, యెందుకు నాకింత దుఃఖం కలుగుతున్నది?"

ఆడపిల్లలందరికీ పెండ్లి ముందర యిలాగే వుంటుందా? లేక యిది సాషె ప్రభావమా? కానీ, సాషె ప్రతి యేడూ, కంఠపాఠం లాగా, యివే విషయాలు చెప్తున్నాడు, అతను చెప్పేది యెప్పుడూ యెంతో అమాయకంగా, వింతగా వుంటుంది. సాషెను గురించిన ఆలోచన యెందుకు తన్ను వదలకుండా వుంది? యెందుకు?

వాచ్‌మన్ గస్తీ తిరగడం యెప్పుడో మానుకున్నాడు. పక్షులు కిటికీకింద చెట్ల కొమ్మల్లో కిచకిచమంటున్నాయి, తోటలోని పొగమంచు విరిసింది, వసంతపు సూర్య కాంతి అన్నిటికీ బంగారు పూత పూసింది, ప్రతిదీ చిరునవ్వులలో ఓలలాడినట్లుంది. కాసేపట్లో మొత్తం తోట సూర్య కిరణాల లాలనతో ఉజ్జీవితమైంది, మంచు బిందువులు చెట్ల ఆకులమీద రత్నాలలాగ తళతళలాడినాయి. నిర్లక్ష్యం చేయబడిన ముసలి తోట ఆ ఒక్క పూటకూ యవ్వనమూ, ఉల్లాసమూ పొందింది.

అవ్వ అప్పటికే నిద్రలేచింది. సాషె పెద్దగా ఖంగుఖంగుమంటూ దగ్గినాడు. కింది అంతస్తులో నౌకర్లు సమొవార్ తెచ్చి పెట్టడమూ, కుర్చీలు సర్దడమూ వినిపించింది.

గంటలు మందంగా గడచినాయి. నాద్యా లేచి చాలా సేపటినుండి తోటలో షికారు తిరుగుతున్నది. ఉదయం యింకా యీడుస్తున్నట్లు సాగుతోంది.

నీనా ఇవానొవ్నా కన్నీళ్లతో, చేతిలో సోడానీళ్ల గ్లాసుతో వచ్చింది. ఆమె ప్రేత దర్శన వాదాన్నీ, హోమియోపతినీ చేపట్టింది, పుస్తకాలు బాగా చదివేది, మత సందేహాల గురించి మాట్లాడడమంటే చెవికోసుకునేది; యీ అన్నిటిలోనూ యేదో ప్రగాఢమైన, నిగూఢమైన ప్రాముఖ్యం వుండక తప్పదని నాద్యా అనుకుంది. ఆమె తల్లిని ముద్దు పెట్టుకొని, ఆమె పక్కనే నడిచింది.

"అమ్మా, యెందుకు యేడుస్తున్నావ్?" అని అడిగింది నాద్యా.

"రాత్రి ఒక పుస్తకం చదివినాను – ఒక వృద్ధుడూ, అతని కూతురూ వున్న కథ. వృద్ధుడు యేదో ఆఫీసులో పనిచేసేవాడు. తరువాత యేమైందో తెలుసా? వృద్ధుని పై అధికారి అతని కూతురును ప్రేమించినాడు. పుస్తకమింకా పూర్తిచేయలేదు, కాని

యిప్పుడున్న చోట యేడుపు ఆవుకోలేకపోయినాను," అని నీనా ఖానొవ్నా గ్లాసులోనుండి ఒక గుటక తాగింది. "ప్రొద్దున్నే అది జ్ఞాపకం వచ్చి, మళ్లీ యేడ్చినాను."

కాసేపు ఆగి నాద్యా అన్నది:

"యిటీవల కొద్ది రోజులుగా నాకు ఉత్సాహంగా లేదు. నాకు నిద్ర పట్టడం లేదెందుకు?"

"నాకు తెలియదు తల్లీ. నాకు నిద్ర పట్టకపోతే, గట్టిగా కండ్లు మూసుకొని – యిలాగ – ఆన్నా కరేనినా* యెలా వుండిందీ, యెలా మాట్లాడింది ఊహించుకుంటాను, లేదా చారిత్రకమైనదో, పాతకాలందో యేదో ఒకటి ఊహించుకోడానికి ప్రయత్నిస్తాను...."

తల్లికి అర్థంకాలేదనీ, అర్థంచేసుకునే శక్తి లేదనీ నాద్యాకు అనిపించింది. యీ భావం ఆమెకు మునుపెన్నడూ కలగలేదు. ఆమెకు భయం కలిగింది, దాక్కోవా లనిపించింది, ఆమె తన గదికి పోయింది.

రెండు గంటలకు అందరూ మధ్యాహ్న భోజనానికి కూర్చున్నారు. ఆ దినం బుధవారం, ఉపవాస దినం; అవ్వ అందరికీ మాంసం లేని పులుసూ, చేపలూ వడ్డించింది.

అవ్వను ఉడికించడానికి సాషా పులుసూ, మాంసమూ రెండూ తిన్నాడు. భోజనం పొడవునా అతను హాస్యోక్తులు చెప్పుతూ వుండినాడు. అతని హాస్యోక్తులు మరీ కొల్లేటి చేంతాళ్లలా వుండి, యేదో నీతిని సూచించడానికి ఉద్దేశింపబడినవి; యేదైనా జోకు చెప్పబోయేముందు అతను శవం వేళ్లలాంటి పొడవైన, పుల్లల్లాంటి వేళ్ల పైకెత్తి నప్పుడు యేమీ వినోదంగా వుండేది కాదు; యిక, అతను చాలా జబ్బుగా వున్నాడనీ, బహుశా చాలా కాలం బతక్కపోవచ్చుననే భావం మీ మనసుకు తోస్తే, మీకు అయ్యో పాపం అని యేడుపు వస్తుంది.

భోజనం తర్వాత అవ్వ విశ్రాంతి తీసుకోడానికి తన గదికి పోయింది. నీనా ఖానొవ్నా కాసేపు పియానో వాయించి, తరువాత ఆమె కూడా వెళ్లిపోయింది.

సాషా తన మామూలు భోజనానంతర విషయానికి వస్తూ, అన్నాడు: "ఓ, నాద్యా, నీవు నా మాట వింటేనా! నా మాట వింటేనా!"

ఆమె కండ్లు మూసుకొని, పాతకాలపు పెద్ద కుర్చీలో ముడుక్కొని కూర్చుంది; అతను గదిలో చప్పుడు కాకుండా అటూయిటూ పచారుచేస్తూ వుండినాడు.

"నువ్వు యెక్కడికైనా వెళ్లి చదువుకుంటే ఎంత బాగుండును!" అన్నాడు అతను. "విజ్ఞాన ప్రబుద్ధులూ, సాధుసత్తములూ అయినవాళ్లు మాత్రమే ఆసక్తి కరమైనవాళ్లు, అవసరమైన వాళ్లు. అలాంటివాళ్లు యెంత యెక్కువగా వుంటే, అంత త్వరగా భూమిమీద రామరాజ్యం యేర్పడుతుంది. అప్పుడు యేదీ యిలాగుండదు,

---

* లియో టాల్‌స్టాయ్ నవలలో కథానాయకురాలు. – సం.

యీ మీ పట్టణంలో యింద్రజాలం లాగ, ప్రతిదీ తలకిందులౌతుంది, ప్రతిదీ మారుతుంది. అద్భుతమైన గొప్ప భవనాలూ, అందమైన పార్కులూ, దివ్యమైన జలయంత్రాలూ, ఉత్తములైన మనుషులూ వుంటారు.... కానీ అది కాదు అసలు విషయం. అసలు విషయం యేమిటంటే, యిప్పుడున్నదే, యిలాంటి మంద వుండదు, ప్రస్తుత రూపంలోని ఆ చెడుగు అదృశ్యమౌతుంది, ప్రతి వ్యక్తికీ విశ్వాసం వుంటుంది, తాను యెందుకు జీవించేదీ తెలుస్తుంది, మందమండి అండదండలు యెవరూ కోరరు. మంచి అమ్మాయివి కదూ, బంగారు కొండవు కదూ, యెక్కడికైనా వెళ్లిపో! యీ మురికి గుంట, నిర్జీవపు, కలుషిత జీవితం యిక చాలునని అందరికీ చూపించు! కనీసం నీకు నీవు చూపించుకో!"

"పోలేను పాషా, నాకు పెండ్లి కాబోతున్నది."

"పెండ్లెందుకూ? కాకపోతే యేం?"

వాళ్లు తోటలోకి పోయి పచారు సాగించినారు.

"యేమైనా నాద్యా, నీ పనిలేని జీవితం యెంత అనహ్యమో, యెంత అవినీతో కాస్త ఆలోచించు. అర్థం చేసుకో," అంటూ పాషా కొనసాగించినాడు. "నీవూ, మీ అమ్మా, మీ అవ్వా పనిచేయకుండా బతకడానికి యితరులు మీకోసం పని చేయవలసి వుందనీ, మీరు యితరుల జీవితాన్ని దిగమింగుతున్నారనీ నీకు కనవడదా? యిది నిష్కళంకమైనదా యిది రోత కాదా?"

"నీవు చెప్పేది నిజమే," అని నాద్యా చెప్పాలనుకుంది, కానీ ఆమె కన్నులలో నీళ్లు తిరిగినాయి, మనసు కుంచించుకపోయింది. ఆమె తన గదికి వెళ్లిపోయింది.

సాయంత్రం అంద్రేయ్ అంద్రేయిచ్ వచ్చి, మామూలులాగే చాలాసేపు ఫిడేలు వాయించినాడు. అతను స్వభావతః మితభాషి; బహుశా, ఫిడేలు వాయించేటప్పుడు మాట్లాడవలసి వుండదు గనుక అతనికి దానిమీద యిష్టం కలిగిందేమో. పది దాటిన తర్వాత కాసేపటికి, యింటికి పోడానికి కోటు తొడుక్కొని, అతను నాద్యాను కౌగిట్లోకి తీసుకొని, ఆమె ముఖంమీదా, భుజాలమీదా, చేతులమీదా ఆవేశపూరితంగా ముద్దులు కురిపించినాడు.

"నా ప్రియతమా, నా ప్రేమమూర్తీ, నా అందాల రాశీ," అని అతను గునగున లాడినాడు. "ఓ, యెంత ఆనందంగా వుంది! యీ ఆనందంతో నాకు మతి చెడుతుందనుకుంటాను!"

యిది కూడా ఆమెకు యెప్పుడో, చాలా చాలా కాలం కిందట విన్నట్లుంది, యేదో నవలలో చదివినట్లుంది, యిప్పుడెవరూ చదవని పాత, చింపిరి నవలలో.

భోజనశాలలో సాషా తన పొడవాటి అయిదు వేళ్ల కొనలమీద పొందించిన సాసర్‌తో టీ తాగుతూ, టేబుల్‌వద్ద కూర్చొని వుండినాడు. అవ్వ వైకుంఠం వేసుకుంటూ

వుంది. వీనా ఖావొవ్నా చదువుకుంటున్నది. దేవుని దీపం చిటపటలాడుతూ వుంది; ప్రతిదీ నిశ్చలంగా, భద్రంగా వున్నట్లుంది. నాద్యా సెలవు తీసుకొని, తన గదికి పోయింది. మంచంమీద పండుకున్న మరుక్షణమే ఆమెకు నిద్రపట్టింది. గత రాత్రిలాగే, తొలి వేకువ రేకతో ఆమెకు మెలకువ వచ్చింది. ఆమె నిద్రపోలేకపోయింది, గుండెమీద యేదో భారమైనది, అశాంతికరమైనది వుండింది. ఆమె మంచంమీద లేచి కూర్చొని, కాబోయే భర్తను గురించీ, తన పెండ్లిని గురించీ ఆలోచిస్తూ మోకాళ్లమీద తల పెట్టుకుంది.... యే కారణంవల్లనో ఆమెకు జ్ఞాపకం వచ్చింది, తన తల్లి ఆమె భర్తను ప్రేమించలేదనీ, యిప్పుడామెకు యే ఆస్తీ లేదనీ, అవ్వమీద, ఆమె అత్తమీద, పూర్తిగా ఆధారపడిందనీ. యెంత ప్రయత్నించినా నాద్యాకు అర్థం కాలేదు, యెందుకు తాను తల్లిని యేదో ప్రత్యేకమైన, అసాధారణమైన వ్యక్తిగా భావించిందీ, ఆమె సాధారణ, అంసతుష్ట స్త్రీ అని తాను యెందుకు గమనించలేకపోయిందీ.

కింది అంతస్తులో సాషా కూడా మేల్కొని వుండినాడు — అతని దగ్గు ఆమెకు వినిపిస్తూ వుండింది. చిత్రమైన, అమాయకమైన జీవి, అతని కలలలో, ఆ అద్భుతమైన పార్కులలోనూ, దివ్యమైన జలయంత్రాలలోనూ, యేదో అసంబద్ధమైనది వుంది, అనుకుంది నాద్యా. కానీ అతని అమాయకత్వంలో, అతని అసంబద్ధతలోనే, అందమైనది యెంతో వుంది; యెంత వుందంటే, తాను చదువుకోడానికి వెళ్లిపోవాల్నా అని ఆలోచించిన క్షణంలోనే తన హృదయమంతా, తన యావత్తు జీవం ఉత్సాహకరమైన చల్లదనంలో మునిగిపోతుంది, తనకు ఆనందంతో తన్మయత్వం కలుగుతుంది.

"ఆలోచించకపోవడం మంచిది...." అని లోగొంతుకలో అనుకుంది ఆమె. "దాన్ని గురించి ఆలోచించకపోవడం మంచిది."

"టిక్ — టాక్," అంటూ దూరాన నైట్ వాచ్‌మన్ గిలక వాయించినాడు. "టిక్ — టాక్.... టిక్ — టాక్...."

3

జూన్ మధ్యలో సాషా హఠాత్తుగా విసుగు భరించలేక, మాస్కోకు తిరిగిపోతాననడం ప్రారంభించినాడు.

"యీ వూర్లో నేను వుండలేను," అన్నాడు అతను విచార స్వరంతో. "కొళాయిలు లేవు, భూగర్భ మురుగు కాల్వలు లేవు! యిక్కడ భోజనం కూడా తినలేకున్నాను — వంటగది చెప్పలేనంత రోతగా వుంది...."

"మరి కొద్దిరోజులు ఆగు, 'లేచిపోయిన కొడుకా,'" అవ్వ గుసగుస చెప్పింది. "యేడవ తేదీన పెండ్లి వుంది."

"నేను ఆగనే లేను!"

"సెప్టెంబర్ దాకా వుంటానన్నావుగా."

"యిప్పుడు వుండాలని లేదు. పోయి పనిచేయాలి."

వేసవి చల్లగా, వర్షాలు పడుతూ వుండింది, చెట్లు యెప్పుడూ నీళ్లోడుతూ వుండినాయి, తోట విచారకరంగా, విరసంగా వుండింది; అక్కడినుండి వెళ్లిపోయి, పని చేసుకోవాలనే కోర్కె కలగడం చాలా సహజం. కింద్రా, పైనా అన్ని గదులలో నుండీ అపరిచిత స్త్రీ కంఠాలు వినవస్తూ వుండినాయి, అవ్వ గదిలో కుట్టు మిషను గరగర లాడుతూ వుండింది. యిదంతా పెండ్లికూతురు దుస్తుల సంరంభంలో భాగం. చలికాలం కోట్లు నాద్యాకు ఆరు వుంటాయి; అందులో అన్నిటికంటె చౌకది మూడు వందల రూబుళ్లు అయింది, అని అవ్వ ఆడంబరంగా చెప్పకుంది. యీ గోల అంతా సాషాకు చిరెత్తించింది. అతను మూతి ముడుచుకొని, తన గదిలో కూర్చున్నాడు. కానీ, ఆగేటట్లు అతన్ని ఒప్పించినారు, జూలై మొదటి తేదీలోపల పోనని అతను మాట యిచ్చినాడు.

కాలం త్వరత్వరగా గడిచింది. సెంట్ పీటర్స్ దినం నాడు మధ్యాహ్న భోజనం తర్వాత అంద్రేయ్ అంద్రేయిచ్ నాద్యాను మాస్కో వీధికి తీసుకపోయినాడు — యువ దంపతుల కోసమని చాలా కాలంగా అద్దెకు తీసుకొని, అన్నీ అమిర్చిపెట్టిన యింటిని మరొకసారి చూడడానికి. అది రెండంతస్తుల యిల్లు; యింతవరకు పై అంతస్తులో మాత్రమే అన్నీ యేర్పాటై వున్నాయి. తళతళ మెరిసే నేలతో, పార్కెట్ లాగ కనిపించేటట్లు రంగువేయబడిన హాలులో బెంట్‌వుడ్ కుర్చీలూ, పెద్ద పియానో, ఫిడేలుకు మ్యూజిక్ శ్టాండూ వుండినాయి. గది పెయింటు వాసన వేస్తూవుండింది. గోడమీద గిల్టు ఫ్రేములో ఒక పెద్ద వర్ణచిత్రం వుండింది — పగిలిపోయిన హాండిల్ గల నేరేడు రంగు వాజ్ పక్కన ఒక దిగంబర సుందరి చిత్రం.

"అద్భుతమైన చిత్రం," అన్నాడు అంద్రేయ్ అంద్రేయిచ్. "యిది షిష్మ చెవ్‌స్కీది."

తరువాతది డ్రాయింగురూము. దానిలో ఒక రౌండు టేబులూ, ఒక సోఫా తళతళలాడే నీలం గుడ్డలు బల్ల కుర్చీలూ వుండినాయి. సోఫాకు పైన, తన మెడల్స్ అన్నీ ధరించి, పొడవాటి టోపీ పెట్టుకున్న ఫాదర్ అంద్రేయ్‌ది ఎన్‌లార్జి చేయబడిన ఫోటో వుండింది. వాళ్లు సైడ్‌బోర్డు గల భోజనశాలలోకి పోయినారు, అక్కడినుండి పడకగదిలోకి పోయినారు. యిక్కడ, మసక వెలుతురులో, పక్కపక్కన రెండు మంచాలు వుండినాయి. యిక్కడ జీవితం కలకాలం ఆనందమయంగా వుండడమూ, తద్భిన్నంగా వుండలేకపోవడమూ సహజవిషయంగా భావించినవాళ్లు ఫర్నిష్ చేసినట్లుంది పడక గది. ఆమె నడుము చుట్టూ వున్న తన చేతిని ఒక క్షణం కూడా తీయకుండా, అంద్రేయ్ అంద్రేయిచ్ నాద్యాను గదులగుండా తీసుకపోయినాడు. ఆమెకు నీరసం కలిగింది,

తప్పు చేసిన భావం కలిగింది, యీ గదులమీదా, మంచాలమీదా, కుర్చీలమీదా ద్వేషం కలిగింది, యిక దిగంబర సుందరిని చూసి వెలపరం కలిగింది. తనకిక అంద్రేయ్ అంద్రే యిచ్‌మీద ప్రేమ లేదనీ, బహుశా తానెప్పుడూ అతన్ని ప్రేమించలేదనీ, యిప్పు డామెకు స్పష్టంగా అర్థమైంది. కానీ యిది యెలా చెప్పాల్నో ఆమెకు తెలియదు, యెవరితో చెప్పాల్నో తెలియదు, అసలు యెందుకు చెప్పాల్నో తెలియదు, దాన్ని గురించి రేయింబగళ్లు ఆలోచించినా అణుమాత్రమూ తెలియలేదు.... అతను తన నడుము చుట్టూ చేయి వేసినాడు, తనతో అంత దయగా, అంత నమ్రంగా మాట్లాడినాడు, అతని గృహంలో తిరుగుతూ అంత సంతోషంగా వున్నాడు. కానీ ఆమెకు కనపడిందంతా వెకిలితనం, మతిలేని, మునుగులేని, భరించలేని వెకిలితనం; ఆమె నడుము చుట్టూ వున్న అతని చేయి ఆమెకు చల్లగా, బిగువుగా, యినప కొక్కెం లాగ వుండింది. యే క్షణంలోనైనా ఆమె పారిపోడానికి సిద్ధంగా వుంది, వెక్కివెక్కి యేడ్వడానికి సిద్ధంగా వుంది, కిటికీలోనుండి దూకడానికి సిద్ధంగా వుంది. అంద్రేయ్ అంద్రేయిచ్ ఆమెను స్నానాలగదిలోకి తీసుకపోయినాడు, గోడలోకి దించిన కొళాయిని చేత్తో తాకినాడు, నీళ్లు ముందుకు దూకినాయి.

"యేమంటావ్ దీన్ని?" అంటూ అతను నవ్వినాడు. "మన స్నానాల గదిలో కొళాయి నీళ్లు వుండేటట్లు, నూరు బకెట్ల నీళ్లు పట్టే తొట్టి పెట్టించినాను."

వాళ్లు కాసేపు పెరట్లో అటూయిటూ నడిచి, తరువాత బయటికి వీధిలోకి పోయి, బండి యెక్కినారు. దుమ్ము దట్టమైన మేఘాలలా లేచింది, వర్షం వచ్చేటట్లు కనపడింది.

"చలిగా వుందా?" అని అడిగినాడు అంద్రేయ్ అంద్రేయిచ్ దుమ్ముకు కండ్లు చిట్లిస్తూ.

ఆమె జవాబు చెప్పలేదు.

కాసేపుండి అతను అన్నాడు: "యేమీ పనిచేయనందుకు సాషా నిన్న నన్ను నిందించడం జ్ఞాపకముందా? అతనన్నది నిజమే. నేను యే పనీ చేయను, యే పనీ నాకు చేతకాదు. యెందుకిది ప్రియా? టోపీకి బిళ్ల తగిలించుకొని ఒక్క రోజు ఆఫీసుకు పోవడమనే ఆలోచనే నాకు వెలపరం పుట్టిస్తుందెందుకు? లాయర్లనూ, లాటిన్ టీచర్లనూ, మునిసిపల్ కౌన్సిలర్లనూ నేను భరించలే నెందుకు? ఓ, రష్యా మాతా, రష్యా మాతా! పనిచేయనివాళ్లనూ, నిరర్థక జీవులనూ యెంతమందిని నీ రొమ్ముమీద భరిస్తున్నావు! దీర్ఘ బాధిత దేశమా, నాలాంటివాళ్లు యెంతమంది!"

తన నిర్వ్యాపారత్వాన్ని యుగలక్షణంగా గమనించి, దాన్ని గురించి సిద్ధాంతీ కరించినాడు అతను.

"మన పెండ్లైనాక పల్లెపట్టులకు పోయి వుందాం ప్రియా," అంటూ అతను

చెప్పుకపోయినాడు. "అక్కడ పనిచేద్దాం. కొన్త భూమి కొందాం, తోటా, కాలువా వుండేది, కష్టం చేద్దాం, జీవితాన్ని గమనిద్దాం.... ఓ, యెంత మనోహరంగా వుంటుందో అది!"

అతను తలమీదనుండి టోపీ తీసివేసినాడు, గాలికి తల వెండ్రుకలు ఊగినాయి. ఆమె అతని మాటలు వింటున్నంత సేపూ తన మనసులో యిలా అనుకుంటూ వుండింది: "భగవంతుడా, నేను యింటికి పోవాలి! ఓ, భగవంతుడా!" సరిగ్గా వాద్యా యింటికి చేరేముందు వాళ్లు ఫాదర్ అంద్రేయ్‌ని కలుసుకున్నారు.

"అడుగో, మా నాన్న!" అన్నాడు అంద్రేయ్ అంద్రేయిచ్ సంతోషంగా, అంటూ టోపీ వూపినాడు. బండివానికి డబ్బులిచ్చేస్తూ అతను అన్నాడు: "నాకు మా నాన్నంటే ప్రాణం, నిజంగా ప్రాణం. మంచివాడు మా నాన్న! చాలా మంచివాడు!"

వాద్యా చికాకుగా, అస్వస్థంగా యింట్లోకి పోయింది. యిక సాయంత్రమంతా అతిథులు వుంటారనీ, వాళ్లతో మాట్లాడవలసి వుంటుందనీ, చిరునవ్వులు నవ్వవలసి వుంటుందనీ, ఫిడేలు వినవలసి వుంటుందనీ, రకరకాల చెత్త సంభాషణ వినవలసి వుంటుందనీ, యెంతసేపూ పెండ్లిని గురించే మాట్లాడవలసి వుంటుందనీ ఆమె మరిచిపోలేకుండా వుంది. తన సిల్కు దుస్తులలో గంభీరంగా, ఆడంబరంగా వున్న అవ్వ అతిథుల ముందర యెప్పుడూ వున్నట్లే గర్విష్ఠిగా కనిపిస్తూ, సమొవార్* పక్కన కూర్చొని వుంది. ఫాదర్ అంద్రేయ్ తన నిగూఢ దరహాసంతో లోపలికి వచ్చినాడు.

"మిమ్మల్ని ఆరోగ్యంగా చూసే ఆనందమూ, సజ్జనాశ్వాసమూ నాకు లభించి నాయి," అన్నాడతను అవ్వతో. అతను మనస్పూర్తిగా అంటున్నాడో, హాస్యమాడుతు న్నాడో చెప్పడం కష్టం.

4

కిటికీ తలుపులమీదా, మిద్దె కప్పుమీదా గాలి మోదుతూ వుండింది. గాలి గీ పెట్టడమూ, పొగగూడు మూల్గే జాలి పాటా వినిపిస్తూ వుండినాయి. రాత్రి పండ్రెండు దాటింది. యింట్లో అందరూ పండుకున్నారు, కానీ యెవ్వరూ నిద్రపోలేదు; కింది అంతస్తునుండి ఫిడేలు వినిపిస్తున్నదనే భావం వాద్యాను వదలిపెట్టలేదు. బయట నుండి పెద్ద ధ్వని వినవడింది, యే తలుపో కీళ్లూడి యెగిరిపడి వుండాలి. ఒక నిముషం తర్వాత నీనా ఇవానొవ్నా లోపలి గౌనుతో, చేతిలో కొవ్వొత్తి పట్టుకొని, గదిలోకి వచ్చింది.

"యేమిటా శబ్దం వాద్యా?" అని అడిగింది ఆమె.

వాద్యా అమ్మ, వాలు జడ వేసుకుని పిరికి చిరునవ్వుతో, యీ తుఫాను రాత్రి పూట మామూలుకంటె యెక్కువ వయసుదిగా, అనాకర్షణీయంగా, పొట్టిగా కనిపిం

---

* నీళ్ల మరిగించి, టీ తయారుచేసేందుకు రష్యాలో వాడే పాత్ర. — సం.

చింది. మొన్నమొన్ననే తాను తన తల్లిని అసాధారణ వ్యక్తిగా భావించడమూ, ఆమె వాడే మాటలకు తాను గర్వించడమూ, నాద్యాకు జ్ఞాపకం వచ్చింది. యివ్వాళ డెంతగా తల బద్దలుకొట్టుకున్నా ఆ మాట లేమిటో ఆమెకు గుర్తురాలేదు — గుర్తువచ్చినవి దుర్బలంగా, కృతకంగా వున్నాయి.

పొగగూట్లో కీచు గొంతులు పాడినట్లుంది, "అయ్యో, దేవుడా!" అనే మాటలు కూడా గుర్తుపట్టవచ్చు. నాద్యా మంచంమీద లేచి కూర్చొని, బలవంతంగా జుట్టు పీక్కుంటూ యేడ్చింది.

"అమ్మా, అమ్మా!" అన్నది ఆమె యేడుస్తూ. "నేను యెంత హింస అనుభవి స్తున్నానో నీకు తెలియదు! నిన్ను వేడుకుంటున్నాను, ప్రాధేయపడుతున్నాను — నన్ను వెళ్లిపోనీ!"

"యెక్కడికి?" అన్నది నీనా ఇవానొవ్నా దిగ్భ్రాంతితో. ఆమె మంచంమీద ఒక వార కూర్చుంది. "యెక్కడికి పోవాలని?"

నాద్యాకు దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చింది. యేడ్పుతో, నోట మాట రావడం సాధ్యం కాలేదు.

"యీ వూరినుండి నన్ను వెళ్లిపోనీ," అన్నదామె చివరకు. "పెండ్లి జరక్కూడదు, జరగదు, నామాట నమ్ము. ఆ మనిషిమీద నాకు ప్రేమ లేదు. అతన్ని గురించి మాట్లాడడమే నాకు అసహ్యం."

"వద్దు తల్లీ, వద్దు," భయంతో దిక్కు తోచక, నీనా ఇవానొవ్నా గబగబా అన్నది. "వూరుకో. నీకిప్పుడు మనస్సు బాగలేదు. కాసేపుంటే పోతుంది. యిలాంటిది తరుచు జరిగేదేలే. అంద్రేయ్‌తో తగవులాడి వుంటావు. ప్రేమికుల కీచులాటలు ముద్దులతో ముగుస్తాయి."

"పొమ్మా పో, వెళ్లిపో!" అంటూ నాద్యా యేడ్చింది.

కాసేపాగి నీనా ఇవానొవ్నా అన్నది: "నిజమే. నిన్నటిదాకా నీవు చిన్నపిల్లవు. యివ్వాళ నేమో పెండ్లికూతురువు. ప్రకృతి నిత్య పరిణామశీలమైనది. రేపోమాపటికి నీకు తెలియకుండానే తల్లివౌతావు, తరువాత ముసలిదానివౌతావు, నాలాగే ఒక చిలిపి కూతురుతో."

"అమ్మా, నీవు మంచిదానివి, తెలివిగలదానివి, అయినా నీవు సుఖపడడం లేదు," అన్నది నాద్యా. "నీ వెప్పుడూ సుఖపడలేదు — నీ వెందు కిలాంటి మామూలు మాటలు మాట్లాడుతావు? యెందుకమ్మా, యెందుకు చెప్పు?"

నీనా ఇవానొవ్నా మాట్లాడడానికి ప్రయత్నించింది, కానీ నోట మాట రాలేదు. ఆమె యేడుస్తూ తన గదికి వెళ్లిపోయింది. మళ్లీ పొగగూట్లో కీచు గొంతులు మూల్గినాయి, నాద్యా హఠాత్తుగా జడుసుకుంది. ఆమె మంచంమీదనుండి తటాలున లేచి, తల్లి

గదిలోకి పరుగెత్తింది. నీనా ఇవానొవ్నా, యేడ్పుతో కండ్లు వాచి, నీలం దుప్పటి కప్పు కొని, చేతుల్లో పుస్తకం పట్టుకొని, మంచంమీద పండుకొని వుంది.

"నేను చెప్పేది వినమ్మా," అంటూ మొదలుపెట్టింది నాద్యా. "ఆలోచించు, నన్ను అర్థంచేసుకోడానికి ప్రయత్నించు, నిన్ను ప్రాధేయపడుతున్నాను! మన జీవితం యెంత నిస్సారంగా, యెంత అవమానకరంగా వుందో ఆలోచించు. నా కండ్లు తెరుచుకు న్నాయి, నాకిప్పుడంతా కనపడుతున్నది. నీ అంద్రేయ్ అంద్రేయిచ్ యేమిటి? అతను కాస్తైనా తెలివిపరుడు కాదమ్మా. భగవంతుడా, ఓ, భగవంతుడా! ఆలోచించమ్మా, అసలు అతనొక మొద్దు!"

నీనా ఇవానొవ్నా యెగిరి కూర్చుంది.

"నీవూ, మీ అవ్వా నన్ను చిత్రహింస పెడుతున్నారు," అన్నది ఆమె వెక్కుతూ. "నాకు బతకాలని వుంది! బతకాలని వుంది," అంటూ ఆమె పదేపదే రొమ్ము బాదు కుంది. "నాకు స్వేచ్ఛ వుండనివ్వరా మీరు? నేనింకా వయసులో వున్నాను, నాకు బతకాలని వుంది, మీరు నన్ను ముసలిదాన్ని చేసేసినారు!"

ఆమె దుఃఖభారంతో యేడ్చింది, పండుకొని దుప్పటికింద పొర్లుతూ, అనుతాప జనకమైన, అర్థంలేని అల్పప్రాణిలా కనిపించింది. నాద్యా తిరిగి తన గదికి పోయి దుస్తులు వేసుకొని, పొద్దుపొడుపు కోసం కిటికీవద్ద కాచుకొని కూర్చుంది. తెల్లవార్లూ ఆమె ఆలోచిస్తూ అక్కడ కూర్చుంది; బయట యెవరో కిటికీ తలుపు తట్టుతున్నట్లూ, యీల వేస్తున్నట్లూ వుండింది.

గాలికి ఆపుల్ పండ్లన్నీ రాలిపోయినాయనీ, పాత ప్లమ్ చెట్టు కూలిపోయిందనీ, ప్రొద్దున అవ్వ ఫిర్యాదుచేసింది. అది మబ్బులు పట్టిన, కాంతి లేని, ఆనందం లేని ఉదయం, పొద్దునమండే దీపాలు వెలిగించుకోవాలనిపించే దుర్దినం. చలిగా వుందని అందరూ ఫిర్యాదుచేసినారు, కిటికీ తలుపులమీద చినుకులు టపటప మంటూ వుండి నాయి. ఉదయ భోజనం తర్వాత నాద్యా సాషె గదిలోకి పోయి, ఒక మాటా మంతీ లేకుండా, మూలనున్న కుర్చీ ముందర మోకాళ్లమీద కూలబడి, చేతులతో ముఖం కప్పుకుంది.

"యేమిటి సంగతి?" సాషె అడిగినాడు.

"నే నిలా బతకలేను, బతకలేను!" అని అరిచింది ఆమె. "యిన్నాళ్లూ యిక్కడ యెలా బతకగలిగినానో తెలియడం లేదు, బొత్తిగా తెలియడం లేదు! నా కాబోయే భర్త మీద నాకు అసహ్యం కలుగుతున్నది, నామీద నాకు అసహ్యం కలుగుతున్నది, యీ నిర్వ్యాపారత్వపు, నిస్సారపు జీవిత మంతటిమీదా అసహ్యం కలుగుతున్నది...."

"ఆగు, ఆగు...." అంటూ సాషె అడ్డుపడినాడు. ఆమె దేన్నిగురించి మాట్లా డేదీ అతని కింకా తెలిసిరాలేదు. "వూరుకో.... అంతా సర్దుకుంటుందిలే...."

"యీ జీవితంమీద నాకు ద్వేషం" అంటూ నాద్యా కొనసాగించింది. "యిక్కడ యింకొక్క రోజు భరించలేను! రేపు వెళ్లిపోతాను. నన్ను నీతో తీసుకపో, నీకు పుణ్యముంటుంది."

సాషా దిగ్భ్రాంతితో ఒక క్షణం సేపు ఆమెవైపు తేరిచూసినాడు. చివరకు అసలు విషయం అతని బుర్రకెక్కింది; అతను పసిపిల్లలాగ ఆనందించినాడు, సంతోషం పట్టలేక నృత్యం చేసినట్లు చేతులు వూపుతూ, వదులు స్లిప్పర్లలో యెగురుతూ వుండినాడు.

"అద్భుతం!" అన్నాడు అతను, చేతులు రుద్దుకుంటూ. "భగవంతుడా, యిది యెంత అద్భుతం!"

ఆమె అతనివైపు రెప్పలార్పకుండా వీక్షిసింది, కన్నులింతచేసుకొని చూసింది, ప్రేమ భరితంగా సమ్మోహితురాలి లాగ చూసింది, అతను తక్షణం యేదో ముఖ్యమైనది, మహా విలువైనది చెప్తాడనే నిరీక్షణతో చూసింది. అతనింకా ఆమెతో యేమీ అనలేదు. కానీ, యేదో నూతనమైనది, విస్తారమైనది, తానింతకు మునుపెన్నడూ యెరగనిది అప్పటికే తన కన్నుల ముందు ఆవిష్కృతమౌతున్నట్లు ఆమెకు అనిపించింది; ఆమె నిరీక్షణతో అతనివైపు చూసింది, దేనికైనా సిద్ధపడి, మృత్యువుకైనా సరే.

కాసేపుండి అతను అన్నాడు: "నేను రేపు వెళ్తున్నాను. నన్ను సాగనంపడానికి నీవు స్టేషన్‌కు రావచ్చు. నీ సామాన్లు నా పెట్టెలో పెట్టుకుంటాను, నీకు టికెట్టు కొంటాను. మూడవ గంట కొట్టినప్పుడు రైల్లోకి యెక్కు, యిద్దరం వెళ్లిపోదాం. మాస్కోదాకా నావెంట రా! తరువాత ఒక్కతెవే పీటర్స్‌బుర్గ్‌కు పో. పాస్‌పోర్టు వుందా?"

"ఆ."

"నీవు యిలా చేశానే అని యెప్పుడూ చింతపడవు — యెప్పుడూ పశ్చాత్తాపపడవు, నాకు తెలును!" అన్నాడు సాషా ఉత్సాహంగా. "వెళ్లిపోయి చదువుకో, తరువాత పరిస్థితులు తమ దారిన తాము నడుస్తాయి. నీవు నీ జీవితం తలకిందులు చేసిన వెంటనే ప్రతిదీ మారుతుంది. అన్నిటికంటె ముఖ్యమైనది నీ జీవితాన్ని తలకిందులుచేయడం, తక్కినదేదీ ముఖ్యమైనది కాదు. అయితే, రేపు వెళ్లిపోతున్నామన్నమాట?"

"ఓ, తప్పక! దేవునితోడుగా!"

తాను ప్రగాఢంగా చలించిపోతాననీ, తన హృదయం యెన్నడూ యింత భారంగా లేదనీ నాద్యా ఊహించుకుంది; యిప్పుడు, వెళ్లిపోడానికి ముందు, తాను బాధపడతాననీ, వ్యథాపూర్ణమైన ఆలోచనలు తన్ను హింసిస్తాయనీ ఆమె నమ్మింది. కానీ పైకి పోయి మంచంమీద వాలిన మరుక్షణమే ఆమెకు నిద్ర పట్టింది; కన్నీటి చారల ముఖంతో, పెదవులమీద చిరునవ్వుతో బాగా సాయంత్రమైందాకా ఆమె గాఢంగా నిద్రపోయింది.

5

బండికోసం పంపినారు. నాద్యా టోపీ, కోటూ ధరించి, పై అంతస్తుకు పోయింది, తల్లినీ, యింత కాలం తనది అయిన ప్రతిదాన్నీ చివరిసారి చూడడానికి. ఆమె తన గదిలోకి వెళ్ళి, యింకా వెచ్చగా వున్న తన మంచం పక్కన నిలబడింది, తరువాత మెత్తగా తల్లి గదిలోకి పోయింది. నీనా ఇవానొవ్నా నిద్రపోతూ వుండింది; ఆమె గది నిశ్శబ్దంగా వుండింది. తల్లిని ముద్దుపెట్టుకొని, ఆమె వెంట్రుకలు సర్ది, నాద్యా ఒకటి రెండు నిముషాలు నిలబడింది.... తరువాత ఆమె మెల్లగా కిందికి దిగిపోయింది.

వర్షం కుండపోతగా పడుతూ వుండింది. గూడు మూసిన గుర్రపుబండి నీళ్ళోడుతూ వాకిటి ముందు నిలబడివుంది.

నౌకరు సామాను బండిలో పెట్టేటప్పుడు, "నీకు చోటు లేదు నాద్యా," అన్నది అవ్వ. "యీ వానలో నువ్వతన్ని సాగనంపాలేమిటి! యింటి దగ్గర వుంటే మంచిది. చూడు యెలాంటి వానో!"

నాద్యా యేదో చెప్పడానికి ప్రయత్నించింది, కానీ చెప్పలేకపోయింది. సాషా ఆమెను బండిలోకి యెక్కించి, ఆమె మోకాళ్ళమీద రగ్గు కప్పినాడు. యిప్పుడతను ఆమె పక్కన కూర్చున్నాడు.

"సెలవు! దేవుడు నిన్ను కాపాడుగాక!" వరండాలోనుండి అవ్వ కేకవేసింది. "మాస్కోకు పోతూనే ఉత్తరం రాయడం మరిచిపోకు సాషా!"

"సరే అవ్వా, సెలవు!"

"యేమి వాన!" అన్నాడు సాషా.

నాద్యాకు యిప్పుడు మాత్రమే యేడుపు వచ్చింది. తాను నిజంగా వెళ్ళి పోతున్నానని యిప్పుడు మాత్రమే ఆమెకు తెలిసివచ్చింది — యింతవరకు అవ్వతో సెలవు తీసుకు నేటప్పుడు, తన తల్లి పక్కన నిలబడినప్పుడు కూడా, ఆమె పూర్తిగా నమ్మని విషయం అది. సెలవు పట్టణమా! అన్నీ ఒక్క పెట్టున ఆమెకు గుర్తు వచ్చినాయి — అంద్రేయ్, అతని తండ్రీ, కొత్త యిల్లూ, వాజ్ పక్కన దిగంబర సుందరీ. కానీ, యివన్నీ యిప్పుడిక ఆమెకు భయం కలిగించలేదు, దిగులు పుట్టించలేదు, అవన్నీ అమాయకపు చిల్లర విషయాలైనాయి, గతంలోకి దూరదూరంగా తిరోగమిస్తున్నాయి. వాళ్ళు రైలుపెట్టెలో యెక్కినాక రైలు బయలుదేరినప్పుడు, యీ గతమంతా, అంత పెద్ద, అంత ముఖ్యమైన గతమంతా, చిన్న ఉండగా ముడుచుకపోయింది; అపారమైన భవిష్యత్తు, యిప్పటిదాకా కంటికి సరిగా కనిపించనిది, ఆమె యెదుట నిలబడింది. వర్ష బిందువులు కిటికీలమీద టపటపమన్నాయి. పచ్చని పొలాలూ, పరుగెత్తే టెలిగ్రాఫ్ స్తంభాలూ, తంతెలమీద పక్షులూ తప్ప యేమీ కనిపించడంలేదు. హఠాత్తుగా ఆమె సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది.

తాను స్వేచ్ఛ పొందబోతున్నానని, చదువుకోబోతున్నానని, ఆమెకు జ్ఞాపకం వచ్చింది. ఆమె నవ్వింది, యేడ్చింది, దేవుని ప్రార్థించింది.

"అవు, అవు," అన్నాడు సాషా చిరునవ్వుతో. "అవు, అవు!"

6

ఆకురాలు కాలం గడిచింది, ఆ తరువాత చలికాలం గడిచింది. నాద్యాకు యిప్పుడు యింటి బెంగ పట్టుకుంది. అమ్మా, అవ్వా, సాషా కూడా, రోజూ ఆమెకు గుర్తు వస్తున్నారు. యింటినుండి వచ్చే ఉత్తరాలు వైరాగ్యంగా, దయగా వుండినాయి, అన్నిటినీ క్షమించి నట్లూ, విస్మరించినట్లూ కనిపించింది. మే పరీక్షలు పాసైన తర్వాత ఆమె ఉత్సాహంగా, సంతోషంగా యింటికి బయలుదేరింది; దారిలో, సాషాను చూడడానికి మాస్కోలో ఆగింది. అతను సరిగ్గా నిరుటిలాగే వుండినాడు — పెంచిన గడ్డంతో, చిందరవందర జుట్టుతో, అదే పాతకాలపు పొడవు కోటూ, కాన్వాసు పంట్లామూ తొడుక్కొని, యెప్పటిలాగే అందమైన చేరడేసి కన్నులతో. కానీ అతను జబ్బుగా, దిగులుగా కని పించినాడు, మరింత వయసెక్కి, మరింత చిక్కిపోయినాడు, నిరంతరం దగ్గుతూ వుండినాడు. నాద్యాకు అతను సాదాగా కనిపించినాడు.

సంతోషంతో నవ్వుతూ, "అరే, నాద్యానే!" అని అరిచినాడు అతను. "నా బంగారు, నా వరాల మూట!"

వాళ్ళు ప్రింటింగు ప్రెస్‌లో కూర్చున్నారు, పొగాకు పొగల మధ్య, వూపిరాడనివ్వని యింకు, పెయింటు వాసనల మధ్యా. తరువాత వాళ్ళు అతని గదికి పోయినారు. అది కూడా పొగవాసనతో నిండి, చెత్తా చెదారంతో గలీజుగా వుండింది. టేబుల్‌మీద, చల్లని సమోవార్ పక్కన, పగిలిన ప్లేటులో నల్లని కాగితంముక్క ఒకటి వుండింది; టేబుల్ నిండా, కింద నేల నిండా చచ్చిన యీగలు పడి వుండినాయి. యిక్కడుండిన ప్రతిదీ తెలియజేస్తూ వుండినాయి, సాషా తన ప్రైవేటు జీవితం గురించి బొత్తిగా శ్రద్ధ వహించడం లేదనీ, శరీర సుఖంపట్ల పూర్తి యేవగింపుతో, నిత్య అపరిశుభ్రతలో జీవిస్తున్నాడనీ. యెవరైనా అతని వ్యక్తిగత సంతోషం గురించీ, ప్రైవేటు జీవితం గురించీ అతనితో మాట్లాడివుంటే, అతన్ని ప్రేమించేవాళ్ళు యెవరైనా వున్నారా అని అడిగివుంటే, దాని అర్థమేమిటో అతనికి తెలిసి వుండేది కాదు, నవ్వి వూరక వుండేవాడు.

"అంతా సక్రమంగా గడిచింది," అంటూ నాద్యా గబగబా చెప్పింది. "ఆకురాలు కాలంలో అమ్మ నన్ను చూడడానికి పీటర్స్‌బుర్గ్‌కు వచ్చింది. అవ్వకు కోపం లేదని అమ్మ చెప్పింది; కానీ యెప్పుడూ నా గదిలోకి పోయి, గోడలమీద శిలువ గుర్తువేస్తూ వుంటుందట."

సాషా ఉల్లాసంగా కనపడినాడు, కాఫీ దగ్గుతూ జీరగొంతుతో మాట్లాడినాడు. నాద్యా అతనివైపు చూస్తూ, అతను నిజంగా తీవ్రమైన జబ్బులో వున్నాడా, లేక అది తన భ్రమేనా అని తర్కించుకుంటూ వుండింది.

"సాషా, సాషా, నీవు జబ్బుగా వున్నావు!" అన్నది ఆమె.

"నేను బాగున్నాను. కాస్త సుస్తీగా వుంది — పెద్ద దేమీ కాదులే...."

"నీవు డాక్టర్ దగ్గరి కెందుకు వెళ్లవు సాషా?" అడిగింది ఆమె ఆందోళనగా. "ఆరోగ్యం గురించి యెందుకు శ్రద్ధ తీసుకోవు? సాషా, నా ప్రియమైన సాషా," ఆమె గొణిగింది, ఆమెకు కండ్లలో నీళ్లు పొంగినాయి, యే కారణం వల్లనో అంద్రేయ్ అంద్రేయిచ్, వాడి పక్కన వున్న దిగంబర సుందరి, తన చిన్నతనం లాగే యెంతో దూరాన వున్నట్లు యిప్పుడు కనపడే తన యావత్తు గతమూ ఆమె మనోనేత్రం ముందు ప్రత్యక్షమైనాయి. విరుటిలాగ సాషా ప్రజ్ఞాశాలిగా, తెలివిపరుడుగా, ఆసక్తికరంగా కనిపించనందుకు ఆమెకు యేడుపు వచ్చింది. "సాషా, ప్రియమైన సాషా, నీవు చాలా జబ్బుగా వున్నావు. నీవు యింత పాలిపోకుండా, యింత చిక్కిపోకుండా వుండడానికి నేను యే మన్నాగానీ యిస్తాను. నేను నీకు చాలా రుణపడివున్నాను. నా బంగారు సాషా, నీవు నాకు యెంత చేసినావు! నీ వూహ కందదు. యిప్పుడు నా జీవితంలోకెల్ల నీవు అత్యంత ఆప్తునివి, అత్యంత ప్రేమపాత్రునివి."

వాళ్లు తెగ మాట్లాడుతూ, అలాగే కూర్చున్నారు. యిప్పుడు, పీటర్స్‌బుర్గ్‌లో ఒక చలికాలం గడిపిన తర్వాత, ఆమెకు అనిపించింది, అతను చెప్పే ప్రతిదానిలోనూ, అతని చిరునవ్వులో, మొత్తం అతనిలో యేదో పాతబడినది, పాత కాలంది, ముగిసి పోయినది, బహుశా ఒక కాలు శ్మశానంలో వున్నది, అనుభూత మౌతున్నట్లు ఆమెకు అనిపించింది.

"యెల్లుండి నేను వోల్గానదిమీద విహారం వెళ్తున్నాను," అన్నాడు సాషా. "తరువాత యెక్కడికైనా వెళ్లి కుమీస్* తీసుకుంటాను. కుమీస్ వాడి చూడాలనుకుంటున్నాను. ఒక మిత్రుడూ, అతని భార్యా నావెంట వస్తున్నారు. భార్య అద్భుతమైన మనిషి. వెళ్లి చదువుకొమ్మని ఆమెతో చెప్తూనే వున్నాను. ఆమె తన జీవితం తలకిందులు చేయాలని నా కోరిక."

మాట్లాడేదంతా అయిపోయినాక వాళ్లు స్టేషన్‌కు పోయినారు. సాషా ఆమెకు టీ యిప్పించి, ఆపిల్ పండ్లు కొనిపెట్టినాడు. రైలు బయలుదేరినప్పుడు, అతను చిరునవ్వుతో చేతిగుడ్డ వూపుతూ ప్లాట్‌ఫారంమీద నిలబడివున్నప్పుడు, అతని కాళ్లు చూసి అతను యెంతో జబ్బుగా వున్నాడనీ, చాలా రోజులు బతికే అవకాశం లేదనీ ఆమె గ్రహించింది.

---

* పులిసిన గుర్రపు పాలు. — సం.

నాద్యా తన సొంత వూర్లో మధ్యాహ్నం దిగింది. స్టేషన్‌నుండి ఆమె బండ్లో యింటికి పోతుండగా, వీధులు అనుచితమైనంత విశాలంగా వున్నట్లూ, యిండ్లు చాలా చిన్నవిగా, పొట్టిగా వున్నట్లూ కనిపించినాయి ఆమెకు. వీధులు దాదాపు నిర్మానుష్యంగా వుండినాయి, ఆమెకు కనిపించిందల్లా పురాతనపు చలికోటులో వున్న జర్మన్ పియానో ట్యూటర్. యిండ్లమీద ధూళి పొర కప్పినట్లుంది. యిప్పుడు నిజంగా ముసలిదై, యెప్పటిలాగే లావుగా, అనాకర్షణీయంగా వున్న అవ్వ నాద్యా చుట్టూ చేతులు వేసి, ముఖం నాద్యా భుజంమీద ఆనించి, చాలా సేపు యేడ్చింది, వూడలాక్కోవడం సాధ్యం కానట్లు. నీనా ఇవానొవ్నా కూడా బాగా వయసెక్కింది, పూర్తిగా అనాకర్షణీయంగా తయారై, మనిషి కుదించుకపోయినట్లు కనిపించింది, కానీ యెప్పటిలాగే ఆమె బిగువు కంచుకం ధరించింది, యెప్పటిలాగే వేళ్లపైన రాళ్లు మెరుస్తూవుండినాయి.

"నా బంగారు," అంటూ ఆమె మనిషంతా కంపించింది. "నా బంగారు కొండ!"

తరువాత వాళ్లు కూర్చొని మౌనంగా యేడ్చినారు. గతం తిరుగు లేకుండా గతించిందని అవ్వా, అమ్మా గుర్తించినట్లు సులభంగా అర్థమైంది. వాళ్ల సామాజిక స్థానమూ, తొలుతటి గౌరవమూ, తమ యింటికి అతిథులను ఆహ్వానించే హక్కూ గతించినాయి. బరువు బాధ్యతలు లేని సుఖ జీవితం మధ్యలో, ఒక రాత్రి పోలీసులు యింట్లో చొరబడి, యిల్లు గాలించి, యింటి యజమాని ఆఫీసు డబ్బు దొంగిలించడమో, ఫోర్జరీయే చేసినాడని కనుక్కుంటే యెలా వుంటుందో అలా వుండింది వాళ్లకు — బరువు బాధ్యతలు లేని సుఖ జీవితానికి శాశ్వతంగా వీడ్కోలు!

నాద్యా పైఅంతస్తుకు పోయి, అదే మంచమూ, గంభీరమైన తెల్లని తెరలు గల అదే కిటికీ, కిటికీగుండా చూస్తే సూర్యకాంతిలో మునిగి ఉల్లాసంగా, జీవంతో కోలాహలంగా కనపడే అదే తోట దృశ్యమూ చూసింది. ఆమె టేబుల్‌ను తాకింది, కూర్చుంది, పగటి కలలో మునిగింది. ఆమె బాగా భోంచేసింది, భోజనం తర్వాత రుచిగల గట్టి క్రీమ్‌తో టీ తాగింది, కానీ యేదో వెలితిగా వుంది, గదులు ఖాళీగా వున్నట్లున్నాయి, కప్పు చాలా కిందుగా వున్నట్లు ఆమెకు తోచింది. రాత్రి ఆమె పండుకొని, దుప్పటి కప్పుకున్నప్పుడు, యీ వెచ్చని, అతి మెత్తని మంచంలో పండుకోవడంలో యేదో అపహాస్యమైనది వుండింది.

నీనా ఇవానొవ్నా కాసేపు గదిలోకి వచ్చి, తప్పుచేసినవాళ్ల లాగ, పిరికిగా, దొంగ చూపులు చూస్తూ కూర్చుంది.

"నాద్యా, యెలా వున్నావు?" ఆమె అడిగింది. "సంతోషంగా వున్నావా? నిజమైన సంతోషం?"

"అవునమ్మా."

నీనా ఇవానొవ్నా లేచి, నాద్యామీదా, కిటికీమీదా శిలువ గుర్తు వేసింది.

"నేను భక్తురాలినైనాను, చూస్తున్నావు గదూ," అన్న దామె. "నేను వేదాంతం అధ్యయనం చేస్తున్నాను, యెప్పుడూ ఆలోచిస్తూ వుంటాను.... యిప్పుడు నాకు చాలా విషయాలు అరటిపండు వొలిచిపెట్టినట్లు స్పష్టంగా వున్నాయి. అత్యంత ముఖ్యమైన విషయం యేమిటంటే జీవితాన్ని పట్టకంగుండా చూడడం."

"అమ్మా, అవ్వ నిజంగా యెలా వుంది?"

"బాగనే వున్నట్లుంది. నీవు సాషాతో కలిసి వెళ్లిపోయినాక, అవ్వ నీ టెల్రిగ్రాం చదివినప్పుడు, అక్కడికక్కడే కింద పడింది. తరువాత మూడు రోజులు కదలకుండా మంచంలో పడివుంది. ఆ తరువాత ప్రార్థనలూ, యేడుపులూ ప్రారంభించింది. కానీ యిప్పుడు బాగనే వుంది."

ఆమె లేచి గదిలో పచారు చేయడం ప్రారంభించింది.

"టిక్-టాక్, టిక్-టాక్," అంటూ వాచ్‌మన్ వాయించినాడు.

"అసలు విషయం యేమిటంటే, జీవితాన్ని పట్టకంగుండా చూడడం. అనగా, మన చైతన్యంలో జీవితం దాని సూక్ష్మ మూలకాలుగా విభజింపబడాలి, యేడు మూల వర్ణాలుగా విభజింపబడినట్లు, యిక ప్రతి మూలకమూ విడివిడిగా పరిశీలింపబడాలి."

నీనా ఇవానొవ్నా యింకా యేమి చెప్పిందో, యెప్పుడు వెళ్లిపోయిందో నాద్యాకు తెలియదు; అమె కాసేపట్లోనే నిద్రపోయింది.

మే గడిచింది, జూన్ వచ్చింది. నాద్యా మళ్లీ యింటి జీవితానికి అలవాటు పడింది. అవ్వ సమొవార్ దగ్గర కూర్చొని, టీ పోస్తూ, పెద్ద నిట్టూర్పులు విడుస్తూ వుండేది. నీనా ఇవానొవ్నా సాయంత్రం పూట తన వేదాంతం గురించి మాట్లాడేది. ఆమె యింకా పరాధీన లాగే బతికేది, కొద్ది కోపెక్కులు కావలసి వచ్చినా, అవ్వను అడగవలసి వుండేది. యింటినిండా యీగలు వుండినాయి, కప్పు అంతకంతకూ కిందికి వస్తూ వుండి నట్లుండింది. ఫాదర్ అంద్రేయ్, అంద్రేయ్ అంద్రేయిచ్ యెదురౌతారనే భయంతో అవ్వా, నీనా ఇవానొవ్నా బయటికి వెళ్లేవాళ్లు కాదు. నాద్యా తోటలోనూ, వీధుల్లోనూ యిండ్లనూ, కాంతి లేని కంచెలనూ చూస్తూ తిరిగేది; చాలా కాలంగా పట్టణం ముసలిదౌతున్నదనీ, దాని కాలం తీరి యిప్పుడది తన అంతం కొరకో, లేక యేదైనా కొత్తదీ, పడుచుదీ అయినదాని ప్రారంభం కొరకో కాచుకొని వున్నదనీ ఆమెకు అనిపించింది. ఓ, ఆ కొత్త, స్వచ్ఛ జీవితం ప్రారంభమైతే! అప్పుడు నేరుగా ముందుకు పోవచ్చు, విధిని ధైర్యంగా యెదిరించవచ్చు, మనం చేసింది ఒప్పు అనే విశ్వాసంతో వుండవచ్చు, ఉల్లాసంగా, స్వేచ్ఛగా వుండవచ్చు! ఆ జీవితం యెప్పుడో ఒకసారి రాక తప్పదు. అవ్వ యిల్లు నిశ్శేషమయ్యే కాలం, నలుగురు నౌకర్లు ఒక గదిలో, బేస్‌మెంటులో, మురికి మధ్య జీవించే పద్ధతి మాత్రమే గల అవ్వ యిల్లు నిశ్శేషమయ్యే కాలం, వస్తుంది — అవును, యీ యింటి మట్టు లేకుండా పోయి, దీనిని అందరూ మరిచిపోయి,

యిది జ్ఞాపకమున్న వాళ్ళ యెవరూ లేని కాలం వస్తుంది. వాద్యాకు వుండిన ఒకేఒక ఆకర్షణ యేమిటంటే, ఆమె తోటలో షికారు తిరిగేటప్పుడు, "అదుగో పెండ్లి కూతురు!" అని కేకలు వేస్తూ, కంచెమీద బాదే పక్కయింటి చిన్న కుర్రవాళ్ళ.

సరాతొవ్‌నుండి, సాషావద్దనుండి ఉత్తరం వచ్చింది. అతను తన నిర్లక్ష్యపు, వంకరటింకర దస్తూరిలో రాసివాడు, వోల్గమీద తన విహారం చాలా బాగా వుండిందనీ, కానీ సరాతొవ్‌లో కాస్త జబ్బు చేసిందనీ, గొంతు పోయిందనీ, గత పక్షం రోజులుగా ఆస్పత్రిలో వున్నాననీ. దీని అర్థమేమిటో ఆమెకు బోధపడింది; ఆమెకు మనసులో దాదాపు నమ్మకం లాంటి దుశ్శంక కలిగింది. యీ అనుమానమూ, అసలు సాషె గురించిన ఆలోచనా కూడా తనను వెనుకటిలాగ చలింపజేయడం లేదని ఆమె కలతపడింది. బతకాలనీ, పీటర్స్‌బుర్గులో వుండాలనీ ఆమెకు కాంక్ష కలిగింది, సాషాతో తన మైత్రి గతానికి చెందినట్లూ, ఆ గతం ప్రియతమమైనదైనా యిప్పుడు చాలా దూరపుదైనట్లూ ఆమెకు అనిపించింది. ఆ రాత్రంతా ఆమెకు నిద్ర పట్టలేదు, పొద్దున కిటికీవద్ద కూర్చుంది, యేదో వినడానికి కాచుకున్నట్లు. నిజంగానే కంఠధ్వనులు కిందనుండి వినవడినాయి — అవ్వ గబగబా యెవరినో యేదో అంటున్నది. తరువాత యెవరో యేడ్చినారు.... వాద్యా కిందికి దిగిపోయి చూసేటప్పటికి అవ్వ ప్రార్థనచేస్తూ గదిలో ఒక మూల నిలబడివుంది, ఆమె ముఖంమీద కన్నీటి చారలు వుండినాయి. టేబుల్ మీద ఒక టెలిగ్రాం వుండింది.

వాద్యా చాలాసేపు గదిలో అటూయిటూ పచారుచేస్తూ అవ్వ యేడుపు విన్నది, తరువాత టెలిగ్రాం తీసుకొని చదివింది. నిన్న ఉదయం, సరాతొవ్‌లో, అలెక్సాందర్ తిమొఫేయిచ్, అనగా సాషా, క్షయతో మరణించినాడని అందులో వుంది.

మృతుని కొరకు ప్రార్థన యేర్పాటు చేయడానికి అవ్వా నీనా ఇవానొవ్నా చర్చికి పోయినారు. వాద్యా ఆలోచిస్తూ చాలాసేపు యింట్లో ఆ గదిలోకీ, యీ గదిలోకీ తిరిగింది. ఆమెకు స్పష్టంగా తెలిసివచ్చింది, తన జీవితం సాషా కోరినట్లు తలకిందులుగా తిప్పబడిందనీ, తానిక్కడ ఒంటరిదనీ, పరాయిదనీ, అవాంఛనీయ అనీ, తనకు కావలసిందిక్కడ యేమీ లేదనీ, గతం చించివేయబడిందనీ, కాల్చి, బూడిదను గాలికి వెదజల్లినట్లు అదృశ్యమైందనీ. ఆమె సాషా గదిలోకి పోయి, అక్కడ నిలబడింది.

"సెలవు సాషా," అన్నదామె. జీవితం ఆమె ముందు పరుచుకొని వుంది, నిమాత్మమైన, విస్తారమైన, విశాలమైన జీవితం; యీ జీవితం, యింకా అస్పష్టంగా, నిగూఢంగా వున్నా, ఆమెను పైగలతో పిలిచింది, ముందుకు లాగింది.

ఆమె మేడమీదికి పోయి తన సామాన్లు సర్దుకుంది, మరుదినం ఉదయం తన కుటుంబంనుండి సెలవు తీసుకొని, ఉల్లాసంగా, మహా ఉత్సాహంగా — యెప్పటికీ తిరిగిరావనే నమ్మకంతో వూరు వదలింది.

"చేహొవ్ సాటిలేని కళాకారుడు. అవును, అవును, నిజం: సాటిలేని కళాకారుడు. జీవిత చిత్రకారుడు. ఆయన రచనలు ఒక్క రష్యన్ మనిషికే కాక మానవులందరికీ బోధపడతాయి, వాళ్లకి సన్నిహితం అవుతాయి. అదే ఆయన రచనల్లోని విశిష్ట లక్షణం."

లియో టాల్‌స్టాయ్

"రాదుగ" ప్రచురణాలయం·మాస్కో